

విరోధి సం.
వైశాఖము

భారతి

సంపుటము 26
సంచిక 5

అగ్రవీక్ష

•

శ్రీ తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి

౧

బృందావనమ్ములో పెద్ద గోపాంగనల్
సంభ్రమమ్మున ఉదయసమయాన నొకకొంద
రిరుగుపొరుగులవారి నెల్ల సంబోధించి,
"మన యశోదా దేవి మగవాని గనె నంట
చూచివత్తమురండుసుకతులారా!" యనుచు
నందమందిరమునకు నడవందొడగినారు.

ఫలపుష్పభూషణాంబరభాజనములతో
శిశువీక్షణాయత్తచిత్తలై మార్గమున
సరసల్లాపాల జనుచుండగా వార,
లందొక్క వ్రజకాంత యనియె నీ రీతిగా :
"కలిగె యశోదాగర్భవాసమున
చిరకాలమునకు శిశు వీనాటికి.

సుందరమూర్తులు నందయశోదలు,
బంగరువన్నియ పాపడె కాదగు.
అర్భకు నేత్రము లాకర్ణాంతా
యతములు కావలె అమ్మకనులవలె.
జననిపోలికనె జన్మించినచో
తనయుం డెంతయు ధన్యుం డగునట."

చామీకరాంగదచ్ఛవులతో గాంగేయ
మణికంకణప్రభల్ మలగి నాట్యములాడ,
మధురనాదము చేయ మంజీరపుంజంబు,
కులుకు నడకలతోడ గోపికల్ చనినారు.

వ్రజనాయకుని మందిరపు తోరణము దాటి
ప్రాంగణంబున గోపభామినుల్ చేరంగ
గుమిగూడియున్నారు గోపాలురు తమాల
విటపిమూలములందు వెరగందిన ముఖాల.

అనతిదూరమ్ములో అవనతాననమైన
కామినీనివహంబు కడిమితరువులక్రింద
నిలిచియుండుట గాంచి, నికటంబు ప్రాపించి
పృచ్ఛించినారు గోపికలు కౌతుకముతో:

"నెచ్చెలులారా, నిలిచితి రిచటనె,
అంతిపురమ్మున కరుగ రెందులకు?
సేమమ్మె కద శిశువుకు జననికి?
అహితమేమి లే దని భావింతుము."

గొంతు సవరించుకొని గోపకాంత యొకర్తె
పై కెత్తి వదనమ్ము పలికె భారమ్ముగా:

"సేమమె మాతకు శిశువుకు, కానీ
నల్లనివాడట నందకుమారుడు.
జననము మూడవ జామున—బిడ్డడు
తెరవడు కన్నులు తెల్లవారినను.
సదనములోనికి జనుచో నెల్లరు
అగునని నందడి ఆగితి మిచటనె."

మాట లాకర్ణించి మ్లానవదనాలతో
వ్రజభామినులు నూత్నవార్త లాలింపగా
నందసదనమువంక నయనపంక్తులు నిలిపి
నిలిచినారు కదంబనికటభూభాగాల.

౨

అభ్యంతరావాసమందుండి వృద్ధ
అరుదెంచి మెల్లన అచ్చటి గోప
భామినులం గాంచి పలికె నీరీతి:

"బృందావనమ్ములో పెద్దపే రున్న
ముఖ్యభిషక్కులు మువ్వురు కూడ
శిశునేత్రములు పరీక్షించి నేరుపున
తుడిచినా రోషధీతోయాలతోడ.
ఉన్మీలనము లేమి యోచించి మరల
చేసి సాధన నిరీక్షించి, ఫలమ్ము
కానరాకుంటచే, క్రమముగా కనులు
తెరవుడుపడు నని తెలిపి చన్నారు.

"భైషజ్యమునకు లోపడని యనేక
బాధలు గుణములు వ్యాధులుగూడ
తరచుగా మంత్రవేత్తలు నివారింప
కనులార లోకాన గాంచుచున్నాము.
బాలగ్రహాదులు పట్టిన వేమొ
బిడ్డని, అనిమొడి భీతిచే తండ్రి,
కొనివచ్చుటకు మాంత్రికుల సత్వరముగ
గోపాలయువకుల కొందర బంపె,
వార్త క్రమ్మర మీకు వచ్చునందాక
వేచియుండుడు మీరు వృక్షాలకడనె"—
అరిగెను వృద్ధ యి ట్లని ద్వారవీథి.

వారు బృందావనవార్తలతోడ
కాల మెక్కించుక గడపుచు నుండ
మాంత్రికుల్ ప్రాంగణమార్గంబువెంట
కానవచ్చిరి శీఘ్రగమనమ్ముతోడ.
అటు నిటు జూడక అగ్రభాగమున
యువకులు నడచుచు నుండగా, వారు
తత్క్షణోన్ముక్తమౌ ద్వారమ్ము వెంట
అంతఃపురాంగణంబం దడుగిడిరి.
మంగళచింతచే మ్లానిమ తొరగె
వల్లవభామినీవదనాంబుజముల.

3

లోలలోచనలెల్ల లోకాభిరామాయ
ఔత్సుక్యమున కాలయాపనము చేయంగ
మందమందమ్ముగా మరల నా మార్గాన
మ్లానవదనాలతో మంత్రవేత్తలు చనిరి.

నందనందను డింక నయనాలు విప్పలే
దేమి లోకేశ్వరీ ! ఏమి చేయుదు మనుచు
కుంఠితోత్సాహాన గోపీజనము వగచె.

ఆకస్మికమ్ముగా నంతలోనె హిరణ్య
కంకణా రావమ్ము కర్ణగోచర మయ్యె.
చూచినా రొకమారె సుదతుల్ పురోభూమి,
కానవచ్చెను రాధ గంధగజయానమున.

కప్పుకొన్నది పీతకౌశేయవసనమ్ము
నిజభుజమ్ములమీద; నీలకుచ బంధమ్ము
బిగియించినది రమ్యపృథులవక్షము చుట్టు;
తురుముకొన్నది లేతతులసీదళాలతో
అతసీకుసుమమాల వితతకైశికములో;
కేల ధరియించినది లీలారవిందమ్ము;
స్వస్తికాకారాన సాంద్రగోరోచనా
తిలకబిందువు తీర్చి దిద్దినది ఫాలమున;
కార్తస్వరప్రభాగండయుగ్మముమీద
మసృణకస్తూరికామకరికాపత్రముల్
రచియించినది భూరిరమణీయ రేఖలో.

ఆనాభితలలంబియౌ హేమభాండాది
హారసంతతి యాపదాందోలనము చెంద,
కరసరోరుహరత్నకంకణారవములో
హాటకాంగదతులాకోటిశింజితములో
మేఖలాకింకిణీమృదులనిక్వాణంబు
చల్లగా మిళితమై శ్రవణోత్సవము చేయ,
ఏకాగ్రదృష్టితో నేగుచుండెను రాధ.

బాలభాస్కరకిరణపటలస్నపితయగుచు
కనకపుత్రికవోలె క్షణము తోచెను రాధ.
మరునిమేషములోన మణిగణప్రభలతో
శాతకుంభార్చితో సంశ్లిష్టగాత్రమై
జ్యోతిర్మయీదేవిభాతి దోచిన దామె.

ఆశ్చర్యచకితలై అఖిలగోపాంగనల్
వీక్షించుచుండగా, వివృతమౌ ద్వారాన
అంతఃపురిసీమలో నడుగుపెట్టెను రాధ.

౪

శాద్వలంబు వహించె సాంద్రమరకతశోభ.
ఇంతలోన కదంబవృక్షసంతతినుండి [ల్,
కురిసినవి జలజలని కుసుమముల్, ముకుళము
పొన్నతరువులనుండి పుష్పముల్ రాలినవి,
విరియబూచెను మల్లి వీక్షణక్షణములో,
వకులభూమీజముల్ వర్షించె సుమములన్.

నిండె పున్నాగావనీజమూలములందు
గుట్టలై రాసులై కుసుమసందోహంబు.

నందపుష్కరిణిలో ఇందీవరాంభోజ
కల్హారపుండరీకములు వికసించినవి.
మల్లికా యూథికా మాలతీ పాటలీ
కేతకీచంపక కేసరాదిలతాంత
పరిమళోద్గారమై పవమానముల్ వీచె.
రాధాంఘ్రినక్తమార్గము వెంట చాలుగా
జనియించి వికసించె స్థలకమలమండంబు.

అల పొదుగులనుండి పాలజాలు స్రవించె,
ఉత్సాహవశమునన్ వత్సకమ్ములు దుమికె,
రంకెవేసెను వృషభరాజముల్ వీకమై,
క్రేంకారములతోడ కేకు లాడదొడంగె,
గండుగోయిలపిండు కలకూజితము చేసె,
ఝంకారములతోడ చంచరీకము లాడె,
గరుడి కృష్ణా యనుచు గగనతలమున బలికె.

గోపగోపీజనము కుతుకమ్ముతో సాగి
అంతర్గృహాంగణం బాశ్చర్యమున జేర,

మొగసాలలోనుండి మ్రోగె వాదిత్రమ్ము,
భూసురాశీర్వాదపుణ్యనాదము మొరసె.

సవిధమ్మునకు వారు చని విలోకింపగా
శిశువు కాంచుచునుండె శ్రీరాధికాదేవి-
నేత్రయుగళమువంక నిర్నిమేషమ్ముగా!
తోచె నొక్కట రవిద్యుతులు శిశునేత్రముల,
క్షణలవమ్మున రాధికాదేవివదనమున
పద్మాలయాముఖప్రభలు వెలుగొందినవి,
నిసువు సందీపించె నీలమేఘచ్ఛవుల.

ధీరమ్ముగా ప్రదక్షిణరూపవలనాల
గరుడి కృష్ణా యనుచు గగనతలమున బలికె.
హర్షవివశాత్మమై అఖిలగోపీజనము
దొరకొనె గానమ్ముతోడ రాసక్రీడ:

జయ కృష్ణాభ్రశ్యామలగాత్రా
నందయశోదాసుందరపుత్రా
జయ జయ నిరుపమసారసనేత్రా
జయజయ రాధాసరసిజమిత్రా!

శ్రీమద్రాధావల్లభో విజయతే।

నన్నయ్యగారి ప్రసన్నకథా కలితార్థయుక్తి

నలచరిత్రము—ఉత్తరభాగము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

ఇది జగద్విదితమైన కథ. ఇంతవరకు వ్రాసిన నాల్గు కథలు చిన్నవి. ఇది పెద్దది. ఈ కథను తీర్చెడి తీర్పు వేరు. ఈ కథలో ౧. హంసదౌత్యము, ౨. స్వయంవరము, ౩. ద్యూతము, ౪. వనగమనము. —ఈ నాల్గుఘట్టములు ఒక భాగము.

రెండవభాగము నలదమయంతు లిద్దరు విడివడి యుండుట. అసలు ప్రధానకథ యిది. నలుడు పోయి ఋతుపర్ణుని యింట నున్నా డంతియే. అతడు రూపము మారినాడు. దీనికి మించి యతడు పడ్డ కష్టము లేవియు లేవు. అతడు దమయంతిని కలిసికొనుటకై చేసిన ప్రయత్న మేదియు లేదు. కష్టములన్నియు పడినది దమయంతి. భర్తను కలిసికొనుటకు ప్రయత్నము చేసిన దంతయు దమయంతి. ఆమె పడిన కష్టము లిన్ని యని చెప్పుటకు లేదు. చివరకు నలుడు తిరిగి కలిదోషము వాసినచో నామె చేసిన ప్రయత్నఫలము.

ఇది నిజముగా నలచరిత్రమా? దమయంతీచరిత్రమా? బృహదశ్వుడు ధర్మరాజునకు నలచరిత్రమే చెప్ప నారంభించెను. కాని నన్నయ్యగారు దమయంతీ చరిత్రమునే చెప్పెను.

ఇందు ప్రథమభాగమంతయు దమయంతీదేవికి ప్రాధాన్యము లేని కథ. అయినను కథ యారంభించుచునే యీ కథలో ప్రాధాన్యము దమయంతీదేవిది కాని, నలునిది కాదని చెప్పుటకు పద్యగద్యము లుపయోగించెను.

"నిషధేశ్వరుం డైన వీరసేనుని కొడుకు నలుం డనువాడు...ప్రజాపాలనంబు సేయుచుండె" ఈ రీతిగా నలుని విషయము వచనములో చెప్పెను. నలునకు ప్రాధాన్యము లేదు. మరి దమయంతీప్రాధాన్యమును పద్యమునందు నిబంధించెను. "అందు కన్యారత్నమైన యా దమయంతి...అధికవిభవయుక్తి కేసి"—

దీనినిబట్టియే నన్నయ్యగారి దృష్టి తెలిసికొన వచ్చును.

ఈ కథలోని రెండవ భాగము మొదలుపెట్టి నప్పటినుండి కథయంతయు దమయంతిమీదనే తిరుగును. అది యెట్లు తిరుగునో, యీ కథాప్రసన్నత యెట్లు కలుగునో జాగ్రత్తగా విచారించినచో తెలియ గలదు.

భర్త తాను నిదురించుచున్నప్పుడు తన చీర చింపికొనిపోవు ననగా నాముందర పతితో దమయంతి యిట్లనియె: "అధికదుఃఖరోగార్తున కౌషధంబు, సురుచిరమ్ముగ భార్యయే చూవె యెందు" అని. నలు డధిక దుఃఖరోగార్తుడు. ఈ కథయంతయు నామె యతని కౌషధ మెట్లైనదో చూపించుటయే.

నలుడు తన్ను వదలిపోయెను. ఆమెదుఃఖ మేమాత్రము? "నీ విట్లు దయలేకపోనగునా? ఎప్పుడు ధర్మువు తప్పవే! సత్యవ్రతుడవే? వగవక సాంగోపాంగములగు నాలుగు వేదములయు నధ్యయనము పొల్పుగ నొక సత్యముతో నెన యగునే?" అని చేసిన యుపాలంభము. ఈ పద్యము నన్నయ్యగారి సూక్తి.

లోకమందరికినోట నున్న పద్యమే. కాని నలుడు నాల్గు వేదములను విభాగించినవాడు. నాల్గు వేదములు చదివినవాడు. సాంగోపాంగముగ చదివిన వాడు. సంస్కృతకవి శ్రీహర్షుడు చెప్పినట్లు విద్యల కతనివలన చతుర్దశత్వ మేర్పడినది.

ఈ సంగతిని నన్నయ్యగారు కథ మొదట చెప్పలేదు. నడుమ చెప్పలేదు. ఎచ్చటను చెప్పలేదు. నలుని యీ విద్యాచతుర్దశత్వము ఈ పద్యమునందు ధ్వనిత మగు వస్తు వగుచున్నది.

ఎందుచేత చెప్పలేదు? ఈ కథ తనవలెనే కష్టము లనభవించినవారు. పూర్వ ముండిరని ధర్మరాజు తెలిసికొనుటకు బృహదశ్వుడు చెప్పినది. కనుక నలదమయంతులు పడిన కష్టములు తత్సంబంధసామగ్రియు దీనికే ప్రాధాన్యము.

ఔచిత్య మింత సూక్ష్మతమ మైన రహస్యము.

తరువాత నడవియందు తిరుగుట, అజగరము పట్టుకొనుట, కిరాతుడు కన్పించుట, సార్థవాహులతో దమయంతి చేదిపురము చేరుట.

మరియు నలుడు కర్కోటకదష్టుడై వికారాకృతి పొంది ఋతుపర్ణునాశ్రయించుట. ఇక్కడికి కథ యైపోయినది. విదర్భపతి నలదమయంతులను వెదుకగా బ్రాహ్మణులను పంపించెను. సుదేవుడు దమయంతిని చేదిపురమున గుర్తుపట్టెను. ఇదిమొదలు దమయంతియొక్క పాతివ్రత్యము, ఆమెప్రతిభావిశేషమును బహిర్గత మయ్యెను.

ఏతత్పూర్వము దమయంతినిగూర్చి పాఠకులకు తెలిసిన విషయములు మూడు: ౧. ఆమె సీత రామునందువలె నలునియందు పరమవ్రత. పాతివ్రత్యము, శృంగారరసము రెండును కలిసియున్న మానుషదేవతాత్వమిశ్రమధురమూర్తి. ౨. కిరాతుని శపించి దహించగలిగినంత తపస్విని. ౩. ఎవ్వరికి కనుపించని ఋషు లామెకు కన్పించిరి.

ఈ పై చెప్పిన గుణములు సర్వపతివ్రతలయందుండవచ్చును. ఇందు దమయంతీదేవివిశేషము లేదు.

సుదేవుడు వచ్చి దమయంతిని గుర్తుపట్టి యామెను విదర్భకు తీసికొనిపోయెను. ఇచటనుండి దమయంతీప్రతిభావిశేషము స్వైరభాసియైన కథాప్రపంచము వెల్లివిరియుచున్నది.

ఆమె తన సుస్థితి యేర్పడినతర్వాత భర్తను వెదకుటకు మొదలుపెట్టినది.

ఏతత్పూర్వము తన పినతల్లియింట నున్నది తాను తా నని చెప్పలేదు. ఆమె యెంత గడుసరియో? ఎంత యభిమానవతియో? అట్లు తాను చెప్పికొన్నచో తన భర్తమర్యాద యెంత పోవునో యామెకే తెలియును.

కాదు. తల్లితోనైన తన భర్తను వెతికింపుమని చెప్పుచు తాను తదాలోకనవిహీనయై పరలోకకృతావాస నగుదు ననెను. యాథార్థ్యమును చెప్పెను. ఆమెలో నున్న మాతృభావమును రేకెత్తించెను. ఈమాట తండ్రితో చెప్పలేదు.

ఇచట నొక మాట చెప్పవలయును. మహారాజుల యిండ్లెట్టివో, అచ్చటి యాచారము లెట్టివో చాళుక్య నృపతులయిండ్లు సమృద్ధిగా నెరిగిన నన్నయ్యగారికి తెలియును.

ఆయన యెరిగిన యీ రాజమర్యాదలు వేరొక సారి వ్రాసెదను.

దమయంతి తాను నలుని కలిసికొనునంతవరకు తండ్రితో మాట్లాడినట్లే లేదు. తన కోరిక లన్నియు తల్లితోనే చెప్పెను. వయసువచ్చిన కూతుండ్రు స్త్రీలు రాజగృహములలో నెట్లుందురో తెలియవలెను.

తండ్రి మార్గణతత్పరులైన బ్రాహ్మణుల నియోగించెను. ఎవ్వరితోడను మాటాడని దమయంతి వారితో నిట్లు చెప్పెను. చెప్పిన మాటలు రెండే పద్యములు. మొదటి పద్యములో నామెవివేక మంతయు నున్నది. "నలుఁ డిప్పు డసమర్థుడగుట జేసి తన్ను నన్య లెరుగకుండనుండు." అందుచేత నా బ్రాహ్మణులు నానాసభలయందు దిట్లనవలయును. మొదటిమాట "నీవు నిత్యసత్యుడ వని. భర్తృధర్మము నీయందు మిథ్య యయ్యె. ఈ నిర్దయబుద్ధి నీకు తగదు. ఆ పతివ్రత

యందు నీవు ప్రసన్నుడ వగుము." ఇవి వాగ్గే మాటలు. మొదటిది ప్రశంస. తరువాతివి రెండు ఆక్షేపణము. నాల్గవది ప్రార్థన. అంతయు ప్రార్థన కాదు. నింద చేయకుండ నుండదు. తాను పడిన కష్టము దాచదు. ఈమె యెవ్వరో సీతా జీవికం బె గొప్పదివలె కన్పించు చున్నది.

సుదేవుడు బాహుకుని పలుకులు తిరిగివచ్చి దమయంతికి చెప్పెను. చెప్పి వెడలిపోయెను. "ఆమె పెద్దయుం బ్రొద్దు చింతించెను."

పెద్దయుం బ్రొద్దు చింతించుట నన్నయ్యగారు తరుచుగా వాడుచుండు మాట. ఇట్టి కొన్ని మాటలను గురించి కథాప్రసన్నతా వ్యాసములు పూర్తియై తర్వాత వ్రాసెదను.

ఈ పెద్దయుం బ్రొద్దు చింతించుట యిచట నెట్టిది? ఎట్టిదో తరువాత నున్నది.

"నలుండు కానివాడు ప్రతివచనం బేల యిచ్చు" ఇది యాలోచన. ఎంత విచారించినను తెగనిది. దాని యోగామ లూహించు వ్యక్తియొక్క యాత్మపరిపాక నిర్ధారయితవ్యములు. ఆమె యాత్మపరిపాక మెట్టి దనగా? ఎంతయో యాలోచించి యా విషయము నిశ్చయించినది, అతడే నలుడని. దీనికి తాను సభలలో ననుమన్న మాటలు వెళ్లిన బ్రాహ్మణుల బుజామార్గ వర్తిత. ఆ బాహుకు డున్న స్థలముయొక్క గొప్పతనము హీటినన్నిటిని పొంతనపరచుకొన్నది. పైగా నా బాహు కుడు శీఘ్రయానకుశలుడు, సూదక్రియానిపుణుడు, అశ్వశిక్షకుడు అని సుదేవుడు చెప్పెను. ఆ బాహు కుడు వెలవెల నగుచు దీర్ఘనిశ్వాసపురస్సరుండై చెప్పెను. వాడు చెప్పిన మాటలు భార్య పురుషుని దోషపుంజము సహించవలయును. అభీష్టభోగము దేహాంతరమునందు పడయును, ధర్మరతియు పడయు నన్న మాటలు.

నలుని మనఃప్రవృత్తి యెట్టిదో, యతనిమాట లెట్టివో దమయంతికి చక్కగా తెలియును. ఆమె యెంత వివేకశాలిని. నలుని రథధ్వనికూడ ఆమెకు సుర్తే. తరువాత నలుడు రథ మెక్కి వచ్చినప్పుడు "దమయంతి యీ రథధ్వని విని యిది నలరథఘోషమని యనురాగ మందె"నని నన్నయ్యగారు వ్రాసిరి. ఆయన రథధ్వనియే యామెకు సుర్తే; యాయన మనో భావము లెట్టివో తెలియవా? మరి పెద్దయుం బ్రొద్దు చింతించుట యెందులకు? వాడు కురుచచేతులవాడు. విరూపాంగుడు. వాడు నలుడెట్లగును? కానిచో తక్కిన విషయము లెట్లు పొసగును?

అతడే కారణముచేతనైన వికృతాంగుడు కావచ్చును.

మరియు నతనిని పరీక్షించి చూడవలయును. ఇచట రెండు విషయము లున్నవి. మొదటిది యాకృతి. రెండవది యతని శక్తులు, అతని మనోభావములు. లోకమున కాకృతి స్థూలమైనది; ప్రధానమైనది. తనకు నతని మనోభావములు ప్రధానమైనవి. అతడు రూపము మారినను తన భర్తయే. ఈ భార్యాభర్తృభావము ఆత్మ సంబంధి. దీనినే నలుడు ధర్మరతి యన్నాడు.

"నలుండు కానివాడు ప్రతివచనం బేల యిచ్చు" —అనగా వాడు విరూపాంగుడైనను, కురుచ చేతులవా డైనను నతడు చెప్పినమాటలు నలుడు కానిచో చెప్పడను అర్థము. అతడు నలుడని యీ రీతిగా నిశ్చయమే చేసెను. ఎంత నిశ్చయము చేసినను గొడ్డలివలె నతని రూపము అభ్యంతరపెట్టుచున్నది. అందుచేత "ఇంకను నలునగలవారలం బంచి యాతని నిమ్మగా నెఱుంగవలయు" అని నిశ్చయించినది. 'ఇమ్మగా' ననగా 'ఆమూలముగా' నని యర్థము. నన్నయ్యగా రీ శబ్దము నీ యర్థమునందే తరుచుగా వాడును.

"నిజజననియనుమతమ్మున సుదేవుని రావించెను". తను చేసిన ప్రతి పనియు తల్లితో చెప్పియే చేయు చున్నది. ఆ సుదేవునితో పునస్స్వయంవరము బుతు పర్ణుని సభలో చెప్పుమని పంపించెను. ఇది యాశ్చర్య కరమైన విషయము. అతని 'నిమ్మగా' నెఱుంగుట యిట్లా? అతడు నలుడని తెలిసికొనుటకు మరికొన్ని ప్రయత్నములు చేయవలయును. అప్పుడు పునస్స్వయం వరవార్త చెప్పించవలయును. మరి యెందు కిట్లు చేసి నది? బాహుకుడు నలుడని నిర్ణయించుటకు కాదు.

బాహుకుడే నలుడని యిదివరకే నిర్ణయించెను. ఇప్పుడుగా నెరుంగుట యనగా?—నతడు వికారరూపు డెందు కయ్యెను? నేనే నలుడ నని యతనిచేత జెప్పించవల యును. ఈ మొదలైన కథ తెలియజేయబడుటకు నిది ప్రయత్నారంభము.

ఈ ప్రయత్న మామె బాహుకునియొక్క నలుని తన మెంత సునిశితముగా నిశ్చయించినదో యంత నిశ్చయముగా ఫలించినది.

రథము వచ్చినది. ఆ రథధ్వని విని యిది నలు రథఘోష మని యనురాగ మందినది. "నలు నిషధేశు పుణ్యశ్లోకు లోకోపకారకు చూడంగగంటి ననుచు" ఆమెనిశ్చయ మెంతటి సుస్థిరస్వరూపము గలదో యిందులో తెలియుచున్నది. ఆ రథధ్వని వినినతర్వాత సందేహలేశముగూడ పోయినది.

అతనిని చూడనప్పుడు ప్రాణములు విడుతు నని తలంచినది. మరి నలుడు వచ్చుచుండెగదా? యెందుకు చూడదు?

అనగా నలుడు తన యథార్థస్వరూపమును తాను పొందగా అని యర్థమా?

ఇదియే యర్థము. ఆమెకు బాహుకుడు నలు డని తెలిసెను. ఏకారణముచేతనో మారిపోయె ననియు తెలియును. కాని యీ బాహుకుడు తనకు నలుడు. లోకమునకు కాడు. ఆ లోకమునకు కాని నలుని నలుడే నని తాను పరిగ్రహించుట లోకవిరుద్ధము. తా నా పని చేయదు. తాను చనిపోవును.

"కమలాయతాక్షి ఋతుపర్ణు చూచి". కమల ములవలె విస్తారములైన కనులు కలది. ఆ రథమునిూద నలుని చూడవలయు నని కనులు విచ్చికొని చూచినది. నలుడు కనిపించలేదు. ఎచ్చటనుండి చూచినది? ఋతు పర్ణుడే యేల కనుపించెను? బాహుకు డేల కనుపించ లేదు? వార్ష్ణేయు డేమయ్యెను? ఇది యొక విచిత్ర మైన రచన. మనమే ప్రశ్న పుట్టించుకొనవలయును. మనమే సమన్వయించుకొనవలయును.

ఈతర్వాత బాహుకుడు రథశాలయందు రథా శ్వంబుల బంధించి సమీపమున విశ్రమించెను. దమ యంతి "బాహుకవార్ష్ణేయులతోడ వచ్చిన ఋతుపర్ణుం జూచి విఫలమనోరథయై యుండెనోపక కేశిని యను దానిం బిలిచి ఋతుపర్ణు నయోధ్యాపతింగా, వార్ష్ణేయు నూతపుత్రుంగా నెఱింగితి. బాహుకుం డనువా డెవ్వండో, వానియందు నా హృదయంబు ముదితం బగు చున్నయది. మన పర్ణాదునకు ప్రతివచనం బిచ్చినవాడు వాడ కావలయు; వానికడకుం బోయి యెరింగిర మ్మని పంచెను."

మొదట రథమునిూద ఋతుపర్ణునే జూచుట కిది కారణము. అందు ముగ్గు రున్నారు. నలుడు సుస్థితిలో నున్నచో రథమునందు ఋతుపర్ణునివలె కూర్చుండును. దూరాన పోవు రథము నంతఃపురమున నుండి యామె చూచుచున్నది. ఋతుపర్ణుడే యెత్తైన పీటమిూద నుండెను. అరదము ముందు దిగువ ప్రదేశ ములో నొగలునందు బాహుకు డుండును. వార్ష్ణేయు డును సేవకుడే. ఇద్దరకు ప్రధానస్థానము లేదు. వారు దమయంతికి కనుపించలేదు. దీనిచేత నాటి రథనిర్మాణ పద్ధతి సూచింపబడుచున్నది.

మరి వానియందు నాహృదయంబు ముదితంబగు చున్నయది. ఈ మాట—

'అసంశయం క్షత్రపరిగ్రహక్షమా
యదార్యమస్యా మభిలాషి మే మనః'

అన్న యర్థమును రూఢిపరచుచున్నది.

ఈ సర్వవ్యవహారమునందు నామె తన యంతః కరణప్రవృత్తిమిూదనే యాధారపడియున్నది. తరువాత బాహుకుని పిలిపించబోవునప్పుడుగూడ 'సందియ మేల' మొదలైన పద్యమునందు 'బాహుకుండు నైషధు డవ శ్యము తానగు నామనంబు నానందము నొందుచున్నది' అని చెప్పును.

తరువాత ఆ పంపించిన కేశిని నలునితో మాటా డిన మాటలలో కేశిని తెలివితేట లెంతవరకు? దమ యంతి చెప్పిన మాట లెన్ని? విచారించినచో కేశిని తెలివితేటలన్నియు దమయంతీదేవివే అనవల యును. ఎందుచేత ననగా కేశిని బాహుకునితో

"దమయంతి నీకుశలం బనుగ బ్రత్తెంచె నన్నది." అనగా నంతఃపురరహస్యము బయటపడు చున్నది. వాడు నలుడు కాడేని యింతమాట యనునే? అతడే నలుడని దమయంతియొక్క నిశ్చయము; నిశ్చయాతినిశ్చయము. ఈ రహస్యము కేశి నికి చెప్పినది. తల్లికి చెప్పినది. తల్లి నమ్మలేదు. ఆమె సందేహపడినది. అందుకనియే "సందియ మేల సర్వ గుణసంపద జూడగ బాహుకుండు భూవందితుడైన నైషధుడు" అన్న పద్యము నా రీతిగా నారంభించుట. ఒక్క మాటతో నునుక నున్న పరిస్థితి నంతయు సద్దిస్తముగా జేయుట.

ఇచట నొక విషయము చెప్పవలయును. కేశి నిని దమయంతి బాహుకునివద్దకు రెండుమార్లు పంపించినది. మొదటిసారి నన్నయ్యగారు కేశినీబాహుకుల సంవాదమును వ్రాసిరి. రెండవసారి కేశిని వెళ్లి తాను చూచివచ్చిన విషయములు దమయంతితో చెప్పును. మొదటిది సంవాదము. రెండవది అతడు వంటచేయు చుండగా కేశిని చూచివచ్చిన కథ. అది యట్లే చెప్పును. దీని నిట్లే చెప్పును. ఈ యౌచిత్యము దీని యందలి శిల్పము శాస్త్రతో దర్శనీయము.

కేశిని వచ్చి చెప్పినతర్వాత దమయంతికి తెలిసిన విషయ మేమి? నలుడు కూడ దుఃఖించుచున్నాడని తెలిసెను. అతడు తనయందు మిక్కిలి యభిముఖు డని తెలిసెను. అతడు తన నిజస్వరూపమును బయటపెట్టుటయే మిగిలినది. బాహుకునివద్దకు కేశినిని పంపించుట వాడు నలుడౌనో కాడో తెలిసికొనుటకు కాదు. అతడు నలుడని యిదివరకే తెలియును. అత డిప్పు డే స్థితిలో నున్నాడు? వట్టి రూపము మారుటయేనా? మనస్సుకూడా మారినదా? మారినరూపము శాశ్వతముగా మారినదా, తాత్కాలికముగా మారినదా? శాశ్వతముగా మారినచో తా నింక నలుడనని చెప్పికొనలేడు. అప్పుడు దానికి తగినట్లే ప్రవర్తించును. తాత్కాలికముగా మారినచో తాను నలునివలె ప్రవర్తించును. తన హృదయగతభావములను గోపనము చేయడు. ఇప్పుడు చేయలేదు. అందుచేత దమయంతికి తెలిసెను —తాను తన భర్తను కలిసికొనవచ్చు నని.

కలిసికొనుట యెట్లు? తవంతట తానైనచో పోయి కలిసికొనెడిదే. తాను తన తండ్రిరాజ్యములో నున్నది; తల్లియంతఃపురములో నున్నది. తాను పోయి గుఱ్ఱాలసావిడిలో నొక కొకిబికిమేనివానితో ప్రసంగించినచో రాజమర్యాద యే మగును? ఒకవేళ బాహుకుడు మరల నలునిరూపము పొందలే డేమో? ఎట్లైనను తన కేమియు నభ్యంతరము లేదు. లోకదృష్టిలో నిది మిక్కిలి తప్పు. అందుచేత తా నశ్వశాలవద్దకు పోగూడదు. బాహుకు డే యంతఃపురమునకు రావలయును. ఇందులో మరియు నంద మున్నది. అంత నిశ్చితమైన యతని నలునితనమును ప్రతిపదమునందు పరీక్షించుటయే. అతడు నలుడు కానిచో నంతఃపురమునకు రానేరడు. వెంటనే వాడు భయపడిపోవును.

అందుచేత తల్లితో "ఘనంబుగ వా డిట వచ్చువాడో యే నందుల కేగుదావనో" అన్నది. అత డిచటికి వచ్చుట ఘనము. ఈ శబ్దము నేటికిని తెలుగు జాతి యిట్లులే వాడుచున్నది. అతడు రానిని తానే వెళ్లునట. దమయంతితల్లి బెదరిపోయినది. వెంటనే తండ్రియొక్క యాజ్ఞచే బాహుకుడు రప్పింపబడెను. బాహుకుడు చనుదెంచి—

"చనుదెంచి యందు దీనా
ననవిరళపంకమలినవత గాత్ర దప
స్విని నతికృశ దమయంతిం
గనియె నలుం డుదితబాష్పకణకలితముఖిన్."

"దమయంతి నలుని వికృతాంగము జూచియు నతని నస్యగా నగపక నెయ్యమునను లజ్జను నతిసంభ్రమమున వివశాత్మ యగుచు పతి కిట్లనియెన్."

ఇంతకంటె నాటకరచన యెట్లుండు నేమి? మరింగా శ్రమమునందలి శకుంతలను జూచి దుష్యంతుడు—

"వసనే పరిధూసరే వసానా
నియమక్షామముఖీ ధృతైకవేణీ."

మొదలుగా వర్ణించినాడు. తన ధర్మపత్ని తన విరహవ్రతభారయగుట చూచుటకంటె పురుషున

కానంద మేమి గలదు? పురుషునియొక్క యాభిముఖ్యసర్వస్వ మందే యేర్పడును. అక్కడ శకుంతలయు నిచట దమయంతియు తమ భర్త్రాభిముఖ్య వాంఛ గలవారు. ఇచటి భావములన్నియు ప్రోగుచేసి చూపించవలసిన యవసరము లేదు.

కథయంతయు దమయంతిమీద నడచుచున్నది. బాహుకుడు దమయంతిదగ్గరకు వచ్చునరికి కథ బాహుకునిపై పునకు మరలినది. కాని వెంటనే దమయంతి మీదికే మరలెను. ఏల ననగా—దమయంతీదేవియే తమ భార్యాభర్తల సంయోగకార్యకరణపరమేశ్వరి. ఆమె యతని జూచి యనన్యగా నగవలేదట. స్నేహముతో, సిగ్గుతో తొట్రుపాటుతో వివశాత్మరైనదట. అయి పతి కిట్లనియెక్. పతితో నే మన్నదో చూచినచో నామెయొక్క వివేకము సంపూర్ణముగా తెలియును. ఆమెయంతటి లోకజ్ఞురాలామెయే. అనగా నన్నయ్యగారియంత లోకజ్ఞుడు నన్నయ్యగారే యని యర్థము. ఇతరమహాకవులు లోకోక్తు లెరుగుదురు. పలుకుఘనం బెరుగుదురు. మాటలోని గడుసుదన మెరుగుదురు. నుడికారపు జిగి యెరుగుదురు. లోకమును నన్నయ్యగా రెరిగిన ట్లెరుగరు. లోక మనగా భిన్నకక్ష్యలుగల సంఘమును తత్కక్ష్యలయొక్క సువిస్పష్టవివిచ్యమాన లక్షణసమవేతముగా నెరిగియుండుట. దరహాము మీద కట్టి మానవస్వభావమును వర్ణించుచుపోయినచో సర్వత్ర పాత్రౌచిత్య మేర్పడదు. ఆ పాత్ర సంఘము యొక్క యే కక్ష్యలోనిది? ఆ సన్నివేశ మెట్టిది? పరిస్థితి యెటువంటిది? వీని నన్నింటిని విచారించి ఆ పాత్రచేత నా మాట ననిపించుట, యాపనిని చేయించుటయు నుచితము. ఔచిత్య మింత తీవ్రమైనది.

దమయంతి పతి కిట్లనియెను: 'అట్లడవిలో భార్యను వదలి నలునివలె నితరులు నిర్దయులై వెడలిన వారు లేరు. అతనికి నే నేమి కీడు చేసితిని? నన్ను వదలి పో నన్న మాట లెందుకు మరచిపోయెనో?' ఇది యనిన మాటల సారాంశము. ఆమె బాహుకునితో మాటాడుచున్నదా? మరల నతనియందు భర్తయందు వలె ననవు నెరపుచున్నదే. స్నేహలజ్జాదులైన చేష్టలు బాహుకుడు భర్తయగుట రూపించుచున్నది. మాటలు బాహుకునికంటె నితరు నుద్దేశించుచున్నవి. ఇది యేమి చమత్కారము?

ఒకవేళ నలుడు మరల తన రూపమును పొందలేడు. కలడో లేడో యతనికే తెలియును. మరల నలరూపము పొందలేడేని వారి దాంపత్యము వ్యర్థమై పోవును. ఈ బాహుకుడే నలుడని తాను లోకమును నమ్మించలేడు. తల్లిదండ్రులు నమ్మినను వానితో తన కూతు రుండుట కంగీకరింపరు. ఇది యంతయు లోకము. ఇది తెలిసికొనుట లోకజ్ఞత. ఈ లోకజ్ఞతయందు దమయంతీదేవిచిత్త మవధిభూతముగా నున్నది.

నేనే నలుడ నని బాహుకుడే చెప్పికొనవలయును. తన పాతివ్రత్యము రుజువుచేసి తన ధర్మము సంపూర్ణముగా నిర్వర్తించి, తన వివేకము భాసింపజేసి తన ప్రేమ నొలుకబోయుచున్న యా దమయంతి ముందు నలుడు తన్ను తాను చెప్పికొనక యేమి చేయును? ఆమె యన్న ప్రతిమాటయు నామె గుండెకు శూలమువలె గ్రుచ్చుకొన్నది. ఒక్క పొల్లుమాట యనదు. ఒక్క వ్యర్థపుబలుకు రానీయదు.

నలున కింక నేమియు నాధారము లేదు. పున స్స్వయంవరప్రసంగ మెత్తినాడు. విదర్భలో తాను చూడలేదా? అక్కడ స్వయంవరమే లేదే? కాని యా మాటయే యతనికి బాధ కలిగించినది. ఆ బాధ బాధ కాదు. తనభార్య నే నిందుకోసము చేసితిని అన్నంతనే తీరిపోవునది. అయినను నట్టిమాట దమయంతి కెట్టి కష్టము కలిగించును? "నే నొక పాపభావము నెరుగ ననుటకు నీపాదములు పట్టుకొనగల్గుదు" నన్నది. ఆమె మాటాడు మాటలు దేవతల మాటలు; మనుష్యుల మాటలు కావు. దమయంతి, చంద్రమతి, అనసూయ, సావిత్రి, అరుంధతి మొదలైన యీ మహాజ్యోతు లెట్లుండురో మనకు తెలియదు. నన్నయ్యగారి ట్లుందు రని చూపినాడు.

పూర్వభాగశిల్పము మరుసంచికలో వ్రాసెదను

భావము - ధ్వని*

శ్రీ పింగళి లక్ష్మీకాంతమ్మ

ప్రపంచమునందలి యే భాషలోనైనను, ఆ జాతి మానవు డుచ్చరించు ధ్వనుల కన్నిటికి సరియైన అక్షరము లుండవు. అట్లే ఆ జాతిలో పుట్టిన కవికి పొడము భావము లన్నిటిని సరిగా వ్యక్తీకరింపదగిన శబ్దములు ఉండవు. ఏమన, ఈ విశ్వమునందలి పదార్థ జాలమంతయు మూర్తమనియు, అమూర్తమనియు రెండు విధములు. ఎంత సంపన్నమైన భాషలోనైనను, మూర్తపదార్థములకు తగినంత శబ్ద సామగ్రి, ఇంచుమించుగా, ఉండిన ఉండవచ్చును గాని, అమూర్తములు తెల్పుటకు ఆ మాత్రము సమర్థమైనదనియు ఉండదు. లోకవ్యవహారవిషయముననే యిట్లయినపుడు, లోకాతీతములై దివ్యభూముల నంటుచుండు కవులభావములను వ్యక్తము చేయగల యంత్ర సామగ్రి యే భాషలో నుండును? తన భాష యీతకు అందని, తన భావములోతు అతిగంభీరమై యుండుటచే తన భాష యెందుకును కొరగాకున్నదని వగచిన కవి ప్రతిజాతిలోను కలడు. అయినను ఆ కొంచెపాటి సామగ్రినే నానావిధముల మలచి, పొదిగి, దానికి సహజముగా లేని నూతనప్రాణమును పోసి తనకు ఉపకరించుకొనునట్లు చేసికొనుటలోనే అతని శబ్దప్రయోగ సామర్థ్యమంతయు ఇమిడియున్నది. ఉన్న మాటలను వాటికున్న అర్థముతోనే చెప్పజూచినచో అతడు కవిత్వమునే చెప్పలేడు. సమర్థుడైన యొక వైద్యుని గురించి చెప్పవలసినప్పుడు, మామూలు మాటలో అనదగిన వాక్యము 'అత డెంతో గొప్ప వైద్యుడు' అని. ఈ వాక్యములోని 'ఎంతో' అను శబ్దమును నీ వెంతగా పొడిగించి ఒత్తిపల్కినను ఆ వైద్యుని గొప్పదనము ఎంతదో స్పష్టముకాదు. అయినను రమణీయముగా నుండదు. ఇది లోకసామాన్యమైన విషయము. ఈ సామాన్యస్థితి తనకు చాలక, కవియైనవాడు ఈ యర్థమునే భంగ్యంతరమున 'అత డమృతహస్తుడు' అనును. ఈ వాక్యమున ఆ యర్థమే గర్భితమై యున్నను, పై వాక్యమునందలి పదములు స్ఫురింపజేయలేని ఒక రామణీయకము వ్యక్తమగుచున్నది. ఇది కవితా కక్ష్యలో చేరినది. ఒక్కొక్కయెడ లోకసాధారణులు కూడ తమ అభిప్రాయమునకు ఎక్కువ సొగసుదనమును, బలమును కలిగింప నెంచి, దానిని ఋజుమార్గమున చెప్పక, వక్రముగానో విపరీతముగానో చెప్పుటయు కలదు. ఒక యుదాహరణము : తప్పటడుగులు వేయు తన ముద్దుబిడ్డనిచే మరి రెండడుగులు వేయించి, చూచి మురియవలె నని కోరెడి ముద్దరాలు, ఆ పిల్లనియెదుట, చాచిన చేతులతో అంతంత నిలిచి, రావద్దు నన్ను ముట్టుకొనవద్దు— అనుచు వెనుకడుగు వేయుచు, వానిచే ముందడుగు వేయించుచు ఆనందించెడి ఒక దృశ్యమును భావింపుడు. ఆపిల్లడు ముందుకు రావలె నని, తనను ముట్టుకొనవలె నని ఆమెకోరిక. ఆ కోరికను ఆమె వ్యక్తము చేసిన రీతి దానికి భిన్నము, విపరీతము. తన యీప్సితమును నిషేధవాక్యరూపమున తెల్పిన ఆ పద్ధతి ఆ యర్థమునకే లేని సొగసుదనమును తెచ్చినది. 'రమ్ము, నన్ను ముట్టుకొమ్ము అను' ఆహ్వానములో ఈ సొగ సుండదు. కావ్యములో ధ్వని యనునది ఆనంద జనకములైన ఇట్టి చమత్కారములు సాధించుటకు దగిన శబ్దములు లేని లోటును తీర్చుచున్నది. పైని చెప్పిన మొదటి ఉదాహరణములో అత డెంతో గొప్ప వైద్యుడు అన్నప్పుడు స్ఫురించిన అర్థము వ్యంగ్యమనియు చెప్పుదురు. ఈ వ్యంగ్యమే ధ్వని యనునది, ఈజాతిధ్వనికి వస్తుధ్వని యని పేరు. అలంకార శాస్త్రములో ఇచ్చటి వస్తుశబ్దమునకు విషయమనియు, అభిప్రాయమనియు (*Incident or Idea*) అర్థము.

---

* ఆలిండియా రేడియో-విజయవాడ కేంద్రము వారి అనుమతితో.

౨

అలంకారికముగా భావము అనగా *Emotion* అని అర్థము. దీనికి ఇంకొక అర్థము రాకుండుటకై కొన్ని చోట్ల దీనినే రసభావము అనియు అందురు. కావ్య మనగా మహాగ్రంథమే కానక్కరలేదు. కవిత్వము అనిపించుకొనదగిన ఒక వాక్యమైనను కావచ్చును. అలంకారశాస్త్రమున కావ్యశబ్దమునకు, భావశబ్దమునకు అర్థము లివి.

రమణీయమైన యేకావ్యములోనైనను నాలుగు అంశముల సముచితసంకలనము ఉండును. భావన (*Imagination*), భావము (*Emotion*), యోజన (*Thought*), రచన (*Form*)—ఈ నాల్గింటిలో ఏది రమణీయముగానున్నను లోకులు ఆ కావ్యమును రసవంతమే అందురు. అట్లనుట కేవలవ్యావహారికము, శాస్త్ర మంగీకరింపదు. విషయవిభజనకై ఈ అంశములను వేర్వేర నాల్గుగా పేర్కొన్నారు. నిజ మారసినచో రసాయనమునందలి నానావిధమధురపదార్థములవలె ఉత్తమమహాకావ్యమున ఈ నాల్గును కలిసియే యుండును కాని విడివిడిగా ఉండవు. అయినను వీనిలో భావము అను అంశము మాత్రమే శాస్త్రీయమైన రసమునకు బీజము. ఆ బీజము అంకురించి కొనలు సాగి, చిగిర్చి, పుష్పించి, ఫలించుటయే రససిద్ధి పొందుట.

కావ్యపఠనవేళ పాఠకుని హృదయములో తొలుత మనోవికార మని చెప్పదగిన ఒక ఆవేశము కల్గును. అదియే భావము—భావోదయము. ఆ భావము వ్యక్తమగుటయే భావధ్వని యనగా. ఆ యనుభవము కొంత సుఖదాయకమే యయ్యు రజోగుణకవితమై యుండుటచేత కేవలఆనందము నీయజాలదు. అందలి లౌకికకాలుష్యక్షాళనము జరిగిన పిమ్మటనే అది పరమానందప్రద మగును. ప్రతిసుఖానుభూతియు ఆనందమునకు పర్యాయపదము కాజాలదు. సుఖ మనునది మనోవికారమమాత్రమే. మనస్సును జయించినది ఆనందము. మనోవికారములుగా పొడము భావము లన్నియు రసముగా పరిణమించువరకు నిల్చియుండజాలవు. వానిలో కొన్నిటికే అట్టి ధృతి కలదు. ఆ శక్తిగలదానికే స్థాయి యని పేరు.

కావున కావ్యములోని శబ్దము యొక్క వ్యంజన అనెడి శక్తివలన నీలో రసమునకు ఆదికారణమైన భావము పొడముచున్నది. ఈస్థాయిభావము ఆ శబ్దశక్తిచేతనే క్రమముగా భావితమై, అనగా, కాలుష్యక్షాళనము జరిగి సాత్త్వికత్వమును పొంది, తదుత్కర్షచే, విగళితవేద్యాంతరమైన స్వప్రకాశానందచిన్మయరూపమున అభివ్యక్త మగుచున్నది. ఆ యవస్థలో కావ్యపఠిత అహో అని పరవశుడై విశ్వమంతయు తానుగా, తానే విశ్వముగా, అంతయు ఆనందమయముగా జీవన్ముక్తు డగుచున్నాడు. ఈ పరిణామములో, స్థాయిభావము అతనిలోని రజోలోకమును వదలీ వదలని మధ్యస్థితిలో అది ఆత్మీయ గుణోత్కర్షచే అనేకఅవాంతరభావ పరంపరలుగా విజృంభించును. వానికే వ్యభిచారిభావము లని పేరు. ఆపై మరుక్షణములో అది సత్త్వకోశమున ప్రవేశించి సాత్త్వికభావము లనెడి రూపమును దాల్చును. ఆ సాత్త్వికరూపమును గూడ విసర్జించిన పిమ్మట చరమదశలో కేవలఆనందమయమైన రసరూపమును పొందును.

మానవులలో రజోలోకము, సత్త్వలోకము అను రెండు కోశములు లేనిమాట నిజము. కాని మనస్సునకు రాజసత్త్వము వదలి, సాత్త్వికత వచ్చు అవకాశము కలదు గనుక, ఆ గుణభేదమునే ఈ కోశభేదముగా నిరూపించుకొనవలెను. తొల్లింటి స్థాయిభావమునకు రాజసత్త్వము పోయి సాత్త్వికత వచ్చుటను నేను 'క్షాళన' యనియు, 'భావన' యనియు అంటిని.

స్థాయిభావములో కావలసిన లౌకికమాలిన్యమెంతో యున్నది. ఆ మాలిన్యాలు పోయి అది నిష్కళంకదివ్యస్వరూపముగా వెలుగొందు పరిణామమే అలంకారశాస్త్రములోని రసప్రకరణమునకు అర్థము.

ఉదాహరణార్థము ఒక శృంగార కావ్యమును గైకొని చూడుడు. దాని పఠనమువలన మొదట పొడము భావమునకు రతి అని పేరు.

ఈ రతిలో రజోగుణసంబంధమైన కామవాసన యున్నది. ఆ వాసన క్షాళితమై చరమావస్థలో శృంగార మను పేర బరగును. అప్పట్ల శృంగార రసానుభవమున కామవాసనయే యుండదు. అదియే కాలుష్యములేని దివ్యసుఖము.

నాటకరసవిచారము

శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి

"రసో వై సః
రసగ్ హ్యే
వాయంల బ్ధ్వానన్దీ భవతి."

నాటకము దశవిధరూపకములలో మొదటిది. పూర్వులు నిర్వచించిన దాని లక్షణమును ప్రత్యేకము. కాని, యిప్పు డాంగ్ల సంప్రదాయము ననుసరించి ప్రదర్శనార్హ మైన యెట్టి లక్షణములోడియే రూపకము నైనను నాటక మనియే వ్యవహరించుచున్నారు. ఇప్పు డా భావములోనే రసమును గూర్చి యొకింత ముచ్చటింతము.

కావ్యనిర్వచనమందువలెనే రసనిర్వచన మందును ప్రాచీనాలంకారికుల మతము లించుక వేఱుగా నున్నను, రసము కావ్యమున కాత్మ, లేక జీవిత మనెడి యభిప్రాయము పెక్కండ్రమతముల గోచరించుచునే యున్నది. 'రస ఆస్వాదనే' అను ధాత్వర్థమునుబట్టియు, 'రస్యతే స్వాద్యత ఇతి రసః' అను వ్యుత్పత్తినిబట్టియు, ఆనందానుభవరూప మైన స్వాదమే రస మని తెలియుచున్నది. దీనినే "స్వాదః కావ్యార్థసంభేదా దాత్మానన్దసముద్భవః" కావ్యార్థ పరిజ్ఞానమున పైకి పొంగునట్టి యాత్మానందమే రస మనెడి స్వాద మన్న ధనంజయమతము ధ్రువపఱచుచున్నది. ఈ విషయమునం దనుమితివాదులు భుక్తివాదులు త్రొక్కిన మార్గము లవలోకించి ధ్వన్యాలోక నాట్యశాస్త్రవ్యాఖ్యాతలం దభినవగుప్తాచార్యుడు లేవనెత్తిన యభివ్యక్తివాదము మమ్మటాదులకు మార్గదర్శకమై వినుతి కెక్కినది. అందలి సార మిది :

"సహృదయుల చిత్తముల నంటి యణగియున్న రతి, ఉత్సాహము శోకము ఇత్యాదికమైన స్థాయి కావ్యపఠనశ్రవణనాట్యదర్శనసమయములందు విభావాదులవల్ల నుద్రిక్తమై యభివ్యక్తమగుచు నెదుట నున్నట్లు, సర్వాంగములను కౌగిలించినట్లు తన్మయత్వము కలిగించి తక్కిన సర్వప్రపంచమును మఱపునకు తెచ్చుచు, వారిచే బ్రహ్మానందము మాడ్కి నాస్వాదింపబడెడి యలౌకికచమత్కారకారియైన శృంగారవీరకరుణాదికమగు రస మగుచున్నది." దీనిని పండితరాయ లెత్తుకొని రసచర్చలో భగ్నావరణచిద్విశిష్టమైన రత్యాదిస్థాయి రస మనటకంటె, రత్యాదిస్థాయివిశిష్టమగు భగ్నావరణచిదానందమే రస మనుట యుక్త మని స్వమత మావిష్కరించెను. ఇది 'రసో వై సః' ఇత్యాదికశ్రుత్యర్థమునకు సరిపడి సముచిత మగు నని యతనిభావము. కావ్యరసము లౌకికరసముకంటె విలక్షణమైన యలౌకికరస మని సర్వాలంకారికులును ప్రశంసించియున్నారు.

శ్రవ్యపాఠ్యకావ్యములు వారివారి యర్హతలను బట్టి శ్రోతలకును, పాఠకులకును రసానుభవము కలిగించు నన్నమాట నిజమే కాని, ప్రదర్శనరమ్య మైన దృశ్యకావ్య మట్లు కాదు, పండితపామరసాధారణముగా నందఱికిని రసానుభూతి కలిగింపజాలును. అందుచేతనే 'కావ్యేషు నాటకం రమ్య'మన్న యభియుక్తోక్తి పుట్టినది. ఒక సహృదయు డింట నుండి యొక చక్కని నాటకము చదివి యానందించుటకంటె దానినే నాట్యరంగమున నటులు ప్రదర్శింపనపుడు చూచి పదిరెట్లెక్కువగా రసాంబుధి నోలలాడును. ఇదే పాఠ్యదృశ్యములకును, పఠనప్రేక్షణములకును గల భేదము. అయితే, యీ యభిప్రాయము సర్వనాటకసామాన్యముగా వర్తింపకున్నది. చదువునపు డింపు పుట్టించు నొక రూపకము ప్రదర్శనరమ్యము కాక

పోవుటయు, చదువునెడ నరుచిగా నున్న యొక కావ్యము నాట్యరంగమున రక్తి కట్టుటయు ప్రాజ్ఞలోక మెఱుగును. అందుకు తగిన కారణములును మన మెఱుగుదుము. ఇపు డా విమర్శ మటుంచి ప్రకృత మైన రస మవలోకింతము.

రసము రసత్వధర్మమున త్రికాలములయందు నేకరూపమే. అయినా, ఆలంబనవిభావనాదిభేదములను బట్టి శృంగారవీరకరుణాదిభేదములను పొందుటయు, అవస్థాభేదములనుబట్టి యాస్వాదగోచరము లగు రుచిభేదములను గాంచుటయు దాని నైజము. ఆ భేదములకు వశము గాక బిఱ్ఱబిగిసి కూర్చుండెనా, అది రాయి గాని రసమే కాదు. ఇందు కొక దృష్టాంతము: తీపి, తియ్యదన మనుగుణమున నొక్కటే యైనను, అందెన్ని భేదము లున్నవి కదా! ఎన్ని జాతుల పండ్లున్నవో? ఒక పండుతీపి నింకొక పండుతీపి పోలుచున్నదా? ఇదంతా సత్యమే యైనను తీపి తీపియే. అట్లే రసము రసమే. కాని, యొకటిమాత్రము నిజము. మాధుర్యము వలెనే యవస్థాభేదములనుబట్టి రసము ప్రభిన్నముగా గనిపించుగాక. దాని ననుభవించువారికి గలుగు నానందముమాత్ర మేకరూపమే. అదే చిదానందము. రత్యాదిస్థాయివిశిష్టమును, భగ్నావరణము నైన యా చిదానందమే రస మన్న పెద్దల నిర్వచనమున కర్థ మదే.

నాటకమున వీరశృంగారములు ప్రధానము లనియు, తక్కిన రసములు యథోచితముగా నంగములు కావచ్చుననియు లక్షణవేత్త లనిరి. కాని, మహాకవులీ నియమమును పూర్తిగా ననుసరింప లేదు. శ్రోతలకును, ప్రేక్షకులకు నానందము కలిగించునట్లు రసమును గ్రహించి దానిని పోషింపఁబూనిన కవులు గ్రుడ్డిగా లక్షణము చేయి పట్టుకొని నడవరుగదా! అందుచే లక్షణాతిక్రమణము తప్పునటకు వీలులేదు. రసపోషణౌచిత్యము కవిప్రతిభాధీనము. కుమారసంభవాదులందు శృంగారము నొకించుక పచ్చిగా వర్ణించిన యా మహాకవియే తన దృశ్యకావ్యములందు మర్యాదాతిక్రమణము గాకుండ దానిని పోషించినాడు. అది రసౌచిత్యపారదృశ్వుల మార్గము.

కొందఱు వ్యాఖ్యాతలును, విమర్శకులును లక్షణము దృష్టిలో నుంచుకొని యిందు ప్రధానము వీరము, ఇందు శృంగార మనుచు భావించిరి గాని, తత్త్వము పరిశీలించినపుడు వాని ప్రాధాన్యమే గోచరింపదు. ఇందు కొక యుదాహరణము: నాగానంద మందు ప్రధానముగా గోచరించునది శమమే. అయినను, లక్షణానుగుణముగా నందలి ప్రధానరసము దయావీర మని నిరూపించుటకు ధనికుడు విశ్వప్రయత్నము చేసినాడు. అందుకు కారణము శాంతము నాటకరసము కాదగ దని లాక్షణికు లనుటయే. ఆ నాటకము ప్రదర్శించునపుడు సామాజికు లనుభవించునది శాంతమే యగును గాని వీరము కానేరదు గదా! అందుచే నతఁ డన్న దయావీరము శాంతములో నంతర్భూత మన వలెనా? శమమే యంగ మనవలెనా?

పఠనప్రదర్శనయోగ్యము లైన నాటకములలో ముద్రారాక్షస మొకటి. ఇది వీరరసప్రధానమే యందురు. అయితే దాన దయా యుద్ధ వీరములలో నేది యగును? నాయకు డెవడు? చాణక్యుడా? చంద్రగుప్తుడా, లేక రాక్షసుడా? మన మెంత సమర్థించినను యిది లక్షణానురోధ మగునా? పరీక్షించినచో నిం దుత్సాహము స్థాయి యన దగునో, క్రోధ మనదగునో యను సందేహ ముదయింపక పోదు. ఇందలి విస్మయవిషాదాదిజనకము లైన కుటిలప్రవృత్తు లెన్నో! తన్మూలము లైన స్థాయు లెన్నో? అందుచే నామమాత్రముగా నేదో యొకటి ప్రధానరస మనుకొన్నను రసాంతరసంబంధము లేక యే నాటకమును సహృదయరంజకము కాజాల దనుట నిజమగుచున్నది. యథార్థస్థితి యదే కదా! మాలతీమాధవములో బీభత్సము వర్ణిత మగుటచేతనే యందలి శృంగార మత్యంతము మెఱుగెక్కి ప్రేక్షకుల కాశ్చర్యానందదాయక మైన దనుటయే యం దొక దృష్టాంతము.

కరుణము నాటకమునకు చెప్పిన రసము కాదు. అది ప్రధానమైన యుత్తరరామచరిత్ర మందుమా, సర్వనాటకశిరోభూషణ మైనది. వ్యాఖ్యాతకూడా

యందలి ప్రధానరసము కరుణ మని యంగీకరించినా, కొందఱు విప్రలంభశృంగార మనుట లక్షణభయము చేతనే. అయినా, ఆ మాట యంగీకరింత మన్నను నాయికానాయకు లిరువురును పునస్సమాగమప్రత్యాశ లే దనుకొన్నయట్టి విప్రలంభము కరుణము గాక మఱేమగును? తమ కావ్యము సహృదయరంజక మగుటయే ప్రధాన మనుకొని కొంద ఱిట్లు కొన్ని యెడల లక్షణ మతిక్రమించినా లక్షణమును లెక్కచేయని భాసునివంటివారుకూడా లక్షణము ననుసరింపక పోలేదు. వస్తువు కల్పిత మగుటయు, నాయకుడు కాంతు డగుటయు కారణములుగా నింకను కొంచెము పెరుగవలసిన చారుదత్తము నాటిక యైనది. అవియే కారణములుగా నాటక మగుటకు సమర్థ మైన మృచ్ఛకటికము కొంచె మనవసరముగా పెరిగి ప్రకరణ మైనది. అయితే నేమి? రసపోషణమున కత్యావశ్యక మైన పాత్రపోషణవిధానము నందు రెండును చరితార్థము లైనవి. అది యా కవులకు చెల్లినది.

రసపోషణము సర్వసాధారణము కాదు. అది విశేషప్రతిభాశాలుల సొమ్ము. దృశ్యకావ్యశోభకు కథౌచిత్య పాత్రౌచిత్య రసౌచిత్యములు మూడును ముఖ్యము లనుట సత్యమైనను, పాత్రపోషణ మటు కథకు, నిటు రసమునకును జీవకళ యుట్టిపడునట్లు చేయునది యని యంగీకరింపక తప్పదు. పాత్రశీలము సముచిత మగుచున్నంతసేపును రసము చక్కగా ప్రవహించును. అది తప్పుదారి త్రొక్కినా, యిది యెక్కడనో యంతరించును. అందుచేతనే గణన కెక్కిన కొందరు మహాకవులు కావ్యజీవమైన రసముమీద దృష్టి పెట్టుకొని పాత్రముల నేమఱక పోషించుచు వచ్చిరి. ఇందు కెన్నో దృష్టాంతములు చూపవచ్చును గాని యిందు వసంతసేనను గైకొందము.

విశ్వామిత్రునివంటి మహర్షులను వలపించు కొన్న వారాంగనలకు చారుదత్తునివంటి కాంతనాయకుని లొంగదీయుట లెక్కలోనిది కాదు. అట్టి మార్గము లెన్నో లోకవిదితములు. అయితే నేమి? ఇందులో ధనప్రధానమైన కులమున బుట్టిన వెలవెలది. సుగుణాలల నయై దరిద్రున్ని ప్రేమించి యా కాంతనాయకుని కనుగుణయైన కాంతనాయికయై యిందలి రసమును సుప్రసన్నము గావించి సామాజికుల హృదయము నలరించినది. ఈ వసంతసేనాశీలపోషణము శృంగారరసపోషణమున కాదర్శోదాహరణ మన్నను సాహసము కాదు.


పాత్రములు కథలోనివే కాని వేఱు కావు. అయినా, పాత్రోచితముగా వస్తువును సంతరించుటయు, కథోచితముగా పాత్రములను సరిదిద్దుటయు కావ్యదృష్టిలో వేఱే. ఆ రెండును సముచితము లగుటయే రసౌచిత్యమునకు మూలము. ఇందు కెన్నో యుదాహరణములు చూపవచ్చును గాని, కల్పితవృత్తములలో నవిమారకము, ప్రఖ్యాతవృత్తములలో వేణీసంహారము ప్రశంసనీయము లందము. వీరరసప్రధానము లైన రామకథానాటకము లెన్ని పుట్టినవో! వాటిలో వేణీసంహారమువలె వన్నె కెక్కిన దేది?

ప్రఖ్యాతవృత్త మని లాక్షణికులు పేర్కొన్నారే కాని, ఆద్యంత మట్టి వృత్తముతో నున్న ప్రసిద్ధనాటకమే కనబడదు. ప్రతిమాశాకుంతలాదుల యితివృత్తములు మిశ్రములు కావా? మన మెఱిగిన విఖ్యాతరూపకముల నొక్కమాఱు స్మరించినచో, ప్రధానరసమున కంగరసముతోడి సంబంధము వలెనే ప్రఖ్యాతవృత్తమునకు కల్పితకథాభాగముతోడి సంబంధము కూడా సహృదయాహ్లాదకారియైన రస ముప్పతిల్ల హేతు వగు నని తెలియకపోదు. కల్పితవృత్త మని కాబోలు, చారుదత్తమును నాటికగా నిర్మించిన భాసుడే ప్రఖ్యాతవృత్త మైన ప్రతిజ్ఞాయౌగంధరాయణమును నాటికగానే నిర్మించినాడు. అందును నూతనాంశములను కూర్చినాడు. ఆ భవభూతియే యా యుత్తరరామాయణకథనే యథోక్తముగా గ్రహించి కరుణరసప్రధానముగా నాటకము రచియించినా, మనకు లభించిన కల్పితభాగములతోడి యుత్తరరామచరిత్ర వలె హాయి పుట్టించునా? అతని ననుకరించినవారి కరుణరసనాటకము లింపు పుట్టించెనా?

ఒకరి కథాపాత్రపోషణవిధానమును మఱియొకరనుకరింపవచ్చును గాని రసపోషణవిధానము ననుకరింప నగునా? శృంగారప్రధానము లైన నాటక

ములు కొన్నివంద లున్నవి గదా? రసప్రదర్శనవిధిలో నొకదానిని పోలిన దింకొకటి కలదా? సమాజేతివృత్త రూపకములలోనే యది మృగ్యము కదా! ఇంక విభిన్నేతివృత్తరూపకముల మాట చెప్పనేల? కాళిదాసు రూపకములు మూడును శృంగారప్రధానములే. అందు శాకుంతలమునకు మాత్రమే విశేషప్రసిద్ధి యేల వచ్చెను? భాసుని రూపకము లన్నిటిలోను స్వప్నవాసవదత్తకు మాత్రమే యశస్సేల వచ్చెను? దీనిని బట్టి, కథాపాత్రరసములు మూడు నొక్కరీతిగా నౌచిత్యపారము గాంచుటయే యందుకు కారణ మని భావింపక తప్పదు.

నాటకములో ధీరోదాత్తులైన రాజర్షి దివ్యులు నాయకులు కాదగుదు రని లక్షణకర్త లన్నారు గాని, యా నియమము నర్వాచీనులు పాటించినారా? యిప్పటివారు పాటించుచున్నారా? ప్రధానపాత్రము లుత్తమశీలసంపన్నములు కావలె నన్నవారి ప్రధానోద్దేశము గ్రహించి తదనుగుణముగా పాత్రములను పోషించుచున్నచో ప్రధాననాయకు డేజాతివా డని శంకింప నక్కఱలేదు. ఆ పాత్ర మట్టి ధైర్యౌదార్యములను చూపదా? అతడు రాజయిన నేమి, దేవుడైన నేమి? కావున సంగ్రహముగా చెప్పదలచిన దేమంటే —నాటకరచనకు పూనుకొన్న కవి సహృదయరంజక మగు నను తలంపుతో తన కిష్టమైన యితివృత్తము నే గ్రహించు గాక, కాని ఆ కథ కట్టి పరమప్రయోజన మభిలషించెనో దానిమీద దృష్టి నిలిపి, పాత్రముల శీలములను ప్రేక్షకుల హృదయ మాకర్షించునట్లు పోషించినపుడే యది సిద్ధించు ననియు, అపుడే రసము సముచితమై సామాజికుల నానందవశులను గావించు ననియు తెలుపుటయే. ఈ విషయమును పూర్తిగా పరామర్శింప బూనినచో గ్రంథ మెంతేని పెరుగును. దాని కిందు తావు చాల దని సంగ్రహించితిని. రసపక్షపాతు లిందలి గుణము గ్రహింతురు గాక.



స్వతంత్రకృతులు - అనువాదములు

- శ్రీ నేలటూరి భక్తవత్సలం

కావ్యప్రయోజనములలో మొట్టమొదటిది యశస్సు అని ఆలంకారికులు పరిగణించిరి[1]. 'మూఢుడనయ్యును కవికీర్తిం బొంద యత్నించుచున్న నేను, ఉన్నతునికి అందుపట్టి పండును కోసికొనుటకై చేయెత్తుచున్న పొట్టివానివలె, వేళాకోళమునకు పాత్రము కాకున్నా'నని కాళిదాసుసైతము చెప్పుకొన్నాడు[2]. యశము గోరియే కవులు కావ్యములు రచింతురు. యశమును గోరుట యనగా తమ కావ్యములు ఆచంద్రతారార్కముగా వెలయవలయు నని కోరుటే కదా! బయటికి చెప్పుకొన్నను చెప్పుకొనకున్నను కవుల హృదయమున నుండు కోర్కె ఇదే యనుటను గుర్తించియే శ్రీమద్రామాయణప్రారంభమున వాల్మీకిమహర్షికి బ్రహ్మదేవుడు ఇట్లు అనుగ్రహించినాడు:

"క్షితి నెందాక కులాచలంబులు రహిం
జెల్వొందు, బుణ్యాపగా
తతి యెందాక జరించు, నర్ణవము లెం
దాకం జెలంగుం, భవత్
కృతరామాయణకావ్య మందనుక నూ
రిస్తుత్యమై యుండు; న
మ్మతి నందాక సుఖించె దీవు తగ న
స్మల్లోకసంవాసివై 3."

వక్తృవైలక్షణ్యముచేతను, విషయవైలక్షణ్యముచేతను కృతికి శాశ్వతత్వము సిద్ధించును. అట్లు అజరామరములైన గ్రంథముల రూపమును దాల్చిన భావరాశియే వాఙ్మయము అనబరగుచున్నది.

పరిశీలనమునకు ఎప్పుడును విభజనము అంగము. వాఙ్మయపరిశీలనమునకు వాఙ్మయవిభజనము అంగము. వాఙ్మయమును ఒక్కొక్క దృష్టితో జూచినప్పుడు ఒక్కొక్కరీతి విభజనము సులువగుచుండును. ఇది ప్రభువువలె శాసించునది, ఇది మిత్రునివలె బోధించునది, ఇది కాంతవలె ఉపదేశమును ఆహ్లాదనమున నలవరచునది—అని ఈవిధముగా కర్తవ్యోపదేశప్రకారమును దృష్టియందు ఉంచుకొని చూచిన శ్రుతి, స్మృతి, పురాణేతిహాస, కావ్యాదిశాఖలు అగపడును[4]. సాహిత్యశాస్త్రదృష్టితో గాంచితిమేని గద్యపద్యచంపూప్రకారములును, దృశ్యశ్రవ్యభేదములును చూపట్టును. రచనపైని రచయితకు గల స్వామ్యమునుబట్టి పరికించిన స్వతంత్రకృతులు అనువాదములనెడి విభాగములు గానవగును.

ఎట్టి కృతి స్వతంత్రము? ఎట్టి కృతి అనువాదము? ప్రతిపాద్యవిషయము, ప్రతిపాదనప్రకారము (భాషాదికము) ఉభయమును ఎందు రచయితకు సొంతములో అట్టి కృతి స్వతంత్ర మని ఆపాతముగ గ్రహించుచున్నాము. కళాపూర్ణోదయమును జూడుడు. అందు ఇతివృత్తము, సంవిధానముల యమరిక, భాష, శైలి సర్వము పింగళి సూరనార్యునిదే అనిపించును.

ఎందు భాషాదికముమాత్రమే రచయితకు సొంతమై ప్రతిపాద్యవిషయము సొంతము కాకుండునో అట్టి కృతి అనువాద మని ఎంచుచున్నాము.

"విద్య యొసగును వినయంబు, వినయమునను
బడయు పాత్రత, పాత్రతవలన ధనము,

---

1. 'కావ్యం యశసే' కావ్యప్ర.
2. రఘు. వే. వేం. శాస్త్రివివరణము పుట: ౪.
3. గోపీనాథ వేంకటకవి యనువాదము.
4. ప్రతాపరుద్రీయము.

ధనమువలనను ధర్మంబు, దానివలన
నైహికాముష్మికసుఖంబు లందు నరుడు౫."

పైపద్యమున భావాదికము శ్రీ చిన్నయసూరి గారిది; విషయమమాత్రము హితోపదేశమునందలి యీ శ్లోకమునుండి గైకొనబడినది :

"విద్యా దదాతి వినయం
వినయా ద్యాతి పాత్రతామ్,
పాత్రత్వా ద్ధన మాప్నోతి
ధనా ద్ధర్మం, తత స్సుఖమ్౬."

ఈ శ్లోకము మూలము, దీనికి ఆ పద్యము అనువాదము.

ఇట్లు స్థూలదృష్టికి స్వతంత్రకృతు లనఁబొప్పు వాని రచయితలు పరిపూర్ణస్వతంత్రు లనియు, అనువాదరచయితలు ఇంచుమించు అస్వతంత్రు లనియు తోఁచకట్టును. కాని సూక్ష్మదృష్టితో జూచినయెడల వారు మనము అనుకొన్నంత స్వతంత్రులు గారు అనియు, వీరు మనము అనుకొన్నంత యస్వతంత్రులు గారు అనియు గ్రహింపగల్గుదుము.

లలితకళలలో ఒకటి కవనము. ఆ కళలకు అన్నిటికిని అనుకరణమే ప్రాణము. తనచుట్టు నుండు ప్రకృతిని గాంచి ఆకృష్టుఁడై దానిని రక్తాదివర్ణములచే అనుకరించువాడు చిత్రలేఖకుడు, దానినే అకారాదివర్ణములచే అనుకరించువాడు కవి. ఈ యనుకరణమునే ఔపచారికముగ సృష్టి అనుచున్నాము.

" స కవిః కథ్యతే స్రష్టా
రమతే యత్ర భారతీ
రసభావగుణీభూతై
రలఙ్కారై ర్గుణోదయైః"7.

ప్రతికృతియు ప్రకృతికి ప్రతికృతియే (=అనుకృతియే). అనుకరణసామర్థ్యమే స్వాతంత్ర్యము గాని, ఎక్కడను లేనిదానిని గల్పించుట కాదు. తాను ఇంతవఱకు చూచినట్టిదానిని, వినినట్టిదానిని, చదువనట్టిదానిని, దృష్టశ్రుతపఠితములను బోలనైన బోలనట్టిదానిని గల్పించుట ఎట్టివానికిని దుర్ఘటము. కాబట్టియే—

"యది హాస్తి త దన్యత్ర
య న్నేహాస్తి న తత్ క్వచిత్."

అని మహాభారత, కథాసరిత్సాగరప్రణేతలు ప్రతిజ్ఞ సేయగల్గిరి. దశరూపకములలో ప్రకరణము అనన దొకటి కలదు. అందు ఇతివృత్తము కవికల్పితమై యుండవలయు నని శాస్త్రకారులు నిర్ణయించిరి. కాని అపూర్వముగను, అమూలకముగను ఇతివృత్తి కల్పనము సేయ ఎవరికి సాధ్యపడినది ? ఇతరలక్షణములు కొంతకు గొంత సరిపోవుచుండునే కాని, కథ సొంత కల్పనమై యుండవలయు నను లక్షణము ఏప్రకరణమునకును సరిపోవుట లేదు. ఉద్దండుని 'మల్లికామారుతము' భవభూతి'మాలతీమాధవము'ను ప్రత్యక్షరము బోలియుండును. 'మాలతీమాధవము' బృహత్కథలోని మదిరావతికథను ప్రాయికముగా అనుసరించి యుండును . ఇతివృత్తము కల్పితమై ఉండవలయు నన్నచోటనే ఇట్లుండగా వేఱుచోట్ల జెప్పవలయునా ? ఇతివృత్తముసంగతి ఇట్లుండ ఇక భావములను, ఛాయలను, శైలీఫక్కికలను ఉత్తరోత్తరులు పూర్వపూర్వులనుండి ఎరవు తెచ్చుకొనుటకు మితియే లేదు. కావుననే ఏగ్రంథమునకు గాని కర్త ఒక్కడే కా డనియు, "కర్తను నేను"అని చెప్పుకొనివానితో అతనికి మార్గదర్శకులైనవారి నందఱను గలుపుకొనవలయు ననియు ఆంగ్లవిమర్శకు లనిరి9. "నాస్త్యచోరః కవిజనః"అను నానుడికిని ఇదే తాత్పర్యము. ఇట్టి ఫక్కికానుకృతులకు ఉదాహృతులను నూర్లకొలది గాదు, వేలకొలది ఈయవచ్చును. వినను గ్రంథవిస్తరభీతిచే ఒక్కటి ఉదాహరింతును :

---

5. నీతిచంద్రిక I-(౭)
6. హితో I-(౬)
7. యాదవాభ్యుదయము I (౨౧).
8. వే. వేం. శాస్త్రిల ఉ. రా. చ. విమర్శ.
9. *"All past inventive men work there with him as with all of us in all things".*

"కదిసితి మంత దంతపరి
 ఘద్విపఖండితదేవదారువుఁ
మదనవినోదకందలిత
 మానసమానసవాఃపభీరువుఁ
ప్రదరపదాచ్యుతక్రకచ
 పాటితలస్తకదేశచారువుఁ
ముదితచమూరువుఁ బలిత
 మూలనమేరువు నా సుమేరువుఁ."

ఇది నవీనానేకగుణసనాథుడగు నాచనసోమనాథుని పద్యము, ఉత్తరహరివంశమున రెండవ యాశ్వాసము లోనిది. ఇట వర్ణ్యము 'సుమేరువు'. దానికిని, దాని విశేషణములు ఒక్కొక్కదానికిని ('దారువు'—'భీరువు'—'చారువు'—'చమూరువు'—'నమేరువు') గడపటిరెండక్షరముల సాదృశ్యము కుదిరియున్నది. దీనిని అంత్యనియమ మని కొందఱు పేర్కొనిరి. ఈ పద్ధతి ననుసరించిన యనంతరకవుల సంఖ్య అనంతము. ఆదికవులు, మధ్యకవులు, అంత్యకవులు, ఆధునిక కవులు నని కవులను నాలుగుతరగతులుగ విభజించిన శబ్దరత్నాకరకర్తలు పూర్వోక్తమైన యంత్యనియమమును మధ్యకవిత్వసామాన్యలక్షణముగా గొని ఈ క్రింది పద్యమును నిఘంటుపీఠికలో ఉదాహరించుకొని యున్నారు.

"సేవించెఁ రంగధామున్ శ్రితనివహపయ
 స్సింధుసంపూర్ణసోమున్
గావేరీమధ్యసీమున్ ఘనకలుషమహా
 కాలకూటోగ్రభీమున్
దేవారిశ్రీవిరామున్ దివిజవినుతసం
 దీప్తితానంతనామున్
ద్విజ్ఞానాభిరామున్ త్రిభువనవిలస
 ద్దైవతాసార్వభౌమున్."

మధ్యకవులలో ఈ నియమమును ఎక్కువగా పాటించి ఒక్కొక్క పడేసి పద్యములలోను దాదాపు ఎనిమిదింట దీనిని పట్టించినవాడు మన బమ్మెరపోతరాజు. ఇందులకును ఒక్క యుదాహృతితో విరామము.

"శర్మద, యమదండక్షత
నర్మద, నతికఠినముక్తినితాచేతో
మర్మద, నంబునివారిత
దుర్మద, నర్మద దరించె ద్రోవన్ వటుడున్ [10]."

కవిత సర్వమును అనుకరణమే అని ఏర్పడినది. సృష్టి యనియు, స్వాతంత్ర్య మనియు కైవారము లందు గుణము అనుకరణసామర్థ్యమే అని తెల్లమయి నది. స్పృహణీయములను గ్రహించి వానిని స్పృహణీయత చెడకుండుటీతిని, మెఱుగెక్కు రీతిని నెలవఱచు ప్రతిభయే స్వాతంత్ర్య మనుచేని అది అనువాదరచయిత లందును ఉన్నట్టియు, దప్పక యుండవలసినట్టియు గుణమే. కావున వారు కేవలము అస్వతంత్రు లని యెంచుట భ్రమ. అనువాదకులయందు ఈ స్వాతంత్ర్యము నాలుగుమార్గములలో బ్రకట మగుచుండును.

(౧) అనువాదకుడు మూలమును అర్థముచేసి కొను తీర్పులో అతని స్వాతంత్ర్యము తొలుత బ్రకట మగును. మూలమును నిర్వికల్పముగను, కూలంకషము గను ఆకళించుకొన్నవాడే అనువదింపను అధికారి. నన్నయభట్టుంగొట్టి మన యాంధ్రకవు లెల్లరు మూలార్థమును కరతలామలకముగ సాక్షాత్కరించుకొన్న వారే యనుట వారి రచనలలో ప్రత్యక్షరమునను గన నగుచుండును. అట్టి గ్రహణము లేనివాని యనువాదము చీకటిలో దేవులాడుటవలె నుండును. అట్టి గ్రహణము గలవాని యనువాదము అనువాదముగానే కాక మూల మునకు వ్యాఖ్యగను వెలుఁగొందును. కీ. శే. వే. వేం. శాస్త్రిగారి యనువాదములలో పూర్వోక్తగుణముం గనిపట్టి కీ. శే. శ్రీమాన్ వి. కె. రాజగోపాలా చార్యులవారు (వ్యాకరణశిరోమణి) ఇట్లు కీర్తించిరి :

"శ్రీకర్ణహారకవిశేఖరరూపకాణా
మాంధ్రోక్తిభి ర్వివరణం ప్రతిరూపనామా,
యః కర్తృహృద్గతసదర్థవిబోధహేతుం
కావ్యశ్రియా పరిగతం చ చకార రమ్యమ్."

ఈ గుణము నింక ననేకుల యనువాదములందును గాననగును. శ్రీవిశ్వనాథకవిరాజుగారి [11] యాశ్చర్య

10. భా. VIII-౫౩౩.

11. మూలకారుడు శక్తిభద్రుడు.

చూడామణ్యనువాదమును గనుడు; శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి భాసనాటకానువాదములం జూడుడు.

(౨) ఒక భాషనుండి మఱియొక భాషకు అనువదించునప్పుడు అనువాదకుడు ఆయాభాషల జాతీయతను గుర్తించి పోషింపవలయును. జాతీయతను పాటించుట యనగా ఆయా భాషయందు దానిదానికి స్వాభావికములైన రీతులను అనుసరించుటే. ఇతర భాషలనుండి—సంస్కృతమునుండిగాని, ఆంగ్లమునుండిగాని—ఆంధ్రమునకు అనువదించునప్పుడు ఆంధ్ర భాషామర్యాదలను అవలంబింపవలయును. ఇందుండి వానిలోనికి అనువదించునప్పుడు వాని సహజపద్ధతులను అవలంబింపవలయును. ఇట్లు చేయుటలో అనువాదకుని స్వాతంత్ర్యము మిగుమిక్కిలి ప్రకాశించును. (అ) పూర్వకవులు పైతము సంస్కృతభాషామర్యాదల నెన్నిటినో తెలిసియో తెలియకయో తెలుగులోనికి ఎక్కించినారు. చూడుడు శ్రీనాథుని పద్యము—(ఇది అనువాదముకాదు లెండు)

"హాటకగర్భుచేత గమ
లాసనుచే జతురాస్యకంకళ్యం
గాటకపీఠికాశ్రుతవి
గాహచతుస్స్మృతిచేత దేవతా
కోటికిరీటసంఘటిత
కోమలపాదసరోజుచే జగ
న్నాటకసూత్రిచేత గృతి
నాథుడు గాంచు జిరాయురున్నతుల్"12.

ఇట్టి లక్ష్యములం బట్టియే వ్యాకర్తలు ఇట్లు సూత్రించిరి—"విశేష్యంబునకుం బోలె విశేషణంబునకు లింగవిభక్తివచనంబు లగు13." కాని ఈ లక్షణము సంస్కృతమునకు సొంత మనియు, తెలుగునకు విజాతీయ మనియు భాషాతత్వశాస్త్రపరిశోధకు లెల్లరు ఏకగ్రీవముగ అంగీకరించిరి. కావున ఇట్టి లక్షణము సంస్కృతవాక్యమున నున్నను తెనుగులోనికి ఆ వాక్యమును మార్చునప్పుడు తెలుగునకు సహజముగ నుండునట్లు మార్చవలయును. ఉదా: "అయే! కింసుమలం కుసుమరహితామపి లతా మిమాం పశ్యతా మయా రతి రుపలభ్యతే"14. ఇందులకు వే. వేం. శాస్త్రిగారి యనువాదము: "ఏమి యిది ఆహా, పూవులు లేనిదానినే అయినను ఈ తీగను చూడగా నాకు రతి కలిగినది." దీని నిట్లు మార్చిన అనువాదము జాతీయమగు నని నా విన్నపము: "ఈ తీగలో పువ్వులైనను లేవే, ఐనను ఆహా ఎందుచేతనో దీనిని చూచినంతనే నాకు ప్రీతి పుట్టుచున్నది." (ఆ) *'Every University must have a publishing department'*15. ఈ యాంగ్ల వాక్యమును అనేకులు ఇట్లు అనువదింతురు: "ప్రతి విశ్వవిద్యాలయమును ప్రకటనశాఖను ఒకదానిని కలిగియుండవలయును." ఇది అనాంధ్రతాదుష్టమును, వ్యాకృతిభ్రష్టము నగు క్రమము. దీనికి సరియైన యనువాదము ఇది: "ప్రతివిశ్వవిద్యాలయమందును ఒక ప్రకటనశాఖ తప్పక యుండవలయును." మన ప్రాచ్యభాషలలో 'ఉపచారము' సులభము. మంత్రిమాత్రు నెల్ల మంత్రిసత్తము డనుచుందుము; ఉపాధ్యాయమాత్రు నెల్ల ఉపాధ్యాయోత్తము డనుచుందుము; ఒక్కొక్క రాజును మనకు రాజేంద్రుడే; ఒక్కొక్క కవియు మనకు కవీశ్వరుడే. ఈ సత్తమోత్తమేంద్రాది శబ్దములను ఇట్టిపట్టుల అవివక్షితార్థకప్రాయములుగ గొనవలయును. ఇట్టి యౌపచారికక్రమములు ఆంగ్లమున లేవు. కావున అందులోనికి పూర్వోక్తశబ్దములను *'The Minister' 'The Teacher' 'The King' 'The Poet'* అనియే అనువదింపవలయును.

(3) ఒక్కదానినే పలువురు అనువదింతురేని ఒక్కొక్కని యనువాదము అతని విశిష్టతకు స్థాపకమై వెలయును. అనువాదకులలో ఒక్కొక్కడును ఏయే యంశములలో ఇతరులనుండి తాను వేఱగుచున్నాడో ఆ యంశములే అతని స్వాతంత్ర్యమును గనుపఱచునవి. ఈ క్రిందిశ్లోకము కాళిదాస 'శాకుంతల'మందును, భర్తృహరి 'సుభాషితత్రిశతి'యందును గూడ గలదు.

---

12. శృం. నై. I-3.

13. బాల. వ్యా. కా. ౧౯.

14. విక్రమో *IV*.

15. ఇంటర్మీడియేటు పరీక్షాపత్రము *March 1944*.

"భవన్తి నమ్రా స్తరవః ఫలోద్గమై
ర్నవాంబుభి ర్దూరవిలంబినో ఘనాః
అనుద్ధతా స్సత్పురుషా స్సమృద్ధిభి
స్స్వభావ ఏవైష పరోపకారిణామ్16."

ఈ శ్లోకమునకు అక్షరార్థము ఇట్లు చెప్పవచ్చును : 'పండ్లబరువుచే చెట్లు నమ్రత గాంచుచున్నవి, క్రొత్తనీళ్లచే మేఘములు దవ్వుల వ్రేలుచుండును, సంపదలచే సజ్జనులు వినయవంతులగుదురు; పరోపకారపరులకు ఇది సహజమే.' పద్యోక్తగుణము ఉపకారులకు మిక్కిలి స్వాభావికమే యనుటను పాదమున స్వభావశబ్దపూర్వనిపాతముచేతను, ఏవకారముచేతను కవి ఘోషించినాడు. తృతీయా స్వరస్యముచే ఫలోద్గమ - నవాంబు - సమృద్ధులకును నమ్రతా - దూరవిలంబన - అనుద్ధతులకును హేతుహేతుమద్భావవ్యాప్తియు గలదు. ఈ యర్థమునకు విదురనీతియందు సంవాదము ఉన్నది.

"విద్యామదో ధనమద
స్తృతీయో ఽభిజనో మదః
మదా ఏతేఽవలిప్తానా
మేత ఏవ సతాం దమాః."

ఇందులకు శ్రీసోమయాజులవారి యనువాదము.

"ధనమును విద్యయును వంశం
బును దుర్మతులకు మదంబు బొనరించును, స
జ్జనులైనవారి కడకవ
యును వినయము నివియ తెచ్చు నుర్వీనాథా17."

ఇట్టి పూర్వోక్తశ్లోకమును త్రిశత్యనువాదకులెల్లరును, శాకుంతలానువాదకులెల్లరును అనువదించియున్నారు. వాని వానియు, ఒక్కొక్కరియనువాద విశిష్టతయు, అందు బయల్పడు ననువాదకస్వాతంత్ర్యమును తెలియుటకై ఒక కొన్నింటిని ఈదిగువ జూపుచున్నాను :

"తరువు లతిరసఫలభారగురుత గాంచు
నింగి వ్రేలుచు నమృత మొసంగు మేఘు
డుద్ధతులు గారు సాధులు బుద్ధిచేత
జగతి నుపకర్తలకు నిది సహజగుణమె."

(ఏనుగు లక్ష్మణకవి)

"స్వాత్మం బొప్ప ఫలించియున్ మహీజముల్
నమ్రంబులై కన్పడున్,
తోయంబుల్ గొనియున్ విదూరముగ నుం
డున్ మేఘ, మత్యున్నత
శ్రీయుక్తుండయియున్ వినమ్రత బ్రవ
ర్తిల్లున్ బుధుం, డార్యులా
హా యీదృక్చరితుల్ గదా, సురభిమ
ల్లా, నీతివాచస్పతీ."

(ఎలకూచి బాలసరస్వతి)

"ఫలముల వెక్కటిల్లియును
బాదపముల్ గను నమ్రభావముల్,
జలధరపంక్తి దవ్వుల నొ
సంగియు నమ్రత నిచ్చు దోయముల్,
కలిమి కలంగియున్ ఘనులు
గర్వము జెందకయుండు, రింతయుం
దలప బరోపకారు లను
ధన్యులకైన స్వభావకృత్యముల్."

(పుష్పగిరి తిమ్మన)

"వినమ్రములౌ బండ్ల వివృద్ధిచే దరుల్
ఘనంబులున్ వంగు నవీనవాంబులన్
అనుద్ధతుల్ సజ్జను లాఢ్యసంపదన్
జనోపకృజ్జన్మగుణం బిదే కదా."

(వే. వేం. శాస్త్రిగారు)

(౧) ఏనుగు లక్ష్మణకవియనువాదమున ఫలములకు అతిరసము లనెడి విశేషము గలదు. అట్టి పండ్లచే బరువెక్కుటమాత్రమే చెప్పబడినది. కాని నమ్రతకు వాక్యమున గమకమే లేదు. రెండవపాదమున 'వ్రేలుట' కుండవలసిన ప్రాధాన్యము 'ఒసంగుట'కు మారినది. ఈ మార్పును పుష్పగిరి తిమ్మనయు గావించినాడు. మూడవ చరణమున మూలకవి 'అనుద్ధతు'లను పర్యదా

16. భర్తృ. I; శాకుం. V.
17. భార. ఉద్యో. II

నముచే వినయశోభితు లను నర్థము దోపకేయు, ఈయన ఉద్ధతులు గా రను ప్రసజ్యప్రతిషేధముతో తృప్తిపడి నాడు. మూలమున గల హేతుహేతుమద్భావస్ఫూర్తి ఇందు లేదు. (ఆ, ౩) బాలసరస్వతి 'నమ్రంబులై యొప్పెడిన్' అనక 'కన్పడున్' అన్నాడు. మొదటి యనువాదమువంటువలె ఇందును మూలములోని యా హేతుహేతుమద్భావస్ఫూర్తి లేదు. అంతే కాదు. 'ఫలించియున్', 'తోయంబుల్ గొనియున్', 'అత్యున్నతశ్రీయుక్తం డయియున్' అను నపూర్థకములచే ఫలోద్గమ-నవాంబు-సమృద్ధులకు సాధారణముగ గల్గు ఫలములు నమ్రతా-విలంబన-అనుద్ధతులు కానట్లును, ఇక్కడ అవి గల్గుట వింత యైనట్లును ఒక ధ్వని గల్గుచున్నది. "ఫలముల బిక్కటిల్లియును" "కలిమి కలంగియున్"అన్నప్పుడు పుష్పగిరి తిమ్మనయు ఇదే ధ్వనిని గూర్చినాడు. 'సురభిమల్లా నీతివాచస్పతీ' అను దశ మునకు తావు గల్పింప మల్లభూపాలీయకర్త 'పరోపకారు' లనవలసినచోట 'ఆర్యు'లనియు అన్యవాక్యసాపేక్షముగ 'ఉద్వృత్ చరితుల్ గదా' అనియు వ్రాయ వలసివచ్చినది. (ర) వే. వేం. శాస్త్రిగారి యనువాదమున హేతుహేతుమద్భావస్ఫూర్త్యాది మూలగతసౌస్వర స్యము అంతయు వచ్చియున్నది.

ఈ భేదములం జూపుట పై యనువాదములను వాట్లింటిని అగ్గించుటకేగాని, దేనినైనను తగ్గించుటకు కానేకాదు. అనువాదము మూలమునకన్న ఇంచుకేని భిన్నమైయుండరా దను నిర్బంధము లేదు. మూలోక్త క్రమమునకు కట్టుపడక కొందఱు స్వాతంత్ర్యముం జూపిరి. ఆ స్వాతంత్ర్యముచే వే. వేం. శాస్త్రిగారు మూలోక్తక్రమమును అన్యూనాతిరిక్తముగ నిర్వహించు సామర్థ్యము మేర జూపినారు. లోకము భిన్నరుచిగావున ఏ యనువాదక్రమము ఏ పఠితకు రుచించునో అతని దృక్పథమున ఆ క్రమము ఇతరములను మించినది. ఎక్కడగాని అధరోత్తరవిచారము యొక్క పరమార్థము ఇంతే కదా!

(ర) భావమును ఆవిష్కరించునప్పుడుగాని, శిలమును జిత్రించునప్పుడు గాని ఎంతేని అరుదుగా అనువాదము అనువాదాంతరములనేగాక మూలమును మైతము మించుట గలదు. ఆ మించుటయు పరిత్రభీరుచు లంబట్టి ఏర్పడునదే. అట్టియెడల అనువాదకుడు నిక్కముగకు మూలకవివాక్యమును అతిక్రమించుచుండునే గాని మూలకవిహృదయమును అతిక్రమింపడు. అనగా మూలకవికి ఏది వివక్షితమో దానినే అతనికన్న మాటిగా స్ఫుటముగా అనువాదకుడు ప్రకాశింపజేయునన్నట. రూపకముల ప్రస్తావనలలో ప్రరోచన యను ఘట్టమున కవికావ్యనటాదిప్రశంస విహితము. శ్రీహర్షుని రూపకములు మూడింటను నటప్రశంసావాక్యము— 'నాట్యేషు దక్షా వయమ్.' దీనికి వేదముశాస్త్రిలవారి యనువాదము—'మాతో సాటిలే రాటలో'. ఇట నటోత్కర్ష మూలవాక్యమునందుకంటె అనువాదవాక్యమందు స్ఫుటతరముగ ధ్వనించుచున్నది. ఉత్కర్షయే మూలకవికిని వివక్షితముగావున అనువాదవాక్యము మూలవాక్యమునకు ఎంత ఎడసియున్నదో మూలకవిహృదయమునకు అంత చేరువైయున్నది. ఇదియు అనువాదకుని స్వాతంత్ర్యము బయల్పడు మార్గములలో అన్యతమము.

'అనువాదము' 'భాషాంతరీకరణము' అనువానిని పర్యాయములుగ కొందఱు వాడుచుందురు. ఆ పర్యాయత గలుగవలయునన్న 'భాష'కు 'వాక్కు' 'మాట' అనునంతమాత్రమే అర్థముగా గొనవలయును. 'భాషాంతరీకరణ' మనగా 'వేఱుమాటలలో (in other words) చెప్పుట' యగును. అట్లుగాక 'భాష'కు ఆంధ్రాంగ్లాది దేశభాషలను, గ్రీక్ గీర్వాణలాటినాదిప్రాచీనభాషలను అర్థముగా గొన్నయెడల 'అనువాద' 'భాషాంతరీకరణ ము'లకు బర్యాయత గలుగదు. అప్పుడు అనువాద విధానములలో (క) భాషను మార్చు విధానము ఒక్కటి మాత్రమే భాషాంతరీకరణ మనదగును. ఆంధ్రాంగ్ల గీర్వాణాదిభాషలలో ఒకదానినుండి వేఱొకదాని లోనికి జేయబడు ననువాదములు ఇట్టివి. (ఖ) భాషను మార్పకయు, అనగా మూలము ఏభాషయం దున్నదో అదే భాషలోనే దానిని అనువదింపవచ్చును. ఆంధ్ర నాటకపితామహు లనబరగిన శ్రీ. శే. ధర్మవరము రామకృష్ణమాచార్యులవారు తమ నాటకములలో ఒక యపూర్వవిధానమును అనుసరించిరి. కొన్నిపాత్రముల భాషితములను మూడురూపములలో రచించినారు—

గద్యరూపమున, పద్యరూపమున, గేయరూపమున. ఆ పాత్రముల నిర్వహించువారు సంగీతనిపుణులైనయెడల గేయమును, ఒకపాటి రక్తకంఠులైనయెడల పద్యమును, అభినయమాత్రనిపుణులైనచో గద్యమును అనుసరింప అనువై యున్నది. ఈ గద్యపద్యగేయములు ఒండొకదానికి అనువాదములై అన్నియు దెలుగునందే యున్నవి. ఇట్టివి భాషాంతరీకరణములు కానట్టి యనువాదములు. ఇట్లు పద్యమును గద్యముగా, గద్యమును పద్యముగా, ఈయుభయమును గేయముగా, గేయమును ఈయుభయముగా అనువదింపవచ్చును. (గ) శ్రవ్యకావ్యమును దృశ్యకావ్యముగా, దృశ్యకావ్యమును శ్రవ్యకావ్యముగా అనువదింపవచ్చును. కాళిదాసుని కుమారసంభవ (శ్రవ్యకావ్య)మును వామనభట్టబాణుడు పార్వతీపరిణయ (దృశ్యకావ్య)ముగా మార్చినాడు. పిల్లలమఱ్ఱి పినవీరుని శృంగారశాకుంతల మను శ్రవ్యకావ్యము ప్రాయికముగా కాళిదాసుని శాకుంతల నాటకమునకు అనువాదమే. (ఘ) సంక్షిప్తముగ నున్న దానిని విస్తృతముగను, విస్తృతమును సంక్షిప్తముగను మార్చుటయు అనువాదమే.

"కురుబల మేల దైత్యసుర
కోటులు వచ్చిన గెల్వరాదె యు
త్తరునకు నా బృహన్నల ర
థంబు పయిం బరవాహినీభయం
కరభుజసారముల్ మెఱయ
గా దఱిగాంచితి నంచు విక్రమో
ద్ధురగతి నాజికేళి నిర
తుం డయి దుర్దమలీల నుండగన్."

ఇది ధర్మరాజు విరాటునితో జెప్పిన వాక్యము (విరా. ౫-౨౫౨). ఆ ధర్మరాజే దీనినే తన తమ్ముల యెదుట ఇట్లు అనువదించినాడు:

"ఒం డేమియు లేదు విరా
టుం డాత్మతనూజు బొగడుచును దుర్దమదో
ర్దండత గల్గు బృహన్నల
యుండ గొఱత యేమి పగఱ నోర్చుట కంటిన్."
(విరా. ౫-౩౦౮)

(ఙ) ఏమార్పును జేయక, చిలుకవలె, చెప్పిన దానిని అట్లే మఱల జెప్పుటయు అనువాదమే. మాటలు వేఱుగాక అవే యగుటచే ఇదియు భాషాంతరీకరణము కానట్టి యనువాదమే. ద్రౌపది కీచకుని బెదరింప ఇట్లు చెప్పినది:

"దుర్వారోద్యమబాహువిక్రమరసా
స్తోకప్రతాపస్ఫురద్
గర్వాంధప్రతివీరనిర్మథనవి
ద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్పు నినుం దో
ర్లీలన్ వసం గిట్టి గం
ధర్వుల్ మానము ప్రాణముం గొనుట త
థ్యం బెమ్మెయిం గీచకా."
(విరా. ౨-౫౫)


ఆమెయే కీచకునితో దా నిట్లంటి నని ఇదే వాక్యమును ఇట్లే మఱల భీమునితో జెప్పినది. (విరా. ౨-౧౬౨). ఉత్తరగోగ్రహణమప్పుడు భీష్ముడు దుర్యోధనునితో ఇట్లనెను:

"వచ్చినవాడు ఫల్గును డ
వశ్యము గెల్తు మనంగరాదు రా
వచ్చికినై పెనంగిన బ
లంబులు రెండును గెల్వ నేర్చునే
హెచ్చును గుందునుం గొడరు
లెల్లవిధంబుల గోర్చు టట్లుగా
కిచ్చ దలంచి యొక్కమెయి
నిత్తఱి బొందగు చేతయుం దగున్."
(విరా. ౪-౨౩౪)

రాయబారము వెడలుటకు ముందు శ్రీకృష్ణుడు ఈ భీష్మవాక్యమును ఇట్లే అర్జును నెదుట అనువదించెను (ఉద్యో ౩-౭౫).

స్వతంత్రరచన లని తలంపబడువానియందు ఉన్నంత వైవిధ్యము అనువాదములందును గలదు. అంతటి ప్రతిభావిహారము వీనియందును గలదు. అట్టి స్వాతంత్ర్యమును గలదు. కావున ఆంధ్ర వాఙ్మయమెల్ల బహుతరముగా సంస్కృతవాఙ్మయమునకు అనువాదమో, అనుకరణమో ఐయుండు ననుట ఇటు తత్త్వార్థకథనమును, అటు ప్రశంసయుఁగూడ నగును.

"మహిమన్ వాగనుశాసనుండు సృజియిం
పం గుండలీంద్రుండు ద
న్మహనీయస్థితిమూలమై నిలువ శ్రీ
నాథుండు ప్రోవన్ మహా
మహులై సోముఁడు భాస్కరుండు వెలయిం
పన్ సొంపు వాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమున ద
త్పాత్రిగల్భక్తి మాహించెదన్."



గోదాదేవివిరహము

•

శ్రీ దివాకర్ల వేంకటావధాని

ఆముక్తమాల్యదయందలి ప్రధానవస్తువు గోదా శ్రీరంగేశ్వరుల ప్రణయము. కావ్యము చివరికి వారి వివాహముతోడనే ముగిసినది. వీరి ప్రణయవృత్తాంత మంతయు దుదిరెండాశ్వాసములందును వర్ణితమైనది. మొదటి నాల్గాశ్వాసములందలి కథకును, దీనికిని నంతగా సంబంధము లేదు. అంతో యింతో యీరెంటికిని సంబంధము కూర్చునంశము గోదాదేవి విష్ణుచిత్తుని కూతు రగుట. ఇతరమతములకంటె వైష్ణవమతమునకును, నితరదైవములకంటె విష్ణువునకును గల యాధిక్యమును సూచించు నుద్దేశముతో కృష్ణరాయ లీ మొదటి నాల్గాశ్వాసములందలి కథను ననవసరముగా బెంచెను. ఇట్లే విష్ణునామసంకీర్తనమహిమను వివరించి గోదాదేవి 'వింతతపము'నకు దృష్టాంతము చూపుటకై యాతడు తుదియాశ్వాసమున మాలదాసరికథను వర్ణించెను. దీనివలెనే ప్రధానకథను వ్యవహితము గావించిన మఱొక భాగము పంచమాశ్వాసమునందలి దీర్ఘమైన వసంతర్తువర్ణనము. గోదాదేవివిరహమున కుత్కర్ష చేకూర్చుటకై కవి దీని నిట వర్ణించియుండెను. ఈ రెండును గలసి చివరిరెండాశ్వాసములందును గొంచె మించుమించుగా సగముభాగ మాక్రమించినవి. మిగిలిన సగమునందు వర్ణింపబడిన విషయములలో గోదాయౌవన వర్ణనము, విరహము, గోదాపహరణము, వివాహము ప్రధానములైనవి. వీనిలో గోదావిరహ మద్భుతమైన సృష్టి. ఇచ్చట నవలంబింపబడిన మార్గ మాంధ్రవాఙ్మయమునం దనన్యసామాన్య మైనది.

ప్రబంధములం దుండవలసిన యష్టాదశవర్ణనములలో విరహవర్ణనముకూడ నొక్కటి. ఆంధ్రవాఙ్మయము నందలి ప్రబంధములన్నిటియందు నిది యల్పముగనో, యధికముగనో వర్ణింపబడియేయున్నది. నాయికానాయకు లొండొరుల జూచి, వలచి యిండ్లకేగిన పిమ్మట ప్రబంధకవులు వారి విరహములను వర్ణింతురు. ఈ విరహవర్ణనములలో జంద్రమాగవమన్మథోపాలంభములు, చిగురాకుసెజ్జలు, మంచిగందంపుబూతలు మున్నగు శీతలోపచారములు, మన్మథపూజలు ప్రధానస్థానము నాక్రమించును. ఇందలి విరహబాధ సాధారణముగా నాంగికమై తుచ్ఛమైన కామమును వెలిపుచ్చుచుండును. అందు గామేచ్ఛ లేని పవిత్రప్రణయము మృగ్యము.

ప్రబంధములలో నాయికానాయకులకు బ్రథమ సమాగమ మతర్కితపూర్వమై హఠాత్తుగా నే యరణ్యమునందో, యే యుద్యానవనమునందో చేకూరుచుండును. వా రంతకుముం దొండొరుల నెఱింగినవారై యుండరు. యౌవనము, తజ్జన్యమైన యంగ సౌందర్యము చూచి వా రొండొరులకు మేల్పడి ప్రణయసంభాషణము గావింతురు. గుణముల ప్రసక్తియే లేని గ్రుడ్డివల పది. "న కురూపాః పాపసమాచారా భవన్తి" యను నానుడిచొప్పున వారు గుణనిధులుకూడ నగుట తటస్థించుటచే నంతగా జిక్కు లేకపోవుచున్నది కాని లేనిచో వా రిరువురును బిమ్మట బశ్చాత్తాపము నొందవలసినవారే. బాహ్యసౌందర్యమునే కాని వా రాంతరసౌందర్యమును బరిశీలించుట యరుదు. అందుచేతనే వారి ప్రణయములలో శాశ్వతమైన కామేచ్ఛకువలె బావిత్ర్యమునకు జోటు లేకపోవుట.

మానవపరిస్థితులందలి సుఖదుఃఖముల బరిశీలింపకయే ప్రకృతి కాలానుగుణమైన తన ధర్మమును యథావిధిగా నిర్వహించుకొనిపోవును. మానవులలో గొందఱి కేకారణముచేతనో దుఃఖము చేకుఱెనుగదా యని వసంతమున లతలు పూవులు పూవక మానవు.

వృక్షాదులు చిగురాకులు తొడుగక మానవు. కోయిలలు మావిచిగురులు మెక్కి మృదుమధురముగా బాడక మానవు. అట్టే కొందఱికి సౌఖ్యకారణములైన పరిస్థితు లభ్యమగదా యని గ్రీష్మమున వడగాలులు కాక వలిగాలులు వీవదొడగవు. మనము మన పరిస్థితులను జక్కపఱుచుకొనవలయునే కాని కాలమునో, ప్రకృతినో నిందించిన లాభ మేమి? అట్లు నిందించుట కన్నము వేసిన దొంగను శిక్షించుట మాని వానికి చౌర్య మొనరించుట కవకాశ మొసంగిన రాత్రిని దూషించిన ట్లపహాస్యమునకు పాత్ర మగును. ఇది నిజమే కాని చెడుగునకు బరోక్షకారణమును బరిశీలింపక ప్రత్యక్షకారణమునుమాత్ర మరసి వెంటనే దానిని నిందించుట మానవస్వభావము. ఇట్టిదే ప్రబంధములలో నాయికానాయకు లొనరించు చంద్రమన్మథమధుమాసాద్యుపాలంభమును. నాయిక సౌందర్యాతిశయముచే దన్ను వలపించి తన మనోరథ మీడేర్పకయే యరిగిన ప్రియుని, ప్రియుని మంచిచెడుగు లాలోచింపక గాటముగా వలచిన తన మనస్సును విడిచి యథాకాలమున దన పనిని దాను నిర్వహించుకొనిపోవు ప్రకృతిని నిందించుట యేటి న్యాయము?

గోదాదేవి పూర్వజన్మమున భూదేవి. "దివిజద్రుప్రసవం" అను పద్యమున నామె తొలిపుట్టువున సత్యభామ యనియు జెప్పబడినది. ఈ యిరువురిలో నెవ్వరైనను ఆమె శ్రీవిష్ణుప్రేమ చూఱగొన్నదియే. మరాళిక, ఏకావళి, హారిణి, మనోజ్ఞ, స్రగ్విణి మున్నగు నాగకన్య లామెయెడ గల ప్రాణమైత్రిచే బోరుగుల భాగవతుల గృహముల జనించి యామెకు వయస్యలైరి. వారు బొమ్మల పెండ్లిండ్లు చేయు సమయముల లక్ష్మీకల్యాణమునకు సంబంధించిన పాటలు పాడుచుండ గోదాదేవి యందు వర్ణితములైన యనంతుని కల్యాణగుణము లాకర్ణించి, ప్రాగ్జన్మసంస్కారవశమున నాతని గవయ నువ్విళులూరుచుండును. ఆమె తన తండ్రి కూర్చిన చెంగలువదండలను ధమ్మిల్లమున ధరించి, నూతిలో నీడ చూచికొని, మరల వానిని బుట్టలో నునిచి, వియోగాతిశయమున నిట్టూర్చుచు విష్ణు నుపాలంభింప దొరకొనును. అతడే యవతారంబులందును దన్ను వలచి త్రోపాడిన వనితల నెవ్వరిని గాపాడియుండకపోవు టటుండ నెక్కుమందిని నెక్కు విధముల హింసించియుండ నుండెనట! అతడు పూర్వకల్పములందు సక్తస్త్రీవిశాలాంబకాంబురుహశ్రేణి జలంబును, మైబులకలును బూరించిన దుర్భరకర్మప్రభావముచేతనే "జలచారస్తబ్ధరోమత్వకేసరిత్వ"ము లొంది ప్రౌఢు డగుటచే వాని నవతారదంభమున నాచ్ఛాదించె నట! ఈ యుపాలంభమున నామెకు విష్ణువుపై గల యపారమైన యనురాగము సర్వతోముఖముగా గోచరించుచుండును. అసలు విరహమున వేగు త న్నుపేక్షించిన కోపముచేతనే యామె యాతని యవతారాంతరముల గాంతారత్నముల కొనరించిన వంచన యంతయు వెల్లడించినది. తన్ను గవయ కోరికతో మునులు గోపికలై జనింప గొంతకాలము వారిని గూడి, యక్రూరుని ప్రేరణముచే మధురాపురయాత్రామిషమున సక్తస్వాంతలగు వారిని వియోగవారాశి ముంచి యేగిన కృష్ణునికాఠిన్య మామె కెంతో వగపు కలిగించినది. చక్కనిదైన శూర్పణఖను రామావతారమున నాతడు 'సోణాలంట ఘోణాచ్ఛేద' మొనరించి బలితుచేయుటయే యామెకు ధర్మేతరముగా గోచరింప నింక నమాయికలగు గోపికల కాతడొనరించిన ద్రోహ మామెకు జాలి కలిగించె ననుటలో వింత యేమి! తనవలెనే కృష్ణునిచే నుపేక్షింపబడి దారుణవిరహాగ్నికీలలపాలైన యితరకాంతల దుస్థితిని వర్ణించి సాధర్మ్యముచే నామె తనవిరహాతురత్వము నెంతో గూఢముగా వెల్లడించినది. 'ఉపాలంభదంభంబుగా జేయు పునఃపునఃస్మరణంబున' నామె వ్యాహరించిన యంతఃకరణరాగ మింతింత యనరాదు. నిందలో స్తుతినివలె నుపాలంభమున నపారానురాగమును వెల్లడించిన యీఘట్టము రామణీయకము 'శ్లాఘాలంఘనజాంఘికమై' యున్నది.

వయస్యలు పాడిన పాటల మాధుర్యమును, నందు వర్ణితములైన మాధవుని మహితగుణములను వినినంతనే గోదకు బూర్వజనిస్మృతి కలిగినది. ఆమెహృదయము వియోగదవదహనభరాక్రాంతమై విన్నదన మొందినది. కాళిదా సన్నట్లు జననాంతరసౌహృదములు భావస్థిరములై యుండునుగదా! గోదావిష్ణువులకు సమాగమ మామె భూదేవియో, సత్యభామయో యైయున్నప్పటి పూర్వజన్మమున; వియోగమును, దజ్జన్యబాధానుభవమును

నీజన్మమున. ఇవియైనను ఆంతరసౌందర్యమునకు సంబంధించిన గుణగణముల వినుటవలన గలిగినదే కాని యంగసౌష్ఠవముచే గలుగు బాహ్యసౌందర్యమును జూచుటచే గలిగినది కాదు. అందుచేతనే యీ వియోగమున గామమునకు బదులు ప్రేమము, మోహమునకు బదులు భక్తిభావము గోచరించుచున్నవి.

వియోగతాప మతిశయించిన వేళల జెలికత్తె లొనరించు శీతలోపచారము లందుచు నవి యా తాపమును మఱింత పెంపొందింప లజ్జ వోనాడి మన్మథ మధుమాసమలయానిలాదుల గసితీఱ నిందించుట ప్రబంధనాయికల పద్ధతి. వారి మదనతాపమును వేడినిట్టూర్పులతోపాటు వాడిన తామర తూండ్లును, కాగిన చిగురాకు సెజ్జలును జెప్పకయే చెప్పుచుండును. గోదాదేవి విరహావస్థలోగూడ స్త్రీసహజమైన హ్రీవిశేషము నుజ్జగింపదు. మాటలవలనను, చేష్టలవలనను జెలికత్తెలామె స్థితి గ్రహించి యడుగ నామె యార్పగ దీర్పగ శక్తిలేనివారికా విచార మేల యని "మేలంబు చేసికొని తేలిపో బలికి పుటపాకప్రకారంబగు వియోగభారము" సహించికొనియుండెను. కాని నిశాసమయంబుల నొక్కొక్కప్పు డొంటిపాటున విష్ణు నుద్దేశించి యామె పలుకు పలుకు లాలించి వయస్యలు మొదలింప, నామె "కించిదవనతాననయై నెమ్మొగంబు వెలవెలపాటు లేవగవున నడంచి మఱి మొఱంగ ననుపుపడక" జన్మాంతరమునందలి యనంతునితోడి క్రీడాప్రపంచము సద్యస్స్వమనుభూత మైన తెఱగున దోఁచుటయుఁ, గన్నీరోద్చుచు మేన బులకలు పొడమ మూర్ఛిల్లును. వెంటనే చెలులు శీతలోపచారము లొనర్ప నామె తెలివొంది, ముకుందచరణస్మృతినిశ్చలతచే మరల గన్నులు మొగుచును. కవి యీ సందర్భమున వియోగమున భక్తిని,భక్తిలో వియోగవ్యథను బ్రదర్శించి విరహమునుగూడ నతిపవిత్రమును, మహోదాత్తమును గావించినాడు. ఈరీతి విరహ మాంధ్రవాఙ్మయములో నింక మఱెచ్చటను గానరాదు.

వియోగవ్యథ దుర్భర మైనప్పు డితరప్రబంధకర్తలు నాయికలచే మన్మథపూజ చేయింతురు. ఆ పూజచే ప్రీతుడై మదనుడు పూముల్కులం విపరక ప్రసన్నత వహించు నని వారి యూహ. ఇది కార్యకారణముల సంబంధ మెఱుంగని వెఱ్ఱిచేత. వియోగవ్యథకు గారణము ప్రియసమాగమాభావము. అది సమకూరుటతో నంతె వ్యసనమును నంతమొందును. అందుచే మన్మథప్రసాదనముకంటెను ముఖ్యమైనది ప్రియసమాగమసంపాదకమైన వ్యవసాయము. గోదాదేవి యొనరించిన పని యిదియే. ఆమె ప్రతిదినము శ్రీవిల్లిపుత్తూరున నున్న విష్ణుదేవాలయమున కరిగి, భక్తితో నాతని బూజించి, యింటికి వచ్చి వియోగచ్యుతధైర్యయై యదుపతిగుణగణములు ద్రవిడభాషలో బాడుచు గాలము పుచ్చుచుండును. ఈరీతియే శ్రీరంగని యంతరంగము ననురాగతరంగితము గావించినది.

పూర్వజన్మవృత్తాంతమును విడిచినచో నిచ్చటి శృంగార మంతయు నయోగసంబంధియే. ఏలయన, నిచట నాయకుడు విగ్రహమూర్తియే కాని కృష్ణనాయకము లైన యితరప్రబంధములందువలె మానవమూర్తి కాడు. ఈ జన్మమున గోదాదేవి యాతని గుణగణముల విన్నదే కాని యాతని రూపము చూచి యెఱుంగదు. అయ్యును ప్రేమ. ప్రేమయే కాదు వియోగము! ఈ భావనాబలమువలననే యామె శిలావిగ్రహమును గూడ జలింపజేసి, వలపించుకొని, చివరికి పెండ్లాడ జాలినది.

కృష్ణరాయలు ప్రబంధయుగమును బ్రవర్తింప జేసిన మహారాజు. కేవలసమరరంగమందే కాక సాహిత్యరంగమందును జక్రవర్తి. కవులు సాధారణముగా గాలప్రభావమును, సమకాలికాభిరుచులను నతిక్రమించిపోజాలరు. వియోగవర్ణనసందర్భములు పరిశీలించి చూడ బ్రబంధములందలి వన్నియు గొంచె మించుమించుగా నొక్కమాదిరిగానే యుండును. ఒక్క కృష్ణరాయలే యీవర్ణనమున నూతనమార్గమును ద్రొక్కినాడు. నూతనత్వముతోపాటు గాంభీర్యమును,పావిత్ర్యమును గూడ జతచేసి దివ్యమానవవ్యతికరవిచిత్రమైన యీ వియోగఘట్టమును గృష్ణరాయలు మహోదాత్తముగా సంతరించినాడు.

ఇందులేఖ

శ్రీ త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి

ఆ గ్రామములో పురుషోత్తమరావు సంపన్న గృహస్థు. ఆయనముద్దుకొడుకు శ్రీనివాసరావు బి. ఏ. పరీక్ష ఇచ్చి కొద్దిరోజుల క్రిందట ఇంటికి వచ్చినాడు. అతనికి వివాహమై నాలుగేండ్లైనది. భార్య కాపురానికి వచ్చికూడా సంవత్సరము కావచ్చినది. అతని వయస్సు ఇరవై రెండేండ్లు. మంచి ప్రవర్తనా, చక్కని నియమములూ కలవాడు. అయితే తండ్రికి అతనిమీద కోపము. మొదటికారణము బ్రహ్మసమాజములో చేరినాడని; రెండవది ఇంట్లో పదహారేండ్ల భార్య ఉంటే ఆమెవంక చూడనైనా చూడడని.

శ్రీనివాసరావుభార్యపేరు ఇందులేఖ. ఆమె బుద్ధిమంతురాలు. సామాన్యముగా చదువుకొన్నది. కాని ఈ కాలపు నవనాగరకతారీతులు లేకపోవడముచేత ఆమెవేషభాషలు, ఆచారవ్యవహారాలు అంత నవీనముగా ఉండవు. ఇందులేఖ సౌందర్యవతి. ముఖమున లక్ష్మీకళ ఉట్టిపడుతూఉంటుంది. కనుకొలకుల నుండి యౌవనరేఖలు ఇప్పుడిప్పుడే తొంగిచూస్తున్నవి. అయితే భర్త విముఖుడుగా ఉండడముచేత ఆమె ముఖశ్రీమీద విచారచ్ఛాయలు అప్పుడప్పుడు పొడచూపుతున్నవి. శ్రీనివాసరావు సెలవులకు ఇంటికి వచ్చినప్పుడెల్ల ఇంటిలోనివారూ, ఇరుగుపొరుగమ్మలూ భార్యాభర్తల నిద్దరిని కలుపవలెనని ఎంతో ప్రయత్నము చేసినారు. కాని కృతకృత్యులు కాలేకపోయినారు.

ఒకరోజున అన్నము పెట్టుతూ శ్రీనివాసరావుతో అతని నాయనమ్మ ఇలా అన్నది:

"ఏమిరా, నాయనా! పడకటిగదిలో పక్కవేస్తే బయటింటిగదిలో పడుకొంటావేమిటి? నీకు భార్య అక్కరలేదా?"

"ఆమె నాకు భార్యకాదు."

"భార్య కాదూ—భార్య కాదూ? ఏమిటిరా నాయనా, ఈ పిచ్చిమాటలు!"

"పిచ్చిమాటలు కావు, నాయనమ్మా!"

"కాక మరేమిటిరా, అబ్బాయీ! అగ్నిసాక్షిగా పెండ్లిచేసుకొన్నది భార్య కాక మరేమి అవుతుంది?"

"ఆమె నాకు చెల్లెలువంటిది."

"ఏమిటీ—ఏమిటీ! చెల్లెలువంటిదా! అయ్యో, ఇదేమి విపరీతమురా, నాయనా?"

"విపరీతము ఏమీ లేదు, నాయనమ్మా! నేను ఆమెను ప్రేమించి పెండ్లిచేసుకోలేదు. అందుచేత ఆమె నాకు భార్య కాదు."

"ఊరంతా ఒక త్రోవా, ఉలిపికట్టె ఒక త్రోవానా? లోకములో అంతా ప్రేమించే పెండ్లి చేసుకొంటున్నారా?"

"నా సంగతి నేను చెప్పినాను."

"అయితే మరి ఎందుకు పెండ్లి చేసుకొన్నావు?"

"అప్పుడు నాకు ఈ మతమూ, నియమములూ లేవు."

"అయితే ఇపుడు మతము మార్చుకొని దాని బ్రతుకు పాడుచేస్తావా? ఇదేనా నీ మతధర్మము? పసిపిల్లగదా! ఇక దాని జీవితము ఏమి కావాలె?"

"ఆమెజీవితము కేమీ లోపము లేదు, నాయనమ్మా! ఆమెనుకూడా బ్రాహ్మమతములో చేరుస్తాను. తరువాత ఆ మతనియమముల ప్రకారము ఇద్దరము వివాహబంధము ఛేదించుకొంటాము. ఆపైన ఎవరి

ఎవరిమీద ప్రేమ కలిగితే వారు వారిని వివాహ మాడవచ్చు."

"ఆఁ—ఆఁ—అయ్యో—అయ్యో!—"

* * *

శ్రీనివాసరావు వివాహానంతరము చదువుకోసము కాకినాడ వెళ్లినాడు. సెలవులలో చుట్టపుచూపుగా ఇంటికి వచ్చివెళ్లడమే కాని నాలుగుసంవత్సరముల నుంచి అతని కాలమంతా అక్కడే గడచినది. బి. ఏ. చదువుతూ ఉండగా అతనికి రఘుపతితో స్నేహము కలిసినది.

రఘుపతి బ్రాహ్మమతదీక్షితుడు. అతను కాలేజీలో అధ్యాపకుడుగా పనిచేస్తున్నాడు. వయస్సు నలభైసంవత్సరములు. బుద్ధిమంతుడు. సజ్జనుడు. అతని యింటికి వస్తూపోతూ ఉండగా శ్రీనివాసరావుకు శైలబాలతో పరిచయము కలిగినది.

శైలబాల రఘుపతికి పినతల్లికూతురు. ఆమెది రాజమహేంద్రవరము. అక్కడ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నది. మెరుగుచామనచాయలో ఆమె కొంచెము అందముగానే ఉంటుంది. అయితే నవీననాగరకతాపద్ధతుల ననుసరించి సౌందర్యపోషణ మార్గము లవలంబించడముచేత చాలా సౌందర్యవతివలె కనబడుతుంది.

శ్రీనివాసరావుకును, శైలబాలకును పరిచయము క్రమముగా అభివృద్ధిఅయినది. వాళ్లిద్దరూ కలిసి పార్కుకూ, సముద్రతీరానికీ విహారార్థము వెళ్లుతూ ఉండేవారు. స్వేచ్ఛగా సంభాషిస్తూ అరమర లేకుండా నవ్వుకొంటూ ఉండేవారు. క్రమముగా శ్రీనివాసరావుకు శైలబాలపలుకులలో ఆదరము వినిపించినది. ఆమెదరహాసములో అతనికి కోరికలు గోచరించినవి. ఆమెఆలోకనములలో అతనికి అనురాగము అనుభూతమైనది.

కొంతకాలము గడచినది. బొమ్మలపండుగ సెలవులు వచ్చినవి. శైలబాల అన్నగారి యింటికి వచ్చినది. సాయంకాలము టీ పుచ్చుకొంటూ, "ఇవాళ శ్రీనివాసరావుగారు రాలే దేమి! ఊళ్లో ఉన్నారా?" అని అడిగినది శైలబాల. "ఊళ్లోనే ఉన్నాడు. నిన్న సాయంకాలముకూడా కనిపించినాడు. ఎందుచేత రాలేదో!" అన్నాడు రఘుపతి.

అయిదుగంటలకు పార్కుకు వెళ్లే వేళకు శ్రీనివాసరావు వస్తాడేమో అని శైలబాల నిరీక్షించినది. కాని అతను రాలేదు. మరునాడు, మూడోనాడుకూడా అతను రాలేదు. నాలుగోరోజున రఘుపతి క్లబ్బుకు పోతూఉండగా శ్రీనివాసరావు కనిపించినాడు. ఇద్దరూ కలిసి ఊరిబయటికి వెళ్లి పెద్దమఱ్ఱిచెట్టుక్రింద ఏకాంతముగా కూర్చున్నారు. అప్పుడు రఘుపతి ఇలా అన్నాడు:

"ఏమోయ్, శ్రీనివాసూ! బొత్తిగా కంటిలో నలుసైపోయినావే! అప్పుడే పరీక్షలకు అంత ఎడతెరపీ లేకుండా చదువుతున్నావా ఏమిటి?"

"అంత ఎక్కువగా చదవడము లేదు."

"మరి? సెలవులు గదా! టీకోసమైనా రావడము లేదేమి? శైలబాల వచ్చిన సంగతి తెలుసునా?"

శ్రీనివాసరావు తెలుసు నన్నట్లు తల ఊగించినాడు.

"అయితే ఆమెను చూచుటకైనా రాలే దేమి? ఆమె నన్ను ఎన్నోసార్లు అడిగినది."

శ్రీనివాసరావు మాట్లాడలేదు. అతని వైఖరి చూచేసరికి రఘుపతికి కొంచెము అనుమానము కలిగినది. ఏదో జరిగిన దనుకొన్నాడు. అతనివంక తేరిపార చూస్తూ ఇలా అన్నాడు: "ఆమె ఏదైనా పరుషముగా గాని, అగౌరవముగాగాని..."

"అట్టిది ఏమీ లేదు. ఆమెమాటలలోగాని, వైఖరిలోగాని పేరుపెట్టదగినది అణుమాత్రముకూడా లేదు. పైపెచ్చు చక్కని సరసత, మనోహరమైన మర్యాదా ఆమెలో నిరంతరము తొణికిసలాడుతూ ఆమె నవనీతహృదయమును వెల్లడిస్తూ ఉంటవి."

"అట్లయితే నీవు రాకపోవడానికి కారణమేమిటి?"

శ్రీనివాసరావు మౌనముగా తల వంచుకొన్నాడు.

"అయితే ఏదో ఉన్నదన్నమాట! నాదగ్గర దాచ నక్కరలేదు. నేను నీకు సోదరునివంటివాడను. నాతో విప్పి చెప్పవచ్చు."

"చెప్పకూడ దని కాదు."

"మరి?"

"చెప్పటకు సిగ్గుగా ఉన్నది."

"సి గ్గెందుకోయ్, వెర్రివాడా!"

"ఆమె—ఆమె—"

"సందేహించకు, బెరుకు లేకుండా చెప్పు."

"ఆమెవాలుచూపులలోను, చిరునవ్వుమాటల లోను ఏదో మనోహరత, ఏదో మాధుర్యము అనుభూత మవుతున్నది. ఆమెసన్నిధిలో ఏదో ప్రీతి ఉత్పాంగు తున్నది. ఈ విషయములో నన్ను నేను పరిశీలించు కొన్నాను. ఇది చిత్తచాంచల్యమనీ, దీనికి కారణము మనోదౌర్బల్యమనీ నిర్ణయించుకొని పశ్చాత్తాపపడు తున్నాను. నిగ్రహముకోసము ప్రయత్నిస్తున్నాను."

రఘుపతి అసాంతము నిశ్శబ్దముగా విని చివరకు పక్కున నవ్వి ఇలా అన్నాడు: "పిచ్చివాడా! ఇందు కోసము పశ్చాత్తాప మెందుకు? ఇది చిత్తచాంచల్యమూ కాదు, మనోదౌర్బల్యమూ కాదు. ఇది ప్రేమలక్ష ణము. ప్రేమ అనేది ఐశ్వరికశక్తివికాసము. దానికి ఎట్టి అవస్థలోను పాపసంపర్కము కలుగదు."

శ్రీనివాసరావుహృదయముమీదినుంచి కొండ తీసివేసిన ట్లైనది. అతనిముఖము విప్పారినది. అతను నూతనోత్సాహముతో గొంతు సవరించుకొంటూ మృదు వుగా ఇలా అన్నాడు: "ఇది—ఇది ప్రేమే అయితే..."

"అయితే ఏమిటి? ప్రేమే! సందేహము లేదు. నీవు సరళహృదయుడవు కావడముచేత ప్రేమావిర్భా తిని అన్యథా అవగతముచేసుకొన్నావు. అది అలా ఉంచు. ప్రతిస్నేహము ప్రణయస్వభావము. అందుచేత శైలబాలకుకూడా నీమీద ప్రేమ అంకురించి ఉంటుంది."

"మీ మాట అవు ననవలెనో, కా దనవలెనో తెలియడములేదు. కాని ఆమెఆదరములోను, హావ భావాలలోను ఏదో వైలక్షణ్యము, ఏదో ఆకర్షణ, ఏదో మాధుర్యము..."

"అవును. నాకు తెలుసును. అనురాగము అన్యోన్యహృదయసంవాది. ఆమెకు నీమీద తప్పక ప్రేమ ఉదయించిఉంటుంది. సందేహము లేదు. ఆహా! ఇవాళ నాకు చాలా సంతోషముగా ఉన్నది. ఇలా పూర్వానురాగము సంపాదిన తరువాత వివా హము జరిగితే అది ఆదర్శవివాహ మవుతుంది."

"అలా కాకపోతే?"

"అప్పు డది వివాహమే కాదు. అంతేకాక ఆ వివాహితులు భార్యాభర్తలు కావడానికే వీలులేదు."

"అయితే వివాహానంతరము అనురాగము ఉద యించ దంటారా?"

"నిజమైన అనురాగము ఉదయించ దనే నా విశ్వాసము. ఒకవేళ ఉదయించినా సంసారయాత్రకు పరరాగము పర్వతమార్గమువంటిది అవుతుంది."

"పూర్వరాగములో మాత్రము ఒడుదొడుకు లుండవా?"

"పూర్వరాగము పుష్పశయ్యవంటిది. అందులో ప్రాణముతో ప్రాణమూ, ఆత్మతో ఆత్మ మేళవిస్తవి. అప్పుడు ప్రేమకు సాఫల్యము కలుగుతుంది."

తరువాత మిత్రు లిద్దరు మౌనము వహించినారు. అప్పుడు వారి మనస్సులలో ఎట్టి ఆలోచనలు పెర సినవో, ఎట్టి తృప్తి నిండుకొన్నదో! శైలబాలకు కూడా తనమీద అనురాగముదయించిన దని శ్రీనివాస రావు ఉవ్విళ్ళూరినా డేమో! ఆదర్శవివాహానికి అంకు రార్పణ అయినదని రఘుపతి ఉప్పొంగినా డేమో!

మరునాడు సాయంకాలము శ్రీనివాసరావు రఘుపతిఇంటికి వచ్చినాడు. కాని అతనికి శైలబాల దర్శనము కలుగలేదు. ఆమె తలవనితలంపుగా ఆ ఉద యమే రాజమహేంద్రవరము వెళ్లిపోయినది. ఆ సంగతి చెప్పుతూ రఘుపతి, "శైలబాలప్రయాణముసంగతి నీకు తెలుపుటకుకూడా అవకాశము లేకపోయినది సుమా!" అని నొచ్చుకొన్నాడు. శ్రీనివాసరావు చిన్నబుచ్చు కొన్నాడు.

అది గమనించి రఘుపతి, "మిత్రమా! నీవు నిరుత్సాహపడనక్కరలేదు. నీటిబుగ్గ ఉప్పొంగినతరువాత దాని వేగము దుర్నివారము. కనుక త్వరలోనే పునస్సమాగమము కలుగుతుంది" అని ధైర్యము చెప్పినాడు.

కాని రఘుపతి పలికిన భవిష్యద్వాణి ఫలించలేదు. అందుచేత శైలబాలహృదయము తెలిసికొనుటకుగాని, తన హృదయము ఆమెకు వెల్లడించుటకుగాని శ్రీనివాసరావుకు అవకాశము లభించలేదు.

* * *

జ్యేష్ఠమాసము. మధ్యాహ్నసమయము. బయట గ్రీష్మము నిప్పులు చెరుగుతున్నది. శ్రీనివాసరావు బయటింటి గదిలో మేజాబల్లముందు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఆగది అతని సొంతము. రాత్రులు కూడా అతను అందులోనే పడుకొంటాడు. గోడకు కొన్ని ఆంగ్లేయపటములూ, ఏకతంత్రీవాద్యమూ తగిలించి ఉన్నవి. ఉదయమూ, సాయంకాలమూ ఏకతంత్రి వాయిస్తూ అతను బ్రాహ్మసంగీతము పాడుతూ ఉంటాడు. ఆ గదిలో ఒక గడియారమూ, ఒక బీరువా, ఒక కోటుస్టాండూ, ఒక మంచమూ తప్ప ఇక సామాను లేవీ లేవు.

రఘుపతివద్దనుంచి అప్పుడే వచ్చిన ఉత్తరము డ్రాయరులోనుంచి తీసి శ్రీనివాసరావు చదవడము ఆరంభించినాడు. అందులో శైలబాలపేరు ఎక్కడెక్కడ వ్రాసిఉంటే అక్కడక్కడ ముద్దుపెట్టుకొన్నాడు. ఉత్తరము అవతల ఉంచి కనులు మూసుకొని ఏదో ఆలోచించినాడు. ఠంగ్ ఠంగ్ అని గడియారము రెండు గంటలు కొట్టినది. మెల్లగా కనులు తెరచి ఉత్తరము డ్రాయరులో ఉంచి, ఇంకొక కాకితము తీసుకొని ఆలోచించి ఆలోచించి, "నేటిరాత్రి పండ్రెండుగంటలకు అంతా నిద్రపోయిన తరువాత ఒకసారి నాగదిలోకి రావలెను" అని వ్రాసినాడు. వ్రాసి దానిని ఉండగా చేసి, డ్రాయరుకు తాళము వేసి బయటికి వెళ్లినాడు.

అంతఃపురములోకి వెళ్లి చూచినాడు. అక్కడ ఎవ్వరూ లేరు. మొదటిగదివద్దకు వెళ్లి చూచినాడు. అతని పెద్దవదిన స్నేహితురాలితో పచ్చీసు ఆడుతున్నది. రెండవగదివద్దకు వెళ్లి చూచినాడు. మంచముమీద పడుకొని తల్లి నిద్రపోతున్నది. అన్నకొడుకు పూరీలు, లడ్డు మొదలైనవి రహస్యముగా తింటున్నాడు. బాలకుడు పినతండ్రిని చూచి వెలా తెలా పోయినాడు. శ్రీనివాసరావు అతనిని గమనించకుండా అవతలకు వెళ్లిపోయినాడు. మూడవగది పూజామందిరము. అందులో విష్ణుమూర్తివిగ్రహ మున్నది. విగ్రహద్వేషి కావడముచేత అతను అటువైపు కన్నెత్తి చూడనైనా చూడకుండా వెళ్లిపోయినాడు.

అవతలి గదిలో అతని భార్య ఇందులేఖ చేతి రుమాలుమీద రంగురంగుల ఉన్నిదారముతో చిత్రము కుట్టుతున్నది. పూలతోను, కాయలతోను నిండిన దానిమ్మకొమ్మమీద రెండు చిలుకలు ఆనుకొని కూర్చుండి అన్యోన్యాలింగనపారవశ్యము అనుభవిస్తున్నట్లున్నవి—అది ఆమె కుట్టుతున్న చిత్రరూపము. ఆమె తదేకదృష్టితో కుట్టుపని చేస్తున్నది. ఆమెవదనమున చెమటబిందువులు ముత్యాలవలె శోభిస్తున్నవి. తాంబూలరంజితమైన అధరము సొంపులు చిమ్ముతున్నది. తొలిగీ తొలగని పయటలోనుంచి రత్నాల పతకము ముసిముసి నవ్వులు నవ్వుతున్నది.

శ్రీనివాసరావు నిశ్శబ్దముగా ఆగదివద్దకు వెళ్లి ఆశ్చర్యముతో ఆమెవంక చూస్తూ నిలుచున్నాడు. వివాహమైన తరువాత అతను భార్యను నిదానించి చూడడము ఇదే మొదటిసారి. ఇందులేఖ తల వంచుకొని తదేకధ్యానముతో చిత్రరూపము తీరుస్తూ ఉండడముచేత భర్తను చూడలేదు.

కొంతసేపైనతరువాత ప్రాంగణములోని మామిడి చెట్టునుంచి రంయిమని వేడిగాలి విసరినది. ఆ ధ్వనికి ఉలిక్కిపడి ఇందులేఖ తల యెత్తి చూచినది. రెప్ప వాల్చకుండా తనవంక చూస్తున్న భర్త కనిపించినాడు. తోడనే కంగారుతో చేతిలోని వస్తువులు అవతల ఉంచి లేచి చీర సవరించుకొని మూలకు పోయి తల వంచి క్రీగంట చూస్తూ నిలుచున్నది. పయిటచెంగుకు కట్టిన తాళపుచెవులు గలగలమన్నవి.

ఆ గలగలకు తిరిగితిరిగి చూస్తూ శ్రీనివాసరావు చప్పుడు కాకుండా గదివాకిలివద్దకు వెళ్లి కాకితపు ఉండ ఆమెకాళ్లవద్ద పడవేసి వెళ్లిపోయినాడు.

భర్త వెళ్లగానే ఇందులేఖ కాగితపుఉండ తీసుకొని తలుపు బిగించి కిటికీవద్దకు వెళ్లి విప్పి చదువుకొన్నది. తరువాత కిటికీలోనుంచి బయటికి చూచినది. ఆమెదృష్టి ఎదురుగా దోరగాయలతో నిండిన మామిడిచెట్టుమీద పడినది. కాయలచాటున నక్కి కోయిల కుహూ అంటున్నది. దూరముగా పావురాలు కువకువమంటున్నవి. మళ్లీ ఆమె కాగితము చదువుకొన్నది. మళ్లీ మామిడిచెట్టువంక చూచినది. చెట్టుసందులలో నుంచి ఆకాశము కనబడినది. ఆ కాగితము రవికలో దాచుకొని వెళ్లి ఆమె విష్ణుమూర్తికి భక్తిపూర్వకముగా సాష్టాంగనమస్కారము చేసినది. తిరిగి తన గదిలోకి వచ్చి గడియ బిగించి తిరిగి కాగితము చదువుకొన్నది.

నేడామెజీవితములో ఎటువంటి దినము! కాపురానికి వచ్చిన తరువాత నేడే భర్త ఆమెను పలుకరించినాడు. సిగ్గుబిడియాల గుండెదడలతో వివాహము జరిగినది. తరువాత సమావేశము మూడురోజుల లోను పుష్పశయ్యయందు భర్తృదర్శనము కాలేదు. అప్పుడామెకు పదమూడేండ్లు. అప్పుడే శ్రీనివాసరావుకు నూతనమతప్రవేశము జరిగినది.

తరువాత ఒకసారి ఆమె అత్తవారింటికి వచ్చి కొన్ని నెల లున్నది. ఇంటిలోనివారూ, ఇరుగుపొరుగు వారూ నూతనదంపతులను కలుపవలె నని ఎంతో ప్రయత్నము చేసినారు. ఎంతో బ్రతిమాలినారు. ఏమి ప్రయోజనము? శ్రీనివాసరావు అంతఃపురములో పడుకొనలేదు. తరువాత కోపము వచ్చి వారా ప్రయత్నము మానివేసినారు. తల్లిమాత్రము విసుగుచెందక ప్రతిదినము అతనిని బలవంతపెట్టుతూ ఉండేది. ఆమె అనురోధము అతను చెవినిపెట్టలేదు.

దాంపత్యజీవితములో అతని విపరీతప్రవర్తనయూ ఆమెదురవస్థా విశేషరికి ఆమెబంధువులకూ, స్నేహితురాండ్రకూ గుండె లవిసిపోయినవి. "ఇక ఆమెజీవితము ఇలా వ్యర్థము కావలసినదేనా! పాప మా చిన్నది ఏమి పాపము చేసిన దని ఈశ్వరు డిటువంటి శిక్ష విధించినాడు!" అని వాళ్లు విచారించినారు.

ఇన్నాళ్లనుంచి అతని మనస్సు ఏమైనది! ఇప్పుడామెదుఃఖమంతా తొలగిపోతుందా!

ఇందులేఖ ఏమిటో ఏమిటో ఆలోచిస్తున్నది. దాంపత్యజీవితసందర్భములో జరిగిన చిత్రసంఘటనలు ఆమెమనఃపటమున సినీమాచిత్రమువలె దృశ్యము లవుతున్నవి. ఇంతలో చటుకున ఆమెచింతాప్రవంతికి అడ్డు తగిలినది. బయటినుంచి ఎవరో తలుపుమీద గబగబ గుద్దినారు. ఇందులేఖ ఉలిక్కిపడి లేచి గడియ తీసినది. ఆమె చిన్న ఆడుబిడ్డ వరలక్ష్మి లోనికి వచ్చినది.

వరలక్ష్మి ఇందులేఖకన్న మూడేండ్లు పెద్దది. ఆమె కడుపుతో ఉండి నెలరోజులక్రిందట పుట్టింటికి వచ్చినది. వరలక్ష్మికిని, ఇందులేఖకును చక్కని అన్యోన్యము. పరస్పరసుఖదుఃఖములందు ఇద్దరూ సమభాగినులు. ఇందులేఖతొట్రుపాటు చూచి ఆశ్చర్యముతో, "ఏదో జరిగిన ట్లున్నదే!" అన్నది వరలక్ష్మి.

ఇందులేఖ మెల్లగా, "ఏ మున్నది జరగడానికి?" అన్నది.

"అయితే తలుపు బిగించుకొని ఏమిచేస్తున్నావు?"

ఇందులేఖ మాట్లాడలేదు. ఆమెముఖభంగి చూచి మరింత సందేహము కలిగి, కంఠము కౌగలించుకొని, "ఏమి జరిగినదో చెప్పవూ!" అని వరలక్ష్మి బ్రతిమాలినది.

"చెప్పుతాను."

"ఎప్పుడు?"

"రాత్రికి."

"కాదు. ఇప్పుడే చెప్పాలె."

ఇందులేఖ చెప్పలేదు. అయితే వరలక్ష్మి వదలలేదు. చివరకు ఎంతో బలవంతముమీద ఇందులేఖ చెప్పినది. విని వరలక్ష్మి మొదట ఊరకొన్నది. తరువాత మెల్లమెల్లగా నవ్వడము ఆరంభించినది.

"ఎందుకు నవ్వుతావు, వదినా?"

"నీ మగని వ్యవహారము చూచి నవ్వుతున్నాను. నేను ఎలా అనుకొన్నానో అలా జరిగినది. ఈసారి వచ్చినదగ్గిరనుంచి మా చిన్నన్నయ్య భలే హుషారుగా ఉన్నాడు. పెద్దవదినతో కూడా చెప్పినాను."

"ఏమని చెప్పినావు?"

"ఏమన్నానంటే—'వదినగారూ! ఈసారి మా చిన్నన్నయ్యమనసు మారినది. ఒక్కసారి కదిలించి చూడండి. తప్పకుండా గదిలో పడుకొంటాడు' అని. వదినగారు అన్నదిగదా—'ఆయనమనస్సు మారనీ మారకపోనీ! అందుకు నే నేమైనా అడ్డుపడ్డానా?' అని. అప్పుడు నే నేమన్నానంటే—'ఇదివరకు మనసు మారలేదనుకోండి ఇప్పుడుమాత్రము తనంతట తాను రాగలుగుతాడా? సిగ్గుపడుతున్నా డనుకొంటాను' అని. ఆమె ఏమన్నదంటే—'ఇద్దరినీ కలపాలని ఇదివరకు ఎన్నోసార్లు ప్రయత్నించిచూచినాను. ప్రయత్నించినపుడెల్లా అవమానించినాడు. ఈసారి నేనుమాత్రము బ్రతిమాలుతానా ఏమిటి? నాకు మాత్రము అభిమానము లే దనుకొన్నావా? నేను అటువంటి మనిషిని కాను. చేసుకొన్నవారికి చేసుకొన్నంత. ఇంకా రెండునెల లున్నవిగదా సెలవులు! సుఖించినా సరే, మానుకొన్నా సరే!' అని."

"నేను వెళ్ళ లేకుండా ఉన్నాను, వదినా!"

"ఎందుచేత?"

"ఆయన నన్ను చాలా సిగ్గుపరుస్తారు."

వరలక్ష్మి కనులు చికిలించి, ముఖము చిట్లించి, కొంటె నవ్వు నవ్వుతూ ఇలా అన్నది: "ఓయబ్బో! పసిపిల్ల సుమా! వంగనాచి! మగనిదగ్గరకు పోవడానికట, సిగ్గట! సిగ్గు ఎంతసేపు ఉంటుందో చెప్పు—గంటలు లెక్కపెట్టుకొంటూ ఉంటాను. ఇక నా ముందు టక్కులు చేయడానికి వీలు లేదు."

"టక్కులు కావు వదినా! చాలా భయముగా ఉన్నది."

"మొదటిరోజు కొంచెము భయముగా ఉంటుంది. అంతే! ఆ ఒక్కరోజూ వెళ్ళిపోదా ఏమిటి?

"అయితే ప్రతిదినమూ వెళ్ళవలసిఉంటుందా?"

"అవును."

"అయితే ఈ ఒక్కరోజు పోకపోతే ఏమి?"

"ఊహూఁ! పోకుండా ఉండడానికి వీలు లేదు. సిగ్గు అనేది ఎప్పుడో ఒకప్పుడు పోవలసినదే కదా!"

"అంతకంటె ఒక్కసారి నీవు అక్కగారితో మళ్లీ చెప్పవూ! ఆమె ఏదో ఉపాయ మాలోచిస్తుంది!"

"అలాగే చెప్పుతాను. కాని నేటికిమాత్రము నీవు రహస్యముగా వెళ్లితీరాలి. తెలుసునా! మాగులోనుంచి దొంగిలించిన మామిడిపండులాగా రహస్యముగా లభించిన వస్తువు చాలా మధురముగా ఉంటుంది."

౨

"చిన్న వదినా, ఓ చిన్నవదినా! ఇంకా మెలకువ రాలేదూ?"

రాత్రివేళ శయ్యాగారములో వరలక్ష్మి ఇందులేఖను లేపినది. ఇందులేఖ కంగారుతో లేచి కనులు నులుముకొంటూ, "ఎన్ని గంటలైనది?" అని అడిగినది.

"పండ్రెండు దాటి పైన అరగంట అయినది."

"నీవుకూడా నిద్రపోయినా వనుకొంటాను."

"లేదు—నాకళ్లకు నిద్ర ఎలా వస్తుంది? అబ్బా! అంతనిద్ర ఏమిటమ్మా నీకు? కార్యము అయ్యేవాళ్లకు హుషారు ఉండనక్కరలేదూ? ఇదే మామూలుగా జరిగితే ఇరుగుపొరుగమ్మల పేరంటము సందడితో ఇల్లంతా మారుమ్రోగుతుండేది!"

ఇలా అంటూ వరలక్ష్మి దీపము వెలిగించినది. పెట్టెలోనుంచి మంచి జరీచీర తీసి, "ఇదిగో, కట్టుకో" అన్నది.

"ఎందుకు, వదినా? అంత అట్టహాస మవసరము లేదు."

"ఆ మాటలు కట్టిపెట్టు. ఆ మాసినచీరతో నే వెళ్లుతావా ఏమిటమ్మా, వెర్రిపిల్లా!"

ఇలా అంటూ వరలక్ష్మి ఆమెకొంగు పట్టుకొని ఈడ్వసాగినది. ఇందులేఖ తప్పించుకోలేకపోయినది.

చీర సింగారించడము అయిపోయినతరువాత, వరలక్ష్మి "ఒక్కదానివి వెళ్లగలవా ? లేక నేను వెంట వచ్చి దిగబెట్టవలసి ఉంటుందా ?" అన్నది.

"నీవు నీకార్యము నాడు ఒంటరిగానే వెళ్లినావు కాబోలు !" అని అనబోయి, ఇందులేఖ, ఈ సమయములో వరలక్ష్మికి కోపము తెప్పించడము మంచిపని కాదనుకొని, సంబాళించుకొని, "నీవు రాకపోతే, కొత్త గదా, ఒంటరిగా ఎలా వెళ్లగలను ?" అన్నది.

ఇద్దరూ తలుపు తెరచి వసారాలోకి వచ్చినారు. వెన్నెలరాత్రి. అంతటా నిశ్శబ్దము. ఇందులేఖ కాలిపట్టాలగజ్జలుమాత్రము గలగలమంటున్నవి. వరలక్ష్మి సంభ్రమములో, "కాళ్లపట్టాలు తీసివేయలేదూ ? ఊరుఊరంతా వినబడేటట్లున్నవే!" అన్నది.

ఇందులేఖ గజ్జలపట్టాలు తీసివేసి బాలీసుక్రింద పెట్టి వచ్చినది. తరువాత ఇద్దరూ ముందు సావడివైపు వెళ్లినారు. శ్రీనివాసుని గదివద్దకు వచ్చి, వరలక్ష్మి రహస్యముగా, "తలుపు దగ్గరగానే వేసిఉన్నది. మెల్లమెల్లగా జాగ్రతగా వెళ్లు" అని చెప్పి వెళ్లిపోయినది.

ఇందులేఖ మెట్లు ఎక్కి భర్త ఉన్న గది వసారాలోనికి వెళ్లినది. తలుపువద్దకు పోయి తొంగి చూచినది. దీపము వెలుగుతున్నది. లోపలికి పోవడానికి భయపడినది. శరీరము కంపించినది. గుండె దడదడ కొట్టుకొన్నది. కాలు ముందుకు సాగలేదు. చివరకు ఎలాగో ధైర్యము అవలంబించి ఆమె చప్పుడు కాకుండా తలుపు తెరచి లోపలికి పోయినది.

భర్త నిద్రపోతున్నాడు. తలగడదగ్గరగా దీపము వెలుగుతున్నది. ఇందులేఖ తలుపు మూసి గడియవేసి దీపము తీసివేసినది. తోడనే వెన్నెల చాటుమాటుల నుంచి చటుక్కున వెలిసి శయ్యమీద భర్తముఖముమీద పడి నవ్వ నారంభించినది. వెన్నెలనవ్వులలో భర్తవదనమామెకు ఎంతో ప్రసన్నముగా, ఎంతో సౌమ్యముగా కనిపించినది. ఆమె పతివదనము నింత పరామర్శగా చూడడము నేడే! చూచి చూచి, "ఇంత సౌమ్యుని హృదయములో అట్టి దుర్భావనలు ఎలా కలిగినవో !" అనుకొన్నది.

అలా ఒక్కక్షణము కడచినది. తరువాత ఇందులేఖ లోలోపల నవ్వుకొంటూ, "భలేవారు సుమా ! నన్ను రమ్మని తాము నిశ్చింతగా నిద్రపోతున్నారు!" అనుకొన్నది. "ఇప్పుడు నాకు కర్తవ్య మేమిటి ?" అని ఆలోచించినది. "భర్తృపాదసేవ నా కింతవరకు లభించినది కాదు. ఇప్పు డీ అవకాశము ఎందుకు పోగొట్టుకోవలెను !" అని నిశ్చయించుకొన్నది. తరుపరి పతిపాదములవద్ద కూర్చుని సంతోషముతో పాద సంవాహనము చేయుడము మొదలుపెట్టినది. కిటికీనుంచి దక్షిణానిలము మధురమధురముగా వీస్తున్నది. అలా ఎంతకాలము—సుమారు అరగంట కడచినది. తరువాత ఆమె పతిచరణములవద్ద పడుకొని నిద్రపోయినది.

రెండుగంటలు కొట్టేసరికి శ్రీనివాసరావుకు నిద్ర మెలకువ వచ్చినది. తెలివి వచ్చినతరువాత కొన్ని నిమిషాలవరకు అతని మనస్సు ఎవరికోసమో ప్రతీక్షిస్తున్న ట్లున్నది. క్రమముగా ఇందులేఖను రమ్మన్నట్లూ, నిద్ర రానంతవరకు ఆమెకోసము ఎదురు చూచినట్లూ, పన్రెండున్నరఅయినతరువాత కూడా ఆమె రాకపోవడముచేత నిద్రపోయినట్లూ స్ఫురణ కలిగినది. ఇలా స్ఫురణతరంగాలు కొట్టుకొంటూఉండగా అతను ప్రక్కకు పొరలినాడు. అప్పు డతని పాదము ఇందులేఖశరీరముకు తగిలినది. ఆ కోమలస్పర్శకు విస్మితుడై లేచి కూర్చున్నాడు.

ఇందులేఖ నిద్రపోతూనే ఉన్నది. అప్పటికి వెన్నెల తలాపినుంచి తొలగిపోయి ఇందులేఖకోమలవదనముమీద ముసిముసినవ్వులు నవ్వుతున్నది. ఆ మనోహరచంద్రికాప్రసారములో శ్రీనివాసరావు ఆ నిద్రాన్వితను, ఆ నవయౌవనవతిని, తన పత్నిని తిలకించినాడు. అప్పు డామెవదనమండలము భువనమోహనముగా కనిపించినది. అంతలో ఆమెపెదవులు కదలినవి. వాటిమీద చిరునవ్వు తొలకాడినది. నునుసిగ్గు తళుక్కు మన్నది. అప్పు డామె ఎట్టి కలలు కంటున్నదో !

శ్రీనివాసరావు భార్యముఖమువంక రెప్ప వాల్చక చూచిచూచి, "అహో! ఏమి ఈ మెదివ్య సౌందర్యము! శైలబాలసౌందర్యము ఇందులో ఎన్నో వంతు!" అనుకొన్నాడు. అలా ఎంతసేపు చూచి నాడో! తరువాత కొంతసేపటికి చటుక్కున మొంగ మావలకు త్రిప్పుకొని, కనులు మూసికొని, "ఈశ్వరా! నా మనోదౌర్బల్యము తొలగించు; నా హృదయానికి బలము అనుగ్రహించు!" అని అస్ఫుటస్వరముతో ప్రార్థించినాడు. ఆ పండువెన్నెలలో ఆ ఒంటరి పాటులో తన హృదయద్రఢిమ ద్రవించిపోతున్నట్లు గ్రహించి వెంటనే దీపము వెలిగించినాడు. తీక్ష్ణమైన దీపకాంతిలో స్వాప్నికజాడ్యము వదలిపోయినది. అంతట ఇందులేఖను కాళ్లమీద కొట్టి లేపినాడు.

ఇందులేఖ కలవరముతో లేచినది. ఆ గాబరాలో చెదరిన చీరచెంగులు, పయటచెంగు ఆమె సర్దుకొటుకు ఎదురుతిరిగినవి. ఎంతో ప్రయత్నముమీద సవరించుకొని ఒక్కసారి భర్తవంక క్రీగంట చూచి ఆమె తల వంచుకొన్నది.

శ్రీనివాసరావు, "ఇందులేఖా!" అని పిలిచినాడు.

ఇందులేఖ ఒక్కనిముసముమాత్రము పతివంక ఓరమాపు చూచి మళ్లీ తల వంచుకొన్నది.

"ఇందులేఖా! ఇవాళ నిన్నెందుకు పిలిచినానో తెలుసునా?"

ఇందులేఖ తెలియ దన్నట్లు తల ఆడించినది.

"అయితే విను: నీవు నాతో కాకినాడ రావలెను. వస్తావా?"

ఇందులేఖ మాట్లాడలేదు.

"ఏమిటి, వస్తావా?"

ఇందులేఖ మృదుస్వరముతో "మీరు ఎక్కడికి తీసుకపోతే అక్కడికి వస్తాను" అన్నది.

"మా నాన్నగారితోను, అమ్మగారితోను చెప్పకుండా, వారి అనుమతి లేకుండా రావలెను. రాగలవా?"

ఇందులేఖ పలుకలేదు.

"సమాధానము చెప్పు. ఇది సిగ్గుపడవలసిన సమయము కాదు. రాగలవా? చెప్పు."

"పెద్దలకు తెలియకుండా ఎందుకు? వారి అనుజ్ఞ తీసుకొని పోవచ్చునుగదా! వారికిమాత్రము అభ్యంతరము ఏ ముంటుంది?"

"నిన్ను వెంట తీసుకపోవడము మా నాయనగారికి ఇష్టములేదు. ఆయన ఏమంటున్నారంటే— 'వాడికి బుద్ధి స్థిరముగా ఉంటేగదా! వాడు ఎలాగో భ్రష్టైపోయినాడు. పోతే పోనీ! కులవధువును షేప్ పౌడర్లు వేయించి బూట్సులు తొడిగించి బ్రహ్మసమాజానికి తీసుకపోతాడుగదా! అది నా గొంతులో ఊపిరిఉండగా జరుగనీయను' అని."

"మీరు నన్ను నిజముగా బ్రహ్మసమాజానికి తీసుకుపోతారా ఏమిటి?"

"మన మిద్దరము పవిత్రమైన బ్రాహ్మధర్మమందు దీక్షితుల మవుదాము."

ఇందులేఖ ప్రమాదము తెలిసికొన్నది. భర్త ఎంత నిగూఢముగా ప్రవర్తిస్తున్నాడో గ్రహించినది. అప్పు డామె, "నేను విష్ణుమూర్తిని భగవంతునిగా విశ్వసిస్తున్నానుగదా! మరి నేను బ్రహ్మజ్ఞానిని ఎలా కాగలను?" అని పలికినది.

అప్పుడు శ్రీనివాసరావు యథోచితగాంభీర్యము వహించి ఇలా అన్నాడు: "ఆ విశ్వాసమంతా నీవు వదలిపెట్టవలసిఉంటుంది. అది అంతా భ్రాంతి. నేను ఎందుకని ఏకేశ్వరుని విశ్వసిస్తున్నాను?"

"మీరు చదువుకొన్నవారు. నాకు అంత జ్ఞాన మున్నదా మరి?"

"నీకుకూడా చదువు చెప్పిస్తాను. అక్కడికి వెళ్లినతరువాత అన్ని ఏర్పాట్లు చేస్తాను. ఆడవాళ్ల స్కూలులో చేర్పిస్తాను."

ఇందులేఖ అసమ్మతిసూచకముగా కంఠ మొరగా వంచి, "నేను చదువు నేర్చుకోవలసిఉంటే మీ దగ్గరనే నేర్చుకొంటాను. ఇంత పెద్దదాననైనతరువాత తనుదునమ్మా అని బడికి వెళ్లలేను" అన్నది.

శ్రీనివాసరావు కొంచెముసేపు ఆలోచించి తరువాత ఇలా అన్నాడు: "నీవు పొరపాటుపడుతున్నావు. అక్కడ మన మిద్దరము కలిసి ఒక్క ఇంట్లో ఉండడము తటస్థించదు."

ఇందులేఖ ఆశ్చర్యముతో, "అయితే నేను ఉండడము మరి ఎక్కడ?" అన్నది.

"ఆ స్కూలులోనే. అక్కడ అంతా ఆడవాళ్లే. ఉండడము, చదువుకొనడము అంతా అక్కడే! అక్కడ సమస్తమైన వసతులు ఉన్నవి."

ఇందులేఖ స్థిరస్వరముతో, "అయితే నేను రాను!" అన్నది.

శ్రీనివాసరావు వ్యాధి ఉన్నచోట చికిత్స జరగడములేదని తెలిసికొన్నాడు. ఉన్న విషయమంతా విప్పిచెప్పడము అవశ్యక మనుకొన్నాడు. అప్పుడతను ఇలా అన్నాడు: "నేను ఇన్నాళ్లనుంచి నిన్ను చూడకుండా, నీవద్దకు రాకుండా ఉన్న కారణ మేమిటో తెలిసికొన్నావా?"

"కొంచెముగా విన్నాను. కాని బాగా తెలియలేదు."

"అయితే విప్పిచెప్పుతాను: ప్రథమతః మన వివాహము పరస్పరానురాగఫలితము కాదు. ద్వితీయతః ఆ వివాహానుష్ఠానము విగ్రహారాధనమతప్రకారము జరిగినది. ఈ రెండు కారణాలవల్ల మనకు వివాహసిద్ధి కాలేదని నా మతము. అందుచేత నీవు నాకు భార్యవు కావు—చెల్లెలివంటిదానవు. తెలిసినదా?"

"ఊఁహూఁ!"

"అట్లయితే ఒక్క విషయము విస్పష్టముగా చెప్పుతున్నాను: నేను నిన్ను ప్రేమించడము లేదు."

"అది కనబడుతూనే ఉన్నది."

"నేను ఇంకొక యువతిని ప్రేమిస్తున్నాను."

"అయితే, నన్ను కాకినాడకు తీసుకపోయి ఏమి చేస్తారు?"

"చూడు, ఇందులేఖా! చిన్నతనములో— ఏమీ తెలియని రోజులలో నిన్ను వివాహమాడినాను. అందువల్ల నీ విషయములో చాలా అధర్మ మాచరించినాను. అందుకని నీ జీవితశేషము నిష్ఫలము చేసి ఇంకా నిన్ను అధోగతిపాలు చేయను. మన మిద్దరము బ్రాహ్మధర్మము అవలంబిస్తే మనము మన వివాహబంధము ఛేదించుకోవచ్చును. అప్పుడు నీకు స్వాతంత్ర్యము లభిస్తుంది. తరువాత నీవు నీఇష్టము వచ్చినవానిని పెండ్లిచేసుకోవచ్చును. కనుక అక్కడికి వెళ్లితే మన మిద్దరము ఒక్కచోట నివసించడము అసంభవము. ఇప్పుడంతా స్పష్టముగా తెలిసినదా?"

ఇందులేఖ సమాధానము చెప్పలేదు. ప్రశ్నలు కూడా వేయలేదు. మరింత తల వంచుకొని దారువిగ్రహములాగా కూర్చున్నది. కొంతసేపటికి ఆమె ఏడుస్తున్నదని శ్రీనివాసరావు తెలిసికొన్నాడు. అందుకు అతని మనస్సు కష్టపడినది. ఒక్కసారి ఆమెగడ్డము పట్టుకొని తల ఎత్తి కన్నీళ్లు తుడిచివేతా మనుకొన్నాడు. కాని కర్కశమైన కర్తవ్యజ్ఞానము అతని ఉద్దేశమునకు అభ్యంతరమైనది. అంతరాత్రివేళ నిర్జన గృహములో ఒకానొక యువతిని స్పృశించడము అతనికి యుక్తిసంగతముగా కనబడలేదు. అందుచేత అతను ఏమీ చేయకుండా ఊరక ఇలా అన్నాడు: "ఇందులేఖా! ఎందుకు ఏడుస్తావు? నీసౌభాగ్యముకోసమే కదా నేను చెప్పినదంతా!"

కాని ఇందులేఖ మాట్లాడలేదు. ఏడుపుకూడా ఆపలేదు. "ఇందులేఖా!" అని అతను పిలిచినాడు. ఈసారి అతని కంఠస్వరము మారినది. అందులో ఆదరాతిశయము ధ్వనించినది. ఆ స్వరము విని ఆమె మరింత ఎక్కువగా ఏడువసాగినది.

శ్రీనివాసరావు ఆశ్చర్యముతో ఇలా అనుకొన్నాడు: "ఈమాటకీమెకు ఇంత కష్టము, ఇంత దుఃఖము ఎందుకో! ముందు కలుగబోయే మహానందము ఆమెమనస్సుకు ఎందుకు స్ఫురించలేదో! నేను ఆమెను ప్రేమించడము లేదు; ఇక ప్రేమించలేను కూడా! ఆ సంగతి విప్పిచెప్పినాను. ఈ బంధము తెంచుకొంటే జీవితములో సుఖమైన మార్గము అవలంబించడానికి అవకాశము కలుగుతుందిగదా! అట్టి ప్రస్తావము

చేసివాకూడా ఎందుకో అంత దుఃఖము! అయితే ఆమె నన్ను ప్రేమిస్తున్నదా ఏమిటి చెపుమా!"

ఆ సమయములో గడియారము ఠంగ్ ఠంగ్ మని మూడు గంటలు కొట్టినది. ఇందులేఖ లేచి, "ఇక నేను వెళ్లుతాను" అన్నది.

శ్రీనివాసరావు చటుక్కున ఆమెచేతులు పట్టుకొని "ఇందులేఖా! నీమనస్సులోని మాట నాకు స్పష్టముగా చెప్పవూ!" అని అడిగినాడు.

ఇందులేఖ కంపితస్వరముతో, "ఇప్పుడు నాకు మనస్సు సరిగా లేదు" అన్నది.

"అయితే రేపు రాః వస్తావా?"

"చూస్తాను."

"చూడడము కాదు, ఇందులేఖా! తప్పకుండా రా."

అతని స్వరములో ఆతురత ధ్వనించినది. "అలాగే" అని ఆమె వెళ్లిపోయినది.

౩

మరునాడు శ్రీనివాసరావుకు మెలకువ వచ్చే సరికి చాలా ప్రొద్దు ఎక్కినది. తెలివి రాగానే ఇందులేఖ అశ్రుపూర్ణనయనము లతని మనోనేత్రమునకు ప్రత్యక్షము లైనవి. లేచి కూర్చున్నాడు. ప్రక్క మీద బంగారు జడపూది కనిపించినది. వెంటనే దానిని పెట్టెలో భద్రపరచినాడు.

ప్రాతఃకాలమందు శ్రీనివాసరావు ఈశ్వరోపాసనా, ఈశ్వరసంకీర్తనమూ చేస్తూ ఉండేవాడు. ఇదివరకు ఎన్నడూ వాటికి అభ్యంతరము కలుగలేదు. కాని నేడుమాత్రము అవి సాగలేదు. నేడు అతని మనస్సు చాలా ఉద్వేజిత మైనది.

గ్రామముబయటికి వెళ్లి శ్రీనివాసరావు తల వంచుకొని ఏటిఒడ్డున పచారుచేస్తున్నాడు. కొంత సేపైన తరువాత తల ఎత్తి చూచినాడు. తన ఇంటి నౌకరు రామన్న చేల కడ్డము పడి పరుగెత్తుతూ తన వైపే వస్తున్నాడు. అతనిని చూడగానే హఠాత్తుగా అమంగళాశంక కలిగి శ్రీనివాసుని మనస్సు ఉద్విగ్న మైనది. "ఏమి సంభవించినది చెపుమా! ఇతను నన్ను పిలుచుకపోవడానికి రావడము లేదుగదా! ఇందులేఖకు ఏమీ ప్రమాదము తటస్థించలేదుగదా! ఆమె ఏదైనా దుస్సాహసికకార్యము చేసి ఉండదుగదా!" అని శోధించినాడు.

రామన్న ఏడుస్తూ దగ్గరకు వచ్చినాడు. శ్రీనివాసరావు కంగారుతో, "ఏమిరా, రామన్నా! ఏమి జరిగినది?" అని అడిగినాడు.

రామన్న పొంగివచ్చే దుఃఖము మింగుతూ, "ఇంకేమున్నది, చిన్నదొరా! కొంప కూలిపోయినది. మంత్రగానిని పిలుచకరాబోతున్నాను. పెద్ద కాటు వేసినది" అని చెప్పుతూ వెళ్లిపోయినాడు.

కాటు అంటే పాముకాటు. శ్రీనివాసరావు ఇందులేఖకు పాము కరచిన దనుకొన్నాడు. ఎవరిని కరచినది అని అడిగేలోపలనే రామన్న దూరము పోయినాడు.

శ్రీనివాసరావు వెంటనే ఇంటికి మరలినాడు. మొదట సహజముగా నడచినాడు. క్రమముగా నడక త్వరిత మైనది. చివరకు అతను పరుగెత్తడము ఆరంభించినాడు.

సింహద్వారముగుండా గృహములోనికి రావడానికి కొంచెము చుట్టు తిరిగి రావలెను. అందుచేత శ్రీనివాసరావు తోటవాకిలిగుండా లోపలికి ప్రవేశించినాడు. చెట్లసందుగా గృహము సమీపిస్తూ ఉండగా కొంచెముదూరములో ఇందులేఖా, వరలక్ష్మి కనిపించినారు. వాళ్లు పూలమొక్కలకు నీళ్లు పోయబోతున్నారు. అతను వాళ్లను చూచి దీర్ఘనిశ్వాసము విడచి మనశ్శాంతి పొందినాడు, ఇందులేఖముఖము విచారముగా ఉన్నది. వరలక్ష్మి నేత్రాలు కౌతుకపూర్ణములు. మొదట వాళ్లు అతనిని చూడలేదు. సమీపమునకు వచ్చినతరువాత చూచినారు. ఇందులేఖ తొట్రుపాటుతో పైట సర్దుకొన్నది. వరలక్ష్మి నవ్వినది. ఆమెనవ్వు అతనిని ఎగతాళిచేస్తున్నట్లున్నది. ఆమె నేత్రములు, 'తెలిసినదిలే, నీసంగతి అంతా మాకు తెలిసినదిలే' అంటున్నట్లున్నవి.

"వరలక్ష్మీ! ఎవరిని పాము కరచినది?" అని అడిగినాడు శ్రీనివాసరావు.

"పాము కరచినదా? ఎవరిని? మాకు తెలియ లేదే!" అన్నది ఆశ్చర్యముతో వరలక్ష్మి.

శ్రీనివాసరావు ముందు సావడిలోనికి వెళ్లి రామన్న భార్యను పాము కరచిన దని తెలిసికొన్నాడు. వెంటనే రామన్న ఇంటికి వెళ్లినాడు. అక్కడ చాలా మంది గుమికూడిఉన్నారు. మాంత్రికులు ఒకనితరువాత ఒకరు ఉచ్చైస్స్వరముతో మంత్రాలు పెట్టుతున్నారు. కాని ఆ సర్పదష్టకు అవి ఏమాత్రమూ ఉపకరించలేదు. రామన్న మాంత్రికుని తీసుకవచ్చేసరికి అంతా అయి పోయినది. అప్పుడు రామన్న ఎంత ఏడ్చినాడో చెప్ప శక్యము కాదు. అయిదారేండ్ల పిల్లవానిలాగా నేల మీద పడి దొర్లుతూ ఏడ్చినాడు. అతని దుఃఖము చూచి 'అయ్యో పాపము, అయ్యో పాపము' అని కొందరు కంట నీరు పెట్టుకొన్నారు. కొందరు అది చూడలేక కళ్ల నీళ్లు కారుస్తూ వెళ్లిపోయినారు. శ్రీని వాసరావు కళ్లనీళ్లు తుడుచుకొని గృహాభిముఖుడైనాడు. నడుస్తూ అతను లోలోపల ఇలా అనుకొన్నాడు:

"అశిక్షితుడూ, అసంస్కృతుడూ అయిన ఒకా నొక కర్షకుని హృదయములో ఇంత అనురాగమా! పూర్వరాగవర్జితముగా మంత్రపూర్వకముగా జరిగిన వివాహములో అనురాగము జనియించడము అసంభవ మన్నాడే రఘుపతి! అతనిని తీసుకవచ్చి ఒక్కసారి ఈ దృశ్యము చూపిస్తే బాగుండును!"

ఇంటికి చేరేసరికి రఘుపతివద్దనుంచి ఉత్తరము వచ్చినది:

"సత్యమేవ జయతి!

కాకినాడ,

జ్యేష్ఠ శు ౨ సోమవారము.

ప్రియసోదర!

నిన్న నేను వ్రాసిన ఉత్తరము అంది ఉంటుంది. గోవిందపురం జమీందారు మహారాజరాజశ్రీ నర సింహప్రసాద్ బహదూర్‌వారు తమ కుమారునికి చదువు చెప్పడానికి ఉపాధ్యాయుడు కావలె నని అన్వేషిస్తున్నారు. సాయంకాలము రెండు గంటలసేపు పాఠము చెప్పవలెను. వేతనము అరవై రూపాయలు. ఆ సంగతి విని నేను వారి దర్శనము చేసినాను. ఆ పద విలో నిన్ను నియోగించుకుంటే చాలా సంతృప్తి పొందగలరు అని వారితో చెప్పినాను. శ్రీవారు అంగీ కరించినారు.

నీకు సమ్మతమైతే ఒక వారము పదిరోజులలో నీవు ఆ పనిలో ప్రవేశించవలసి ఉంటుంది. కనుక ఈ ఉత్తరము అందినవెంటనే వెనుకటి ఏర్పాటు ప్రకారం శ్రీమతి ఇందులేఖను వెంటబెట్టుకొని బయలుదేరి రావలెను. నీ ప్రత్యుత్తరము చూచుకొని మహిళా విద్యాలయములో శ్రీమతికోసము తగిన ఏర్పాట్లు చేస్తాను.

శైలబాల వచ్చినది. రాగానే నిన్నుగురించి అడిగినది. ఆమెకు నీమీద ప్రేమ దినదినాభివృద్ధి పొందుతున్న దనుటకు సందేహము లేదు. సోదరి ఇందు లేఖను తీసుకవచ్చే విషయములో నీవు ఏమాత్రము అన్యథా శంకించనక్కరలేదు. ఏదైనా అభ్యంతరము కలిగే పక్షములో ఒక్క సంగతి జ్ఞాపక ముంచుకో: ప్రపంచములో సత్కార్య మేదైనా సాధించవలసి వచ్చినపుడు అనేకాటంకములు అతిక్రమించవలసి ఉంటుంది అని. జీసెస్ తన ప్రియధర్మము ప్రచారము చేయడముకోసము ప్రాణాలు అర్పించడానికి కూడా సందేహించలేదు. సర్వమంగళవిధాత నీకు సర్వథా సర్వదా సాయపడును గాక!

భవదీయ:

రఘుపతి."

శ్రీనివాసరావు రఘుపతిఉత్తరానికి ప్రత్యుత్త రము వ్రాయలేదు. అతనికి మాటిమాటికి ఇందులేఖ బాష్పాక్రాంతవదనము ప్రత్యక్షము కాసాగినది. ఆమెకు ఏమాత్రము ఇష్టము లేదు. పైన ఆమె ఎంతో దుఃఖపడుతున్నది. అందుచేత అతను ఆమెను ఏ విధ ముగా కాకినాడ తీసుకపోతాడు!

నేటి ఉదయము రామన్న వ్యవహారము చూచిన తరువాత శ్రీనివాసరావు మతవిశ్వాసము కొంచెముగా చంచలించినది. ఇందులేఖ అతనిని బాగా ప్రేమించి ఉంటుంది. లేకపోతే వివాహబంధము ఛేదించుకొనడము అనే ప్రసంగము వచ్చేసరికి ఆమె కంత దుఃఖమెందుకు కలుగుతుంది ! వివాహమునకు పూర్వమే అన్యోన్యానురాగము కలుగవలెగాని, తరువాత అట్టిది కలుగదనే విషయములో అతని మనస్సుకు చాలా సంశయము కలిగిపోయినది.

సాయంకాలము అతని అన్నకుమారుడు గబగబ వచ్చి కవరు ఇచ్చి పరుగెత్తుకపోయినాడు. కవరు అతికించి ఉన్నది. చిరునామా లేదు. అతను కవరు చింపి ఉత్తరము చదువుకొన్నాడు. అందులో ఇలా ఉన్నది:

"ప్రాణేశ్వరా !

మీరు నన్ను ఎక్కడికి తీసుకపోతే అక్కడికి రావడానికి సిద్ధముగా ఉన్నాను. ఫలానా సమయములో అని తెలియజేస్తే ఆవేళకు నేను మీవెంట బయలుదేరుతాను. నేటిరాత్రికి రాలేను. క్షమించ గోరుతున్నాను.

మీ చరణదాసి,
ఇందులేఖ."

ఉత్తరము చదువుకొని శ్రీనివాసరావు విపరీతముగా ఆశ్చర్యపడినాడు. రావడానికి సిద్ధముగా ఉన్నదా ? అయితే వివాహబంధము ఛేదించుకొనడానికి విచారపడడము లేదన్నమాట ! ఆ నాలుగు పంక్తులూ మళ్లీమళ్లీ చదువుకొన్నాడు. విచారము లేకపోతే ప్రేమించడము లేదన్నమాటా ? అయితే 'ప్రాణేశ్వరా', 'మీ చరణదాసి' అనే మాటలు ఎందుకు వ్రాసినది ? వాటికి అర్థ మేమిటి ? 'అవి ఉత్త పడికట్టుమాటలు—వాటికి మరి పెద్దఅర్థము ఏమీ ఉండదు' అనే సిద్ధాంతానికి వచ్చేసరికి అతని హృదయములో జ్వాల ప్రారంభమైనది.

అయితే ఆ జ్వాల ఒక్కక్షణమమాత్రమే. శ్రీనివాసరావు తన మనస్సును రెండుగదుములు గదిమినాడు: "ఆమె నిన్ను ప్రేమించడము లేదనుకో. అందువల్ల నీకు కలిగిన నష్ట మేమిటి?" అని ప్రశ్నించుకొన్నాడు. "లేదు. అందువల్ల నా కేమాత్రము వ్యథ లేదు" అని మనస్సు బదులు చెప్పినది. అప్పుడతను భావనావిఖ్యాతమైన శైలబాలామూర్తిని అత్యంతాదరముతో హృదయఫలకమున చిత్రించుకొన్నాడు.

తరువాత అతను ఇలా ఆలోచించినాడు: "ఇక ఒక్కదినముకూడా ఆలస్యము చేయరాదు. రేపే ఇందులేఖను తీసికొని కాకినాడకు ప్రయాణము కావలెను. రాత్రి ఒంటిగంటకు ఇంటినుంచి బయలుదేరాలె. తాళ్లూరు ఇక్కడికి రెండు క్రోసులు. ఈ కొంచెముదూరము మెల్లగా నడచిపోతే ఇక్కడివారికెవ్వరికీ తెలియకుండా ఉంటుంది. తాళ్లూరునుంచి బండి చేసుకొని చెరువూరుమీదుగా వెళ్లితే పది క్రోసులు. పెండ్యాలమీదుగా వెళ్లితే పండ్రెండు క్రోసులు. అయినా పెండ్యాలమీదుగా వెళ్లడమే మంచిది. కొంచెము చుట్టుఅయినా మార్గములో గ్రామా లెక్కువగా తగులవు. అందుచేత జనుల కంట బడకుండా పోవచ్చును. మధ్యాహ్నానికి కోలవెన్ను చేరి భోజనము చేసుకొని రాత్రికి హంసవరము చేరవచ్చును. హంసవరములో రైలెక్కితే సులభముగా కాకినాడ చేరవచ్చును. ఇలా ప్రయాణించడమువల్ల ఎక్కువ ఆలస్య మవుతుంది. అయితేమాత్ర మేమి ! నలుగురికి తెలియకుండా ఉంటుంది. కనుక ఇలా పోవడమే మంచిది."

ఆరాత్రి అంతా శ్రీనివాసరావుకు నిద్ర పట్టలేదు. భవిష్యజ్జీవితవిషయమునకు సంబంధించిన నానావిధ కల్పనలతో అతని శిరస్సు వేడెక్కిపోయినది. మరునాడు ప్రాతఃకాలమున ఇందులేఖకు ఇలా వ్రాసినాడు:

"ప్రియసోదరికి,

నేటిరాత్రి ఒంటిగంటకు ప్రయాణమై నా గదికి రావలెను. ఇంకొక చీర తప్ప మరి సామాను లేవీ తీసుకరావద్దు. కావలసిన వన్నీ అక్కడ ఏర్పాటు చేస్తాను.

శ్రీనివాసరావు."

రాత్రి ఒంటిగంటకు శ్రీనివాసరావు రహస్యముగా భార్యను తీసుకపోయినాడు.

౪

మధ్యాహ్నము పండ్రెండు గంటలకు మండు టెండలో చెమటలు దిగగారుతూ ఇందులేఖా, శ్రీనివాసరావులు కోలవెన్ను సత్రముముందు బండి దిగినారు. శ్రీనివాసరావు బండివానికి బాడుగ ఇచ్చి భార్యతో సత్రములోపలికి వచ్చినాడు. సత్రపు గుమాస్తా వచ్చి వారికి వసతి చూపించినాడు. శ్రీనివాసరావు గుమస్తాకు డబ్బు ఇచ్చి భోజనసామగ్రి తెచ్చిపెట్టవలసిన దని కోరినాడు. గుమాస్తా బజారుకు వెళ్లినాడు.

సత్రమువెనుక పెద్ద కోలను ఉన్నది. కోలనులోని జలము నిర్మలమైనది. ఇందులేఖ ఎండదెబ్బకు ఉడికిపోయినది. ఆమెకు విపరీతమైన దప్పిక అవుతున్నది. అయినా ఆమె విశ్రాంతి తీసుకోలేదు. ఒంటిచెమట ఆరకముందే ఆమె స్నానము చేయబోయినది. శ్రీనివాసరావు తొందరగా స్నానముచేసి హంపవరానికి బండి మాట్లాడబోయినాడు.

గుమస్తా భోజనసామగ్రులు తెచ్చేసరికి ఒంటిగంట అయినది. అంతవరకు ఇందులేఖ గ్రీష్మతాపము శమింపచుటకై స్నానము చేస్తూనేఉన్నది. భోజనసామగ్రులు రాగానే ఆమె స్నానము ముగించి బయటికి వచ్చి ఒడలు తుడుచుకొని వంట ప్రారంభించినది.

ఎండదెబ్బ తగిలినమీద అంతసేపు నీళ్లలో నానినందుకు ప్రతిఫలము త్వరలోనే కలిగినది. వంట పూర్తి అయినా కాకముందే ఆమెకు జ్వరము ప్రారంభమైనది. శ్రీనివాసరావు తిరిగి వచ్చేసరికి ఇందులేఖ చలిజ్వరముతో గడగడ వణకిపోతున్నది. తాకి చూడగా ఆమె శరీరము మండిపోతున్నది. కన్నులు జపాపుష్పముల వలె ఎర్రబడినవి. పడుకొనడానికి పరుపుగాని, జంపఖానాగాని వెంట తీసుకరాలేదు. కప్పడానికి దుప్పటిగాని, ఇతరవస్త్రముగాని లేదు. ఇప్పు డతను ఆమెను ఎక్కడ పడుకోబెట్టుతాడు? ఏమి కప్పుతాడు? అప్పు డతను ఇలా అన్నాడు: "నే నిప్పుడే బజారుకు వెళ్లి జంపఖానా దుప్పట్లు కొనితెచ్చి నీకు పక్క అమరుస్తాను."

"ముందు మీరు భోజనముచేయండి. మీకు వడ్డిస్తాను. నేను తరువాత పడుకొంటాను లెండి."

"పిచ్చిదానా! అంత జ్వరముతో అన్నము వడ్డిస్తావా! నీవు అలా బాధపడుతూఉంటే నాకు మాత్రము అన్నము రుచిస్తుందా?"

ఇందులేఖ వణకుతూ వణకుతూ ఇలా అన్నది:

"నాబాధ కేమిలెండి? అందుకని మీరు ఉపవాసముచేస్తారా? చాలు, చాలు! ఈ ఒక్కరోజుకే మీ మొగమంతా చిక్కిపోయి నల్లబడినది."

శ్రీనివాసరావు ఆమెకు సమాధానము చెప్పకుండా బజారుకుపోయి జంపఖానా, రెండు దుప్పట్లు, పచ్చడము తెచ్చి పక్కవేసి ఇందులేఖతో, "వచ్చి పడుకో, పచ్చడము కప్పుతాను" అని అన్నాడు.

"అ దేమిటి? మీరు భోజనము చేయనిది నేను పడుకోను" అన్నది ఇందులేఖ.

ఆ మాటలు వినకుండా అతను ఆమెను రెక్కపట్టుకొని తీసుకవచ్చి పడుకోబెట్టినాడు. ఆమె పడుకొని రెండుమూడుసార్లు "అన్నము పెట్టుకొని భోజనము చేయండి. చల్లారితే మీరు తినలేరు" అని హీనస్వరముతో అతనిని బలవంతముచేసినది. తరువాత జ్వరగతి మరింత తీవ్రము కావడముచేత ఆమెకు స్మృతి తప్పినది.

* * *

మూడురోజు లైన తరువాత ఇందులేఖకు స్మృతి వచ్చినది. కనులు తెరచి చూచినది. భర్త ప్రక్కనే కూర్చుని ఉన్నాడు. అపుడు శ్రీనివాసరావు "ఇందూ! ఎలా ఉన్నది ఇప్పుడు?" అని అడిగినాడు. ఇందులేఖ "నెమ్మదిగానే ఉన్నది. సరేగాని, మీరు భోజనము చేసినారా?" అంటూ అటూ ఇటూ చూచినది. అది సత్రపుగది కాదు. తాను మంచముమీద పడుకొనిఉన్నది. అప్పు డామె, "ఇ దేమిటి? ఇపుడు నేను ఎక్కడ ఉన్నాను?" అని అడిగినది.

"ఇందూ! నీవు మళ్లీ ఇలా మాట్లాడుతుండగా వింటానని అనుకోలేదు. మూడురోజులు కడచిపోయినవి. ఈఊళ్లో మాణిక్యారావుగారు అనే పిల్లజమీందారు ఉన్నాడు. వారి మేడ ఇది."

"మూడు రోజులే !"

"అవును, ఇందూ ! మూడురోజులు నీవు స్మృతి లేకుండా పడిఉన్నావు. ఇక నీకు వ్యాధి నిమ్మళిస్తే అంతా సార్థక మవుతుంది."

ఇందులేఖ కొంచెముసేపు నిశ్శబ్దముగా ఉండి, తరువాత, "మీకు ఒక్కమాట చెప్పుతాను" అన్నది.

"ఏమిటి, ఇందూ !"

"నన్ను బ్రతుకనీయవద్దు."

ఆ మాట వినగానే శ్రీనివాసరావు వలవల కన్నీరు కారుస్తూ, "ఛీ, ఇందూ ! ఏమిటి ఈ పిచ్చి మాటలు ? నీకు జబ్బు నయము మవుతుంది. నీవు బ్రతుకుతావు" అన్నాడు.

ఇందులేఖ పెదవులు కంపించినవి. కనుల నీరు క్రమ్మినది. భర్తవంక రెప్ప వేయకుండా చూస్తూ గద్గదికతో, "నేను బ్రతికి ఏమి ప్రయోజనము ! నన్ను దాటిపోనీయండి" అన్నది.

"కాదు, ఇందూ ! నిన్ను దాటిపోనీయలేను."

"ఈ వ్యర్థురాలిని పెట్టుకొని ఏమి చేస్తారు ?"

"నిన్ను నేను ప్రేమిస్తున్నాను, ఇందూ !"

రోగిణిదుర్బలహృదయము ఆవేగభరము ఇక సహించలేకపోయినది. కన్నులు మూసుకపోయినవి. శరీరము అవశమై కంపించినది.

కొంచెముసేపటికి డాక్టరు వచ్చినాడు. శ్రీనివాసరావు విప్పారిన ముఖముతో, చిరునవ్వుతో నమస్కారము చేసి, "డాక్టరుగారూ ! మీరు ఉదయము పదిగంటలకు ఇచ్చిన మందు చాలా అద్భుతముగా పనిచేసినది. స్మృతి కలిగినది. పది నిముషాల క్రిందట కొంచెముగా మాట్లాడినది" అని చెప్పినాడు.

అపుడు డాక్టరు ఇలా అన్నాడు: "అయితే ఇక భయము లేదు. ఈ జ్వరము ఇక రెండు మూడు రోజులలో జారిపోతుంది. కాని ముందు మీరు చచ్చిపోయేటట్లున్నారు. మూడురోజుల బట్టి నిద్రాహారాలు లేకుండా అదేమాదిరిగా పీఠము వేసుక కూర్చున్నారు. మీవలె భార్యను ప్రేమించేవాళ్లను చాలా తక్కువ మందిని చూచినాను."

శ్రీనివాసరావు లోలోపల "చాలా తక్కువ మంది అనే మాట నిజమే !" అనుకొని, ప్రకాశముగా "నాభార్యకనుక నేను స్వభావతః ఏలాగో ప్రేమిస్తాననుకోండి. కాని మీరు చూపించిన సౌహార్దము మాత్రము సాటిలేనిది" అన్నాడు.

ప్రవీణుడైన డాక్టరు ఆత్మప్రశంసకు కొంచెము సంకోచిస్తూ, "నేనుమాత్రము ఎక్కువ ఏమి చేసినాను ? నేను ఏకొంచెము చేసినానో అది నా విధి; నా వృత్తిధర్మము !" అన్నాడు.

"మీరు ఎంతో ఆదరముతో మాణిక్యాలరావు గారితో చెప్పి, వారి ఉద్యానగృహము ఖాళీచేయించి ఇప్పించకపోతే, ఆ సత్రపు గదిలో ఎగుడు దిగుడు నెమ్మ నేలమీద జంపఖానాపక్కపైన పడుకొని నా భార్య ఎన్నిరోజులు జీవించి ఉండేది !"

డాక్టరు ఆ ప్రసంగము మార్చి అన్యప్రసంగము తెచ్చినాడు. తరువాత ఔషధము, పథ్యము మొదలైన విషయాలు చెప్పవలసినవి అన్నీ చెప్పి వెళ్లిపోయినాడు.

ఆ రాత్రి పది గంటలకు ఇందులేఖకు జ్వరము తగ్గినది. ఆరాత్రి అంతా ఆమె సుఖముగా నిద్రపోయినది. శ్రీనివాసరావుకూడా నిశ్చింతగా నిద్రపోయినాడు.

౫

మరునాడు ఉదయము డాక్టరు వచ్చినాడు. ఇందులేఖ అతనిని చూచి చీర సవరించుకొని ముఖము వంచుకొన్నది. జ్వరము పూర్తిగా తగ్గిపోయిన దని విని సంతోషముతో డాక్టరు, "ఇక ఏమాత్రము భయము లేదు. ఆమెమనస్సు ఇకముందు ఎక్కువ ప్రసన్నముగా ఉండేటట్లు చూడవలెను. ఔషధము కంటెకూడా అది అత్యవసరము సుమా !" అని చెప్పి వెళ్లిపోయినాడు. తరువాత శ్రీనివాసరావు డాక్టరు చెప్పిన ప్రకారము ఇందులేఖకు ఔషధము, ఆహారము ఇచ్చినాడు. పిమ్మట ఇద్దరికి కబుర్లు ఆరంభమైనవి.

"ఇన్నిరోజులనుంచి ఎక్కడ భోజనము చేస్తున్నారు?" అని అడిగినది ఇందులేఖ.

"డాక్టరుగారి ఇంటినుంచి భోజనము వస్తున్నది."

"అయితే, ఆకారమంతా అలా ఉన్నదేమి? చిక్కి సగమై నల్లబడిపోయినారే! మీ కష్టానికంతా కారణము నేను. నాకోసము ఎందుకింత కష్టపడుతున్నారు?"

శ్రీనివాసరావు చిరునవ్వుతో, "నాకు జబ్బు చేస్తే నీవుమాత్రము నాకోసము మరి కష్టపడవా?" అన్నాడు.

ఇందులేఖ పక్కవంక చూస్తూ, "ఇప్పుడు జబ్బు కోరుకోనక్కరలేదులెండి" అన్నది మెల్లమెల్లగా.

శ్రీనివాసరావు ఇందులేఖహస్తము గ్రహించి సాదరముగా దువ్వుతూ, "కోరుకోను. కాని నాకు జబ్బు చేస్తే నీవు కష్టపడతావా, లేదా?" అని అడిగినాడు.

"పడతేమి?"

"ఎందుకోసము?"

ఇందులేఖ కామ్యరుద్ధస్వరముతో, "మీరు నా ప్రాణేశ్వరులు కనుక!" అన్నది.

శ్రీనివాసరావు ఆమెహస్తము మృదువుగా దువ్వుతూ, "నీవు నాభార్యవు కనుక!" అన్నాడు.

ఇందులేఖ సస్మితవదనముతో, "ఎప్పటినుంచి?" అన్నది.

"నిన్ను ప్రేమించిననాటినుంచి."

ఆమె కొంచెముసేపు ఊరకుండి, "మీరు బ్రాహ్మణులే కదా! బ్రాహ్మలు అసత్యమాడరని విన్నాను" అన్నది.

"వారముక్రిందటివరకు నేను బ్రహ్మనే."

"ఇప్పుడో?"

"ఇప్పుడు అయినా కాకపోయినా నేనసత్యము పలుకను. నేను నిన్ను నిజముగా ప్రేమిస్తున్నాను."

"అయితే ఆనాడు ప్రేమవిషయము చెప్పినారే —అదేనా?"

శ్రీనివాసరావు నిరుత్తరుడై కొంతసేపటికి, "నీవు నన్ను ప్రేమించడము లేదు" అన్నాడు.

"ఎలా తెలిసినది?"

"ఎలాగా? మన వివాహబంధము భేదించుకొనడానికి నీవు అంగీకరించినావు. అందుకనే నీవు కాకినాడ రావడానికి సమ్మతించినావు!"

ఇందులేఖ నవ్వుతూ, "ఇదేనా మీరు తెలుసుకొన్నది?" అన్నది.

"అయితే మరి ఏమిటి?"

"నా అంతట నేను బుద్ధిపూర్వకముగా వచ్చినాననుకొన్నారా? నన్ను పెద్దవదినగారు పంపించినది."

"నీవు ఇంకొకరిని పెండ్లాడడము ఆమెకు ఇష్టమూ, సంతోషమూనా?"

"అవును. వరునికూడా స్థిరపరచినది."

"ఎవరు?"

"యమధర్మరాజు!"

శ్రీనివాసరావు పకపక నవ్వినాడు.

"వదినగారు ఏమని చెప్పినారంటే—తండ్రిగారి ఇంటినుంచి నామరది నిన్ను ఎలా దొంగిలించుకొనిపోతున్నాడో అలా నీవు మార్గములో ఆయన మనస్సు దొంగిలించుకోవాలె. లేకపోతే..."

"లేకపోతే పైన మీరు స్థిరపరచుకొన్న వివాహానికి బందోబస్తు అన్నమాట! అంతే కాదూ! భలే మంచి ఆలోచన చేసినారు వదినామరదలిద్దరూ! ఆడవాళ్లు ఎంతకైనా సాహసులు సుమా! ఎగతాళికేమిగాని, ఇందూ! నీవు నామనసు నిజముగా దొంగిలించినావు. అందుచేతనే నేను ఆ అన్యవివాహవిషయములో అన్ని ఆలోచనలు తుడిచివేసికొన్నాను."

"అయితే అది ప్రేమపూర్వక వివాహము కాదన్నమాట! అందుచేతనే దానికి విఘాతము కలిగినది. నేను మీ మనస్సు దొంగిలించుకొన్నానన్నారే, అది ఎప్పుడో చెప్పగలరా?"

"అదంతా తరువాత చెప్పతానులే."

"ఎప్పుడు కౌంగిలించుకొన్నానో ఆ సంగతి మాత్రము చెప్పండి."

"ఎప్పుడా ? ఏరాత్రి మొట్టమొదట మంచము మీద నాకాళ్లగట్టు పడుకొని నీవు నిద్రపోయినావో అప్పుడు ప్రారంభమైనది. తరువాత క్రోవలో వృద్ధి పొందినది."

చాణక్యపండితుడు శిష్యులకు ఉపదేశించినాడు: 'ఘృతకుంభమువంటివాడు పురుషుడు; తప్తాంగారమువంటిది స్త్రీ. ఈ రెంటిని, ఆ ఇద్దరిని ఒక్కచోటికి చేర్చరాదు. చేర్చితే వికారము సంభవించక తప్పదు' అని. అందులో ఆ స్త్రీపురుషు లిద్దరూ తరుణవయస్కులై భార్యాభర్తలుకూడా అయితే ఇక రక్షణ మేమి ఉంటుంది ?

ఇందులేఖ మందహాసము చేస్తూ, "త్రోవలో ఆ మాట చెప్పలే దేమి ?"అన్నది.

శ్రీనివాసరావు ముగ్ధదృష్టితో ఆమెవంక చూస్తూ ఊరకొన్నాడు. అప్పుడు ఇందులేఖ మృదుస్వరముతో, "శైలబాల! శైలబాల నా భర్తను అపహరించగలదా? ఆమెకు సాధ్యమవుతుందా? పోదాము పదండి కాకినాడకు. ఆమెను ఒక్కసారి చూస్తాను" అన్నది.

"ఇక కాకినాడ వెళ్లడము లేదు. నీకు సంతోషము కులాసా చిక్కగానే విశాఖపట్నము వెళ్లి అక్కడ పదిరోజు లుండి తరువాత ఇంటికి వెళ్లుదాము."

ఇందులేఖ ఆ మాటలు వినిపించుకోకుండా, "ఆమె మిమ్ము నిజముగా ప్రేమించినదా ? అట్లయితే ఈ సంగతి తెలియగానే పాపము చాలా దుఃఖపడుతుంది కాబోలు !" అన్నది.

"ఆమె నన్ను ప్రేమించినదో, లేదో ఆమె హృదయానికే తెలియాలె, ఆ ఈశ్వరునికే తెలియాలె!"

"ఆమె ఆమాట చెప్పలేదా ? మీరు అడుగలేదా ?"

"ఆమెదగ్గిర ఎప్పుడూ ఈ ప్రసంగము రాలేదు."

"మీ రామెను ప్రేమిస్తున్న సంగతి అయినా ఆమెకు తెలుసునా మరి ?"

"ఎలా తెలుస్తుంది ?"

ఇందులేఖ అభిమానభరముతో, "ఆమెకు తెలియకపోవచ్చు. కాని మీ రామెను ప్రేమిస్తున్నారు కదా !" అన్నది.

"ఎలా ప్రేమిస్తాను ? అలా అయితే ఇంత శీఘ్రముగా నీవు నాహృదయములో దూరి నన్ను ఎలా జయించగలుగుతావు ! ఇప్పుడు జరిగిన ఈ సంఘటనవల్ల నేను ఆమెను యథార్థముగా ప్రేమించడము లేదని ఋజువైనది గదా! కేవలము చూపుల ప్రేమ ఉండేది. అంతే! కాని హృదయములో చొరలేదు. ఆమె ఇంగ్లీషుచదువు, బెరుకులేని మాటలు, అరమరలేని చిరునవ్వులు, మురిపించే మర్యాద, మరపించే నవీనత సౌందర్యస్ఫురణ కల్పించి నామనస్సును ఆకర్షించినవి."

మరి రెండు రోజు లైనతరువాత ఇందులేఖ పథ్యము పుచ్చుకొన్నది. మరి రెండు రోజులు ఇద్దరూ ఉద్యానగృహములో చాలా సుఖముగా, సంతోషముగా కాలము గడపినారు.

నాటిరాత్రి వారి నిద్దరిని డాక్టరు భోజనానికి ఆహ్వానించినాడు. మరునాడు ఉదయము బండికి విశాఖపట్నము పోవడానికి వారు అంతా సిద్ధము చేసుకొన్నారు.

ఆ సాయంకాలము డాక్టరుగారి ఇంటివసారాలో కూర్చుని టీ త్రాగుచుండగా శ్రీనివాసరావుకు రఘుపతివద్దనుంచి ఉత్తరము వచ్చినది. ఆ ఉత్తరము :

"బ్రహ్మకృపా హి కేవలమ్ !

కాకినాడ,

జ్యేష్ఠ బ ౨ మంగళవారము.

ప్రియసోదరా !

సోదరి ఇందులేఖ జబ్బుపడినదని విని చాలా విచారించినాను. ఈశ్వరు డామెకు శీఘ్రముగా ఆరోగ్యము కలిగించుగాక !

నేను నీ కొక దుఃఖవార్త తెలుపుతున్నాను. దానిని నీవు ధైర్యముతో సహించవలెను. శైలబాల నిన్ను ప్రేమిస్తున్న దనే విషయములో నీకు దృఢ విశ్వాస మున్నట్లు చెప్పినావు. నాకుకూడా అట్టి విశ్వాసమే కలిగినది. కాని నిన్న సాయంకాలము ఆ నా విశ్వాసము విధ్వస్తమైనది. శంకరరావుకు, శైలబాలకు వివాహము స్థిరపడిన దని విన్నాను. వా రిద్దరూ రెండు సంవత్సరాలనుంచి పరస్పరానురాగబద్ధు లని కూడా విన్నాను. అందుచేత శైలబాల నిన్ను ప్రేమిస్తున్న దనే నీ విశ్వాసము కేవలము భ్రాంతిమాత్రమే!

నీకు ఇంకొక భ్రాంతి ఉన్నది. అదికూడా ఇప్పుడే తొలగించడము అవసరము. హైందవధర్మప్రకారము సంపన్నమైన వివాహమునకూ, నూతన బ్రాహ్మధర్మరీత్యా సంఘటితమైన వివాహమునకూ ఏమీ సంబంధము లే దని నీ విదివరకు అభిప్రాయపడి ఉన్నావు. కాని భార్యాభర్త లిద్దరూ బ్రాహ్మధర్మము స్వీకరించినప్పటికీ హైందవవివాహ ధర్మసంబంధము విచ్ఛిన్నము కాజాలదు.

నీవు కాకినాడ వస్తావా? నాలుగైదు రోజులలో సోదరి ఇందులేఖకు ఆరోగ్యము కలిగి మీ రిద్దరూ ఇక్కడికి రాగలిగినా వెనుక చెప్పిన ఉపాధ్యాయోద్యోగముకూడా మించిపోదు. అయినప్పటికీ నా సలహా ఏమి టంటే—సోదరిని గృహమునకు పంపివేసి నీవు కొన్నిరోజులపాటు హిమాలయములోని ప్రశాంత ప్రదేశమందుగాని, కలకత్తాలోని బ్రాహ్మమందిరమందుగాని ధ్యానోపాసనాదులు చేసుకొంటూ చిత్తశాంతీ, ఆత్మశాంతీ కలిగించుకోవలసినది అని. తమసో మా జ్యోతి ర్గమయ!

భవదీయుడు,
ర ఘు ప తి.

పునశ్చ—శైలబాలవివాహము సందర్శించుటకై ఈ ౨౮ నాడు పిఠాపురము వెళ్లుతాను. ౨౧౦ నాటికి తిరిగి వస్తాను. మీరు రాదలచుకొంటే అప్పటికి రావచ్చును."

రాత్రి తొమ్మిదిగంట లైనతరువాతి డాక్టరుగారి ఇంటినుంచి వచ్చి శ్రీనివాసరావు భార్యకు ఆ ఉత్తరము చూపించినాడు. ఇందులేఖ చదువుకొని నవ్వుతూ, అయితే శైలబాలమీద నా కిక కోపము లేదు. విశాఖపట్నము పోవడము మాని, పిఠాపురము పోయి, శైలబాలవివాహము చూతాము" అన్నది.

"అలాగే పిఠాపురము పోదాము. శంకరరావు వద్దనుంచి ఆహ్వానముకూడా వచ్చినది. విశాఖపట్నము పోదా మనడములో నాకు ఇంకో ఉద్దేశ్యముకూడా ఉన్నది. ఏమి టంటే—శైలబాల నన్ను మరచిపోవడానికి అవకాశము కలిగించిన ట్లవుతుం దని."

ఆ మాట వినగానే ఇందులేఖకు అభిమానజ్యోతి ప్రదీపించినది. వెంటనే ఆమె ఇలా అన్నది: "ఇందాక మనసులోని మాటగా చెప్పితే నిజమే అనుకొన్నాను. అందుకోసమా, నా శరీరారోగ్యము మిష పెట్టి విశాఖపట్నము పోదా మన్నారు!"

బయట అంధకారములో వకుళవృక్షముమీద కూర్చుని కోకిల వారి సంభాషణ ఆలకిస్తున్నది. దానికి మానవభాష తెలుసును కాబోలు! వ్యాజపూర్వకము లైన ఆమెఅభిమానవాక్యాలు వినగానే దానికి సంతోషము కలిగిన ట్లున్నది. అందుచేతనే అది మాటిమాటికి కువ్వూకువ్వూ అని పంచమస్వరముతో కూయడము ఆరంభించినది. శ్రీనివాసరావు భార్యను హృదయానికి హత్తుకొని, "కాదోయ్, కాదు—అది కాదు" అంటూ ముద్దుపెట్టుకొన్నాడు.

మధుర పండితరాజము

శ్రీ పింగళి లక్ష్మీకాంతం

కురంగీ విలాపము

అలఘుతపః ప్రశాంతమగు
నాశ్రమభూమి యటన్న భ్రాంతినా ?
చిలుకలుగూడ జెట్లపయి
"జీల్చుము, చంపుము, త్రావు" మన్న ప
ల్కులె పఠియించు నీమొఱకు
గూడెము సొచ్చితివో కురంగి యా
పలుకులు నీ చెవిఁ బడవె ?
పాపపు దుర్విధి మోసగించెనో ?

పరిచిరి కాలపాశముల
వంటి యురుల్, మరి పల్వలంబులన్
గరళము గల్పి, దారుల మొ
గంబుల గోతులు త్రవ్వి, యగ్గి గొ
ల్పిరి యుగ్రపక్కలన్, సెలసు
విండ్లను దాల్చి నిల్చి, రెట్టులన్
సుగతి లేక యా హరిణ
సుందరి బోయని నిట్లు వేడెడిన్.

పలలమంతయు గొనుము: జీవమ్ముతోడ
బొదుగుమాత్రము మిగిలిచి వదలు మన్న !
గడ్డిపట్టని నిసువులు గలవు రెండు
స్రుక్కి నాకోస మెదురులు సూచుచుండు.


చందన చర్చ

మూలమునన్ భుజంగములు,
మూర్ధమునందు విహంగముల్, ద్విపా
ర్శ్వాల మతంగముల్, విపుల
శాఖలయందు బ్లవంగవర్గముల్
పూలను భృంగముల్, సవిధ
భూమి కురంగము లేమి కోరియో
యేలని బంటులై కొలుచు
నెవ్వఁడు చందనవృక్షరాజమున్,
భుగభుగాయితవిషకీల ఫూత్కరించు
పాపజాతికి బరిమళపవనభిక్ష
పెట్టి పోషించు శ్రీఖండవృక్షరాజ
మహిమ వర్ణింప నెవడు సమర్థు డగును ?

సకలజగత్ప్రమోదకర !
చందనభూజమ ! యీ వనమ్మునం
దిక నిలువంగబోకు, మిత
రేతరఘర్షణజాతదావపా
వకకలితమ్ములో నధమ
వంశము లున్నవి పెక్కు, వీనిచే
స్వకుల మొకండె కాదు సుమి,
సర్వవనమ్మును దగ్ధమయ్యెడిన్.

జనన మన్ననో, కఠినపాషాణభూమి
దనువుచూతుమొ, దారుసాధారణంబు
సాహచర్యంబొ, యాశీవిషమ్ముతోడ
మలయజయశమ్ము స్వగుణసంపాదితమ్ము.

ఆశాంత ప్రసరద్భవత్పరిమళ
వ్యాకృష్యమాణుండనై
నీశోభల్ కనులార జూచుతమి నెం
తేదూర మేతెంచితిన్
నీశాఖాభుజ మెక్కి యాడెడు ఫణిన్
వీక్షించితిన్, జాలుపో !
ఆశీర్వాదము ! పోవనిమ్ము నను, మే
లౌగాక పాటీరమా !



తిరుపతికొండమీద నుండు పాపనాశన మను దివ్యతీర్థము.

మేకపిల్ల

[కథానిక]

శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి

బుద్ధభగవానుని పాలరాతివిగ్రహంముందు వెండి ప్రమిదలోని దీపం నిశ్చలంగా వెలుగుతోంది. ఎదురుగా ఉన్న కిటికీలోంచి త్రయోదశీచంద్రుని ముదురుకిరణాలు జాజివాసనలు మోసుకొచ్చి తథాగతుని స్నిగ్ధకపోలాలకు మెరుగులు దిద్దుతున్నాయి. దీపకళికలోంచి బయలుదేరిన సూక్ష్మధూమరేఖ బోధిసత్వుని అర్ధనిమీలితనేత్రాల్ని తెరిపించటానికి ప్రాధేయపడుతూ వాటిచుట్టూ ప్రదక్షిణాలు చేస్తోంది. ధావళ్యంలో గౌతమదేవుని కేమాత్రం తీసిపోని మేకపిల్ల, కొమ్ములతో వారి పాదాల్ని స్పృశించి, ఆ ప్రశాంత గంభీరవదనంలోకి చూసి "మె! మ్మే!!" అంటూ ఒక్కగంతులో ముందుపావిట్లో కొచ్చింది.

ముందుపావిట్లో మంచంమీద నందుడు పడుకునున్నాడు. మూడే ఘంటాయి. కిందటిరాత్రినుంచీ మన స్పృహే లేదు. చుట్టూ చేరిన బంధువులూ, తల్లీ, మామ్మా దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఆదుర్దాగా చూస్తున్నారు. మేకపిల్ల మంచంచుట్టూ తిరుగుతూ నందునిమీద ఉన్న దుప్పటిని మునిపళ్లతో కొరికలాగుతూ "మె! మ్మే!!" అని అరుస్తోంది మెల్లిగా. ఒక్కొక్కప్పుడు అతిగంభీరంగా నందుని మొహంలోకి చూసి, ఎంతసేపటికీ వాడు కళ్లు తెరవకపోతే, ఉలిక్కిపడి, ఒళ్లు దులపరించి బుద్ధభగవాను డున్న గదిలోకి పరుగెత్తుకుంది.

నందుని ముంగురులు నాలికతో నాకినా, కొమ్ముల చిరుకొనలతో వాడి కపోలాలు స్పృశించినా, మేకపిల్లను ఎవరూ అదల్చరు. పుట్టినప్పటినుంచీ వాళ్లిద్దరికీ అంత స్నేహం. ఆడుకునేప్పుడు ముందు కాళ్లు రెండూ ఎత్తి నందుడి తలమీద పెట్టేది మేకపిల్ల ఎంతో ఒడుపుగా. వాడు కిలకిలా నవ్వుతూ పట్టుకుచ్చులాంటి దాని వెంట్రుకలను జడలల్లేవాడు. ఒక్కొక్కప్పుడు నందుడితో పాటు పరుపుమీదే పడుకునేది మేకపిల్లకూడాను. దానికి నీళ్లు పోస్తేనేకాని తను నీళ్లు పోయించుకునేవాడు కాదు నందుడు. తనకి సబ్బు పెట్టి రుద్దితే మేకపిల్లకీ రుద్దాల్సిందే! అన్నం తినేటప్పుడు కూడా మేకపిల్ల దగ్గిరుంటేనేగాని ముద్ద దిగేదికాదు. లేత గరికా, జొన్న కంకులూ తనే మేకపిల్ల నోటికందిస్తూ తనుకూడా ఓ పరక కొరికేవాడు నందుడు. మేకపిల్ల చెంగున గంతేసి నందుడి నోట్లోంచి ఆ పరకని తన మునిపళ్లలో పట్టుకు లాగి "మె! మె!! మ్మే!!!" అంటూ నందుడి బుజ్జిపొట్టమీద కుమ్మబోయేట్లుగా చక్కిలిగిలిపెట్టేది. వాడు ఆచక్కిలిగిలికి పకపకలాడుతూ "మా! మ్మా!! అమ్మా!!!" అంటూ మేకపిల్ల చెవులు పట్టుకుని యుద్ధం చేసినట్లు ఎగబడేవాడు. వాళ్లిద్దరికీ తెలిసిన భాషేదో వుంది. మేకపిల్ల "మె! మ్మే!!" అంటే చాలు, నందుడు తల్లిదగ్గిర పాలు తాగుతున్నా సరే పరిగెత్తుకెళ్లాల్సిందే! నందుడికి మాటలు రానప్పుడు "మా! మ్మా!! అమ్మా!!!" అనే శబ్దాలతోనే అన్నివిషయాలూ అర్థమయేటట్లు మేకపిల్లకి చెప్పేసేవాడు. క్రమంగా వాడికి మాటలు రావటంలో, మేకపిల్లకికూడా మనిషిభాష అర్థమైపోవటం మొదలెట్టింది. "మె!! మ్మె!! మ్మే!!" అనే ధ్వనులతో అది అన్నింటికీ సమాధానాలు చెప్పటంకూడా నేర్చుకుంది. నందుడితోపాటు పొద్దున్నే నీళ్లు పోసుకుంటేనేగాని గడ్డిపర

కన్నా ముట్టుకోడు. తోటలో విడిచిపెట్టేసినా దొండపాదు, కాకరతీగ, బెండమొక్కలూ, పొట్ల పందిరీ ముట్టుకోనే ముట్టుకోదు. గరికెరెబ్బలూ, చికిలింతా ఏరుకుతింటుంది. దొడ్లో పొగడచెట్టుకింద యిద్దరూ ఆడుకుని ఆడుకుని అలిసిపోతారు. మేకపిల్ల చెట్టునీడనే పడుకుంటుంది. నందుడు మొఖమల్లు వంటి దాని డొక్కలో తల పెట్టి నిశ్చింతగా నిద్రపోతాడు. ఖాదీవెండిలాగా మెరమెరలాడే మేకపిల్లను కావిలించుకుని పడుకున్న కస్తూరిబొమ్మలాంటి నల్ల నందుడిని చూసి వాళ్లమ్మ ఎంతో మురిసిపోయేది. వాళ్ల మామ్మకిమటుకు నందుడిమీద కోపంగా వుండేది పాడుమేకపిల్లతో ఆట లేమి టని. మేకపిల్ల మీద ఆవిడికి అసహ్యంకూడాను. కాని మనమడిమీద అమితమైన మమకారం—వాడు మూడుమూర్తులా తాత గారి పోలికవడంచేత. ఓమాటు మామ్మ మేకపిల్లని విదిలిస్తూ ఒక పూచికపుల్లతో కొట్టబోయింది. నందుడు యింతింత కళ్లు చేసుకుని, ఆ పుల్ల పట్టుకుని మామ్మమీద విరుచుకుపడ్డాడు. ఎంత "అభిమానం రా నీకు వెధవమేకపిల్లంటేనూ?" అని ఆవిడ నవ్వుకుని మనమణ్ణి ముద్దెట్టుకుంది. ఇదంతా చూస్తున్న మేకపిల్ల "మే! మ్మే!!" అనేసరికి నందుడు మామ్మకంట్లో పూచికపుల్లతో పొడిచి, జబ్బ మీద కరిచి ఒక్కఅంగలో దూకి మేకపిల్లమెడ కావిలించుకున్నాడు. "మే! మ్మే!!" భాషలో అది నందుడితో ఏం చెప్పిందో ఏమో! వాడు మామ్మ కేసి చూసి ఒకటే నవ్వడమూ, అది "మే! మ్మే!!" అంటూ గంతు లెయ్యడమూ! అలా చిందులు తొక్కుతుంటూనే వాళ్లిద్దరూ తోటలో కెళ్లిపోయారు.

ఓమాటేమైందంటే, నందుడూ మేకపిల్లా వీధిలో ఆడుకుంటూంటే "బొంయ్! బొంయ్!!" మంటూ ఓ కొత్త కుక్క మొరుక్కుంటూ ఒచ్చి నందుడిమీద పడింది. వాడు కెవ్వుమని కేకేసి మేకపిల్లమెడ కావిలించుకున్నాడు. కాస్తుంటే కుక్క నందుడి తొడకండలు పీకి పోగులు పెట్టేదే! మేకపిల్ల వెంటనే మెడ ఒక్క విసురు విసిరేసరికి నందుడు కిందపడ్డాడు. అమాంతం అది కుక్కమీద దూకి కొమ్ములతో పొడిచి పడేసి తొక్కటం మొదలెట్టింది. కరిచి ముక్కలు చేసేదే కాని మాంసంవాసన గిట్టక ఊరుకుంది. మేకపిల్ల ముందు ఏమీ చెయ్యలేక, కుక్క గిలగిలా తన్నుకుంటూ, అందినంతవరకు దాని కాళ్లని తెగకరిచి విడిచిపెట్టింది. ఇంతలోకే దోవనపోయేవాళ్లొచ్చి కుక్కని తోలేశారు. మేకపిల్ల కాళ్లంతా నెత్తురు ముద్దవటం చూసి నందు ఏడవటం మొదలెట్టాడు. దాని కాళ్లు కడిగి కట్టుకట్టేదాకా వాడు మెతుకు కొరక లేదు. తరవాత చాలా రోజులకిగాని దాని కాళ్లు సాంతం నయం కాలేదు. ఆ కుక్క పిచ్చిదికూడాను. ఆనాటినుంచీ మామ్మకి మేకపిల్లమీద అసహ్యం కొంచెం తగ్గింది కాని, సాంతం పోలేదు. నందుడు చూడకుండా దాన్ని అప్పుడప్పుడు కసురుతూనే ఉంటుంది. ఆ సంగతి మేకపిల్ల నందుడికి చెప్పితే యిద్దరూ నవ్వుకునేవాళ్లు. ఆవిడ నెవరూ లక్ష్యపెట్టే వాళ్లు కాదు.

అసలు మేకపిల్ల వాళ్లింటికి మూడేళ్లక్రితం రావటంకూడా తమాషాగానే జరిగింది—ఆకిందటి రాత్రినుంచే ఛాయాదేవికి ప్రసవవేదన జాస్తిఅయింది బాగా. తెల్లారబోతోంది. అంతకుముందే లేచిన పీతాంబరుడు స్నానాదులు ముగించుకుని దక్షిణంవేపు గదికిటికీ తెరిచి "ధమ్మపదము" తీశాడు చదువుదామని. వీధిమూలకిటికీ కెదురుగా ఒక మేక మరణవేదన పడుతోంది. అప్పుడే పుట్టిన ఒక మచ్చలపిల్లని కుక్కలాక్కెళ్లటం కళ్లారా చూసి పీతాంబరుడు బొట బొటా కన్నీరు కార్చాడు. తన భార్య ప్రసవవేదనపడుతుంటే, ఎంతమంది డాక్టర్లు? ఎంతమంది నౌకర్లు? మరి యీ మేకకి పుట్టిన పిల్లనన్నా కనీసం కుక్కనోట పడకుండా కాపాడేవాళ్లెవరూ లేరే! పీతాంబరుడు "ధమ్మపదము" మూసేసి పరిగెత్తుకొచ్చాడు వీధిలోకి. ఇంకా మనుష్యులెవరూ నడవటంలేదు. రాత్రి ఆ దారిన వెళ్లిన మేకలమందగిట్టల ముద్రలు నేలమీద కనిపిస్తూనేవున్నాయి. పాపం, ప్రసవించనున్న యీ మేక నడవలేకపోయింది కామాలు! గొల్లవాడూ నిద్రకళ్లలో మరిచిపోయి వెళ్లుంటాడు. పీతాంబరుడు

వెళ్లేసరికి కుక్క పారిపోయింది. అంతకు ముందు పుట్టిన రెండుపిల్లల్నీ కూడా ఆ కుక్కే పొట్టనపెట్టుకునివుంటుంది. వాటితాలూకు కాళ్లు అక్కడే పడివున్నాయి. అసలు తల్లి మేకనుకూడా కుక్క చాలా చోట్ల కరిచేసింది. పీతాంబరుడు మేకమేను తడిమాడు. నెత్తురు తుడిచి కట్టుకడుకుంటే యింకో పిల్ల పుట్టింది. ఇక తల్లికి సేవ అక్కర్లేదు. ఆ పిల్లని పీతాంబరుడికి అప్పజెప్పి, తనయందు ఒక మానవమాత్రుడు చూపిన దయ కెంతో కృతజ్ఞత సూచిస్తున్నట్టుగా, పీతాంబరుడి మొహంలోకి జాలిగా చూస్తూ తల్లిమేక కళ్లు మూసింది శాశ్వతంగా... మేకపిల్లని ఎత్తుకుని యింట్లో అడుగుపెడుతుంటే దాసిది పకపకలాడుతూ వచ్చి "మొగపిల్లాడు బాబయ్యగారూ !" అంది. పీతాంబరుడు ప్రశాంతగంభీరతతో "సరే ! దీన్నికూడా పెంచమను. దీని తల్లి చచ్చిపోయిందికూడాను" అంటూ మేకపిల్లని దాసి కిచ్చాడు...

ఆరాత్రే పీతాంబరుడు బ్రహ్మకపాలానికి బయలుదేరి వెళ్లాడు. చిన్నతనంలోనే పెళ్లవడం చేతనూ, తండ్రిని ఎదిరించటానికి కొంచెం జంకడంచేతనూ, పీతాంబరుడు గృహస్థాశ్రమధర్మాన్ని సాక్షిమాత్రంగా నిర్వహించాడు తప్పితే అతనికి సంసారంమీద ఏ మాత్రమూ ఆస్థ లేదు. వేదాంతశాస్త్రంలో పట్టభద్రుడైనప్పుడే అతనిలో కలిగిన పరివర్తనకు న్యాయశాస్త్ర పఠనం మరింత దోహద మిచ్చింది. తన కొడుకు పేరుప్రఖ్యాతులు గల న్యాయవాది అవుతా డని పీతాంబరుని తండ్రి ఎంతో ఉబలాటపడి పట్టా కట్టించాడు. తరవాత కొద్దికాలానికే తండ్రి గతించడంచేత పీతాంబరుడు న్యాయస్థానాని కెళ్లటంకూడా మానేశాడు. ఇల్లువాకిలి విడిచి దేశాటన కేనాడో బయలుదేరివుండేవాడేగాని గర్భవతి అయిన భార్య సజలనేత్రాలతో శిశూదయం అయేవరకు ఉండవలసిందిగా కోరితే కాదనలేకపోయాడు. ఆమె కెందుకనో భయం, తన భర్త తిరిగి రాడని. సరే, పుత్రోదయం అయింది. భార్య కన్నీరిక పీతాంబరుని కాళ్లకి సంకెళ్లు వెయ్యలేవు. ఆ సంగతి ఛాయాదేవికీ తెలుసు. బయలుదేరేముందు, పురిటిగది గుమ్మందగ్గిరి కొచ్చిన భర్తతో "అబ్బాయిని చూశారా ?" అంది సార్థకధ్వనితో. తన కన్నీటికి లేని శృంఖలాశక్తి పదిహేను గంటల వయస్సు గల శిశువు కుంటుందా ? పీతాంబరుడు మందహాసం చేసి "చూశాను" అన్నాడు. తల్లికోరిక తీరుద్దామని పీతాంబరు డెన్నడూ అనుకోలేదు. ఆజన్మాంతం కాని, కనీసం తాను దాటిపోయేవరకుగాని యిల్లు విడిచిపెట్టవద్దని ఆమె పీతాంబరుని కోరింది. ఆకోరిక తీర్చడం అసాధ్యం. తన పాదాలకు నమస్కరించి శెలవు తీసుకుంటున్న కుమారుని కౌగలించుకుని తల్లి భోరున ఏడ్చింది. ఆమెకీ భయమే, పీతాంబరుడు తిరిగి రాడని. ఆమాట అతని నోట అనిపించి వినటాని కిష్టం లేక "ఎప్పుడు తిరిగొస్తావు ?" అని అడగనేలేదు ఎవరూను.

పీతాంబరుడు కాశీ చేరినట్టుమాత్రం కబురు తెలిసింది. తరవాత, అతను హరిద్వారం వెళ్లటానికని ఎక్కిన రైలు ప్రమాదానికి గురిఅయిందనీ, మరణించిన వారిలో కొందరిని గుర్తుపట్టటానికే వీలుపడలేదనీ కాశీలోని అతని మిత్రులద్వారా ఛాయాదేవికి మరొక వార్త వచ్చింది. అంతే. ఏళ్లు గడిచిపోయాయి. పీతాంబరు డేమయ్యాడో ఎవరికీ తెలీదు. బహుశః ఆ రైలుప్రమాదంలో మరణించివుంటా డనే అంతా నిశ్చయించుకున్నారు. కాని మరణించినట్లు ధృవపడలేదు కనక ఛాయాదేవి ముత్తయిదురూపాని కేమీ మార్పు కలగజెయ్యలేదు సంఘం...

పరిస్థితుల ప్రభావంవల్ల ఛాయాదేవికికూడా వైరాగ్యగుణం అలవడింది. తన భర్తభావాల్నీ, నడకల్నీ, అలవాట్లనీ అనుకరించడంలో ఆమె కోవిధమైన మానసిక తృప్తి కలిగేది. ధార్మికంగా నందుడు ఊరటకి కారణమయ్యాడు. ఇంత స్థితిగల కుటుంబంకనక అన్నవస్త్రాల కేమీ లోటు లేకపోయింది. పీతాంబరుడి తల్లి తన భర్త మృతికి పడిన దుఃఖం యింతా అంతా కాదు. మనమడు పుట్టినందుకు కలిగిన సంతోషానికి మేర లేదు. కొడుకు దేశంపాలై, బతికున్నాడో లేదో అనే స్థితిని కల్పించేసరికి మళ్లీ కడుపు చెరువైంది. అప్పుడప్పుడు బాగా ఏడుస్తుంది. తన కున్నంత దుఃఖం కోడలికి

లేదనికూడా ఎత్తిపొడిచిందికూడాను ఒకటిరెండుసార్లు. ఏమైనా తనుమాత్రం చేయగలిగిం దేముంది? మరణించిన భర్తనీ, సజీవుడో కాడో తెలీని కొడుకునీ కూడా యీ మనమడిలోనే చూసుకుంటూ, మురుస్తూ ఏడుస్తూ రోజులు వెళ్ళదీస్తోంది.

అలాంటి సందుతే యిప్పుడు మరణశయ్యమీద వుండేసరికి మామ్మకిగాని, అమ్మకిగాని కాళ్లూ, చేతులూ ఆడటం లేదు. ఊళ్లోనా, అమ్మవారు ఊహూలా వాల్లాడిపోతోంది. గ్రామస్థులంతా కొలుపు చేస్తామని మొక్కుకున్నారు కూడాను. ఊళ్లో గడపకో మేకపోతుచొప్పున బలివ్వటానికి నిశ్చయించారు. మత్స్యమాంసాలు తినే కులంవా శ్లైవరూ అందుకు వ్యతిరేకించలేదు. అమ్మవారి కొలుపుసంఘంవాళ్లు యింటింటికీ వెళ్లి వీరాదులు కట్టించారు. బ్రాహ్మలీన్ని, కోమట్లనీమటుకు వాళ్లు ఒత్తిడిచెయ్యలేదు—వాళ్లు మాంసం తినరుకనక. కాని అమ్మవారి కేం ఆగ్రహం ఒస్తుందోనని వాళ్లల్లోకూడా కొంతమంది, పదిహేనూ యిరవయ్యో యిచ్చి, తమ పేరునకూడా ఒక వేటని వెయ్యవలసిందిగా కొలుపుసంఘాన్ని కోరారు.

పీతాంబరుడు మొదటినుంచీ అహింసాపరుడనీ, క్షత్రియుడైనప్పటికీ మాంసాదు లేనాడో వర్జించాడనీ ఊరంతా తెలుసు. "అపరబుద్ధుడు వెలిశాడయ్యా!"అని చాటున అతన్ని హేళనచేసేవాళ్లు కూడా వున్నారు. ఇప్పు డతను ఉంటే, ఒక ఆట ఆడించి విడిచిపెట్టేవాళ్లు. "మేకపోతును వేయించడమో, లేకపోతే వెలేసి ఊళ్లోంచి వెళ్లగొట్టడమో జరిగితీరేది. పాపం, ఉన్నది ఆడవాళ్లు. ఇవ్వనే యిస్తారు. అదీగాక మేకపోతుకూడా వాళ్లింట్లోనే వుంది. పీతాంబరుణ్ని సాధించటం మాత్రం పడదు."—ఇన్నీ అనుకుంటూనే మూడు రోజుల క్రితం కొలుపుసంఘంవాళ్లు పీతాంబరుడింటికెళ్లి వీరాదుకట్టమన్నారు. ఛాయాదేవికి తన భర్త భావాలు బాగా తెలుసు. బుద్ధదేవుని పాలరాతి విగ్రహం ఆమెకి ప్రతిక్షణమూ భర్తను జ్ఞప్తికి తెస్తుంది. ఒక క్షణం ఆలోచించి "మేము వీరాదుకట్టం" అని చెప్పించింది ఛాయాదేవి. కొలుపుసంఘంతరఫున వచ్చిన వీరడికి వీరావేశం ఒచ్చింది. వృకోదరాన్ని ఒక చేత్తోనూ, బుర్రమీసాల్ని ఒకచేత్తోనూ నిమురుతూ "ఊఁ...మీకు కూడా ఎక్కిందీ విషం? ఎలా కట్టరో చూస్తా...ఎల్లుండిరాత్రి మళ్లా ఒస్తాం" అంటూ వెళ్లిపోయాడు. ఈ విషయంలో వీరడికి ఊళ్లో పెద్దమనుషుల మద్దతు బాగా వుంది లోపాయికారీగా...

మామ్మకి గుండె పీచు పీచుమంటూనే వుంది. "దుష్టుమండాకొడుకుకూడాను వీరడు. అదీగాక అమ్మవారు తల్లి...ఒక్కగా నొక్కడు...పసివెధవ సందుడు...అనాదినుంచీ ఒస్తున్న ఆచారాలే కూడాను. ధర్మరాజులవారూ, శ్రీరామచంద్రులవారూ మాంసం తినేవాళ్లేట! ఈనాటికి కుర్రకారు బయలుదేరి "మేం అహింసాపరులం" అంటూ నోరుకట్టుకు కూర్చుంటే మటుకు ఆ అమ్మవారుతల్లి ఊరుకుంటుం దేమిటి? అదీగాక యిలాంటి రోజుల్లోనా? ఊరంతా ఎత్తిపోతుంటేనూ! కోడలికి మరీ చాదస్తం! అసలు దానికి పిల్లాడిమీద అపేక్ష ఏడిసిందీ? ఎలా కన్నదో బాబూ రాయి కన్నట్టు! ఎల్లుండి వాళ్లొచ్చినప్పుడు చాటుగా ఓ పాతికరూపాయలు చేతులో పడేస్తే వాళ్లే అబ్బాయిపేరు చెప్పి ఒక వేటను వేసేస్తారు; సరిపోతుంది. ఈవిడికి తెలియాలా ఏమిటి? అసలు మేకపిల్లనే యిచ్చేస్తే! పిల్ల రేమిటి? పోతల్లేయాం తెత్తు పెరిగింది. పిల్లాడిమీద పీడకూడా కొట్టుకుపోతుంది. కాని, పాపం, కుక్కతో యుద్ధంచేసి ఆనాడు పిల్లాడిప్రాణాలు రక్షించలేదూ! అయితే మటుకు? మేకజన్మ మేకజన్మే! ఏమో బాబూ! ఆవిడగారే మంటుందో? ఇంట్లో నా పెత్తనమా, మన్నా? మొగుడిరాజ్యం, తన రాజ్యమూను. కొడుకుల రాజ్యం కోడళ్ల రాజ్యమూను...నా కెందుకొచ్చిందిగానీ చాటుగా పాతికరూపాయలు ఆ వీరడి చేతిలో పోస్తే పని వెళ్ళమారిపోతుంది..." అని నిశ్చయించుకుంది.

కొందరి పళ్లల్లో విషపుపన్ను ఉంటుందిట! వీరడు పళ్లు కొరుకుతూ వెళ్లి పోయినరాత్రే శాపం

పెట్టినట్టు, నందుడు ఉలిక్కులికిపడటమూ, కలవరింతలూనూ! మామ్మ భయపడినట్టే జరిగింది. జడుసుకున్నాడేమోనని, సోమయాజులుగారి దగ్గిరికెళ్లి రాత్రికి రాత్రి విభూతి తెచ్చిపెట్టింది. ఒళ్లు పేలిపోతోంది. తెల్లారి కాస్త జారినట్టే జారింది. ఓ మెతుకు కొరికాడో లేదో ప్రళయంగా మళ్లా వచ్చిపడింది. రాత్రినుంచీ మన స్పృహే లేకపోయె! అమ్మవారి చేష్టేనని మామ్మకి బాగా తెలిసిపోయింది. కోడలితో కూడా చెప్పేసింది. అమ్మవారికి మొక్కుకోమని. అత్తగారితో వాదించి లాభం లేదని ఛాయాదేవికి తెలుసు. ఆవిడ ఒద్దనీ కద్దనీ ఏమీ అనకుండా వూరుకునేసరికి సుముఖమే ననుకుంది మామ్మ.

మొన్నాడు రాత్రివేళ యమకింకరులల్లే కొలువుసంఘంవాళ్లు వీరడిని ముందుపెట్టుకొచ్చారు. స్పృహ లేకుండా పడివున్న నందుణ్ణి చూసేసరికి వాళ్లకి చాలా సంతోషం కలిగింది. మామ్మ మొహం చూడగానే యిట్టే తెలిసిపోయింది మీదుకట్టడం ఆవిడ కిష్టమేనని. ఛాయాదేవిమటుకు ససేమిరా అంది అనడం. ఆమెకీ మనస్సులో పీకుతూనేవుంది. వీరడలా ఘూర్ణణపడి వెళ్లడమూ, నందుడు మంచమెక్కడమూ, అత్తగారి నమ్మకమూ, చుట్టుపక్కలవాళ్లు చెప్పడమూ చూడగాచూడగా అదే నిజమనిపిస్తోంది. కాని తన భర్త ఏం చెప్పేవాడు? ఆయనే ఉంటే మీదుకట్టనిచ్చేవాడా? గౌతమదేవులు పెదిమెలు కదల్చకుండానే ఏమిటో ఉపదేశిస్తున్నట్లు కనిపిస్తున్నారు. తాను తన భర్తకు ద్రోహం చెయ్యలేదు. నందుడు పోయినాసరే!...'నందుడు పోవడం' అనే భావం మనస్సులో కొచ్చేసరికి ఛాయాదేవి కంపించిపోయింది. వాడుకూడా లేకపోతే యిహ దిక్కెవరు? మీదుకడితేనేగాని నందుడు బతకడని నిర్ధారణ చేసేశారు చేరినజనం, ఛాయాదేవితో సంప్రదించ నవసరం లేకుండానే. అసలు మీదుమాత్రం ఆవిడే కట్టాలని శాస్త్ర మేముంది? మామ్మ కిష్టమేనయ్యె! నిజానికి యింటిపెద్ద ఆవిడేకూడాను. అరుగుమీదకూర్చున్న పెద్దమనుష్యులు "అత్తా, కోడళ్లలో పెత్తనం ఎవరిది" అనే విషయంమీద న్యాయశాస్త్రచర్చకూడా జరిపారు. "అత్తదే పైచెయ్యి" అని వాళ్లు తీర్పుయిచ్చినా, యీ సందర్భంలోమటుకు రోగితల్లే మీదు కట్టాల్సివుంటుందని అభిప్రాయపడ్డారు. నలుగురూ ఒత్తిడిచేసేసరికి ఆమె ఏడుస్తూ లోపలికెళ్లిపోయింది. ఈ అవిధేయత కొలువుసంఘా న్నవమానించినట్టయింది. చివాలున నలుగురూ లేచారు. "మీపిల్లాడు మీకు దక్క"డని ఘంటాపథంగా చెప్పేసి. వీళ్లను వెలివేసే విధానం యావత్తూ చిత్తుగా నిర్ణయంచేసేశారు వీథిమూల చేరిన యువకులు.

మామ్మ లబ్బున మొత్తుకుని పాతికరూపాయలూ వీరడిచేతిలో పోసింది. ఆయన ఒక్క గిరాటువేసి "మొన్ననయితే సరిపోయేదేమో! ఆ దశ దాటిపోయింది. అదిగో కనిపిస్తోందే! ఆ పోతు నెయ్యాల్సిందే యిప్పుడు. లేకపోతే అమ్మవారికి తృప్తి కలగదు." అని వీథిగుమ్మం దాటాడు. అందుకుకూడా అంగీకరించడానికి మామ్మ కష్టపడలేదు. ఛాయాదేవి నెవరూ లక్ష్యపెట్టక్కర్లేదు. నందుడి ప్రాణం రక్షించాల్సిన గురుతరబాధ్యతను అక్కడ చేరిన ప్రతివ్యక్తీ తన నెత్తి నేసుకుంది. అందుకూ మామ్మేమీ అభ్యంతరపెట్టలేదు. పట్టుపట్టుమని మేకపిల్లదగ్గిరికెళ్ళారు మెళ్లో పసుపుతాడు కట్టటానికి. ఇందాకా వీరడు తన మొహంవేపు చూసినప్పుడే అనుమానపడిన మేకపిల్ల, మృత్యుచ్ఛాయలవలె తనవేపుకు వాళ్లు రావటంచూసి "మె! మ్మే!!" అంటూ ఒక్క గంతేసి నందుడి మంచం ఎక్కింది. వాడు ఉలిక్కిపడి కదిలాడు. అమ్మవారి మహాత్యం అప్పుడే కనిపిస్తోం దన్నారు చుట్టూ చేరినవాళ్లు. దీని తాతల్లాంటి పోతుల్ని యిట్టే తెగేసిన వీరడికి సైతం యీ మేకపిల్లను పట్టుకోటమే కష్టమైపోయింది. నలుగురూ చుట్టూ చేరి బంధించబోయేసరికి అందరిమీదనుంచీ చెంగున ఎగిరి బుద్ధభగవాను లున్న గదిలో దూరింది. నిస్సహాయతను ప్రదర్శిస్తున్న ఆ కళ్లకేసి ఒక్కమాటు చూసి, ఛాయాదేవిఒళ్లో పడింది మేకపిల్ల. "దీనిని కూడా పెంచమను. దీని తల్లి చచ్చిపోయింది కూడాను." అని కాదూ తన భర్త దాసితో అనాడు చెప్పింది? అలాంటి దీన్నిప్పుడు కరకు కత్తిపాలు

చేస్తుందా? నందుడో మరి? ఇద్దరూ పోతారేమో! తనుకూడా బలయిపోతే? ఏమైనా సరే యిందుకు తను ఒప్పుకోరాదు..."

దృఢనిశ్చయంతో ఛాయాదేవి మేకపిల్లమేను నిమురుతూ కన్నీరు కారుస్తుండగా హంతకులు లోపలి కొచ్చారు. ఆమె తీవ్రంగా చూస్తూ "ఇక్కడి నుంచి వెళ్లిపొండి" అని నమ్రతగానే చెప్పింది. "పోతుని ఒదులు..." అంది మామ్మ. "అంతే!" అన్నట్టు పీరడు ఉరిమిచూశాడు. నందుని బతికించి పీతాంబరుడి వంశం నిలపటానికి వాళ్లు కంకణం కట్టుకున్నారు. మామ్మఆసరా చూసుకుని పీరడు ముందుకెళ్లి మేకపిల్లచెవులు పట్టుకున్నాడు. ఛాయాదేవి ఏడ్చింది. ప్రార్థించింది. అంతకిమించి ఏమీ చేయలేదని అందరికీ తెలిసిపోయింది. మేకపిల్లకీ అర్థమయింది తనని బలిస్తే నందుడు బతుకుతాడుట. పోనీ తన కదే పదివేలు. ఆనాడు కుక్కతో యుద్ధంచేసి వాడిని బతికించలేదూ తను? అలాగే యిప్పుడు తనే ఆహుతయి నందుడి ప్రాణాలు కాపాడుతుంది!

మేకపిల్ల యీమాటు ఏమీ ప్రతిఘటించకుండా పీరడిచేతిలో కొచ్చింది. పసుపుతాడు కట్టారు. మామ్మసలహామీద దాన్ని నందుడి మంచంచుట్టూ మూడుమాట్లు తిప్పారుకూడాను. తథాగతు లున్న గదిలో నుంచి ఛాయాదేవి రోదనధ్వనిమాత్రం కొంచెం కొంచెంగా వినిపిస్తోంది. దానికి జవాబుగా మేకపిల్ల "మే! మ్మే!!" అని రెండుమూడుసార్లు అరిచింది మెల్లిగా. నందుడు ఒత్తిగిలాడు. కళ్లు తెరిచి చూశాడుకూడాను. తన ఆత్మబలిదానం సద్యఃఫలితాన్నిస్తున్నందుకు మేకపిల్ల సంతోషాన్ని వెలిబుచ్చుతూ, నందుడి ముంగురులను నాకింది. విజయగర్వంతో కొలుపుసంఘంవాళ్లూ, యితరపెద్దలూ వెళ్లిపోయారు. మనమడికి ప్రాణభిక్ష పెట్టినందుకు మామ్మ అందరికీ కృతజ్ఞత చూపిస్తూ వీడ్కోలిచ్చి లోపలి కొచ్చే సరికి మేకపిల్ల నందుడి మంచ మెక్కి జరిగిన విషయా లన్నీ వాడికి చెబుతున్నట్టుగా మొహంలో మొహం పెట్టి కూర్చునుంది. ఛాయాదేవి కన్నీ రద్దుకుంటూ మంచందగ్గిర నుంచుంది.

౨

తారాగణాల్ని నలిపేసిన జీమూతఖండాలు ఆకాశాన్నంతా ఆక్రమించుకుని చీకట్లు కక్కుతున్నాయి. కాళీకాలయప్రాంగణంలోనుంచి వెలువడుతున్న కాహళభేరీధ్వానాలు ప్రాకారంలోని అజకుక్కుటాదుల ఆర్తనాదాల్ని మింగేస్తున్నాయి. గణాచారుల ముందు వేసిన గుగ్గిలధూమాలు పైశాచికత్వమున్న జాతరజనంలోకూడా శివాలు పుట్టిస్తున్నాయి. కైపుకోసం పదేపదే తెగతాగిన వధకులు ఒళ్లు తెలీని ఆవేశంతో అమ్మవారి ముందు చిందులు తొక్కుతున్నారు. పసరక్తపానాని కలవాటుపడ్డ కరవాలాలు, కాగడాల వెలుతురులో వజ్రశిలపక్కనే తళతళలాడుతున్నాయి. గర్భగుడిచుట్టూ సంతానాదులకోసం ప్రాణాచారాలు పడిన స్త్రీ లింకా లేవలేదు. కపాలమాలా,రుధిరారుణజిహ్వా,జగన్మాతమాతృహృదయాన్ని హత్యచేసి ఘీంకారాలు చేస్తున్నాయి, యింకా శోణితపాతం మొదలెట్టలేదేమని.

జంతుబలినివారణ ప్రచారసంఘంవాళ్లు చేసిన ప్రబోధానికి ఫలంగా కొలుపుసంఘంవాళ్లు పోలీసుల సహాయం అర్థించి, ౧౪౪ సెక్షను ప్రయోగంకూడా చేయించుకున్నారు. శాంతిభద్రతల రక్షణ అనే పేరుతో నిరాటంకంగా జంతుబలి జరిగే ఏర్పాట్లన్నీ అధికారులు చేశారు. "యథాశక్తిగా ప్రచారంచేశాం. కాగితాలు పంచిపెట్టాం. వాదించదలుచుకున్నవాళ్లతో హేతువాదయుక్తంగా వాదించాం. ఇహ మన మేం చేయగలం?" అనే ఆత్మతృప్తితోనూ, అశక్తతతోనూ ప్రచారసంఘంవాళ్లు జండాలూ, కాగితాలూ వగైరా కట్టలు కట్టేసుకుని తమ కార్యాలయంలో విశ్రమిస్తున్నారు–జంతుబలినివారణాప్రచారం చెయ్యటానికి మొన్నాడు ఏగ్రామం వెళదామా అని ఆలోచిస్తూను. కొలుపుసంఘసభ్యుల ఆహ్వానం మీద, వారితోపాటు విందారగించి తప్పతాగిన రక్షకభటులు కాళీకాలయంచుట్టూ కాపలా కాస్తున్నారు, 'పవిత్ర

మైన ఆ బలికార్యాని కడ్డం ఒచ్చే ఏ'పైశాచికశక్తి' లోపలికి రాకుండా...

బలి ప్రారంభమైంది. తెగిన గళరక్తనాళం లోంచి, చివ్వున పైకి లేచే నెత్తురుధారలు చూపరుల ఉత్సాహాన్ని యినుమడింపజేస్తున్నాయి. తల లేకుండానే నాలుగుగజాలదూరం పరిగెత్తి పడిపోతున్న ఎనుబోతులు ప్రేక్షకుల వినోదానికాకర మవుతున్నాయి. ఆ రుధిరకాసారాల్ని చూసి కుమిలిపోతున్న ఆదిశక్తిఆక్రందనాన్ని వినే నాథుడే లేకపోయాడు.

కొలుపుసంఘంపెద్ద ఆరా తీస్తే పీతాంబరుడి మేకపోతు యింకా రాలేదని తేలింది. ఇంత రాద్ధాంతం అయింతర్వాత ఊరుకుంటారా? పైగా మీదుకట్టిన పోతుకూడాను. వాళ్ల నందుడు చావటం అటుండగా, అమ్మవారుతల్లికి కోపం ఒచ్చిందంటే ఊరంతా నాశనం చేస్తుంది. పోతుకోసం నలుగురు మనుష్యుల్ని పంపించారు పీతాంబరుడింటికి. ఎవ రడ్డం ఒచ్చినా, పడదోసి తీసుకురమ్మని నాయకుడు చెప్పేశాడా మనుష్యులికి. ఆనాడే ఆ పోతు అమ్మవారి దైపోయింది. అమ్మవారి దంటే గ్రామాని దన్న మాట. గ్రామక్షేమంకోసం ఏం చేసినా ఫరవాలేదు.

ఆ మనుష్యు లెళ్లేసరికి మేకపిల్ల మెడ కావిలించుకుని నందుడు పడుకునున్నాడు. మేకపిల్ల చిక్కిసగ మైపోయింది. మీదుకట్టిన రోజునుంచీ నందుడు దాన్ని ఒదిలి క్షణంకూడా ఉండటంలేదు. వాడికి ధారకమూ లేదు. మేకపిల్లకూడా గడ్డిపరక కొరికిన పాపాన పోలేదు. నలుగురూ బాగా తాగివున్నారో ఏమో, నందుడిచేతిని బలవంతాన తప్పించి మేకపిల్లను కిందికి లాగేసి తీసికెళ్లారు. వాడు కెవ్వన కేకేసి లేచి పడిపోయాడు. "నాన్నా!" అంటూ భాయాదేవి పిల్లాడిని కావిలించుకుంది. మేకపిల్లను మంచంమీదనుంచి దింపటానికి శక్యం కాకుండా యిందాకటినుంచీ సతమత మవుతున్న మామ్మకి తృప్తి కలిగింది ఇహ నందుడి ప్రాణాలికే భయమూ లేదని......

ఆ మనుష్యు లలా వెళ్లారో లేదో, ఒక గడ్డపాయన సావిట్లో కొచ్చి మామ్మకి నమస్కారం చేసి "నేను పీతాంబరుణ్ణి...అమ్మవారికి జాత రటగా?" అన్నాడు భార్యకేసి చూస్తూను. వాళ్లు తమ చెవుల్ని తామే నమ్మలేకపోయారు. భాయాదేవి సజలనేత్రాలతో భర్తపాదాలమీద వాలింది. తల్లి కౌగిలించుకుంది. మరణశయ్యమీద ఉన్న తన కుమారుణ్ణి చూశాడు. తన కెదురుపడిన మనుష్యులు తీసుకెళుతున్నది ఆ మేకపిల్లే అయివుంటుంది. తనయింటి వేపునుంచే ఒచ్చారు వాళ్లు. అయినా సందేహనివృత్తికోసం "మేకపిల్ల బాగుందా?" అని అడిగాడు. తల్లి యింత మొహం చేసుకుని "బాగానే వుంది నాయనా. అబ్బాయికి ప్రాణంమీది కొస్తేనూ, అమ్మవారు తల్లికి..." అర్ధోక్తిలోనే అంతా అర్థమైంది పీతాంబరుడికి. అగ్నిజ్వాలలమధ్య నుంచున్నట్టనిపించింది. గిరుక్కున పక్కకి తిరిగాడు. గదిలోని గౌతమదేవుల పాలరాతివిగ్రహం మునపటిమాదిరిగానే ప్రశాంతగంభీరతతో విరాజిల్లుతోంది. ఏదో అవ్యక్తసందేశం ఆతథాగతుని వదనమండలంలోంచి ఆవిర్భవించి పీతాంబరుని విద్యున్మయం చేసింది. అతను త్వరితగతిని కాళికాలయం చేరుకున్నాడు. ఏదో అనుపమశక్తి అతన్ని నడిపిస్తోంది.

పీతాంబరు డొచ్చా డనే సంగతి అప్పుడే కొందరికి తెలిసిపోయింది. "చచ్చా డన్నారుగా! చచ్చి బతికాడా? అసలు చావనేలే దేమో! ఒకవేళ ఏ దొంగసన్యాసో నేనే పీతాంబరుడి నని బయలుదేరలేదుకదా!...ఈయనగారి అహింసలూ, సత్యాలూ ఏ మవుతాయో చూద్దాం. ఇంట్లో పోతునేగా యిచ్చింది. అయినా పాపం, అతనేం చేస్తాడులే! ఆడవాళ్లు చేసిన పనయ్యె..." అప్పుడే కొందరి బుర్రల్లో యిన్నిమాటలూ పుట్టాయి. పీతాంబరు డొచ్చా డనీ, గడ్డం పెంచా డనీ దగ్గిరుండి వేటలు వేయిస్తున్న కొలుపుసంఘంపెద్దకికూడా తెలిసింది. సమయానికే ఒచ్చాడు. తనపోతుని బలిచ్చేటప్పుడు స్వయంగా చూసుకోవచ్చు!

పీతాంబరుడు బలివేదికదగ్గిరి కొచ్చేసరికి మేక పిల్లని వెయ్యబోతున్నారు. "బాబూ, జంతుబలి మానండి." అని బిగ్గరిగా అరుస్తూ అమాంతం ఆ మేక పిల్లని కావిలించుకు పడుకున్నాడు. జనంలో కలవరం బయలుదేరింది. వీరడు ఎత్తిన కత్తి దింపటానికి సాహసించలేకపోయాడు. ఈ రాత్రి అమ్మవారు నరబలి కోరిం దేమో! పీతాంబరునిలాంటి సత్పురుషుడు బలికి సర్వవిధాలా యోగ్యుడే. వీరడి చేతులు వణుకుతున్నాయి. తల తిరిగిపోతోంది. తటపటాయిస్తూ కొలుపుసంఘంపెద్దకేసి చూశాడు. "ఊఁ, కానియ్యి" అని అతను సైగచేశాడో లేదో, కంపిస్తున్న హస్తాలతోనే వీరడు వేటు వేశాడు. నరరక్తం చూసేసరికి వీరడి కళ్లు బైర్లుకమ్మాయి. కల్లుమత్తు దిగింది. కంగారుగా బైటికి పరిగెత్తాడు. "హత్య! హత్య!!" అంటూ హాహాకారాలు పుట్టాయి. ఇంతలోకే రక్షకభటులు పరిగెత్తుకొచ్చి స్మృతితప్పి పడివున్న పీతాంబరునిని లేవదీశారు. గుబురుగా పెరిగిన అతని జుట్టు అతన్ని రక్షించింది. వీరడు వణుకుతున్న చేతులలో వేసిన వేటు గురి తప్పింది. అతని జుట్టుముడిసహా శిరస్సుమీద పెచ్చును లేవదీసుకుంటూ ముందుకు నడచిన ఖడ్గం అతని ఎడమచేతిని పాంతం ఖండించి నేల తాకింది...జాతర అసంపూర్తిగానే పూర్తయింది.

వీరణ్ని అరెస్టుచేశారు. సంఘంపెద్ద లంచాలిచ్చి తప్పించుకున్నాడు. మేకపిల్లతో కూడా నందుడు సైతం క్రమంగా కోలుకున్నాడు. గాయాలు నయమైన తరవాతి పీతాంబరుడికి తెలిసింది వీరడిమీద హత్యాయత్న నేరం మోపబడిం దని. అధికారుల్ని వేడుకున్నాడు అతనిమీద కేసు ఎత్తివేయవలసిం దని. వీలు కాదన్నారు వాళ్లు. కాస్తా కూస్తా నేరమూ, ఎత్తి వెయ్యటానికి? అదీ గాక, నేరం ఋజువయితే వాళ్లకి ఘనతకూడాను.

చేసే దేం లేక, ఆఖరికి తనే వీరడి తరఫున న్యాయవాదిగా కోర్టులో వాదించటానికి పూనుకున్నాడు. ఇలాంటి కేసెక్కడా కనిపించలేదు జడ్జిగారికి కూడా. ప్రభుత్వన్యాయవాదిపని మరీ యిరకాటాన పడింది. ఆఖరికి కేసు కొట్టేశారు.

3

అజ్ఞానం మూఢనమ్మకాలికి మంచి ఎరువు. అజ్ఞానం విచ్ఛిన్నం కాగానే మూఢనమ్మకాలు లేచిపోయినా, నమ్మకాల్ని పాలుపోసి పెంచే అలవాటు పడిన ఆ మనుష్యుల హృదయాలు సహేతుకవిశ్వాసాలకు సర్వసమర్పణ చేస్తేనేగాని మనలేవు...వీరడు పీతాంబరునికి దాసోహ మన్నాడు. వేలకొద్దీ మూగజీవాల పచ్చినెత్తురును అవలీలగా పారిస్తూ వచ్చిన వీర డిప్పుడు అహింసావాది అవటమూ, పీతాంబరుని వెంట ఊరూరూ తిరిగి జీవకారుణ్యప్రచారం చేయడమూ చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. కాని ఏ శాకాహారికీ లేనంత విశ్వాసం అతని కిప్పుడు అహింసావిధానంలో కలిగిం దనటాని కేమీ సందేహం లేదు. ఒక చెవ్వూ, ఒక కొమ్మూ తెగిన మేకపిల్లా, ఆ మేకపిల్లనే బలిచేయ సిద్ధపడిన వీరడూ, తననే హత్యచేయ సిద్ధపడిన ఆ వీరడినే రక్షించిన పీతాంబరుడూ జీవకారుణ్యప్రచారానికి మూర్తీభవించిన ఉత్తమోపదేశాలయ్యారు.

అద్వైతధార

శ్రీ నిర్వికల్పానందస్వామి

✻
శ్రీ కృష్ణ మి శ్ర య తి

ఈయన పదకొండవ శతాబ్దపువా డని చారిత్రకుల నిర్ణయము. భాష్యాదులకంటె కావ్యనాటకములయెడ సాధారణజనులు ప్రీతిని జూపుదు రను నైజమును గ్రహించి, అద్వైతతత్త్వమును నాటకరూపమున ప్రకాశింపజేసిన సూక్ష్మబుద్ధి ఈ శ్రీకృష్ణమిశ్రుడు. శ్రీహర్ష వేంకటనాథ రూపగోస్వామ్యాదులుకూడ ఈ మార్గముచే కొంతవఱకు అవలంబించి యుండిరి. పాశ్చాత్యులలో గెయిటే పేరు తలపునకు దగులును.

ఈయన రచించిన నాటకముపేరు ప్రబోధచంద్రోదయము. కందుకూరి వీరేశలింగం, అక్కొండి వ్యాసమూర్తిశాస్త్రి, వడ్డాది సుబ్బారాయుడు (?) గార్లు దీనిని తెలిగించినారు. తిమ్మరుసుబంధువగు నందిళ్ల గోపమంత్రి 'చంద్రిక' యను టీకను, రామదాసదీక్షితులు 'ప్రకాశ' మను టీకను సంస్కృతములో దీనికి గూర్చియుండిరి.

వేంకటనాథుడు రచించిన 'సంకల్పసూర్యోదయము'నకును, కవికర్ణపూరుడు నిర్మించిన 'చైతన్యచంద్రోదయము'నకును ఉత్సాహదాత ఈ రచనయే. ఈ నాటకములు రెండును విశిష్టాద్వైత, అచింత్యభేదాభేదపరములు.

* ఈ శీర్షికతో లోగడ భారతిలో శ్రీ పద్మపాద, సురేశ్వర, వాచస్పతి, సర్వజ్ఞాత్ముల జీవితములును, సిద్ధాంతములును నాలుగు వ్యాసములుగా వెలువడి యున్నవి. మిగిలినవారినిగురించి క్రమముగ వివరింపబడును.

శ్రీకృష్ణమిశ్రుని జీవితవిశేషములు ఏమియును తెలియవచ్చుట లేదు. కొందరు ఆయన ఈ నాటకమును వ్రాసి, సన్న్యసించె ననియు, కొందరు తచ్ఛిష్యు డొకడు శృంగారగ్రంథాసక్తుడై యుండ వాని మనస్సును మళ్లించుట కీరచనను గూర్చె ననియు జెప్పుచున్నారు.

కథాసంగ్రహము :

ఈ నాటకమునందు రాగద్వేషాదులను మనోవృత్తులకు మానవరూపము కల్పింపబడినది. ధర్మ, జ్ఞాన, అజ్ఞాన, సంకల్పాదులు పురుషపాత్రలుగనో, లేక స్త్రీపాత్రలుగనో రంగమున ప్రవేశించును. నాటకము ప్రదర్శింపబడుచుండ చూచువారికి తమ మనస్సే ఇన్ని రూపములను ధరించి ఏకపాత్రాభినయ మొనర్చుచున్నదా యని అనిపించును.

అజ్ఞానము కాశీరాజ్యమును పాలించుచుండును. పాప, సంశయ, మూర్ఖత్వాదు లీ రాజునకు సహచరులు. వీ రందరును గలసి జ్ఞాన-రాజును వెడలగొట్టిరి. పాపము వృద్ధినందెను. కాని వైదికమగు అపౌరుషేయజ్ఞానముతో జ్ఞాన-రాజు కలియగా వాస్తవజ్ఞాన ముదయమై అజ్ఞానము తొలగెను. ఔపనిషదాత్మజ్ఞానసామ్రాజ్యప్రతిష్ఠనిమిత్తము అజ్ఞానముతో యుద్ధము జరిగెను. జ్ఞానము శాంత్యాదుల సాయముతో జయించెను. ప్రబోధచంద్రచంద్రికలతో జగత్తు ఉద్భాసిత మయ్యెను.

నాటకమున లలితమధురమగు శైలిలో సంగ్రహముగ భారతీయమతసిద్ధాంతము లన్నియును శ్లోకరూపమున ఆయా పాత్రలచే పలికింపబడినవి. మాక్డొనాల్డుదొర ఈ నాటకమునుగురించి "భారతీయవాఙ్మ

యమున సృష్టింపబడిన అద్భుతరచనలలో నిది యొక్కటిగ పరిగణింపదగిన దనియు, జీవముతోడను, శక్తితోడను నిండి ఈ నాటకము తొణుకాడుచున్న దనియు" అభిప్రాయ మొసగెను.

శైలికి ఒకటి రెండు శ్లోకములు:

"నిత్యం స్మరన్ జలదనీలతనుం హరింవా,
శార్దూలచర్మశశిఖండధరం హరంవా,
గ్రీష్మే సుశీతలమివ హ్రద మస్తశోకం
బ్రహ్మ ప్రవిశ్య భజ నిర్వృతి మాత్మలీనాం."

"సంసారాపార సింధుప్లవకుశలమహో
కర్ణధారో మురారే
భక్తిర్ముక్తేః పరా సా ప్రసరతు జననీ
సార్వకాలం జనస్య."

౬

ప్ర కా శా త్మ య తి

ఈయన పద్మపాదుని 'పంచపాదిక'కు 'వివరణ'మను టీకను గూర్చెను. వివరణకారు డను పేరుతోనే వేదాంతపాఠకులకు ఈయన పరిచితుడు. ఈయన శ్రీమదనన్యానుభవయతీంద్రుని శిష్యు డను అంశము తప్ప, దేశకాలములకు సంబంధించిన విషయము లేవియును దెలియవచ్చుట లేదు. కాని ఇతరాధారములనుబట్టి, ౧౧ వ శతాబ్దముననో, లేక ౧౨ వ శతాబ్దముననో ప్రకాశాత్ముడు విలసిల్లె నని చెప్పవచ్చును.

వి వ ర ణ ము:

ఈ వివరణ మనబడు వ్యాఖ్యాగ్రంథము మూలమగు పంచపాదికవలెనే తొమ్మిది వర్ణకము (ప్రకరణము) లతో ముగిసినది. పంచపాదిక వేదాంతచతుస్సూత్రికకు శంకరులు గూర్చిన భాష్యమునకు వ్యాఖ్య.

వివరణమునకు మరల అఖండానుభూతిశిష్యుడగు అఖండానందముని రచించిన 'తత్త్వదీపన'మను టీకయును, జగన్నాథాశ్రముని శిష్యుడగు నృసింహాశ్రమి నిబంధించిన 'భావప్రకాశిక' యను టీకయును, అమలానందుని టీకయును, రత్నప్రభాకారుడగు రామానందసరస్వతికృతమగు 'వివరణోపన్యాస'మను టీకయును గలవు.

కాని భారతీతీర్థ (విద్యారణ్య ? ?) కృతమగు 'వివరణప్రమేయసంగ్రహము' అను సంగ్రహగ్రంథమునకు గల ప్రసిద్ధి పై టీకలలో దేనికిని లేదు.

వివరణమూలగ్రంథమును 'విజయనగరసంస్కృత సీరీజ్, కాశీ' వారు ప్రకటించియున్నారు. వివరణప్రమేయసంగ్రహమును మూలానువాదములతో ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారు వెలువరించియుండుట గమనార్హము; మూలము నాగరిలిపిలోను, అనువాదము ఆంగ్లమునను కలవు.

ఇక వివరణకారుని అభిప్రాయములను ముఖ్యము లగువానిని సంగ్రహముగ పరికింతము.

శ్ర వ ణ వి ధి:

'ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః—ఆత్మను శ్రవణమనననిదిధ్యాసనముల వలన ప్రత్యక్ష మొనర్చుకొననగును.' (బృ. ఉ. ౨-౪-౫) అని శ్రవణాదిపరముగ గోచరించు వాక్యము నియమవిధియే; అపూర్వవిధి కాదు.

శ్రవణాదుల ఫలము ప్రతిబంధనివృత్తి. అభ్యుదయనిశ్శ్రేయసములు వేదార్థానుష్ఠానముననే సంభవనీయములు. అర్థజ్ఞానము స్వాధ్యాయప్రసూతము. అధ్యయనము ఉచ్చారణానుచ్చారణాలక్షణము. నియమవిధి విహితము.

అధ్యయనమునకు వలెనే ఉపర్యుక్తశ్రవణము కూడ నియమవిధిసాపేక్షము. బ్రహ్మసాక్షాత్కారము సత్తానిశ్చయమాత్రము. స్వప్రయత్నముననే వేదాంతవిచారము సంభవ మనుమాట నిక్కమే. కాని గురుముఖమున విననిచో ప్రతిబంధకములు తొలగ జేరవు.

వివరణానుయాయులగు కొందరు శ్రవణఫలముగ శబ్దము నిర్విచికిత్సమగు పరోక్షజ్ఞానమును కలిగింప, ధ్యానఫలముగ అపరోక్షజ్ఞానము లభించు ననుచున్నారు.

సంక్షేపశారీరక కారుడగు సర్వజ్ఞాత్మముని శ్రవణ ఫలములగు ఈ పరోక్షాపరోక్ష జ్ఞానములను అంగీకరింపక తాత్పర్యానుసంధానప్రవృత్తియును, అంతరాయ దూరీకరణమును, బ్రహ్మజ్ఞానాభిముఖీవచిత్తవృత్తియును గలుగు ననెను. కాని ఇది నియమవిధియే.

భామతీకారుడగు వాచస్పతి శ్రవణవిషయమున విధిసంస్పర్శ నంగీకరింపలేదు.

ఉపాదానకారణము :

వివరణాచార్యుని మతము : సర్వజ్ఞత్వాదివిశిష్టుడును, మాయాసంవలితుడును, ఈశ్వరశబ్దవాచ్యుడును నగు బ్రహ్మమే జగదుపాదానము. 'యః సర్వజ్ఞః సర్వవిత్ యస్య జ్ఞానమయం తపః - తస్మా దేతత్ బ్రహ్మ నామ రూప మన్నంచ జాయతే' అను శ్రుతి ఇందులకు ఉదాహర్తవ్యము. భాష్యకారుడుగూడ 'అంతస్తద్ధర్మోపదేశాత్', 'ప్రసిద్ధోపదేశాత్' మున్నగు సూత్రవ్యాఖ్యాసమయమున ఈ విషయమును అంగీకరించినాడు.

సర్వజ్ఞాత్మముని శుద్ధబ్రహ్మమునే కారణ మని చెప్పియుండెను. వాచస్పతి మాయను సహకారికారణముగ వరించెను.

బింబ ప్రతిబింబ వాదము :

ప్రకాశాత్ముడు జీవుని ప్రతిబింబముగను, ఈశ్వరుని బింబముగను అంగీకరించెను. "విభేదజనకేఽజ్ఞానే నాశ మాత్యంతికం గతే" అను స్మృతి ఈ సిద్ధాంతమునే బలపరచుచున్నది. ఉభయులును ప్రతిబింబములే యైన ఉపాధిద్వయము నంగీకరింపవలెను. ఇట్లు అంగీకరించుట అనావశ్యకము. జీవేశ్వరుల బింబప్రతిబింబ భావము నంగీకరించిన లౌకికదృష్టాంతములో సరిపుచ్చుకొనవచ్చును. ఈశ్వరస్వాతంత్ర్యమును, జీవపారవశ్యమును సిద్ధించును.

తత్త్వజ్ఞానాశ్రయత్వము బింబత్వకృతము కాదు. భ్రాంతునియందే తత్త్వజ్ఞానాశ్రయత్వము నిశ్చితము. భ్రాంతి అజ్ఞతవలనను, అజ్ఞత జీవత్వమువలనను ఏర్పడినవి. బింబభూతుడగు ఈశ్వరునియం దివి లేవు. "న బింబత్వకృతం తత్త్వజ్ఞానాశ్రయత్వం; కింతు భ్రాంతిత్వకృతం; తద ప్యజ్ఞత్వకృతం, తదపి జీవత్వనిమిత్తమ్— ఇతి భావః"

జీవుడు ప్రతిబింబ మని యంగీకరించినాము; సరియే, కాని ఈ జీవుడు స్వ-బ్రహ్మాత్మభావము నెరుగునా ? ఎరుగకుండిన సర్వజ్ఞతాహాని. ఎరిగిన బ్రహ్మమునకే సంసారదర్శనము. దానికే మందురు ? అనిన ప్రకాశాత్ముని ప్రత్యుత్తరము : "దేవదత్తో హి స్వాత్మాన మషీపాత్రేఽల్పత్వాదిగుణ మవగచ్ఛన్నపి తత్త్వజ్ఞానప్రతిహతత్వా న్నానుశోచతి. ఏవం బ్రహ్మాపి స్వాత్మని జీవే ప్రతిబింబే సంసారం పశ్యదపి తత్త్వజ్ఞానిత్వాన్నానుశోచతి.—దేవదత్తుడు భగ్నదర్పణమున స్వచ్ఛాయను అల్పత్వాదిగుణయుక్తముగ చూచినను తత్త్వజ్ఞానఫలితముగ శోకింపని రీతిగ, బ్రహ్మము తనయందు జీవరూపప్రతిబింబమున సంసారదర్శన మొనర్చుచున్నను యథార్థము తెలియునుగనుక శోకాదిసంసారధర్మాక్రాంతము కాదు.

జీవు డీశ్వరప్రతిబింబ మని ఎట్లు తెలియనగు ననిన: 'రూపం రూపం ప్రతిరూపో బభూవ' అను శ్రుతియును, 'ఏకధా బహుధాచైవ దృశ్యతే జలచంద్రవత్' అను స్మృతియును, 'అతఏవ చోపమా సూర్యకాదివత్' అను సూత్రమును ఈ విషయమును దెలియజెప్పుచున్న వని సమాధానము.

పూర్వపక్షము: బ్రహ్మము అమూర్తవస్తువు కదా! ప్రతిబింబ మెట్లు పొసగును ? సమాధానము : "అమూర్తస్య చాకాశస్య సాభ్రనక్షత్రస్య జలే ప్రతిబింబవద్, అమూర్తస్య బ్రహ్మణోఽపి ప్రతిబింబసంభవాత్, జానుమాత్రప్రమాణేఽపి జలే దూరవిశాలాకాశదర్శనాత్, జలాంతరాకాశే ఏవాభ్రాదిబింబయుక్తో దృశ్యత ఇతి వక్తు మశక్యత్వాత్, తత్ప్రతిబింబత్వం చిద్రూపత్వంచ శాస్త్రప్రతిపన్నం ప్రత్యక్షప్రతిపన్నంచ న నిరాకర్తుం శక్యతే.—అమూర్తనక్షత్రఖచితాకాశము జలమున ప్రతిబింబించునట్లు బ్రహ్మముకూడ. బ్రహ్మముయొక్క చిద్రూపత్వప్రతిబింబత్వములు శాస్త్రమువలనను, లౌకికదృష్టాంతమువల

ననుగూడ సమర్థింపబడుచున్నవి. నిరాకరింప వీలు కాదు*.

సర్వజ్ఞాత్మమునికూడ ప్రతిబింబవాదియే; అవిద్యాచిత్ప్రతిబింబ మీశ్వరుడు; అంతఃకరణచిత్ప్రతిబింబము జీవుడు; కాని వాచస్పతిమతమున జీవేశ్వరులిర్వురును ప్రతిబింబములే.

అవచ్ఛిన్నవాద ఖండన :

అవచ్ఛిన్నవాదు లి ట్లందురు: అనుపహితమైన రూపమునకు ప్రతిబింబ ముండదు. అరూపవస్తువు విషయమునగూడ నిదియే మాట. ఆకాశప్రతిబింబోదాహరణ మయుక్తికము. ఆకాశవ్యాప్తసూర్యకిరణ మండలము జలమున ప్రతిబింబితము కాగా, భ్రమవలన ఆకాశప్రతిబింబముగ పరిగ్రహింపబడుచున్నది. ధ్వనియందు వర్ణప్రతిబింబదృష్టాంతముకూడ యుక్తియుక్తము కాజాలదు. ఇందులకు ప్రమాణము శూన్యము. ప్రతిధ్వనిని పూర్వధ్వనిప్రతిబింబ మన జెల్లదు. వర్ణరూపప్రతిశబ్దవిషయమునగూడ నింతే. ఘటాకాశదృష్టాంతమే పోషకము. అంతఃకరణావచ్ఛిన్నచైతన్యము జీవుడు; అనవచ్ఛిన్నము ఈశ్వరచైతన్యము. ఈ పక్షము నంగీకరించిన: అంతరాంతరవర్తియగు చైతన్యము తత్తదంతఃకరణరూపోపాధిబలమున జీవభావమున అవచ్ఛేదమున, అవచ్ఛేదరహితుడగు ఈశ్వరునకు బహిరంతరసత్త సిద్ధించును. 'యో విజ్ఞానే తిష్ఠన్' ఇత్యాదులగు శ్రుతులతో నేకవాక్యత ఒడగూరును. ఈశ్వరుడు వికారాంతరావస్థితుడు కాకుండును. జలచంద్రదృష్టాంతము నంగీకరించి, ప్రతిబింబవాదమును సమర్థింపజూచిన: ఆకాశప్రతిబింబాకాశము లను వృత్తిద్వయమును గ్రహింపవలసియుండును. ఈ యవసర మేమి ? కృత్స్నప్రతిబింబసిద్ధియే లేదు. మరియును ప్రతిబింబించునది మేఘావచ్ఛిన్నాకాశమో, లేక ఆలోకమో. జలాంతర్గతాకాశమున కక్కడ ప్రతిబింబమును జూపగలవా ? ముఖాదులు బహిరావరణమున నున్నప్పుడే ప్రతిబింబము గోచరించును. జలనిమజ్జితుని ప్రతిబింబము చూపట్టునా ? కనుక సర్వగతచైతన్యముయొక్క అంతఃకరణాద్యవచ్ఛేదకత్వమే అంగీకార్యము. అవచ్ఛిన్నవాదమే యుక్తియుక్తము.

వివరణకారుని ప్రత్యుక్తి : అవచ్ఛిన్నవాదము తర్కాసహము. సామాన్య విశేషోపాధియోగమున అంతొంతవర్తియగు బ్రహ్మము సర్వాత్మరూపమున జీవభావమున అవచ్ఛిన్నముగుటవలన, అనవచ్ఛిన్నబ్రహ్మమునకు బహిరంతరసద్భావము అవశ్యంభావి. అనవచ్ఛిన్నబ్రహ్మము అవచ్ఛిన్నప్రదేశమున ద్విగుణీకృతవృత్తియోగమున సర్వగతత్వసర్వనియంతృత్వములు అసంభవము లగును. ఇదంతయును స్వరూపాపేక్షికము, బహిఃస్థితి నపేక్షింపదు, అందువా ?—'యో విజ్ఞానే తిష్ఠన్' ఇత్యాదిశ్రుతులు జీవాతిరిక్తముగ బ్రహ్మము జీవసాన్నిధ్యమున నిర్వికారావస్థితిని దెలియజెప్పుచున్నవి. 'ప్రతిబింబపక్షేతు జలగతస్వాభావికాకాశే సత్యేవ ప్రతిబింబాకాశదర్శనా దేకత్రైవ ద్విగుణీకృత్య వృత్త్యుపపత్తే ర్జీవావచ్ఛేదేషు బ్రహ్మణోఽపి నియంతృత్వాదిరూపేణ అవస్థాన ముపపద్యత ఇతి ప్రతిబింబపక్ష ఏవ శ్రేయా నితి—ప్రతిబింబపక్షమున : జలగతస్వాభావికాకాశ ముండినను, ప్రతిబింబాకాశము గోచరించునకదా! పూర్వపక్షి దోషముగ పరిగణించిన ద్విగుణీకృతవృత్తిబలముననే జీవరూప అవచ్ఛేదమున బ్రహ్మము నియంతరూపమున వెలయుట ఏర్పడుచున్నదే. కనుక ప్రతిబింబపక్షమే శ్రేయము.'

జీవ బ్రహ్మ విభాగము :

ఈ విభాగము అవిద్యాతంత్రము. కాని అవిద్య ఉపాధి కాదని గుర్తుంచుకొననగును. ఆత్మకే యవిద్యా సంబంధము అనాది. ఈ అవిద్య వాస్తవముకాదు. కల్పనాప్రసూతము. భేదాశ్రయము. స్వరూపము లేనిది. అవిద్య ఒక్కటియే. అహంకారాదులయందు ప్రతిబింబించి బహుత్వమును ధరించుచున్నది.

మిథ్యాత్వ లక్షణము :

పంచపాదికాకారుడగు పద్మపాదుడు ఒసగిన మిథ్యాత్వనిరుక్తి : 'సదసద్విలక్షణత్వమ్.' అనగా

---

* లౌకికదృష్టాంతము నొసగుట అద్వైతాచార్యుల వైశిష్ట్యము. లౌకిక మని ఏ విషయమును వారు ప్రమాణమును జూపక విడచినది లేదు.

ఉన్నదనిగాని, లేదనిగాని చెప్ప వీలుపడనిది. అనిర్వచనీయ మని భావము. ఇట్టిది మిథ్యయే. ప్రతీతికాలమున కల దని తోచినను, జ్ఞానోదయకాలమున నిరస్తమగును. మిథ్యయన శూన్యత కాదు, సదసద్విలక్షణత.

వివరణకారుడు మరిరెండు లక్షణములను నిర్వచించినాడు. ఒకటి: 'జ్ఞాననివర్త్యత్వం మిథ్యాత్వమ్' అనగా: జ్ఞానోదయమున బాధింపబడునది. సత్యము అబాధితము. సత్యము ఏకాలమునను, ఎట్టి స్థితి యందునను బాధింపబడదు. రెండవది: 'ప్రతిపన్నోపాధౌ త్రైకాలికనిషేధప్రతియోగిత్వం మిథ్యాత్వమ్' అనగా: త్రైకాలికనిషేధమునకు ప్రతియోగి (*Seat*) యగునది మిథ్య. మిథ్య అలీకము కాదు. పరమార్థదృష్టికి ఉపాధ్యారోపితము. ఆధారము లేక అధిష్ఠాన మగునది సత్తు. అధిష్ఠానముననే ఉపాధి ఆరోపితము. అధిష్ఠానమున మిథ్యావస్తు వేకాలముననను నుండబోదు. రజ్జువున సర్పము భూతభవిష్యద్వర్తమానకాలములలో ఏకాలముననను లేదు. కాని భ్రాంతదృష్టికి ప్రతీతికాలమున గోచరించుచున్నది. కనుక త్రైకాలికనిషేధప్రతియోగిత్వమే మిథ్యయని తేలుచున్నది.

ప్రతిబింబమిథ్యాత్వవాదఖండన :

పూర్వపక్షు లి ట్లందురు: జీవుడు స్వరూపతః బ్రహ్మముకంటె భిన్నుడు. జీవుడు బ్రహ్మప్రతిబింబ మగుటయే కారణము. ముఖప్రతిబింబము ముఖముకంటె వేరైనట్లు. కనుక పృథగస్తిత్వముగల జీవుడు మిథ్య.

ప్రకాశాత్ముని మతమున ప్రతిబింబము మిథ్య కాదు. కారణము: బింబప్రతిబింబముల అభిన్నత. పూర్వపక్షుల యుక్తి నిస్సారము.

విద్యారణ్యాదులు ప్రతిబింబసత్యత్వము నంగీకరింపలేదు. వారి యుక్తి: ప్రతిబింబము బింబముకంటె భిన్నమగుటవలన మిథ్య. ఇది రజతము కాదనిన పట్ల ప్రతిభాత మైనది మిథ్యారజతమే కదా! రజతత్వము త్రైకాలికబాధితము. ఇటులనే దర్పణప్రతిబింబితముఖవిషయమునగూడ తెలియవగును. కనుక ప్రతిబింబమిథ్యాత్వమే యుక్తియుక్తము.

జీవభావము పరమార్థదృష్టికి మిథ్య.

ఈ పక్షములను రెంటిని ప్రదర్శించిన మహామహు లిరువురును పండితవ్యక్తులే. ఏది సమంజస మను విషయమును నావంటి అల్పజ్ఞుడు నిర్ణయింపజాలని పని. పెద్దల చిత్తమునకే దీనిని వదలివేయుచున్నాను.

కర్మ: సన్న్యాసము :

బ్రహ్మవిద్యకు యజ్ఞాదుల వినియోగము కల దని ప్రకాశాత్ముని సిద్ధాంతము. ఇట్లంగీకరించిన జ్ఞానోదయపర్యంతము కర్మకర్తృత్వము స్వీకరింపవలెనే యన్న: విత్తులను వెదజల్లువరకు భూమిని దున్నుట అవసర మైనట్లు, చిత్తశుద్ధి లభించునంతవరకు కర్మముల అగత్యము కలదు. తరువాత సన్న్యాసము. ఇది శ్రుతిస్మృతిచోదితమతమునకు వ్యతిరిక్తము కాదు. ప్రోద్బలకము: 'ప్రత్యక్ప్రవణతాం బుద్ధేః కర్మాణ్యుత్పాద్య శుద్ధితః, కృతార్థాన్యస్తమాయాంతి ప్రావృడంతే ఘనా ఇవ.' (నై. సి.)

భేదాభేదవాదఖండన :

'జీవుడు బ్రహ్మముకంటె భిన్నుడును, అభిన్నుడును గూడ' అని భేదాభేదవాదు లందురు.

వివరణకారుడు ఈ సిద్ధాంతము నంగీకరింపలేదు. భేదాభేదములు పరస్పరవిరుద్ధములు. ఒకే తావున మనజాలవు. అభేదదర్శికి భేదదర్శన ముండదు. జీవబ్రహ్మములకు జాతివ్యక్తి సంబంధము కాని గుణగుణిసంబంధము కాని, కార్యకారణసంబంధము కాని, అంశాంశిసంబంధము కాని కలుగనేరవు. 'మమైవాంశో' అను స్మృతికంటె 'నిష్కలం నిష్క్రియం' అను శ్రుతి బలవత్తరము. 'పాదోఽస్య సర్వా భూతాని' అను శ్రుతియభిప్రాయము అనంత్యత్వమును దెల్పుటయే కాని, అంశాంశిభావమును ప్రతిపాదించుట కాదు.

ప్రకాశాత్ముని వివరణగ్రంథము చాల పెద్దది. దిఙ్మాత్రముగ అందలి విశేషములను సూచించితిని.

౮

అద్వైతానంద బోధేంద్రుడు

ఈయన కావేరినదీతీరమునందలి పంచనదము (తిరువయ్యారు ?) న ప్రేమనాథపార్వతీదేవు లకు జన్మించెను. కౌండిన్యగోత్రము. పూర్వాశ్రమ నామధేయము సీతాపతి. ఈయన తన పదునేడవయేట నే సన్న్యసించెను. కాంచీమఠాధీశ్వరుడును, భూమానందు డను నామాంతరము గలవాడును నగు శ్రీ చంద్రశేఖ రేంద్రసరస్వతి ఈయనకు సన్న్యసగురువు. గురువు శిష్యునకు మఠభారము నొసగి కాశీక్షేత్రమునకు నిర్గ మించెను. రామానందసరస్వతి ఈయనకు శాస్త్రవిద్యా గురువు.

ఈయన పండ్రెండవ శతాబ్దపు వాడు కావ చ్చును. చిద్విలాస, ఆనందబోధాచార్య నామములు కూడ ఈయనకు గలవు. ఖండనఖండఖాద్యకారుడగు శ్రీహర్షుని, అభినవగుప్తాచార్యునిగూడ ఈయన వాదమున నోడించెనని సదాశివేంద్రుని గురురత్నమాలా గ్రంథము తెల్పుచున్నది. క్రీ. శ. ౧౧౬౬ నుండి ౧౨౦౦ వరకు ఈయనపీఠాధిపత్యకాలము.

ఈయన పాండిత్యము అసాధారణమైనది అను అంశము శ్రీహర్షకృతమగు 'స్థైర్యవిచారము'న నే తెల్ప బడియున్నది. కాని అందు వాదవివాదప్రసక్తి లేదు. ఉభయులును అద్వైతులే యైనప్పుడు ఖండనమండనము లేల? శ్రీహర్షుని పాండిత్యముకూడ అశ్రుతపూర్వమే. అట్టివానిచే సమ్మానింపబడిన ఆనందబోధేంద్రు డను విశేషణము అనంతరకాలమున 'అట్టివాని నోడించిన'గ మారియుండవచ్చును. అభినవగుప్తు నోడించిన విష యము ఎంతమటుకు యథార్థమో చెప్పజాలము.

గ్రంథములు :

బ్రహ్మవిద్యాభరణము, శాంతివివరణము, గురు ప్రదీపము అనునవి ఈ యాచార్యుని గ్రంథములు. చివరి రెండును ముద్రితము లైనట్లు తోచదు.

ఇక 'బ్రహ్మవిద్యాభరణము' అనునది శాంకర భాష్యమునకు వృత్తి. 'భామతి'ని గ్రహింపగోరు వారికి తోడ్పడును. కుంభకోణం అద్వైతమంజరీ గ్రంథావళిలో ఇది వెలువడియున్నది.

"ఆనందబోధార్యకృతాః ప్రబంధాః
పారప్రకాశం న గతా బుధానామ్,
యద్బ్రహ్మవిద్యాభరణామృతాబ్ధా
మగ్నా న పశ్యంతి పరం ప్రబంధమ్."

అను శ్లోక మీగ్రంథప్రసిద్ధినే తెల్పుచున్నది. సాయనభాష్యాదియందు చూపట్టు వాగీశాదిశ్లోకము ఈ గ్రంథప్రారంభమున కలదు. తరువాతివాడగు సాయను డీ శ్లోకము నిటనుండి గ్రహించియుండ నోపును.

యోగవాసిష్ఠమునకు ఆనందబోధేంద్రసరస్వతి యను వ్యక్తిపేరిట ఒక టీక కలదు. ఈ ఇరువురును ఒక్కరాయను సంగతి నిదమిత్థముగ చెప్పజాలము.

గ్రంథస్థ విషయములు—

సమన్వయ సూత్రము :

అద్వైతానందుడు భామతీకారునే యనుసరించి తన వృత్తిని గూర్చెను. వివరణప్రమేయసంగ్రహ కారుడు 'తత్తు సమన్వయాత్' అను సూత్రమునందలి సమన్వయశబ్దమునకు . అన్వయసమ్యక్త్వ మనగా, ఇతరపైలక్షణ్యార్థప్రతిపాదకత్వమే సమన్వయత్వ మని అర్థమును జెప్పెను. 'గా మానయ' అనుపట్ల క్రియా కారకసంసర్గప్రతిపాదనమున నియోగాగారము ఆకాంక్షిత మగుచున్నది. అట్లే 'ఉద్భిదా యజేత' అనుపట్ల ఉద్భిన్ శబ్దమునకును, యాగశబ్దమునకును ఏకా ర్థతయే యుండినను నియోగము ఆకాంక్షితము. 'నీల ముత్పలమ్' అనుపట్ల గుణగుణిభేదాభేదసంబంధము కలదు. ఏకార్థశబ్దముల లింగసంఖ్యాదులు సామాన్య ముగ వర్జనీయములు. కాని వేదాంతవాక్యములు సంసర్గాదిప్రతిపాదనాపరములు కావు. అభిధావృత్తి నాశ్రయించియో, లేక లక్షణవలననో అఖండైకరస మగు బ్రహ్మమును జగత్కారణముగ సామాన్యాను

వాదప్రతిపాదన మెంనర్చును. కనుక ఇతరవిలక్షణార్థత్వ ప్రతిపాదకత్వమే సమన్వయత్వము.

అద్వైతానందుని అర్థము వేరుగ నున్నది. తత్ప్రతీత్యుద్దేశకత్వమే సమ్యక్త్వము. ఉపక్రమాది షడ్విధలింగబలమున వేదాంతవాక్యము లన్నియును అద్వితీయమగు పరమాత్మయందు పర్యవసించు చున్నవి.

సవిశేష బ్రహ్మవాద ఖండన :

'సదేవ సౌమ్యేద మగ్ర ఆసీద్' అను శ్రుతిబలమున సవిశేషబ్రహ్మమును ఉపస్థాపింపగోరువారికి ఈయన చక్కటి సమాధానము నొసగియున్నాడు. 'వాచారంభణ' శ్రుతివలన నిర్గుణ-బ్రహ్మమే సిద్ధించును. గౌడపాదులుకూడ—

"మృల్లోహవిస్ఫులింగాద్యైః
సృష్టిర్యా చోదితాన్యథా,
ఉపాయః సోఽవతారాయ
నాస్తి భేదః కథంచన."

అను కారికయందు నిర్విశేషవస్తువునే అంగీకరించియుండెను.

ఈ రీతిగ అపూర్వపాండిత్యప్రకర్షతో స్వమతస్థాపనను చక్కగ ఈయాచార్యు డొనర్చినాడు.



అయోమార్గము

'జమదగ్ని'

మండువేసగియెండ చంద్రనిప్పులు చెరిగ
బడలి పుడమియు వడకి మూర్ఛపడి యొరిగె;
కనులు బైరులు క్రమ్మి పొరలుపొరలుగ తెరలి
చెరలాడు మరుమరీచికల వాగురల
బయలులో

పరువెత్తు నదె రైలుదారి!

కనులలో చురుచురుక్కను కాంతిసూదులను కూరి!
గొఱ్ఱుతోలిన చాళ్ల వీక
ఏకాంతరమ్ముగా ఆశాంతములు తాక
తీవ్రవేగమున పరుగెత్తు కాలాహులను పోలి!
నవనాగరకతామహాయంత్రభూతాస్థి
పంజరాయనకఠినహృదయార్థసంప్రస్థి
తాన్యక్షురీవాహలోహనాళద్వయిని పోలి!
కనులలో చురుచురుక్కను కాంతి సూదులను కూరి

పరువెత్తు నదె రైలుదారి!

అదె అచట పశు వొకటి బడుగైన తనయొడలు
తడబడగ, కడుగాలు పెనమైన నెరిబయల,
మట్టి మూచూచి తన నీడనే చూచి యడలు!
మ్రోడైన ఆ చెట్టు వానకై తపియించు
దాని నీడను గూడ కట్టెండ దహియించు;
గూబ గుఁయ్యని మ్రోయు నీరవము హెచ్చె
శబ్దసర్వస్వమ్ము చచ్చువడి చచ్చె;
భుగభుగల వెలి కెగయు ప్రళయాళికజ్వాల

నిశ్చలమ్మయి జగద్విలయమై క్రాల
శూన్యలోకము గాగ, శూన్యతయు శవ మైనయట్లు;
వైశాఖరుద్రుని సమాధియట్లు!
ఎవ్వరిని లెక్కింప దా రైలుదారి
దహనాంశుఝంఝాప్రకంపనము చేరి
కనులలో చురుచురుక్కను కాంతిసూదులను కూరి
పరువెత్తు నదె రైలుదారి!

అట్టె చూచెను పశువు వ్రాలిపడు అత్తఱి!
తన చేయు ధనధనేంధనము వెన్నంటి
వచ్చె నా నాగరకతామహామారి సివ మెత్తి!
రయిలు వచ్చిన, దదిగో రయిలు!
జాగరితమై కనియె ప్రజ్ఞ నెరుగని బయలు!
మసిబొగ్గు నల్లతల, గాజుమిడిగ్రుడ్డు;
పొగలు గ్రక్కెడి నోరు, నిప్పు లూదెడి ముక్కు,
గిరగిరా తిరుగాడు నిడువైన తెడ్డు!
'రైలెంజి' నది! దాని కంట బడినది తుక్కు!
ధణధణా ధణధణా
దద్దనా ధనమంచు ధారణీవేదనా
కారముగ పరువెత్తు కంపింప భూధరములెల్ల!
పెద్ద రోకలిబండపురుగు!
కడుపుమాత్రము నిడివి డొల్ల;
వాయువునె లెక్కగొన దద్దాని పరుగు!
కూత కూయుచును నిప్పుల నుమియుచు
పొగలు గ్రక్కుచును దిక్కుల కెక్కుచు
పరువెత్తెడు నదె గుప్పుగుప్పుమని;
కూర్చుండిరా జనులు?
ఉన్నవా లోన సామాన్లు?
లేదు;

అయిన నేమాయె నా రైలు పరువెత్తు !
"జనములో ? సామానో ? ఏమైన నగుగాక !
యంత్రమునకా చింత ?" అన్నట్లు రైలు పరువెత్తు !
సద్దు మణగెను; కన్ను మొరగినది రయిలు !
మరల కట్టెండలో ప్రజ్ఞతప్పెను బయలు !
ఒక్కక్షణమేగదా మెరసినట్లయ్యె
బయలినిద్దుర కదిమె పీడకల యయ్యె !
అయయొ ! త్రెంచిన దొక్క నరమైన చాలు
రక్తమ్ము పెల్లుబికి వరదలై వ్రాలు !
ఏమి కావలె నింక
జీవిజీవము లింక ?
పొగలు క్రక్కుచు చన్న ఆ మహాశకటా
సురునకయి యిట నిర్మితంబైన దకటా
ఇనుపకమ్ములదారి కనుము !
అచట తిరుగాడు పసిరక్తమ్ము దినదినము
పీల్చికొని పోవు నాగరకతానాళ
మిదియె యన నమ్మునది యెవడు ?

నమ్మజాలనివాడు బోళ !

సద్దణగె; ఎట కేగెనో ఏమొ రయిలు !
మూర్ఛపోయెను మరల ఎండలో నెరిబయలు !
కనులలో చురుచురుక్కను కాంతి సూదులను కూరి
పరువెత్తు, పరువెత్తు, పరువెత్తు నదె రైలుదారి !
కంపనముతో మెరసి యినుపకమ్ములదారి
పరువెత్తు నదె రైలుదారి !*

* 'కువెంపు' కన్నడగేయానికి అనుసరణము.

న్యాయము లేదు. కావున మేము కప్ప మిచ్చిపంప జాలము"అని చెప్పిపంపెను.

"అటుపిమ్మట ఆ సమాచారమును వీరనరసింగ రాయలు విని మిక్కిలియు కోపించుకొని, "ఈ పాళె గాండ్రు మనయొక్క రాజ్యములో పట్టాభిషేకము జేసికొనియుండిన హరిహరరాయలు మొదలైనవారికి కప్ప మిచ్చుచుండి, ఇప్పుడు ఇంత వ్యవహారము చేయవల సిన కార్య మేమి యున్నది?" అని యా ఉమ్మత్తూరు కోటను ముట్టడించి మూడు మాసముల పర్యంతము యుద్ధము సేయగా ఆ పాళెగాండ్రు బహుబలమును జేర్చుకొని వీరిని కోటసమీపమునకు జేరనీయక కొట్టిరి. అప్పుడు నరసింగరాయలు ఆ కోటను సాధింపజాలక దండు త్రిప్పుకొని శ్రీరంగపట్టణమునకు వచ్చి ముట్టడి వేయగా, పూర్వము పెద్దనరసింగరాయలు జీవగ్రాహు నికి పట్టము గట్టియుండిరి. ఆ జీవగ్రాహుని కొడుకు బహుబలముతో శ్రీరంగపట్టణకోటను గట్టిచేసికొని, ఉమ్మత్తూరు తలైక్కాడు పాళెగాండ్రకు జెప్పి పంపి యచటినుండి బహుసేనలను పిలిపించుకొని, కోటను విడిచి బయటికి వచ్చి వీరనరసింగరాయల దండుపై బడి యుద్ధముజేసిరి. అప్పుడు వీరనరసింగరాయలు కొంచె మపజయమును బొంది దండు త్రిప్పుకొని విద్యానగరికి వచ్చి కృష్ణరాయలతో నా యుమ్మత్తూరు శ్రీరంగపట్టణ ములు మిక్కిలియు బందోబస్తుగనుండుటవలన సేనల నధిక ముగ జేర్చుకొని యనేకవస్తుసామగ్రులను గొని యా దేశమును సాధింపవలయు నని యోచనజేసి రాజ్యపరి పాలనము జేయుచుండిరి"[11].

ఉమ్మత్తూరు ప్రభువు వీరనరసింహరాయలను ప్రతిఘటించినది నిశ్చయము. ఏలన, కృష్ణరాయలు రాజ్యమునకు వచ్చినవెంటనే యుమ్మత్తూరును జయించి స్వాధీనపఱచుకొనుటకు దండు వెడలవలసి వచ్చెను; కావున ఉమ్మత్తూరుప్రభు వంతకుపూర్వమే, అనగా వీరనరసింహరాయల రాజ్యకాలముననే తిరుగుబాటు చేసి యుండవలయును. కొంగుదేశరాజాక్కళ్ చరిత్ర యందు చెప్పిన రీతిగనే వీరనరసింహరాయలు ఉమ్మ త్తూరు దేశమును స్వాధీనపఱచుకొని యచట దన యధి కారమును మరల నెలకొల్పుటకు ప్రయత్నము సల్పి యుండినచో నత డోడిపోయి ననుటకు సంశయపడ వలసినది లేదు.

ఇట్లు పరాజితుడై వీరనరసింహరాయలు వెను దిరిగి పోయినపిమ్మట ఉమ్మత్తూరు ఇమ్మడి దేవరాజు (శ్రీపరాజు) పెనుగొండను స్వాధీనము చేసికొనెనని తోచుచున్నది. పెనుగొండ నతడు జయించినట్లెచ్చటను జెప్పియుండలేదు. కాని, సమకాలిక పోర్చుగీసురాయ బారి ఫ్రయ్యర్ లూయి కృష్ణరాయల రాజ్యారంభ మప్పటికే రాయలను ధిక్కరించిన సామంతు డొక్కడు పెనుగొండను జయించె నని వ్రాసియున్నాడు. ఉమ్మ త్తూరుప్రభువు 'పెనుగొండచక్రేశ్వర' బిరుదాంకితు డగుటచేతను, వతని యధికారము బెంగుళూరు తుంకూరు మండలముల పర్యంతము వ్యాపించియుండినందువను, మఱియు నా ప్రాంతమున రాయలకు మా ఱొడ్డియుండిన సామంతు డత డొక్కడే యగుటచేతను పెనుగొండను బట్టుకొనిన సామంతు డతడే కావలయును.

వీరనరసింహరాయలపై నిమ్మడి దేవరా జెప్పుడు తిరుగబడెనో అతని శిక్షించుటకు రాయ లాత నిపై దండు ఎపుడు వెడలెనో నిశ్చయించుటకు దగిన సాక్ష్య మింతవఱకు లభ్యపడలేదు; కాని క్రీ. శ. ౧౫౦౬ డిసెంబరు ౧౫ వ తేదీనాటి మైసూరు జిల్లా మళవల్లి తాలూకా ముట్టహళ్లిగ్రామశిలాశాసనమున 'ఉమ్మత్తూరు దేవణ్ణొడయల కుమారుడైన మల్లరాజను పేరు గల చిక్కరాయలు' శ్రీమన్మహారాజాధిరాజ రాజపరమేశ్వర భుజబలప్రతాప నరసింహమహారాయల సామంతుడుగ రాష్ట్రపాలన సేయుచుండినట్లు చెప్పి యుండుటవలన[12] నుమ్మత్తూరుప్రభువు తిరుగుబాటును, వీరనరసింహరాయల దండయాత్రయు, ప్రాయశః క్రీ. శ. ౧౫౦౮ వ సంవత్సరమునకో యించుక తరువాతనో నడచియుండవలయును. ఉమ్మత్తూరుప్రభువు పెను గొండదుర్గమును సాధించినది దానికి తరువాత నై యుండవలయును. ఏలనగా, ఇమ్మడినరసింహ

11. ***Further Sources nos. 97-(a). of no. 97.***

12. ఎపి. కర్ణా. సం. ౩, మల. నెం. ౯౫.

రాయలు క్రీ. శ. ౧౫౦౬ వఱకును వీరనరసింహ రాయలచే పెనుగొండయందు కారాగారమున బంధింప బడియుండి యచ్చట నా సంవత్సర మతనిచే వధింప బడెను. కావున పెనుగొండ యప్పటివఱకును వీర నరసింహరాయల స్వాధీనమం దుండె నని నిశ్చయముగ జెప్పవచ్చును. వీరనరసింహరాయల పరాజయమునకు ముందు ఇమ్మడితేవణ్ణకు పెనుగొండ స్వాధీనపడి యుండెదు. కావున క్రీ శ. ౧౫౦౭ నన్, ఇందుకు తరువాతనో దేవణ్ణ పెనుగొండను సాధించియుండ వలయును.

అల్పరాష్ట్రాధిపతియైన ఉమ్మత్తూరు దేవరాజు రాయల నింత సులభముగ నెట్లోడింపగల్గెనో కనుగొన వలసియున్నది. వీరనరసింహరాయలు సామ్రాజ్యాధి పత్యమును వహించినపిమ్మట కొందఱు మండలాధిపతు లును, పలువురు సామంతులును నతనిపై దిరుగుబాటు చేసినట్లు న్యూనిసు వ్రాసియున్నాడు[1]. అట్లు తిరుగు బాటు చేసినవారిలో నిమ్మడి గాచప్ప ఉడయుడు ముఖ్యుడు. నరసానాయకుని సేనాధిపతులలో నిత డొక్కడు. ఇతడు ఆదవాని దుర్గాధీశుడగు కాచప్ప నాయకుని కుమారుడు. క్రీ. శ. ౧౪౯౩ వ సంవత్సర మున రాయదుర్గ చావడికి జెందినఅగ్రిస్థలము ను పాలించుచుండెను[14]. అనంతపుర మండలములోని యెరుపకొండయందలి శిలాశాసనమువలన క్రీ. శ. ౧౫౦౮ న నితడు యాదవగిరిదుర్గమును పాలించుచుండి నట్లు తెలియుచున్నది. యాదవగిరి బళ్లారి మండలము లోని యాదవనిదుర్గమునకు నామాంతరము[15]. ఇమ్మడి కాచప్ప బిజాపురసుల్తాను యూసపు ఆదిల్‌ఖానునితో మైత్రి పాటించి యతని బలము నూతకొని వీరనర సింహరాయలను బ్రతిఘటించెను. ఈ కాచప్ప ఉడ యునికి ఉమ్మత్తూరు దొరలతో సంబంధము గల దని కొందఱి యభిప్రాయము. ఈ యభిప్రాయమును స్థిర పఱచగల సాక్ష్యమెద్దియు లభింపకపోయినను, అది యసమంజసము గాదు. కాచప్పయధికారము పెను గొండప్రాంతదేశమునఱకును వ్యాపించియుండె నని పై నుదాహరింపబడిన శాసనసాక్ష్యమువలన రుజు వగుచున్నది. ఉమ్మత్తూరుదొరలు పెనుగొండను సాధించినట్లు పోర్చుగీసు రాయబారి ఫ్రయ్యరు లూయి ఉత్తరములవలన దెలియుచున్నది. కాచప్ప కును, ఉమ్మత్తూరువారికిని వీరనరసింహరాయలు సామాన్యశత్రువు. మఱియు స్వాతంత్ర్య స్థాపనకై ఏక కాలమున వీరిరువురు రాయలతో బోరుచుండిరి. కావున కాచప్పకు ఉమ్మత్తూరువారితో మైత్రి కలుగుట యస హజము గాదు. దీని నిజానిజము లెట్లుండినను ఉమ్మ త్తూరుపై వీరనరసింహరాయ లెత్తిపోయిన కాలమున నే యాదవనియందు కాచప్ప రాయల యధికారమును ద్రోసిపుచ్చి స్వతంత్రధ్వజమును లేవనెత్తెను. అతనికి

13. *Forgotten Empire*, P. 314.

14. ARE. 719 of 1917.

15. ARE. 409 of 1920. శాసనశాఖవారి ౧౯౨౦ వ సంవత్సరపు వార్షికనివేదికయందు *'Kacha-Rajendra ruling at Devagiri'* అని యున్నది. మఱియు నీ దేవగిరి యాదవవంశనృపాలుర రాజధానియగు నౌరంగబాదు జిల్లాలోని దేవగిరియనియు, గాచరాజేంద్రు డా వంశమునకు జెందినవా డనియు శాసనశాఖవా రభిప్రాయపడియున్నారు. (ARE. 1921 Part II Para 12) ఇది పొరబాటు. శాసన ప్రతిబింబమును బరిశీలించిచూడగా నందు 'దవగిరి' యని యున్నది కాని దేవగిరి యని లేదు. మఱియు 'దా'కుముందు శాసనశిల పెడత్తిపోవుటవలన నొక యక్షరము మాసిపోయియున్నది. అరవీటివంశజుల శాసనములందును, పద్యద్విపదబాలభాగవతములందును 'కాచప్ప' ఆదవానిదుర్గపాలకు డని యున్నది. ఆద వనిదుర్గమునకే తీకున దానికి యాదవగిరి యను నామాంతర ముండినట్లు చెప్పియున్నది. కావున శాసనములోని 'దవగిరి'ని [యా] దవగిరి యని సంపూర్తిచేసితిని. ఇది యంగీకార్యము గాకపోయినను, దేవగిరి యను పాఠమే సరియైన దనుకొన్నను, అప్పుడు అహమదునగర రాజ్యాంతర్గతమును బిజాపురరాజ్యమునకు జాల యుత్త రమునం దుండిన ప్రాచీనయాదవరాజుల రాజధాని యది కాజాలదు. పెనుగొండకు సురగిరి దేవగిరి యను నామాంతరము లుండుట సుప్రసిద్ధము. కావున పెను గొండయే ఈ దేవగిరి కావచ్చును.

ప్రాపుగ నతని మిత్రుడు బిజాపుర ప్రభువు యూసుఫ్ ఆదిల్ ఖానుడు గొప్పదండుతో రాయరాజ్యముపై నెత్తి వచ్చి తుంగభద్రను దాటి కందనవోలునకు ముట్టడి వేసెను.

వీరనరసింహరాయల యాజ్ఞమీద అరవీటి బుక్కరాజు రామరాజును, నతని పుత్రుడగు తిమ్మరాజును కందనవోలుదగ్గరను, ఆదవాని చెంతను నాదిల్ ఖాను నోడించి తఱుమగొట్టిరి. కాచప్పనోడించి బందీకృతుని గావించి యాదవానిదుర్గముతోగూడ నతని రాయల కొప్పగించె నని యారవీటిరాజుల తామ్రశాసనములవలనను వా రంకితము గొనిన యాంధ్ర గ్రంథముల వలనను దెలియవచ్చుచున్నది[16]. బుక్కరాజురామ

---

16. ఆరవీటి రాజుల తామ్రశాసనములందు సామాన్యముగ గానవచ్చు నీ క్రింది శ్లోకము లిచ్చట స్మరింపదగినవి.

౧౧. సహస్రైస్సప్తత్యా సహితమపి య స్సింధుజనుషాం
సపాదస్యానీకం సమితి భుజశౌర్యేణమహతా,
విజిత్యాదత్తే స్మాదవనిగిరిదుర్గం విభుతయా
విధూతేంద్రః కాళప్పడయమపి విద్రావ్యసహసా.

౧౨. కందనవోలిదుర్గ ముఱుకందళదభ్యుదయో
బాహుబలేన యో బహుంతరేణ విజిత్య హరేః
సన్నిహితస్య తత్ర చరణాంబుజ భక్తితయా
జ్ఞాతిభి రర్పితం సుఘయతిమ్మ నిసేవ్య విషం.
(ఎపి. ఇండి. సం. ౧౬. పుట ౨౪౯)

మఱియు కోనేరునాథుని బాలభాగవతములయం దీ విజయములు వర్ణింపబడియున్నవి.

"ఎందు నెన్నగ జాలు నిద్ధశౌర్యమున
గందనవోలి దుర్గంబులో నుండి
బుక్కయరామభూభుజు డెల్లనృపులు
నెక్కువ యిది యని యెన్నంగజాలి
వీరులు డెబ్బదివేవురాశ్వికులు
జేరి కొల్వంగవచ్చిన సవా నెదిరి
కలనంది పంచబంగాళంబు జేసి
గెలిచె దచ్చరితంబు గీర్తింప దరమె?
వినుతింపదగు నాదవేనిదుర్గమున
ననతుడైయుండు కాచాధిపు గెలిచి
అరుదుగా సప్తాంగహరణంబు సేసె
గరిమెన్నతుండు బుక్కయరామవిభుడు."

"పద్యబాలభాగవతమున,
గబ్బిల్ డెబ్బదివేవు రాశ్వికులు వె
ద్కక్ గొల్వగా గిన్క పె
న్మబ్బుల్ గప్పగ గందనోలు గొనువే
డ్కక్ జుట్టుముట్టక్ సవా
బిబ్బీసుబ్బణగించె తోలె నరిరా
డ్భీముండు లంకాసర
గ్విబ్బంద్రాభుడు బుక్కభూవిభునిరా
మాధీశు డాహో యనక్."

అను పద్యముగూడ నీ విషయమును విశదపఱచుచున్నది.

రామరాజు తిమ్మరాజునయితే మాదవనిదుర్గమును సాధించుటకు దన తండ్రికి సహాయ మొనర్చెను.

"విక్రమంబున నాదవేనిదుర్గంబు
విక్రాంతు లెన్న వేవేగ సాధించి
సిరులతో వీరనృసింహరాయలకు
బరువాత్మ దుర్గాధిపతి నొప్పగించి
గరిమ స్వామిద్రోహగండపెండార
మరిభీకరముగ రాయ లొసంగ నొంద."

—ద్విపదబాలభాగవతము (భారతి. సం. ౬ పుటలు. ౫౨౩, ౭౫౫).

వీరనరసింహరాయలచే రామరాజు తిమ్మరాజు 'స్వామిద్రోహరగండపెండేరము' ను గొన్నవిషయము పద్యబాలభాగవతమునందును నుడివియున్నది.

"శ్రీవీరనరసింహుచే 'బతిద్రోహర
గండపెండేర' మే ఘనుడు గాంచె."

"శ్రీమద్వీరనృసింహరాయనృపతి
శ్రేయోదయా సాధిత
'స్వామిద్రోహరగండనూపుర' విరా
జద్రామరాట్తిమ్మ—'

(భారతి. సం. ౬, పుట. ౭౫౫, అధో. 30.)

రాజును నతని పుత్రుడగు తిమ్మరాజును జిన్న సామంతులు. ఎనుబదివేల గుఱ్ఱపుదళములతో గూడ నెత్తివచ్చిన యూసుపు ఆదిల్ ఖానుని నిర్జించి పాఱదోలుటకు వారికి స్వయము శక్తి లేదు. రాయసైన్యముల తోడు లేక యీ కార్యమును వారు నిర్వహించి యుండజాలరు. తమ యాధిపత్యము క్రింద శత్రువులతో రాయరాణువ పోరాడి పొందిన విజయములను కేవలము దమ పరాక్రమము వలననే కలిగినట్లు రాయసామంతులును, దళవాయలును ప్రకటించుకొనుట యాచారమగుటచే వారవీటి రామరాజును, నతని కుమారుడును పొందిన విజయములను నట్టివరై యుండవలయును. కావున వీరనరసింహరాయ లుమ్మత్తూరుపై నెత్తిపోయిన సమయముననె యూసుఫ్ ఆదిల్ ఖానుడు విజయనగరసామ్రాజ్యముపై నెత్తివచ్చుట వలన రాయరాణువయందు జాల భాగమాతని నెదిర్చి తిలుపుటకు బోవలసివచ్చెను. అందు వలన నుమ్మత్తూరును సాధించుటకు దగినంత బలము లేక పోయెను. వీరనరసింహరాయల అపజయమున కిదియె ముఖ్యకారణమని తోచుచున్నది.

ఏ కారణముచే వీరనరసింహరాయల కపజయము గలిగినను కృష్ణదేవరాయల పట్టాభిషేక కాలమున, దక్షిణ కర్ణాటకమున జాల భాగము రాయల యధికారము నంగీకరింపక స్వతంత్రముగ నుండినది. కావున ఉమ్మత్తూరుప్రభువులను జిదుగగొట్టి వారి స్వాధీనమందుండిన దుర్గములను, రాష్ట్రమును మరల రాయసామ్రాజ్యమున జేర్చుకొనుట కృష్ణరాయలకు ప్రథమకర్తవ్యమాయెను. బిజాపురసుల్తాను దళిమిదేసిన వెనుక రాయలు దనపై మరల నెత్తిరాగల డని యుమ్మత్తూరి దేవరా జెఱుగును. కావున నతడు రాయసైన్యము లెప్పుడు వచ్చినను దగురీతిని ప్రతిఘటించుటకు వలసిన ప్రయత్నములు సేయగడగెను. ఈ ప్రయత్నములు కొంగుదేశరాజాక్కళిక చరిత్రయం దిట్లు వర్ణింపబడి యున్నది:

"అప్పుడు కర్ణాటకదేశపు రాజులలో నున్మత్తూరు రాజులు శివసముద్రమును కైవసము జేసికొని ఆ కోట రెండుప్రక్కలను కావేరి ప్రవహించుచుండుటవలన ఆ కోటను జక్కగా కట్టి అనేకవీరంగులు మొదలగు నాయుధములవల్లను బలపఱచి ఆ శ్యాప రాజు (దేవరాజు) స్వర్గమును బొందినవా డాయెను. అంతట వానికుమారుడు గంగరాయడు అచట రాజ్యమును రక్షించుకొనుచు ఆ కోటను పెక్కుఆయుధములవల్లను అనేకజనులవల్లను బహుభద్రము జేసికొని యుండెను[17].

కృష్ణదేవరాయలు మొట్టమొదట ఉమ్మత్తూరు మొదలుగ సర్వకర్ణాటకరాజ్యమును సాధింప నిశ్చయించుకొనెను[18]. వీరనరసింహరాయల పరాభవ

రాఘురాజీయమునందును పై విజయప్రస్తావము గలదు.

"మదకరి కోకటి కిర్వది గుఱ్ఱములు
గుఱ్ఱమునకు విలుకాండ్రు ముగురు విచ్చు
కత్తులవా రీకెకాండ్రట్ల వత్తిల్ల
నిట్టి రేనుగులను జొట్టు మూడు
వేలరేనూరు నద్వ్రృత్తితో నడవంగ
గందనోల్లాధింపగా దలంచి
మొనడించి గట్టిగా ముట్టడి దిగిన నా
బిబ్బని మిక్కిలి యుబ్బణంచి."—
(*Sources.* P. 104)

17. ***Further Sources**, I **No.*** 128.

18. కొంగుదేశరాజాక్కళిక చరిత్రలో కృష్ణదేవరాయలు ఉమ్మత్తూరు దండయాత్రకు ముందు ద్రావిడదేశమును జయించినట్లు చెప్పియున్నది.

"అటుపిమ్మట విజయనగరికోటను జక్కగ గట్టి, పెనుగొండ చంద్రగిరి ఇవి మొదలగు కోటలు గట్టించి నాలమందిని చేర్చుకొని యనేకగజాశ్వములు మున్నగు వానిని గూర్చుకొని రాజ్యములను గట్టుకొనవలయు నని ద్రావిడదేశమునకు బోయి యచట కాంచి చెంజి వేలూరు కోటలను కైవసము జేసికొని వేలూరుకోటను బహుభద్రముగ గట్టి దానియందు తన మనుష్యులను, రాజకుమారులను గాపుంచి రాజ్యమును ధర్మనీతిగ రక్షించుకొనుచుండిరి." (***Further Sources***, 1. *no.* 118.)

మొకప్రక్కను, అంతశ్శత్రువర్గమును నిర్మూలము గావించి రాజ్యమును నిష్కంటకము గావింపవలయు నను ఇచ్ఛ యొకప్రక్కను ప్రేరేపింప కృష్ణరాయ లుమ్మత్తూరిపై దండయాత్ర వెడలెను19. ఉమ్మత్తూరు దండయాత్ర వృత్తాంతము పెక్కుగ్రంథములందు వర్ణింపబడియున్నది. ముక్కుతిమ్మన్నగారు—

'ఉమ్మత్తూరు శివసముద్ర పురవ
ప్రోన్మూలనాడంబరా'20

అని యొక్కమాటతో దండయాత్రపర్యవసాన మును సూచించినారు. అట్లే సంగీతసూర్యోదయ కర్త బండారు లక్ష్మీనారాయణ ముక్కుతిమ్మన్నగారి భావములో సగము నొక శ్లోకమున నిమిడ్చినాడు.

"శాత్యేఒ సౌ సకలకలాకలాప్రయుక్తం
సప్రాణం సపది విజిత్య గంగరాజం,
భంక్త్వా తచ్ఛివసముద్ర ముత్కటం ద్రా
గావాసం స్వతనుత నిర్భరం శివానాం."21

రాయవాచకమున నింతకంటె విపులముగ,—

"సత్రం రొక్కకొని పయనం గదల కదలి వుమ్మత్తూరు శివసముద్రానకు వచ్చి గంగారావు పూడెమునుమీంద కార్యము సేసి పుదరదోలి ఆ స్థలాలు వక్కనాటనె సాధించి అక్కడ పూడిగాలవార్లను వుంచి అంద్దునుండ్డి శ్రీరంగపట్టం కోటకై చీనికోట కొత్తళములు జూచి మీద ఆదిరంగనాయకుల సేవించి" అని వర్ణింపబడి యున్నది22.

కృష్ణరాయవిజయమున, "ఒక్కహూరుమత్తున సుమ్మత్తూరు శివసముద్రస్థలంబుల నెసంగు గంగరాజు నోడయల నోడించి తదీయస్థలంబున శాలెంబులు బలి యించి శ్రీరంగపట్టణంబు నిరీక్షించి" అని రాయవాచ కములోని విషయమునే సంగ్రహించిచెప్పియున్నది23.

కాని కొంగుదేశరాజాక్కలిక చరిత్రయం దొక్కదానియందు మాత్ర మీ దండయాత్ర విపులముగ వర్ణింపబడినది:

"అటు తరువాత రాయ కృష్ణరాయలు కర్ణాటక దేశపు పాళెగాండ్రు రాజులతో డయుద్ధము జేసి జయించి ఆ దేశమును గట్టుకొనవలయు నని, ముందు తన యొక్క అన్నగారగు వీరనరసింగరాయలు జయము లేక వచ్చి యుండుటచేతను, వారు కప్పమీయక నుండుటచేతను వారిపై మిక్కిలి కోపమును బొంది, ఏనుగు, గుఱ్ఱము, పదాతి (దళముల తోడను) ఫిరంగి మున్నగు నాయుధ ములతోడను గొందఱు పాళెగాండ్రతోడను గూడి బయలువెడలి కర్ణాటకదేశమున కావేరీతీరమున పశ్చిమ రంగమునకు దూర్పున శివసముద్రకోటను ముట్టడి వేసి వానికి (గంగరాజునకు) శత్రువుగా నుండిన చిక్క రాయని చేర్చుకొని యింకను సన్న పాళెగాండ్రతో గూడ ప్రేతపర్వతము, గొరియనె కొండ యను స్థలముల

దీని నాధారపఱచుకొని కీ. శే. డాక్టరు యస్. కృష్ణస్వామిఅయ్యంగారు "*A Yet-remembered Ruler of a Long - forgotten Empire*" (*pp*. 7-9) అను గ్రంథమున నుమ్మత్తూరురాజ్యమే కళింగ దిగ్విజయానంతరము న్యూనిజుచరిత్ర బడి కృష్ణ దేవరాయలు జయించిన కొటూరురాజ్య మని వాదించి యచట నతడు సాధించిన నదీశాఖలమధ్యపట్టణమే శివసముద్ర మని చెప్పి, గంగరాజురాష్ట్రము చోళ మండలాంతర్గతమని నిర్ధారించినారు. మఱియు న్యూనిజు పేర్కొన్న కొటూరుదేశమే కొడవరాయదేశ మని సాధించి దానిని కృష్ణరాయలు జయించె నని రుజువు సేయుటకు కొంగుదేశరాజాక్కలిక చరిత్ర యందలి పై వాక్యముల నుదాహరించిరి.

కాని కృష్ణస్వామయ్యంగారు వాదించునట్లు ఉమ్మత్తూరు చోళమండలాంతర్గతము గాదు; మఱియు కొటూరురాజ్యమును, ఉమ్మత్తూరు రాజ్యమును నొక్కటి కావు. కృష్ణరాయల కాలమునకు కొడవుల పేరు సంపూర్ణముగా మాసిపోయినది. కావున కృష్ణ రాయలు ద్రావిడదేశమును జయించె నని రుజువుసేయ గల విశ్వాసపాత్రమైన సాక్ష్యము గానరాదు.

19. *Forgotten Empire p.* 125.

20. పారి ౨: ౧౦౪.

21. *Further Sources*, *I*, *no*, 116 - (*a*) *v*. *4*.

22. రాయ. పుట ౮౪.

23. కృష్ణ. ౩: ౬.

యందు దండు దిగి యొక సంవత్సరము గడచిన వెనుక ఒత్తిన కడప కావేరి మార్గమున కోటను లగ్గలు పట్టినంతట ఆ గంగరాయడు గంగనకుచ్చి యనెడు కావేరి మడుగులో బడిపోయెను.

"తరువాత కృష్ణరాయలు ఆ కోటను స్వాధీనము జేసికొని దానియందు తమ మనుష్యుల నుంచి శ్రీరంగపట్టణమునకు వచ్చి యాపట్టణమును గూడ జయము జేసికొని శ్రీరంగపట్టణములో కంపగవుడు వీరప్పగవుడుల వశమున గొంత దేశమును విడిచి చిక్కరాయని వశమున మఱికొంత దేశమును విడిచి యచట నచట నుండు పాళెపట్టుల నన్నిటి జయించి యచటనచట (పాలించుటకు దన) మనుష్యులను నియమించి కర్ణాటక దేశము కోటి ద్రవ్య మని కట్టుబడిచేసి తమ దస్త్రములో లెక్క దాఖలుచేసికొని కర్ణాటదేశమునకు ముఖ్యపట్టణముగ శ్రీరంగపట్టణము గట్టిచేసికొని యుండిన శకవర్షము ౧౪౩౪ ప్రభవవర్షము..."24

గ్రంథాధారములవల్ల కృష్ణరాయల యుమ్మత్తూరు దండయాత్రనుగూర్చి తెలియవచ్చు విషయ మంతియు నింతియే. ఇందు విశ్వాసపాత్రములుగాని యంశము లెవ్వియు గానరాకపోయినను, గొన్నియెడల విమర్శకెడ మున్నది. మొట్టమొదట దండయాత్ర నడచిన దెప్పుడో నిశ్చయింపవలసియున్నది. పోర్చుగీసు గవర్నరు అల్బాకెర్కు క్రీ. శ. ౧౫౧౦ సెప్టెంబరు మాసమున గోవాకరపట్టణమును బిజాపుర ప్రభువు నోడించి గైకొనెను. ఆ విజయవార్త విజయనగరమునకు వచ్చినంతటనే కృష్ణరాయలు పోర్చుగీసుగవర్నరుకు దన సానుభూతిని తెలియజేయుచు రాయబారులను గోవా కంపెను. వారిచే విజయనగరమందుండిన పోర్చుగీసు రాయబారి ఫ్రయ్యరు లూయి యాల్బాకెర్కున కంపిన లేఖలో కృష్ణరాయలు దన కెదురు తిరిగి పెనుగొండను స్వాధీనపఱచుకొనిన సామంతునిమీది కంపుట కేడువేల మందిగల యొక చిన్న దండును సిద్ధముసేయుచుండె నని వ్రాసెను. విజయవార్త విజయనగరము చేరుటకును, నచటినుండి రాయబారులు గోవాకు బయలుదేరుటకును నొక్కమాసము పట్టియుండు నని యనుకొనిన,క్రీ. శ. ౧౫౧౦ చివరవఱకు నుమ్మత్తూరు దండయాత్ర బయలువెడలలేదని చెప్పవచ్చును. కొంగుదేశరాజాక్కలిక చరిత్రయందు శా. శ. ౧౪౩౪ ప్రభవవర్షమప్పటికి ఉమ్మత్తూరు మొదలుగాగల సకలదక్షిణకర్ణాటక దేశమును కృష్ణరాయలు జయించి స్వాధీనపఱచుకొనె నని చెప్పియున్నది. కాని ఇచట శకాబ్దమును ప్రభవాద్యబ్దమును సరిపోవు. శా. శ. ౧౪౩౪ నకు సరియైన ప్రభవాదివర్షము ప్రభవ కాదు; అంగీరస. శుక్లవర్షమువఱకును వీరనరసింహరాయలు రాజ్య మొనర్చుచుండెను. శా. శ. ౧౪౩౧ శుక్ల శ్రావణమునందు కాని కృష్ణరాయల రాజ్యాభిషేకము గాలేదు. కావున శా. శ. ౧౪౩౪ సరియైన వర్షము ప్రభవ యనుట తప్పు. ప్రభవ సంవత్సరమున నింకను వీరనరసింహరాయలు రాజ్యము సేయుచుండెను. ఇక శా. శ. వర్షమే సరియైన దని తలంచితిమేని క్రీ. శ. ౧౫౧౨-౧౩ నకు ఉమ్మత్తూరు దండయాత్ర సంపూర్ణ మాయె నని యొప్పుకొనవలసియున్నది. క్రీ. శ. ౧౫౧౨ వ సంవత్సరము ఆగస్టుమాసమున కృష్ణరాయ లింకను శివసముద్రమందే యుండె నని అనంతపురమండలములోని బుక్కపట్టణగ్రామమున నుండు నొక శిలాశాసనమున జెప్పియుండుటవలన 25 కొంగుదేశ రాజాక్కలిక చరిత్రయందు నమూదు సేయబడిన శకాబ్దము సరియని యొప్పుకొనవచ్చును.

మఱియు రాయవాచకమున జెప్పినట్లు కృష్ణరాయలు ఉమ్మత్తూరు శివసముద్రములను 'ఒక్కనాటనె సాధింపలేదు. క్రీ. శ. ౧౫౧౧ వ సంవత్సరమున విజయనగరమునుండి బయలువెడలిన రాయలు క్రీ. శ. ౧౫౧౨ ఆగస్టున నింకను శివసముద్రముముందుండుట చూడగా నొక్క శివసముద్రముముట్టడియె యొక సంవత్సరమునకంటె నధికకాలము సాగె నని కొంగుదేశరాజాక్కలిక చరిత్రవాక్యమెక్కుడువిశ్వాసపాత్ర మని తోచెడిని. లభ్యమైన యాధారము లన్నిటిని చక్కగ పరిశీలించి చూడ నుమ్మత్తూరు దండయాత్ర దాదాపు రెండు సంవత్సరములకాలము నడచినట్లున్నది.

24. *Further Sources I. No.* 118.

25. *ARE.* 180 *of* 1913.

సేనాసంఖ్యానిరూపణ; — ఫ్రయ్యరులూయి అల్బాకెర్కునకు వ్రాసిన యుత్తరమందు కృష్ణరాయ లేడువేల మందిగల చిన్న దండును పెనుగొండను సాధించుటకు సిద్ధము పఱచియున్నాడని వ్రాసెను26; ఉమ్మత్తూరు శివసముద్రము మొదలగు బలిష్ఠములైన దుర్గములను సాధించుటకీ దండు చాలదు. న్యూనిజు చరిత్రమున కృష్ణరాయలు రాజ్యాభిషిక్త మయిన తరువాత ఒకటిన్నర సంవత్సరమువఱకు రాజధానియందే నివసించుచు రాజ్యపాలనా విధానమును గఱచుచుండె ననియు, నా కాలమందు ౩౪౦౦౦ కాల్బలమును, ఎనిమిదివందల యేనుగులుగల బలమును సమకూర్చె ననియు వ్రాసి యున్నాడు27. రాయవాచకమునందు గూడ రాజ్యాభిషిక్తుడైనతరువాత కృష్ణరాయలు కొంత కాలము రాజధానియందే యుండి యుద్ధప్రయత్నములు సేయుచుండెనని చెప్పియున్నది. కాని యుమ్మత్తూరుపై రాయలు దాడి వెడలినపు డతనివెంట నడచిన దళములు న్యూనిజు చెప్పిన సంఖ్యకంటె జాల పెద్ద దని తెలుపుచున్నది. తనతోగూడ యుద్ధమునకు నడచుటకు రాయలు పిలిపించిన అమరనాయకుల దళములలో ౨౪౦౦౦ గుఱ్ఱములును, ౧౨౦౦ ఏనుగులును, ౨౦౦,౦౦౦ కాల్బలమును; అమరనాయకు లీయవలసిన కప్పమునకు బదులు రాయలకు స్వాధీనము జేసిన దండులో ౧౨౦౦౦ గుఱ్ఱములును, ౫౦౦ ఏనుగులును, ౧౦౦,౦౦౦ పదాతులును నుండె ననియు; నివిగాక రాయల కైజీత బలగమును పాలెపట్టు ఫౌజులును యుద్ధమునకు దరలె ననియు వ్రాసియున్నది28. న్యూనిజు ఉమ్మత్తూరుదండయాత్రను పేర్కొనలేదు; కాని రాయవాచకమునం దీ ప్రచండసైన్యముతోగూడనే రాయ లుమ్మత్తూరుపై నెత్తి పోయె నని యున్నది. ఫ్రయ్యరు లూయి యుమ్మత్తూరు దండయాత్రయపుడు విజయనగరమున నివసించుచుండినవాడు. న్యూనిజు కృష్ణరాయల యేలుబడియందు పలుమారు విజయనగరమునకు వచ్చుచు పోవుచుండినవాడు. ఇరువురును కృష్ణరాయల సమకాలికులు. కావున వారు వ్రాసిన వ్రాతలను త్రోసిపుచ్చుదగదు; కాని వారు చెప్పిన వృత్తాంతము సమగ్రము గాదు. ఫ్రయ్యరు లూయి పేర్కొనిన యేడువేల సేన పెనుగొండదుర్గమును సాధించుటకుగూడ చాలదు; కాల్బలమును ఏనుగులను లెక్కపెట్టిన న్యూనిజు అశ్వబలమునుమాటనైన నెత్తలేదు. ఉమ్మత్తూరును జయించిన సైన్యమే బహమనీరాజ్యముపై జైత్రయాత్రను సాగించియుండుటవలన ఫ్రయ్యరు లూయి న్యూనిజుల సైన్యపరిగణనకంటె రాయవాచకపు గణుతియే వాస్తవమునకు చేరుబడియగుచున్నట్లు తోచుచున్నది.

ఇంతటి ప్రబలసైన్యమును వెంటబెట్టుకొని యుద్ధమునకు బయలువెడలినను విజయలబ్ధికి రాయలు కేవలము దన పరాక్రమముమీదనే యాధారపడియుండలేదు. నయశాస్త్రమర్మజ్ఞు డగుటచేత మొదట శత్రువులను భేదోపాయమువలన వేర్పఱచి వారి బలమును దగ్గించుట యుక్త మని తలచి గంగరాజునకు జ్ఞాతియైన చిక్కరాయని చేరదీసి రాజ్య మిచ్చెద నని యాస చూపి తనయండను జేర్చుకొనెను. విభీషణుడు శ్రీరామునికివలె చిక్కరాయలు కృష్ణరాయల కుమ్మత్తూరు రాజ్యమును సాధించుటయందు తోడ్పడెను.

దండయాత్రయందలి విశేషాంశములు: ప్రథమమున పేర్కొనదగినది పెనుగొండవిజయము. పైనుదాహరింపబడిన యాధారగ్రంథములయందుగాని, మఱి యెచటగాని కృష్ణరాయలు పెనుగొండను జయించినట్లు చెప్పియుండలేదు. కాని ఫ్రయ్యరు లూయి యాకోట క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరాంతమందు శత్రువుల స్వాధీనమం దుండినట్లు వ్రాసియున్నాడు. మఱియు పైనుదాహరింపబడిన బుక్కపట్టణశిలాశాసనమువలన క్రీ. శ. ౧౫౧౨ వ సంవత్సరమున పెనుగొండ మరల రాయల యధికారముక్రిందికి వచ్చినట్లు తెలియుచున్నది. మఱియు నప్పటికిని కృష్ణరాయలు శివసముద్రమును ముట్టడించియే యుండుటవలన నుమ్మత్తూరు

26. *Forgotten Empire P.* 126.

27. *Forgotten Empire P.* 316.

28. రాయ. పు ౩౪ తరువాయి. *Further Sources II*, No. 138.

దండయాత్రయొక్క ప్రారంభదశయందే పెనుగొండ నాతడు సాధించియుండవలయును.

రెండవది యుమ్మత్తూరు: ఇది యుమ్మత్తూరు రాజ్యమునకు రాజధాని; ఆ రాజ్యములోని ప్రధాన దుర్గములయం దొక్కటి. రాయలవారు సాధించిన దుర్గములలో నది యొక్కటి యని రాయవాచకమువం దున్నది. ఉమ్మత్తూరుపురవప్రములను నిర్మూలించె నని ముక్కుతిమ్మనగారు సాక్ష్యము పల్కుచున్నారు. కావున కృష్ణరాయలవా రీ కోటను సాధించుటతో దృప్తినందక యా కోటగోడలను నేలమట్టమునకు జదరముగావించిన ట్లున్నది.

ఉమ్మత్తూరు తరువాతి శివనసముద్రము. ఇది యుమ్మత్తూరురాజ్యమునందలి బలవత్తమదుర్గము. కావేరి రెండుపాయల మధ్యనుండు ద్వీపముపై నిర్మింపబడుటచే నది శత్రులకు దుస్సాధ్యము; వర్షాకాలము నందు దుర్గమము. మఱియు నీ కోట కిరుప్రక్కల పేతగిరి, గౌరనమలె యను కొండలు రెండు పెట్టని గోడలై సంరక్షించుచుండినవి. తక్కిన వైపుల కావేరీ వాహిని యగాధకందకమువలె ప్రవహించుచుండినది. ప్రకృతిచే నిట్లా కోట సంరక్షింపబడుచుండినను దృప్తినందక యుమ్మత్తూరు ప్రభువులు దానిని బలిష్ఠమైన గోడలచే మఱింత దృఢపఱచి ఫిరంగులు మొదలగు నధునాతనఆయుధసమితిచే సురక్షితముగ జేసికొని యుండిరి. కావున కృష్ణదేవరాయలకీ దుర్గమును బట్టుకొనుటకు జాలకాలము పట్టినది. పేతపర్వత గౌరవమలెలమీద దన ముఖ్య స్కంధావారమును స్థాపించి కావేరివైపు బలములను గాపుంచి కోటలోని వారిని వెలుపటికిని, వెలుపలివారిని కోటలోనికిని బోనీయక నరికట్టెను. గంగరా జొక సంవత్సరమున కధికముగ రాయరాణువకు బోటుమాపియటు పిమ్మట నిలువజాలక కోట నుండి పారిపోవుచు గంగళించి మడుపునబడి మృతుడాయెను; అంతట విజయనగరసైనికులు కోటను లగ్గపట్టి స్వాధీనము జేసికొనిరి. ఉమ్మత్తూరి కోటనుబోలి శివనసముద్రదుర్గముయొక్క వప్రములను రాయలు విరుగ ద్రోయించె నని ముక్కు తిమ్మనగారును, నక్కల కునికిపట్టుగ జేసెనని భండారు లక్ష్మీనారాయణుడుకు వ్రాసియున్నారు.

శివనసముద్రనిర్మూలనముతో గర్ణాటకవిద్వేషుల వెన్నుముక విరిగినది; కాని వారి యుపద్రవము సంపూర్ణముగ దొలగిపోలేదు. శ్రీరంగపట్టణ మింకను శత్రులచేత నేయుండినది. పెక్కు పాళెగాండ్రు ద్రోహమార్గమును విడనాడలేదు. వారిని జిదుగబొడిచినగాని రాష్ట్రము సంపూర్ణముగ స్వాధీనము గాదు. కావున కృష్ణరాయలు శివనసముద్రమునుండి దండు దరల్చుకొని శ్రీరంగపట్టణముపై నడచి యా కోటను ముట్టడించెను. కోట బలిష్ఠమైనదే. శివనసముద్రమువలె నదియు గావేరిమధ్యద్వీపముపై నుండినది. కాని యీ ముట్టడినిగూర్చి విశేషాంశము లెవ్వియు దెలియవు. కోట రాయలకు స్వవశ మాయెను. శ్రీరంగపట్టణము వశపడినపిమ్మట కృష్ణరాయ లా పరిసరప్రాంతములం దుండిన చిల్లరపాళెగాండ్రను జయించి వారి పాళెపట్టు సీమల నన్నిటిని స్వాధీనము జేసికొనెను.

కృష్ణరాయ లిట్లు దక్షిణకర్ణాటకమందలి తీవ్ర శత్రువుల నందఱిని సమూలముగ పెకలించివైచి తన యధికారమును స్థిరముగ నెలకొల్పుటకొఱకు దేశపాలనవిధానమున గొన్ని మార్పులను గావించెను. ఈ మార్పులలో ముఖ్యమైనది ప్రధాననగరనిర్ధారణ. సంగమ వంశజులకాలము నుండియు హొయ్సలదేశమునకు ముందటివలెనే ద్వారసముద్రమే ప్రధాననగరమైయుండినది. క్రమక్రమముగ దాని ప్రాముఖ్యము సన్నగిలినది. కేంద్రప్రభుత్వపు టధికారము క్షీణించు కొలది సామంతులు బలిసి యణుపరానికడులైరి. సాళువ చక్రవర్తులకాలములో గర్ణాటకసామంతుల యడావుడి హెచ్చై సమయము చిక్కినప్పుడెల్ల కేంద్ర ప్రభుత్వమున కెదురుతిరుగుచు వచ్చిరి. రాను రాను కర్ణాటకమున కేంద్రప్రభుత్వమునకు ముఖ్యస్థానమైన ద్వారసముద్రము వెనుకబడిపోయినది. కావున కృష్ణరాయలు మారుమూలనుండిన ద్వారసముద్రమును వదలి విప్లవకారుల కునికిపట్టగు కావేరీతటదేశమున కాయపట్టైన శ్రీరంగపట్టణమును కేంద్రాధికారవర్గమునకు ముఖ్యస్థానమును గావించెను. మఱియు గర్ణాటకమున

తాను జయించినరాష్ట్రములో నొక భాగమునకు గొంపగవుడు వీరప్పగౌడు లనువారిని పాలకులుగ నియమించెను. ఇంక కొంత దేశము నుమ్మత్తూరుదండయాత్రయందు తనకు సహాయుడును, గంగరాజునకు జ్ఞాతియు నగు చిక్కరాయల కొసగెను. శత్రువుల కడ గొన్న పాళెపట్టు లన్నిటిని విశ్వాసపాత్రులగు దనయాత్రికుల కిచ్చెను. వీరియందనేకులు గర్ణాటకులు గారు. పూర్వదేశమునుండి వచ్చిన తెనుగువారు. మఱియు గర్ణాటకదేశమునుండి రాయభండారమునకు జెందవలసిన కప్పము కోటిద్రవ్యమని నిశ్చయించి నగరి యక్షవణచిత్రాలలో దాఖలుచేయించి యచటినుండి తరలిపోయెను.

కృష్ణరాయ లొనర్చిన మార్పులవలన కర్ణాటకమున శాంతి నెలకొనెను; మఱి నూఱేండ్లదాక స్థిరమై నిర్వక్రముగ సాగినది. అచ్యుతరాయల రాజ్యారంభకాలమున నుమ్మత్తూరుదొరలు మరల తలయెత్తిరి; కాని వారి యాటలు సాగలేదు. శ్రీరంగపట్టణదుర్గాధ్యక్షులు స్వామిభక్తిపరాయణులై దేశమున కే విపత్తు రానీయక గాపాడుచు వచ్చిరి. కృష్ణరాయలచే గర్ణాటకమున స్థాపింపబడిన తెనుగునాయకులును, పాళెగాండ్రును గర్ణాటక సామంతులను, రాజవిద్వేషులను నణగద్రొక్కి రాయల యధికారము నిలబెట్టుటయం దప్రమత్తులై యుండిరి.

(సశేషము)



నాయకత్రయ నివేదిక-
ఆంధ్రరాష్ట్రనిర్మాణము

•

(ఒక ఆంధ్రుడు)

ఆంధ్రరాష్ట్రంవిషయం ముందుగా ఆలోచన లోకి తీసుకోవా లనీ, ఏ ఇతర రాష్ట్రంగురించి గాని విచారించడానికి పూర్వం ఆంధ్రరాష్ట్రనిర్మాణ పద్ధతిని అమలుచేయడాన్ని పరిశీలించా లనీ జయపూర్ కాంగ్రెస్ మహాసభ నియమించిన నాయకత్రయసంఘం ఉద్ఘాటించినందుకు యావదాంధ్రము ఆనందభరిత మైన దనడానికి సందేహం లేదు. అయితే రాష్ట్రం రాగల దని ఎంత సంతోషించిందో, రాష్ట్రం రావడానికి ఈ నాయకత్రయం విధించిన విపరీత, అసాధారణమర తులు అంత చింతించింది ఆంధ్రదేశం అనికూడా అంగీ కరించాలి. "ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలీ అంటే, ఆంధ్రరాష్ట్రం కావా లని ఘోషించేవారు చెన్న నగరం తమదే అనే హక్కును పరిత్యజించాలి"అని నాయకత్రయం షరతు పెట్టడం సబబుగా ఉం దని ఎవ్వరూ అంగీకరించరు. "స్వాతంత్ర్యం కావా లంటే జూన్ 3వ తేదీ పథకాన్ని అంగీకరించి, దేశవిభజనకు సమ్మతించండి" అని బ్రిటిష్‌ప్రభుత్వం ౧౯౪౭ వ సంవత్సరంలో భారతీయనాయకులను వొత్తిడిచేస్తే సబబుగా ఉం దని ఎవరు అన్నారు? ఆ తరువాత ఉభయఅధినివేశాలకు అధికారం దఖలు పరచి నందుకు బ్రిటిష్‌ప్రభుత్వ విధానాన్ని హర్షిం చినవారు కూడా జూన్ 3 వ తేదీ పథ కాన్ని తీవ్రంగా ఖండించినారు. దేశవిభజనను అంగీ కరించకపోయినా భారతీయనాయకులు జూన్ 3 పథకాన్ని ఆమోదించి దేశస్వాతంత్ర్యాన్ని సాధించి నారు. ఈనాడు దేశం విభక్త మైన దని విచారించేవారి కంటే, దేశం స్వతంత్ర మైన దని సంతోషించేవారే హెచ్చుమంది. ఆంధ్రులపాలిటికి అగ్రనాయకత్రయ నివేదిక ఒక విధంగా జూన్ 3వ తేదీ పథకమే అని చెప్పవచ్చును. ఆ పథకాన్ని అంగీకరిస్తేనే ఆంధ్రు లకు రాష్ట్రం వస్తుంది. ఆ నివేదికను తిరస్కరిస్తే రాష్ట్రం ఎన్నిసంవత్సరాలకు వస్తుందోకూడా చెప్పడం కష్టం అని ఆ నాయకత్రయసంఘసభ్యుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు ఎవరికీ ఏవిధమైన అను మానాలూ ఉండటానికి వీలులేకుండా విస్పష్టం చేశారు. అయినా మన ఆంధ్రనాయకులు ఈ విషయం స్పష్ట మైనవెంటనే "పీఠభద్రపళ్లెం" పట్టారు. రెండు మూడేళ్లక్రితం సరిహద్దుసంఘం అంటూ వారాని కో రోజు చేసిన హడావిడి తిరిగి ప్రారంభ మైంది. నగరంలో తెనుగుప్రాంతాలు అని అనుకున్న చోటల్లా సభలు చేస్తున్నారు. బ్రహ్మాండంగా, ౧౬ వ శతాబ్దం నుండి ౨౦ వ శతాబ్దంవరకూ చెన్నపట్టణం చరిత్రను వివరిస్తూ ఉపన్యాసాలు చేస్తున్నారు; తీర్మానాలు కావిస్తున్నారు. అయితే ఈ ఆందోళనలక్ష్యం ఏమిటో మాత్రం బోధపడడం లేదు.

"చెన్నపట్నం తెలుగుపట్నం" అనేవాళ్లు నగరాన్ని ఉమ్మడినగరంగా చేయమని సూచించడం విపరీతంగా కన్పిస్తుంది. ఇలాంటి సూచనవల్ల మొదటి వాదం పేలవ మౌతున్నది. "చెన్నపట్నం నిజంగా తెనుగుపట్నం" అని నమ్మినవారు నగరం ఆంధ్ర రాష్ట్రంలోనే చేరా లని ఆందోళనచేయాలి. అందుకు అవసరమైన ఆర్థిక, రాజకీయ, చారిత్రక దాఖలాలను

సేకరించి, దశాబ్దాలకైనాసరే రాని, అవచ్చినపుడు పరిహద్దునిర్ణాయకసంఘంవారికి సమర్పించి తీర్పును నిరీక్షించవచ్చును.

రెండోవాదం చెన్నపట్నాన్ని జాయింటు రాజధానిగా ఉంచా లన్నది. ఈ వాదంకూడా సమర్థనీయంగా కన్పించదు. ఇది ఎప్పుడూ రెండో పక్షమే. ఈ సందర్భంలో ఒక్క విషయాన్ని మాత్రం మనమూ, మన నాయకులూ గుర్తించుకోవాలి. విశ్వకళాపరిషత్తు కేంద్రాన్ని విశాఖపట్నం మార్చినందుకు ఈనాటి వరకూ అందుకు బాధ్యులైనవారిని నిందించేవారు ఆంధ్రరాష్ట్రానికి మద్రాసు రాజధానీనగరంగా ఉండా లనడం ఏమాత్రమూ సబబుగా లేదు. ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం కావా లనడానికి ఒక కారణం, ఇక్కడ చెన్నపట్నంలో కూర్చున్నవారు ఒరిస్సా పరిహద్దుప్రాంతపు వ్యవహారాలను సరిచేయజాల రనే నమ్మకం ఒకటి. అది యథార్థమేకూడా. ౬౦౦౦ మైళ్ల దూరంనుండి బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పాలించడం సబబు కాదుసరిగదా, తంతవ్యం గాదనికూడా విమర్శించియుండగా, ఆంధ్రరాష్ట్రంవిషయంలో చెన్నపట్నంలో ఉండే ప్రభుత్వంపై అలాంటి విమర్శ చేయడం సహేతుకమే. కాదని ఎవ్వరూ అనలేరు.

జాయింటు రాజధానిగా ఉండాలి చెన్నపట్నం అనే వాదాన్ని థార్‌కమిటీవారు సాకల్యంగా విచారించి అలాంటిది చరిత్రలో ఎక్కడా లేదనీ, ఒకే నగరం రెండు రాష్ట్రాలకు రాజధానిగా ఉండడంవల్ల అనేకపరిపాలనచిక్కులు ఏర్పడగలవు కనుక చెన్నపట్నాన్ని ప్రత్యేక ఉపరాష్ట్రంగా చేయా లని సూచించినారు. ఈనాటి ఆందోళననుబట్టి చూస్తే ఆంధ్రనాయకులు ఈ థార్‌కమిషన్ ప్రతిపాదనకు సుముఖంగా ఉన్నట్లు కన్పిస్తుంది. "బొంబాయి విషయంలో అలా చెప్పి చెన్నపట్నం విషయంలో ఇలా చెప్పడం ఏమి సబబుగా ఉంది" అని ప్రశ్నించడంలోనే నగరం సమిష్టిగా గాని, జాయింటు రాజధానిగా గాని, లేక ఆంధ్రరాష్ట్రంలో చేరి గాని ఉండా లని ఆంధ్రులు అభిలషించడం లేదని, పరోక్షంగానే కావచ్చు, స్పష్టమైంది. బొంబాయిని ఒక భాషారాష్ట్రరాజధానిగానే ఉంటానికి వీల్లేదన్న వారు, చెన్నపట్నాన్ని ఒకరాష్ట్రంలో సామాన్యంగా చేర్చడానికి సమ్మతిస్తారా? వారు సమ్మతిస్తేనేం, సమ్మతించకపోతేనేం? మా ఆందోళనను కొనసాగిస్తాం అంటే ఎవ్వరూ అడ్డుపడకపోవచ్చును. కాని అందువల్ల రాష్ట్రం రాలేదంటే, ఆ తరువాత రాగల గాలిదుమారాన్ని కూడా వీరు ఎదుర్కొనగలిగి ఉండాలి.

రాష్ట్రనిర్మాణవిధానం, అగ్ర నా యకత్రయ నివేదికలోని ఇతరఅంశముల విచారణ చేయడానికి పూర్వం చెన్నపట్నంగురించే మరొక్క విషయం చెప్పవలసిఉంటుంది. ఏనాడు చెన్నపట్నాన్ని ప్రత్యేక పరిపాలన గల ఒక ప్రాంతంగా ఏర్పాటుచేయవలసిందని మనం కోరామో అనాడే చెన్నపట్నం ఆంధ్రరాష్ట్రంలోనే చేరా లనే కోరికను వదులుకున్నట్లయింది. మిగతా తెనుగుప్రాంతాలతోనే ఆంధ్రరాష్ట్రం ఏర్పడడానికి వీరు సమ్మతించిన ట్లయింది. ఇది జరిగి దాదాపు పదిసంవత్సరములు అయింది. కనుక ఇవాళ కొత్తగా ఆంధ్రులు ఒక నిర్ణయానికి రావలసిన అగత్యం లేదు. అగ్రనాయకత్రయనివేదికను ఆమోదించడం ఆంధ్రుల అభిమతానికి విరుద్ధం కాదు. చెన్ననగరం ప్రత్యేకపరిపాలనాప్రాంతంగా ఉండా లనే ఆందోళనను విరమించా లని అగ్రనాయకత్రయనివేదిక ఎక్కడా ఆదేశించలేదు. కనుక ఈనాడు ఈ నివేదిక ప్రకారం రాష్ట్రాన్ని అంగీకరిస్తే చెన్ననగరం తమిళ రాజధాని అయిపోతుం దని భయపడ నవసరం లేదు. పట్నంలో ఉన్న ఆంధ్రులు ఆ ఆందోళనను అసాంతం సాగిస్తూనే ఉండవచ్చును. సామర్థ్యం ఉంటే ఇతర, తమిళేతరవర్గాలను సంఘటితపరచి, లక్ష్యాన్ని సాధింపనూ వచ్చును. ఈ ఆందోళనకు ప్రత్యేకాంధ్రరాష్ట్రం చేయూత నివ్వనూవచ్చు. ఈ విధంగా చేస్తేనే ఏదో ఒక మాటకు కట్టుబడి ఒక లక్ష్యాన్ని సాధించడానికి వీ లుంటుంది. కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైనతరువాత చెన్నపట్నం కార్పొరేషనువారు ఇచ్చిన స్వాగతానికి సమాధానం ఇస్తూ డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు "ఈ స్థానికస్వపరిపాలన రాష్ట్రస్వపరి

పాలనగా ఎలా పరిణామాన్ని పొందుతుందో చూడ వగును" అన్నారు. మద్రాసు అందరి కష్టంవల్లా పెరిగిం దన్నారు. వారి అభిప్రాయం మారినట్లు వారి ఇటీవలి ప్రకటనలు తెలుపుట లేదు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘంకూడా చెన్నపట్నం ప్రత్యేకపరిపాలనా ప్రాంతంగానే ఉండాలని కోరింది. కనుక నగరంలోని ఆంధ్రులు అందుకే కృషిచేయవలసి ఉంటుంది.

చెన్నపట్నాన్ని ఆంధ్రరాష్ట్రంతర్భాగం చేయాలనుకునేవారు మూడేళ్ల క్రితమే మేలుకోనవలసి ఉండెను. చెన్నపట్నం కార్పొరేషనువిస్తరణ పేరిట పూర్వపు పరిహద్దులకు సంశ్లిష్టముగా ఉన్న అనేక తమిళజనాభా అధికంగా గల శివార్లను నగరంలో చేర్చివేసిరి. ద్విభాషాప్రాంతాలలో, చెన్నపట్నంతో సహా తమిళమే వ్యవహారభాషగా మార్చివేసిరి. నేటి ఉమ్మడిప్రభుత్వంవల్ల ఆంధ్రోద్యమమునకు, ఆంధ్ర అపేక్షలకు ఎలాంటి ప్రమాదం ఘటిల్లుచున్నదో తెలుసుకోవడానికి ఈ రెండు స్వల్పవిషయాలూ చాలు. కనుక సాధ్యమైనంత త్వరలో ప్రత్యేకాంధ్ర పరిపాలన, రాష్ట్రము ఏర్పడేటట్లు నాయకులు చూడ వలసియున్నది.

బొంబయినగరం ఎలాగో ఇంచుమించు చెన్నపట్నంకూడా అంతే అని అగ్రనాయకత్రయమే అంగీకరించినప్పుడు, ధార్ కమీషన్‌వారు బహుభాషాపట్టణాలను ఒక ప్రత్యేకసమస్యగా పరిగణించి, అన్నింటికీ ఒకేవిధమైన పద్ధతిని ఏర్పాటుచేయాలని సూచించినపుడు చెన్నపట్నంలోని తమిళేతరులందరి ఆందోళన ఫలింపదని నిరాశ చెందవలసినఅగత్యం కన్పించడం లేదు. అయితే అందరూ ఒకే మాటకు కట్టుబడి, ఒకే పరిష్కారపద్ధతిని కోరడం చాలా అవసరం. ధార్ కమీషన్‌కు సాక్ష్యం ఇస్తూ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారే చెన్నపట్నంవిషయంలో మూడు నాలుగు సూచనలను చేశారు. "చెన్నపట్నాన్ని ఆంధ్ర రాష్ట్రంలో చేర్చడం వాంఛనీయం; అది సాధ్యం గాని పక్షంలో, అది సమ్మతం కానపుడు ఉత్తర మద్రాసు ఆంధ్రరాష్ట్రంలో చేరాలి. అదీ అంగీకారం కాకపోతే కృష్ణానదీతీరాన నూతనాంధ్రరాజధాని ఏర్పడేవరకూ ఆంధ్రరాష్ట్రానికి చెన్నపట్టణమే రాజధానిగా ఉండాలి." ఇది కాశేశ్వరరావుపంతులుగారు చేసిన సూచన. ఇంచుమించు మన నాయకులందరూ ఇదే ధోరణిలో చెన్నపట్టణానికి అనేకపరిష్కార మార్గాలు సూచిస్తూవచ్చారు. మామిడిపూడి వెంకటరంగయ్యగారు ౧౯౪౯ ఆగస్టు ౨౪ వ తేదీన నగరంలో జరిగిన ఒక సభలో ఉపన్యసిస్తూ చెన్నపట్నం బహుభాషాపట్నం అని అంగీకరించి ఉత్తర భాగాన్ని ఆంధ్రలో చేర్చాలనీ, అది వీలుకాని పక్షంలో చెన్నపట్నంవంటి నగరాలను కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో ఉంచాలనీ సూచించారు. ౧౯౪౯ ఆగస్టులో ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు కార్యవర్గం చెన్నపట్నంపై ఆంధ్రుల హక్కులను ఉద్ఘాటిస్తూ పరిహద్దుసంఘం నగరాన్ని ప్రత్యేకరాష్ట్రంగా చేయాలని సూచిస్తే ఆ విధమైన పరిష్కారానికి తమకు అభ్యంతరం లేదని తీర్మానించింది. ఆంధ్రుల వాదం దుర్బలం కావడానికి మనం ఇన్ని ప్రత్యామ్నాయాలను సూచించడమే కారణం. ఈనాటికీకూడా "పట్నంపై హక్కులను వదులుకోము" అని ఘోషిస్తూ ధార్ కమీషను ప్రతిపాదనను ప్రశంసిస్తున్నాం. ఈ రెండూ పరస్పర విరుద్ధం అని మనం గుర్తింపవలసియున్నది.

చెన్ననగరాన్ని ప్రత్యేకరాష్ట్రంగా చేయాలని పట్టణాంధ్రులు ఆందోళన చేయడం ఉత్తమం. అట్టి ఆందోళనను ఆంధ్రరాష్ట్రప్రభుత్వం బలపరచడం విధాయకం. ధార్ కమీషనువారు తెలిపిన లెఖ్ఖలను బట్టి చెన్నపట్నం మిగులురాష్ట్రంగా ఉంటుందని స్పష్టమైంది. కార్పొరేషనువారి విశాలచెన్నపట్టణం స్థాపన సాధ్యం గనుక బొంబయినగరాన్ని చేసినట్లే చెన్నపట్నాన్నికూడా ప్రత్యేకరాష్ట్రంగా చేయడం కష్టసాధ్యం గాదు. ప్రపంచచరిత్రలో ఇట్టి పట్టణ ప్రభుత్వాలకు సామ్యములు లేకపోలేదు. అసలు బి. యన్. రావుగారి ఉపరాష్ట్రాల పథకాన్ని అనుసరించి చెన్నపట్నం ఉమ్మడిరాజధానిగా ఉండవలసింది. స్ట్రాఫోర్డ్‌క్రిప్సు ప్రకారం ఆంధ్రులకు విజయవాడ, అరవలకు మధురగాని, తిరుచునాపల్లిగాని రాజ

ధానులై చెన్నపట్నం కమీషనరురాష్ట్రం కావలసింది. నూత్నరాజ్యాంగంలో అట్టి ఉపరాష్ట్రాలకు స్థానం లేదని చెప్పవచ్చు. కాని బొంబాయికి ప్రత్యేకప్రభుత్వం సాధ్యమైనప్పుడు చెన్నపట్నానికి మాత్రం ఎందుకు సాధ్యం కాదు? అయితే ఆంధ్రులు మాత్రం రాష్ట్రంవిషయంలోనూ, చెన్నపట్నంవిషయం లోనూ ఒక నిశ్చితాభిప్రాయానికి రావలసిఉంటుంది. ఆమాదిరి నిర్ణయానికి రాకపోతే ఆంధ్రులు చేతులారా రాష్ట్రాన్ని పోగొట్టుకున్నవా రౌతారు.

చెన్నపట్నాన్ని ఆంధ్రరాష్ట్రంలోనే చేర్చాలనేవారు, చెన్నపట్నాన్ని బొంబాయిలాగానే ప్రత్యేకరాష్ట్రంగా చేయాలనేవారు తమ వాదం ఎంతవరకు హేతుబద్ధంగా ఉన్నదో విచారించుకోవాలి. బొంబాయి తమ రాష్ట్రంలోనే చేరాలనే మహారాష్ట్రులు నగరంలో నూటికి ౪౦ మంది వంతున ఉన్నారు. మన నాయకులు మహారాష్ట్రుల కోరికను బలపరచడానికి బదులు చెన్నపట్నాన్నికూడా బొంబాయిలాగానే ప్రత్యేకరాష్ట్రంగా చేయాలంటున్నారు. అంటే బొంబాయి మహారాష్ట్రులకు చెందరాదనే మనవారి అభిప్రాయమైనట్లు స్పష్టమౌతున్నది. ఈ విధంగా బొంబాయివిషయంలో చెప్పేవారు చెన్నపట్నం ఆంధ్రలోనే చేరాలని కోరలేరు. జనాభానుబట్టి గాక, నగరప్రాధాన్యమునుబట్టి ప్రత్యేకరాష్ట్రం చేయాలని అంటున్నాం అని వాదిస్తే, అప్పుడు చెన్నపట్నం ఆంధ్రరాష్ట్రంలో చేరాలి అనే నినాదాన్ని మానివేయక తప్పదు. ఒక సిద్ధాంతాన్నిబట్టి గాక, కేవలం సెంటిమెంటునుబట్టి వాదాన్ని కొనసాగిస్తే ఏమీ ప్రయోజనం ఉండదు.

ఆంధ్రనాయకులకు ఇది యథార్థంగా పరీక్షా సమయం. రాష్ట్రం రాకపోయినా సరే, చెన్నపట్నం అంతు తేల్చుకోవాలని అనుకుంటే ఈలోపున రాష్ట్రం అధోగతిపాలై పోతుం దనడానికి సందేహం లేదు. రామపాదసాగరుప్రాజెక్టు బుట్టదాఖలైనది. మాచఖండ్ ప్రాజెక్టు కూలబడబోతున్నది. "అరవప్రాంతాలకు అధికంగా లాభించే కృష్ణా-పెన్నారు ప్రాజెక్టు" పని చురుగ్గా సాగి తుంగభద్రాప్రాజెక్టుకు అడ్డుపడవచ్చు. ఈ క్షణంలో రాష్ట్రం వచ్చినా, ఆంధ్రులు యావన్మంది ఒక్క తాడుమీద నడిచి, అపారత్యాగములు చేసినా, ఆంధ్రరాష్ట్రం ఇతరరాష్ట్రాలతో సరిసమానంగా నిలబడేందుకు అధమం ౨౦ సంవత్సరాలు పడుతుంది. రాష్ట్రం వాయిదాపడినందువల్ల ఈ అభివృద్ధి ఇంకా వెనకపడిపోతుంది. అంచేత కేవలం 'సెంటిమెంట్'కు బానిసలు కాక వాస్తవికదృష్టితో విషయాలన్నింటినీ పరిశీలించి ఆంధ్రనాయకులు ఒక నిర్ణయానికి రావలసిఉంటుంది. ఆ నిర్ణయానికి వచ్చిన తరువాత మనకు సహజమైన ఔదాసీన్యమునకు, నిర్లిప్తతకు స్వస్తి చెప్పి ఆ నిర్ణయం తత్‌క్షణం అమలుజరిగేటట్లు చూడవలసిఉంటుంది.

ఇక రాష్ట్రనిర్మాణం సంగతి వస్తే అది ఎలా జరగాలి అన్న విషయంలోకూడా మన నాయకులకు ఒక విస్పష్టమైన అభిప్రాయం లేకుండా వచ్చింది. ఇండియాప్రభుత్వచట్టం ౪౦ వ సెక్షనుప్రకారం ఆంధ్రను రాష్ట్రాల జాబితాలో చేరిస్తే చాలని అన్నారు. మూడుసంవత్సరాలక్రితం "ఆంధ్రపత్రిక" రాష్ట్రనిర్మాణానికి ౪౦ వ సెక్షను గాక ౨౯౦ వ సెక్షను సాధన కావలసిఉన్నదని హెచ్చరించింది. పరిషత్తు ఏర్పాటుచేసిన రాజ్యాంగరచనాసంఘం "కేవలం షెడ్యూలులో చేరినంతమాత్రాన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ"దని, ఇప్పటి భారతరాజ్యాంగచట్టంలోని ౨౯౦ వ సెక్షనుప్రకారం రాష్ట్రనిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటేగాని నూత్న రాజ్యాంగంలోని మొదటి భాగం మొదటి షెడ్యూలులో ఆంధ్రరాష్ట్రాన్ని చేర్చ వీలు గాదని, చేర్చి ప్రయోజనం లేదని బల్లగుద్ది చెప్పేవరకూ మన నాయకులు ఏలాగైనా షెడ్యూలులో ఆంధ్రను చేర్పించితే చాలునని అనుకొని, అలా చేయడానికి చాలా తాపత్రయపడ్డారు.

సెక్షను ౨౯౦ ప్రకారం ఆంధ్రరాష్ట్రం ఏర్పడడానికి ఎంతో వ్యవధి అవసరం లేదు. ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్టాభి సీతారామయ్యగారు ౧౯౫౦ ఏప్రిల్ నాటికి రాష్ట్రం ఏర్పడవచ్చునని, కొత్త ఎన్నికలతో ఆంధ్రకు ప్రత్యేకప్రభుత్వం ఏర్పడ

వచ్చునని సూచించారు. చెన్నరాష్ట్రప్రధాని కుమార స్వామిరాజాగారు ౧౯౫౦ం ఏప్రిల్ నాటికి ఆంధ్రకు ప్రత్యేకప్రభుత్వం ఏర్పడగలదని సూచించారు. కాని ఆంధ్రులు అగ్రనాయకత్రయని వేదికను ఆమోదించిన నాటినుండి మూడు మాసాల్లో ఆంధ్రరాష్ట్రం ప్రత్యేక ప్రభుత్వంతో సహా ఏర్పడగల దని పంజాబు, వంగ రాష్ట్రముల విభజన, భారత, పాకిస్తాన్ అధినివేశముల నిర్మాణం నిరూపిస్తున్నవి. "ఒక నిర్ణయం జరిగిన తరువాత ఆ నిర్ణయం వెంటనే అమలు జరుగని పక్షంలో ఏలాంటి ప్రమాదాలు రాగలవో భారతదేశవిభజన వెల్లడించింది."

పెద్దసమస్య రాష్ట్రసరిహద్దుల నిర్ణయం. ఈ విషయంలో రాష్ట్రపతి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా ఇంచుమించు ఒకే అభిప్రాయంతో ఉన్నట్లు స్పష్ట మౌతున్నది. సరియైన సరిహద్దులను సరిహద్దు నిర్ణాయకసంఘం నిర్ణయించేవరకూ ఇప్పటి కాంగ్రెసు రాష్ట్రాన్నే ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పాటు చేయా లని ఆంధ్రకాంగ్రెస్ కార్యవర్గం తీర్మానించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పట్టాభిసీతారామయ్యగారుకూడా ఇదే పద్ధతిని సూచించిరి. కనుక గవర్నరుజనరలు ౨౯౦ వ సెక్షనుప్రకారము వెంటనే ఉత్తరువులు చేయవచ్చును. ప్రస్తుతం సరిహద్దులు తాత్కాలికంగా నిర్ణయమైతే, ఇక రాష్ట్రనిర్మాణానికి అవసర మైంది ఉమ్మడిరాష్ట్ర ఆస్తి, అప్పుల విభజన. ఆస్తులు, అప్పులు అనేసరికి చాలామంది దాదాపు రెండు శతాబ్దాలనుంచే లెఖ్ఖలు తీయవలసిఉంటుం దని భావిస్తున్నారు. అది చాలా పొరబాటు. ఆంధ్రజిల్లాల్లో ఉన్న ఆస్తి ఆంధ్రప్రభుత్వానికి, తమిళప్రాంతంలో ఉన్నది తమిళరాష్ట్రానికీ చెందుతుంది. ఉమ్మడిగా ఉంటున్న (ఉదాహరణకు మద్రాసురేడియోకేంద్రం) ఆస్తి ఏదో ఒక రాష్ట్రానికి చెందితే అది లెఖ్ఖలోకి తీసుకోవలసివస్తుంది. ప్రభుత్వంఆస్తి, రికార్డుల విభజన వాదాలపై పూర్తికావచ్చు. ఆదాయంపన్ను శేటాయింపు, రిజర్వునిధిపంపకం ఇవన్నీ పుస్తకాలు చూచి చేసుకోవలసిన పనే గనుక అదనపు సిబ్బందిని నియమించి మాసంలోపుగా పనిని పూర్తి చేయించవచ్చును.

రాష్ట్రనిర్మాణం విషయంలో ఆంధ్రులు ప్రత్యేకం శ్రద్ధ వహింపవలసిన విషయం ఒక్కటున్నది. రాష్ట్రం ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్రం ఆధారంగా ఏర్పడవచ్చును. అయితే ఆ విధంగా ఏర్పాటు చేస్తానే సరిహద్దుల నిర్ణయసంఘాన్ని కూడా వెంట వేనియమించాలని పట్టుబట్టవలసిఉంటుంది. అగ్రనాయకత్రయ సంఘమువారు ఉత్తరాదిన ఇలాంటి సరిహద్దుల మార్పు జరుగరా దన్నారుగాని, దక్షిణాదిన అట్టి నిర్ణయం ప్రమాదభరిత మని భావించియుండలేదు. ముందెప్పుడో ఈ విషయం విచారింపవచ్చు నని వాయిదా వేయడంవల్ల ఆంధ్రులకు ఇదివరకు చాలా నష్టం కలిగింది. ఒరిస్సా సరిహద్దునిర్ణయంలో దాదాపు ౧౫ సంవత్సరాల క్రితం జరిగిన అన్యాయం ఈనాటివరకూ సర్దుబాటుకాలేదు. బళ్లారిజిల్లా సరిహద్దులూ అలాగే కావచ్చు. ఆంధ్ర-తమిళ సరిహద్దులు అలాగే జరుగవచ్చును. కనుక ఈ సమస్యకూడా ఈ వేడిలోనే సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కావడం అవసరం. ౧౯౩౬ వ సంవత్సరంలోగాని, లేక అంతకుపూర్వం సింధు, ఒరిస్సాలు ఏర్పడినపుడుగాని ఆంధ్రరాష్ట్రం ఏర్పడిఉంటే ఇంత అన్యాయం జరిగిఉండేది కాదు. కాంగ్రెసుఅధ్యక్షుడు బొంబాయిలో పత్రికావిలేఖరులతో ముచ్చటిస్తూ చెన్నపట్నంవిషయం కొన్నాళ్లయినతరువాత పునరాలోచింపవచ్చు నని చెప్పిరి. రాష్ట్రప్రధాని కుమార స్వామిరాజాగారూ ఇదేవిధంగా చెప్పినారు. కాని రాష్ట్రపతి తిరిగి చెన్నపట్నం వచ్చి పత్రికావిలేఖరుల సభలో మాట్లాడుతూ ఆంధ్రులు చెన్నపట్నంపై తమ హక్కులను శాశ్వతంగా వదులుకుంటేనే ప్రత్యేకాంధ్రరాష్ట్రం కాంగ్రెస్అగ్రనాయకత్రయని వేదిక ప్రకారం ఏర్పడగల దని అసందిగ్ధంగా ప్రకటించారు. ఇతరసరిహద్దుల విషయంలోనూ అలాంటి ప్రకటనలు వెలువడేందుకు పూర్వమే ఈ వివాదగ్రస్తమైన సరిహద్దుల నిర్ణయం జరగడం అవసరం.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడేందుకు ఇంక ఎవరు పని ప్రారంభించాలి అన్నది ప్రశ్న అయినట్లు కన్పిస్తున్నది. కాంగ్రెస్ కార్యవర్గం నివేదికను తమ తీర్మానంతో సహా కేంద్రప్రభుత్వానికి పంపించింది. కేంద్రప్రభు

త్వమే ఆ తీర్మానాన్ని అనుసరించి అవసరమైన చర్య తీసుకోవడం సబబు. ౩౦ వ సెక్షను (ఎ) ప్రకారం చెన్న రాజధానివిభజనపై మద్రాసుప్రభుత్వాభిప్రాయాన్ని లాంఛనంగా కనుక్కోవలసిఉంది. మద్రాసు ప్రభుత్వం అగ్రనాయకత్రయనివేదికను ఆమోదిస్తుందనడానికి సందేహం లేదు. ధార్కమీషనుప్రశ్నకిచ్చి పంపిన సమాధానం, ఈ నాయకత్రయ నివేదికకు విరుద్ధంగా లేదు. చెన్నరాష్ట్రమంత్రివర్గం తన అభిప్రాయం తెలపడంతోబాటు అగ్రనాయకత్రయ నివేదికపై శాసనసభలోని ఆంధ్రసభ్యులందరి అభిప్రాయం తెలుసుకోవాలి. లేక రాజ్యాంగపరిషత్తు అధ్యక్షుడు రాజ్యాంగపరిషత్తులోని ఆంధ్రసభ్యుల అభిప్రాయం తెలుసుకోవచ్చును. ఈమాసంలోనే రాజ్యాంగపరిషత్తు సమావేశమౌతున్నది కనుక ఈ కలాపం అంతా వెంటనే పూర్తికావలసిఉంది. రాజ్యాంగపరిషత్తులోని ఆంధ్రసభ్యులు తమ సమ్మతి తెలుపుట ౩౦ ప్రకారం గవర్నరుజనరలు ఉత్తరువుచేయుటకు సరిపోవగలదు. చెన్నరాష్ట్రశాసనసభయందలి ఆంధ్రసభ్యులుకూడా ఇదే ప్రకారం సమావేశమై అగ్రనాయకత్రయనివేదికను ఆమోదిస్తూ, రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గం చేసిన తీర్మానంప్రకారం ఆంధ్రరాష్ట్రాన్ని వెంటనే ఏర్పాటుచేయవలసిం దని కేంద్రప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేయవలెను. ౧౯౪౯ ఆగస్టు ౧౫ నాటికి ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలనే దీక్షతో పనిచేసిన సాధ్యంకాగలదు. రాజధానివిషయంలో ఇబ్బం దేమీ ఏర్పడ నవసరంలేదు. పాకిస్థాన్ ఏర్పడి, కరాచీకి ప్రభుత్వం మారేవరకూ, భారత పాకిస్థాన్ ప్రభుత్వాలు ఢిల్లీలోనే వ్యవహరించినట్లు విజయవాడలో ప్రభుత్వకార్యాలయములకు సదుపాయాలు కలుగువరకూ ఆంధ్రేతరప్రభుత్వంతోబాటు ఆంధ్రప్రభుత్వం కూడా మద్రాసునుండే వ్యవహరింపవచ్చును.



పెంపకం

[కథానిక]

శ్రీ కందుకూరి లింగరాజు

"ఏదైనా ఉద్యోగం చేస్తానండి"—పేపర్లో తన నెంబరు మిగిలిపోయిన పార్టులో ఉండడం చూచి, నిట్టూర్పు భారంగా వదులుతూనే, రాజా అన్నాడు.

అంతవరకూ అయిదుసార్లు వెళ్లేడు. వెళ్లినా, విశ్వవిద్యాలయం కృతకృత్యు డవడానికి అనుజ్ఞ ఇచ్చేదే కాదు. ఈ రెండు సంవత్సరాల్లోనూ రాజాని కనీసం నెలకి పదిమందైనా అడిగేరు. ఆ ప్రశ్నలు చిరాకు కల్గించేవి. న్యూనతపరచినట్లే వుండేవి. పైగా తోడి వారలు వల్లగాను తోడుక్కోవడం తలతీసినట్లే వుంది.

రామయ్యపంతులు చదువుతున్న పేపరు ఓపారి దించి, కొడుకువైపు చూచేడు ఆశ్చర్యంతో. "ఉద్యోగం...ఇంటర్మీడియట్ కే ఎవ డిస్తాడు ?."

"ఎక్కడో అక్కడ...సర్వీస్ కమిషన్ కడతా". ఈమాటలు రామయ్యకి న్యూనత కల్గించేయి.

అసలు తను ప్రవేశించడమే ఉద్యోగిహోదాలో ప్రవేశించి, ప్రభుత్వానికి చీము రక్తం ధారపోసి, మేడమెట్లు ఎక్కేడు. ఆఖరుకు మేడమీద కూర్చునే ఉద్యోగంకూడా అయింది. తనకొడుకు ఇంత నీచంగా, నలభైరూపాయిల ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేని విష యంలా ఉంది.

తన ఆశల్లో కనీసం బి. ఏ. అయినా అయి, ఉద్యోగిస్థాయిదాల్లోనే చేరాలన్న ఊహ వెనక నిలుచుంది. అంతవరకూ కొడుకుని గారాబంగానే పెంచేడు. వాడు పుట్టినప్పటినుంచి ఖర్చు ఎక్కువే అయినా భరించేడు. భరించడంలోకూడా వొప్పి కల్గినా ఓర్చుకునే.

తండ్రి ఆలోచనలో పడ్డం రాజాకు ఆలోచన కలిగించింది. తనకు నిజంగా లోపల చదవాలని వున్నా, తను ఆ కాలేజీల్లో ప్రవేశిస్తే చదవ లేనని తెలుసు. చదివినా పట్టా రావడానికి, క్రిందటి అనుభవం 'కొన్ని సంవత్సరాలు పట్టావచ్చు'అనే చెపుతోంది.

"పోనీ, డాక్టరీ చదవమన్నారా ?"

"ఛీ ! చావులు, బ్రతుకుల మధ్య జీవనం. మన వంశంలో ఎవరూ చదవనేలేదు."

"ఇంజనీరింగు...?"

"నీది లెఖ్ఖలుగ్రూపు కాదేమో !"

పాలుపోయింది కాదు రామయ్యపంతులకు. తన వూహల్లో బి. ఏ. అయినతర్వాత, కనీసం తన బావగారు—ఆయన వో రిటైర్డుకలెక్టరు—తన పైఅధికారి సహాయం చెయ్యకుండా ఉంటారా అన్న ధైర్యం.

"మరి ఏం చెయ్యమన్నారు ? ఉద్యోగమూ అక్కరలేదు. డాక్టరీ మంచిది కాదు. ఇంజనీరింగుకు ప్రవేశం లేదు. మరి ?"

కొడుకుప్రశ్న నిలబెట్టినట్టే అయింది. కోపం తెప్పించింది. అంతవరకూ తను ఆఫీసులో గుమాస్తాలను, బంట్రోతులను నిలవనియ్యకుండానే ఆజ్ఞాపించేవాడు. ఇక్కడ పాలుపోకుండానే సందిగ్ధంలో పడి పోయేడు.

తను సంపాదించి, తిండీ బట్టా ఇస్తుంటే, పడి తింటూకూడా, తన్ని విమర్శించడానికి ఎందుకు కాలు దువ్వుతాడో తెలియటం లేదు.

"మద్రాసులో బావకు వ్రాస్తా...సైన్సు బి. ఏ. లకు మంచి భావి వుందేమో"అంటూ ఖండువా భుజంమీద వేసుకుని వెళ్లేడు.

ఆ చెప్పడం ఇరుకున పెట్టినట్టు ఉన్నా, ఏం చెయ్యాలో తెలియని స్థితిలో పడిపోయేడు. తలలో అనేకఆలోచనలు ఒచ్చేయి. అంతవరకూ తండ్రి అడిగినంతా డబ్బు పంపించడంతో ఏర్పడిన దూబరాఖర్చు నరాల్ని పీకేది. డబ్బు లేక, ఈ మార్చి సెప్టెంబరుల్లో ఉండడం, తనను ఎంత బాధపెట్టిందో ఓర్చుకోలేని స్థితికి తెచ్చిపెట్టింది. ఈ లేమే ఉద్యోగానికి ప్రోత్సహించిందికూడాను.

ఆ నెలల్లో తండ్రిని అడుగుదా మనుకున్నాడు. వచ్చిన ఇరవై దరిదాపువయస్సు మనస్సును నలిపింది. 'మెజారిటీ' 'ఇంకా అడగడం ఏమిటే!' అని చెప్పింది. అమ్మని అడిగేడు. "మీ నాన్న నాకు డబ్బుకూడా ఇస్తాడా ఏమిటి? అంతగా నమ్మకం లేకపోతే తాళంచెవి ఇస్తా, నా పెట్టి చూచుకో" అనేది.

ఈ పరిణామం, మళ్లీ చదువంటే వెనక్కి తీసింది. అయినా...

మద్రాసునుంచి ఉత్తరం రావడం, ఎస్టేట్ కలెక్టర్ గారికి ఓఉత్తరంతో, రాజా నగరంలో చేరిపోయేడు. బి. ఏ. లోనే, సైన్సుగ్రూప్‌లోనే.

* *

రామయ్యపంతులు ఆ రెండు వత్సరాల్లోనూ కనీసం మూడువేలైనా ఖర్చుపెట్టేడు. అడిగినప్పుడల్లా పంపనే పంపేడు. పెద్దపరీక్షలు అయి ఇంటికి వస్తా డనేటప్పటికి, ఏదో బరువు తీసినట్టే అయింది. తన బావకు, ఇక స్పెక్షనుకు వచ్చిన పైఅధికారికి ఓసారి తన కొడుకుసంగతి జ్ఞాపకంచేసేడు. వాళ్లు అన్న మాటలతో ధైర్యపడిపోయేడు.

వీళ్లిద్దరూ, కనీసం ఓవందరూపాయిలకు తక్కువకాని ఉద్యోగం ప్రభుత్వందగ్గర వూళ్లాక్కనైనా ఇస్తారనే ధీమాతోనే అంతస్తులు కట్టేడు. ఉద్యోగం ఎల్లాగా అవుతుంది; పెళ్లి కూడా చేసేస్తే ఓవిధంగా బాధ్యత తీరిపోతుం దని వూహించేడు. అప్పుడే వలుసరైదుసురు రావడం, వాళ్లు మూడు, నాలుగు, ఐదువేలుకూడా ఇస్తా ననడం గర్వంగా వుండే విషయమే అయింది.

పెళ్లివిషయంలో తన అక్కగారితో చర్చించేడు కూడాను. ఒక్క ఈ విషయమే ఏమిటి, ప్రతీ విషయమూనూ. ఆఖరుకు పెళ్ళానికి చీరెలు కొనాలా, అక్కర్లేదా అన్న చిన్నసంగతికూడాను. ఇల్లా ప్రతీదీ అడగడానికి కారణం లేకపోలేదు. రామయ్య పంతులకు చిన్నతనంలోనే తల్లీ, తండ్రీకూడా పోయేరు. అప్పటినుండి ఆవిడే గురువైపోయింది. అతని చదువు, ఉద్యోగం, అన్నీకూడా ఆమె పురమాయించినవే. ఇంట్లో పెత్తనంకూడా ఆమెదే.

ఒక్క మాటలో చెప్పాలంటే, సన్నంగా, పూచలా ఐదడుగులలోపు వుండే ఆవిడమాట వినాలి. వినితీరాలి. ఇతరులుకూడా దాన్ని దాటి వెళ్లకూడదు అన్న భావం మిద్దెకట్టుకు కూర్చునేది. ఆవిడా ఉన్న తెలివితేటల్తో, రామయ్యని కొంగున ముడేసుకునే చెలాయించింది.

ఒక్కొక్కప్పుడు రామయ్యకు ఆవిడ చెప్పే పనుల్లో కష్టం తోచినా, ఎదురు తిరగడానికి దమ్ములు చాలేవికావు. ఎదురుగా పెంచిన, పైకితెచ్చిన కృతజ్ఞత ఉట్టికట్టుకోవడంవల్ల తన వ్యక్తిత్వమే చంపుకుని, ప్రభుత్వాన్ని ఆవిడకు అప్పజెప్పేసేడు. ఈ స్థితికూడా ఉంచవలసిన కొలమానం దాటి, ఆమె ప్రతీ విషయంలోనూ జోక్యం కల్పించుకొని, ఆఖరుకు ఆఫీసు, ఇంటి, స్వ, పరకీయాల్లో సలహాలు చెప్పడంతో, రామయ్య పంతులు అసలు ఇంక తను ఆలోచించడం ఎందుకు అన్న స్థితిలో పడిపోయాడు. ఇది ఒక్కొక్కసారి తిరగబడ్డా, సందిగ్ధం ఎక్కువై ఏమీ చెయ్యలేని, స్త్రీపెంపకపు బిడ్డలాగే తయారై కూర్చున్నాడు. దీంతో ఈ లేనితనం నోరుకట్టుకుని లోపల కూర్చుంది.

ఆరోజుల్లో రోజూ పేపరు చూస్తూనే ఉండేవాడు రామయ్యపంతులు ఫలితాలు వచ్చేయేమో అని. ఉండబట్టలేకనే ఆరోజు అడిగేడు.

"ఏదో వ్రాసేను"

కోపం వచ్చింది. తన సంచీకి చిల్లుపెట్టి మూడు వేలుపైగా ఖర్చుపెట్టేడు. కాలేజీలో ఉన్నప్పుడే వాళ్లవల్లా వీళ్లవల్లా వింటూ నేవున్నాడు—'మీ వాడు కాలేజీ నాటకాల్లోనూ, విద్యార్థుల యూనియన్‌లోనూ పాల్గొంటున్నా' డని; పైగా చిల్లరగా పెధవకథలు పత్రికలకు వ్రాస్తున్నాడని కూడా విన్నాడు. ఇప్పుడు ఉద్వేగం ఆగక—

"చదువు మానేసి, కథలూ, నాటకాలలో పాల్గొంటూ కూర్చున్నా వన్నమాట".

ఉలిక్కి పడ్డాడు రాజా. నిజంగా అతని జీవితం అక్కడ అల్లాగే జరిగిపోయింది. అయినా తన కాలేజీ తన్ని మరిచిపోకుండా చేసుకున్నాడు. ఇదంతా ఎల్లా తన తండ్రికి తెలిసిందో అర్థం కాలేదు.

"పేపర్లు..."

"నీముఖం...నువ్వు చదవక పేపర్లు కష్టంగా వున్నాయంటే అర్థం ఏమిటి? ఇక్కడ నే నెంత వచ్చి డబ్బు పంపించేనో అర్థం కాదు. ఎప్పుడూ డబ్బు, డబ్బు! ఉత్తరం రావడంతడవు; డబ్బు, డబ్బు...కాని చదువో..."తడబడ్డాడు.

"మీా రిల్లా అంటారనే, ఉద్యోగం చేస్తానన్నా."

ఏం సమాధానం చెప్పాలో వెంటవెంటనే అర్థంకాకపోయినా, కోపం ఒణికిస్తుంటేనే—

"మహా చేసేవ్...ఇది ఇల్లా వెలగబెట్టేవ్, అది ఇంక తగలెడతావ్" అన్నాడు.

గబగబా, అన్నంముద్ద తినకుండానే వెళ్లిపోయాడు రాజా. ఒక్కటీ అర్థంకావటం లేదు. తన తండ్రి తనను ఇల్లా ఎందుకు ప్రతీపనిలోను దిగనారుస్తాడని ఆలోచించేడు. తనకు జ్ఞానంవచ్చినప్పటినుండి, కనీసం ఒక్క విషయంలో 'మంచిది. అది చెయ్యి' అని చెప్పిన విషయం కన్పించలేదు.

చాలాసార్లు ఎదిరిద్దా మన్న వూహ కల్గింది. ఎదిరించి, తను తనపంథాని, మార్గాన్ని వాళ్లమీాద రుద్దలేకుండానే వున్నాడు. ఎంత చెప్పినా తన దృక్పథం వాళ్ల దృష్టిలో తప్పు. ఏంచెయ్యాలో పాలుపోకనే బాధపడేవాడు.

ఆవారంలో పరీక్షరిజల్ట్సు వచ్చేయి. ఒక్క తెలుగులోనే ప్యాసయివుండడం రామయ్యకి అరికాళ్ల మంటలు పెట్టినట్టే అయింది. నాలుగూ దులిపేసేడు. పోయిన డబ్బుకు, ఎదురుసమాధానం చెప్పే కొడుక్కీ, గుండెలు మండుకుపోయేయి.

తనకు ఎదురుసమాధానం చెప్పేవాణ్ణి ఏం చెయ్యాలో పాలుపోలేదు. తన జీవితంలో తన అక్క గారికి ఎప్పుడూ ఎదురుచెప్ప లేదు. మరి తన కొడుకు తప్పుచేసికూడా, కట్టె విరిచినట్లు ఎందుకు మాట్లాడుతాడు? తల్లిపోలిక వాడికి వచ్చిందేమో అనుకున్నాడు. కాని తనకు, అక్కగారికికూడా, తక్కువ వేవల్లే చాకిరీచేసే, మాటలు వచ్చా అన్న అనుమానం కలగజేసేట్టే వుందే. మరి...

తన ఆఫీసులో గుమాస్తాగా వేయిద్దా మనుకున్నాడు; సెప్టెంబరు నెలవరకూ. అయినా అది తాహతుకు తగ్గట్టుగా కన్పించలేదు.

ఆ రోజుల్లో రాజాస్నేహితుడు గణపతి రావడం ఆశ్చర్యపరచింది రామయ్యపంతుల్ని—ఎందుకు వచ్చేడా అని. ఉండిఉండి "నేను మిలిటరీ క. పి. ఓ. సెలక్షనుకు పెట్టేను, మీా అబ్బాయినికూడా దరఖాస్తు చెయ్యమనండి"అన్నాడు.

ఉలిక్కిపడ్డట్టే అయింది. తను ఎదటబడి చెప్పలేని విషయాన్ని స్నేహితుడితో చెప్పించడానికి రమ్మన్నా డన్నమాట. యుద్ధం! పేరు వింటేనే తనకు భయంగా వుంది. అయినా బ్రాహ్మణుడికి, కులగోత్రాలు లేని తిండి, దేశంకాని దేశంలో, పీను గుల్లా ఉండి చావడానికే. కాదు...మనస్సు ఒప్పుకో లేదు. పైగా చేతికి అందివచ్చినవాడు. ఇంతకాలం, తిట్టినా, తను ఒదులుకోలేని వయస్సు.

"నా కిష్టం లేదోయ్".

"పెళ్లి పెటాకులు లేవుకా! వాడు వెళ్లా లని వుంది; వెళతా" అన్నాడు రాజా. "మనకులం వాళ్లకు ఇప్పుడు దారీ తెన్నూ అది ఒక్కటే అవాలి. లేకపోతే మనకు ఎవడు ఉద్యోగం ఇస్తాడండి?"—స్నేహితుడు, తను చెప్పేది హేతువాదకంగా ఉన్నట్టే.

"ఉద్యోగం అదే వస్తుంది. అయినా ఇప్పటి వాళ్లకు యుద్ధంలోకి పోతాం అన్నది ఓ పరిపాటైంది."

"చచ్చేవాళ్లు ఎక్కడైనా చస్తారు. తిరిగిన స్తే, ఏ గెజెటెడ్ రేంకులోనో ఉండవచ్చు" అన్నాడు తన తండ్రి తనకు అనుమతి ఇవ్వటం లేదన్న ఉక్రోషంలోనే. పరీక్ష పోయింది. తను చదవలేదు. చదవాలన్నా, ఇంట్లో కనుపిరచే పరిస్థితులు తనను చదవనియ్యవు. తను అలవాటుపడ్డ పరిస్థితులు తన్ను ఒదలవు. తండ్రి తనకి డబ్బు ఇవ్వడు...ఎన్నో...ఇవన్నీ కలిసే ఆ ఉద్రేకం పోసేయి.

"వీక్షైయోపడిలో పడ్డవాళ్లం. [మాకు ఇప్పుడు సహాయం అన్నది కావాలి. కొడుకులు చేస్తారు అనిమేం ఆశిస్తాం..."

దిగ్బంధనమే అయింది. కృతజ్ఞత! ఎంత బరువుగా వుంది. తన్ను కని, పెంచినందుకు, తను భావి, ఉన్నతి, ఇచ్ఛకూడా క్రతువుక్రింద పెట్టి, వాళ్లకోసం వుండాలి...గుండెలు నలిమినట్టే అయ్యింది.

రైలులో గణపతిని ఎక్కిస్తూనే, "నువ్వు వెళ్లిరా! నాకు అదృష్టం లేదోయ్" కన్నీళ్ళు తిరిగేయి. వెను తిరక్కుండానే స్టేషనులోనుండి బయట పడ్డాడు. దారి పొడుగునా ఆలోచనలు వచ్చేయి. అవి కోపంగా నుంచుని తండ్రిని తిట్టేయి. తన అసమర్థతకి ఏడ్చేయి.

కృతజ్ఞత! నాలుగుదిక్కులమీద కూర్చుని అరిచే దాన్ని, తన చీము, రక్తం పీల్చడానికి వచ్చిందే అనుకుని ఏడ్చి, ఇల్లు చేరేడు.

* * *

రెండు వత్సరాలు తిరిగేయి. ఇవి రెండుకూడా రాజాని, శాంతినిచ్చి, ప్రపంచకంలోకి పంపలేక పోయేయి. ఆ వాల్గు పరీక్షలకు వెళ్లేడు. ఈసారైనా తప్పకుండా ప్యాసయితీరాలన్న ఆశతోనే చదివేడు. వెళ్లేడు. పేపర్లు అతని నెంబరును మాత్రం అచ్చు వేసుకోనేలేదు.

ఈ తీరుబడిగా వుండే కాలంలో ఏం చెయ్యాలో తెలిసేది కాదు. ఎప్పుడైనా కథలు వ్రాయాలన్న కోర్కె కలిగితే వ్రాసేవాడు. అవి పంపించేవాడు. ఒక్కొక్కసారి ఈ వ్రాయడంకూడా ఎందుకూ అన్న జిజ్ఞాస కలిగేది.

ఇదికాక, తన దినచర్యలోకూడా ఓ క్రమబద్ధం ఏర్పడించి. లేవడం, కాఫీ తాగడం, ఇంట్లో ఏం సరుకులు కావాలో అడిగి బజారుకు పోవడం—ఇది నూత్నంగా అలవాటుపడింది. ఓవిధంగా కొంతకాలం గడచిం దని అనుకుందా మనుకున్నా, రోజూ తన తండ్రి ఎకౌంటుపుస్తకం తణిఖీచేస్తూనేవున్నాడు. ఇది బాధ కలిగించింది. తనమీద నమ్మకం లేదనే ఇల్లా చేస్తున్నాడన్న భావన క్రమ్ముకొనేది. ప్రతీదీ ఆరాతీసి అడిగేవాడు.

ఆ నెలల్లో తన చేతిలో కనీసం కాఫీ తాగడానికైనా డబ్బులు ఉండేవి కావు. చదువుతున్నప్పుడో, రెండు చేతులా విరజిమ్మేడు. ఆ వాసన ఒదలటం లేదు. డబ్బు తనలో అలవాటుకోసం కావాలి. ఈ కావాలి అన్న భావన, పిపాసా, తను ఇంటిఖర్చు చేసినప్పుడల్లా పావలాది అరణాలు, అర్ధణాది అణా వేసేట్టు చేసింది. అల్లా తనచే దొంగపద్దు వ్రాయించేది. ఈ దొంగతనం ఆరాలుతీయించడం సహించలేక పోయేది. అడిగినప్పుడల్లా రాజా దెబ్బలాడేవాడు.

"అంత నమ్మకం లేకపోతే, ఏ బంట్రోతుకో ఇచ్చి తెప్పించుకో లేకపోయేరా?"

"అంత పౌరుషం ఎందుకూ? అడిగినంత మాత్రములో చెప్పడాని కేం? వాళ్లమాత్రం సరి అయినవాళ్లా ఏం?"

"మీ ఉద్దేశ్యంలో నేను అటువంటివాడినేగా?"

రామయ్యకు ఆ ముక్కలు చిరాకు తెప్పించేవి. తిని, ఇంటిదగ్గర విధవముండలా పడివుండక, పైగా పరీక్షలకు డబ్బు తగలేస్తూ తిరిగేవాడికి ఇంత ఉక్రోషం ఎందుకా అన్నది సమస్యక్రిందనే ఉండేది. తను తన కొడుకును ఓ డబ్బున్న ఫాయిదాలో పెంచేడు. కావలసినంతా అప్పుడు ఇచ్చేడు. ఇప్పుడు ఈ స్థితిలో వాడికీ ఆ పూర్వపు అలవాట్లు ఉంటా యనీ, వాటికి ఖర్చుక్రింద డబ్బు ఇవ్వా లనీ తోచలేదు. అసలు ఆ భావన కల్గడంకూడా ఏ కోశాన్నైనా లేనేలేదు.

"అయితే నువ్వు వాళ్లలోనే జమ అన్నమాట" తన తెలివితేటలకు తానే మురిసిపోతూ.

రాజా వెంటనే లేచివచ్చి, అకౌంటు పుస్తకం, మిగిలినచిల్లరా పెట్టెమీద పెట్టి "నే వాడి దలచుకోలేదు" అని చివాలున వెళ్లిపోయేడు.

"వెధవపౌరుషా లున్నాయి! అన్నీ పనులూ నే చేస్తూవుండాలి. ఎదిగినవాడు ఉన్నాడు అంటే ఆమాత్రం సాయం చెయ్యక్కర్లేదూ...?"

విషం మ్రింగినట్టే భరించేడు. ఏం చెయ్యగలడు! డబ్బు సంపాదిస్తేనే మనిషి. లేకపోతే ఎందుకూ పనికిరాని చెత్తకారి. బ్రతికినా చచ్చినవాడితో సమానం...

ఆ ఉద్రేకంలోనే ఏదో ప్రకటన చూసి ఉద్యోగానికి దరఖాస్తు పెట్టేడు. దరఖాస్తులో తను ఖచ్చితంగా బి. ఏ. వరకే చదివే ననే వ్రాసుకున్నాడు. వయస్సు పూర్ణవయస్సే వేసేడు. ఇరవై నాలుగు.

ఆ అంకెలు వేసేటప్పుడు దుఃఖం వచ్చింది. ఇరవై నాలుగువత్సరాలు, దరిదాపు అర్ధజీవితం వెళ్లిపోయింది, చెప్పుకోదగ్గది ఏమీ తను చెయ్యకుండానే. కష్టపడి తను సంపాదించిం దని ఒక్క యాగానీ చూసుకోకుండానే. భావిమాత్రం నిర్దయగా ఎదురు చూస్తూనేవుంది.

ఇన్నివత్సరాలూ తండ్రి గడించిన డబ్బే తిన్నాడు. అయన్ని పీల్చి పిండిచేసేడు. చేసినా సక్రమం కాలేకనే, తన జీవితం వక్రమం అయిపోయింది. ఈ ఇన్నేళ్లు తన ఇంట్లోనే తాను ఓ గౌరవనీయబానిస అయి వుండిపోయేడు.

ఆఖరున సంతకం పెట్టినపుడు రెండు-చినుకులు చొక్కాలో ఇనికేయి. తను పుట్టడం ఇందుకే అనుకున్నాడు. పుట్టినా ఏ కఠినత్వమో రాకుండా, సూక్ష్మ గ్రాహ్యత, సున్నితం ఎందుకు అలవాటైందో తెలియచేలేదు. ఇవే తనకు పరీక్షలు పోగొట్టేందుకు ఉచ్చులుకూడా పన్ని కూర్చున్నాయి...

ఓ వారంరోజులు పోయిన తర్వాతనే ఇంటర్వ్యూకు రమ్మని వచ్చింది. కాగితం తండ్రిచేతుల్లో పెట్టి గుమ్మానికి వేళ్లాడేసిన మామిడాకుల్ని లెక్కపెట్టేడు.

"జీతం ఎంతేమిటి?"

"ఏభై."

"ఏభై! ఈకాలంలో మా ఆఫీసుజవాను సంపాదిస్తున్నాడు. ఏం ఉద్యోగం అది? మార్చికి కట్టేవుకా..."

నరాలు తోడేసినట్టయింది. ఏం చేస్తాడు? నిజంగా చెయ్యలేని స్థితిలోనే పడిపోయేడు. అందులోనే జీవిస్తుంటకూడాను.

"మరిచిపోయేను. ఓసారి పట్నం వెళ్లి రావాలి. వాళ్ల అబ్బాయి ఒకడు ఉన్నాట్ట. వారిని మన అమ్మాయిని చూసుకుందుకు రమ్మని చెప్పాలి."

అక్కగారు గుమ్మంలో నుంచునే "సిద్ధాంతి, రేపు బావుం దన్నారు ప్రయాణానికి..." అంది.

మామిడాకుల లెక్క తేలనేలేదు. ఇదివరకు రెండు మూడుసార్లు పెళ్లికొడుకుల్ని పిలుచుకువచ్చేడు. వాళ్లు రానుపోను ప్రయాణంఖర్చులు పుచ్చుకుని, నాల్గు పిండివంటలతోనూ పీకలదాకా తిని, ఉత్తరమైనా వ్రాయక కూర్చున్నారు...

దారిలో వెళుతూనే తన ఉద్యోగంకూడా చెప్పకుండానే దాచి; పట్నం వెళ్లేడు. వాళ్లు నానా ప్రశ్నలు వేసేరు. అందులో 'నీకు పెళ్లి అయిందా? ఏం ఉద్యోగం? ఎంత జీతం? పిల్లలా?' ఈ వరసలో ఉండడం చిరాకుపరచింది. కాని అనునయంగా తప్పించుకున్నా, ఆ ప్రశ్నలు రైల్లో పడి తన ఇంటికి వచ్చేవరకు పీడిస్తూనే వున్నాయి.

"ఏం ఉద్యోగం? జీతం ఎంత?" ఎన్నోసార్లు సూదుల్లా పొడిచేయి. ప్రతిరక్తనాళాన్నీ అంకుశంలాగే గుచ్చేయి. ఇరవై అయిదేళ్లు వచ్చి, వాట్లకి గొప్పగా సమాధానం చెప్పలేకనే చచ్చిఉండిపోయేడు. "తండ్రి మీద పడి......" ఇంకా ఎందుకూ జీవించడం అని తట్టింది.

అదృష్టం అనేది లేదేమో! అది వున్నా కనీసం తను వారం వారం చూచే వారఫలితాల తపస్సుకైనా ఒకిలో ఒరుసుకుందేమో అన్న ఆశతోనే అన్ని వారాలూ చూచేడు. "మంచిరోజులు. ఉద్యోగ ప్రయత్నం ఫలించే సూచనలు ఉన్నై. అభివృద్ధి, మార్పు..." ఇల్లాంటి తారీఖులు నిద్రపోకుండా కలలు గని, రాత్రిళ్లు ఏడ్చేవాడు...మానవుల్లో పెంపుదలలో స్వం చచ్చిపోతే ఇల్లాంటి ఆశలు, తాత్కాలికఉపశమనాలకు అర్రులు చాస్తుందేమో!...

పెళ్లివారు వచ్చేరు. ఆ హడావిడిలో తీరుబడి లేనట్టే ఉండేది. ప్రయాణాల్లో మిగిలిన డబ్బులు రోజురోజుకు తరిగేయి. అవి అయిపోతాయేమో అనే భయపడ్డాడు. జీవితంలో నరకం.

అనుకోకుండానే పదిరోజుల్లో, ఆ ఏభైరూపాయల ఉద్యోగంలో ప్రవేశించమని కాగితం వచ్చింది. సంతోషం పట్టపగ్గాలు లేకుండానే క్రమ్మింది. జీవితం మారింది. అదృష్టం అంటే ఇదేనా? ఈ నాడుతో డబ్బున్న ధనికుని ఇంట్లో పుట్టిపెరగడం కంటె నరకం లేదనుకునే ముక్తి సంబరపడుతూనే తండ్రి దగ్గరకు వెళ్లి చెప్పేడు.

ఆయన ఆ కాగితం చదివేలోపునే, తన తండ్రి వెళ్లమంటాడు, ఖర్చుకు డబ్బుఇస్తాడు, క్యారియర్, క్యాంపుకాట్ కూడా పట్టుకువెడితే మంచిది...అనుకుని ఊహాలు పన్నుకున్నాడు.

"వాళ్లు పెళ్లికి ఒప్పుకున్నట్టు వ్రాసేరు. నువ్వు ఓసారి మన రైతులదగ్గరకు వెళ్లి వసూళ్లు చేసుకు రావాలి."

"ఉత్తరాలు వ్రాస్తే వాళ్లే పంపిస్తారు..."

"పెళ్లి అయినతర్వాత వెళ్లవచ్చు. ఇదివరకు ఉత్తరాలు వ్రాయకనే పంపించలేదా? ఇవన్నీ ఎవరు చూస్తారు?..."

"అప్పుడు శలవుపెట్టి ఒస్తా కావలిస్తే: ఇప్పుడు నాకు జాయిన్ అవ్వాలని ఉంది."

"ఉండి!" ఎర్రపడి చూచేడు—"ఇంతోటి జీతపు ఉద్యోగంలోనూ...రెండు స్కూల్ ఫైనల్

మద్రాళ్లకు ప్రయివేటు చెప్పుకుంటే వస్తుంది. ఇంత దూరం వెళ్లక్కరలేదు..."

"వెళ్లక్కరలేదు—" ఆ నొక్కి అవడంలో వచ్చిన శబ్దం నరాల్ని తోడేసింది. తనను చిత్రవధచేసి, ప్రతీఖండంలోని రక్తం తండ్రి త్రాగుతున్నట్టే కన్పించింది. నిజంగా తండ్రికాదు......అనుకున్నాడు.

కాళ్లీడ్చుకుంటూనే గదిలోకి వెళ్లి, ప్రక్కమీద పడి ఏడ్చేడు. కోపం, దుఃఖం రెండూ ఆవేదన పట్ట పగ్గాలు లేకుండా ఆక్రమించేయి.

తిండీ, ఈ నరకపుటిల్లు ఆక్షణంలో విడిచి పారిపోవాలి అన్న ఆలోచనా డబ్బులు లెఖ్ఖపెట్టేటట్టు చేసింది. మూడురూపాయిల పావలా అర్ధణా. ఆ ఊరు వెళ్లి ఒక్కపూటకి తిండికి సరిపోతుంది...తర్వాత... ఎవర్ని అడుగుతాడు? ఎల్లా...

దుఃఖం ఎక్కువైంది. తన అనామకజీవితం ఎందుకు ఇంకా అనిస్తూ నిలబడిందో తెలియటంలేదు. విరక్తి కల్గింది. అయినా తను తెగించగల్గేంత ధైర్యం రావటం లేదు. చాలాసార్లు అనుకున్నాడు. చస్తే నయన అని...కాని చావడం...భయం...

ఒక్కటి. కృతజ్ఞత నరగలుకక్కుకుంది. "నిన్ను కళ్లల్లో, గారాబంగా పెట్టిపెంచేరు. వాళ్లకు..."

భరించుకోలేని దుఃఖం, ఆవేదనతోనే శాంతి పడా ఏడ్చేడు. జీవితంలో మనసారా ఒక్కసారి ఏడిస్తే, సుఖం అందుబాటులో వుంటుందేమో అనుకునే.

* * *

ఆ రోజుల్లో తన కొడుకు తను నిర్దేశించిన, నిర్ణయించిన పనులన్నీ వింటున్నాడు అనేది గర్వం కల్గించింది. ఇంట్లో తన ప్రసక్తి అక్కరలేకుండానే సంసారం గడిచిపోతోంది. సంవత్సరం సంవత్సరం రైతులవద్దకు వెళ్లడం, శిస్తువసూళ్లు, కొత్తకదపాలు వ్రాయించడం రాజారామే చేసేడు. రామయ్యపంతులుకు తను పెళ్లి వసూలుచేసినదానికంటె ఒక్కపైసా బాకీ లేకుండా, పింగరాజు లింగరాజులా రాజా లెస్తున్నందుకుమాత్రం చాలా సంతోషం అయింది.

రెండు మూడుసార్లు పెళ్లివారింటికి వెళ్లేడు. తన పేరుమీదనే తాంబూలాలు కూడా ఇచ్చేడు. ముహూర్తం పెట్టించాలనే తాపత్రయపడ్డాడు. అన్నీ తనే. తన కొడుకు ఈ మారిన పద్ధతుల్లో సంతోషం తెచ్చిపెట్టినా, పెళ్లి అయిన క్షణంనుండి, ఎక్కడికైనా వెళ్లిపోతాడేమో; అందుకే ఈ శ్రమ, ఆందోళన పడుతున్నా డన్న ఆలోచన రాకపోలేదు. వచ్చినా, తను ఆలోచించలేని నిస్సత్తువ, దాన్ని పొడిగించనివ్వ లేదు.

ఆరోజులన్నీ ఆలోచనలు పెళ్లిగురించే జరిగేయి. చర్చలు, నిర్ణయాలుకూడా అయ్యేయి. అనుకోకుండా అక్కగారు, రెండురోజులు మంచం ఎక్కి, మూడో రోజున స్వర్గస్థురాలైంది. ఇది రామయ్యను తల్లి విడిచిన పక్షిలా చేసేసింది.

ఆ రోజూనా, దాంతర్వాత పదిరోజుల్లోనూ తన తండ్రి వలవలా ఏడ్వడం, ఆగదిలోకి వెళ్ళి, ఘంటల తరబడి దుఃఖిస్తూ, ఆవిడ జీవితచర్యల్ని మననం చేసుకుని మరింత క్రుంగిపోవడం రాజాను ఊపేసింది. ఆవిడ ఆ సమయంలో చచ్చిపోయినందుకు నిజంగా తనూ బాధపడ్డాడు. ఏదో సంసారానికి పెద్ద ఆసరా తీసేసినట్టే అయింది; ఇంటికి నడిమూలం తీసినట్టుగా. ఇల్లు శూన్యంగా, ఎడారిలాగే ఉన్నట్టు తట్టింది.

ఆవిడ, అవిచ్ఛిన్నంగా ఏభై సంవత్సరాలు ఆ యింటిని కిరీటం లేని రాజులా ఏలి, వన్నెలు కల్పించింది. తన తండ్రికి, ఎవరూ చెయ్యలేని త్యాగం, 'స్వం' చూచుకోకుండానే ఒనర్చింది. అల్లాంటి మూలవిరాట్టు పోవడం అందరికీకూడా, పైగా తనకి, ఓ పెద్ద అఘాతం కల్పించింది.

దుఃఖించేడు. మనసారానే ఆవిడనుగురించి ఏడ్చేడు. కాని తనతండ్రిని చూచినపుడల్లా బేజారు అయ్యేట్టే మనస్సు గుబుగుబమనిపోయింది. నిజంగా దిక్కులేనివాడే అయ్యేడు. ఆయన తల్లితండ్రులకి పుట్టిన సంతానంలో ఆయన ఒక్కడే మిగిలి, వచ్చిన అప్పగారి గుణగణాలకు దేవత్వం ఆపాదించుకుంటూ కాలం గడపాలి. ఎంత భీకరంగా, నిర్దయగా కాలం నంచుంది?

నెలరోజులు సెలవు పెట్టి, దుఃఖం, బెంగవల్ల కృశించిపోయిన తండ్రిస్థితి హృదయాన్ని కలచివేచింది. నానాటికీ బెంగతో కృశించిపోతున్న తండ్రిని చూస్తే జాలి, దుఃఖం కూడా బాధించింది.

ఆవిడ వెళ్లిపోయింది. ఆవిడబాధ్యత ఇప్పుడు ఎదిగి ప్రపంచాన్ని అర్థంచేసుకుంటున్న తనమీదా,

ఇన్నాళ్లూ మాటా మంతీ లేకుండా సంసారం చేసిన తల్లిమీదా పడింది. ఈ మానని గాయాన్ని ఏవిధంగా మానించాలా అన్న ఆలోచనలు కమ్ముకున్నై. ఆలోచించేడు. ఈ బరువు తను భరించి మోయగలడా ? అసలు చచ్చేవాళ్లంతా, వంశపారంపర్యా మెయ్యమని ఓ బరువు ఒదిలిపెట్టి వెళ్లుతారా ?

ఆ రోజుల్లో, ఆ ఇంట్లో వుంటే ఆ జరిగిన సంగతులు తిరిగితిరిగి మనసకు 'ఒస్తాయని ఇల్లు మార్చేడు. తండ్రికి దగ్గరగా, ఒక్కక్షణంఅయినా విడవకుండా, తిండి తిని, కబుర్లు చెప్పడంకంటె ఇంకేమీ చెయ్యలేకపోయేడు. కొంతైనా ఉపశమనం కల్గుతుం దని స్వంతగ్రామం తీసుకువెళ్లేడు. ఆ కొబ్బరి తోటల్లో వరిచేల వాసనల్లో శాంతి, మరపు, సైకం ఒస్తుందనే ఆశతోనే. కాని 'పరామర్శ' ఎంతో మందిని తెచ్చింది.

జీవితంలో ఆ ముక్క ఎంత క్రూరంగా హింసిస్తుందో అప్పుడు అర్థమైంది. ఉన్న పెల్లాళ్లల్లోనూ ఎవరో ఒకరు వచ్చేవారు. ఏడిపించేవారు. తను అనుకున్న ఆశ, ఈ పిచ్చిచర్యలవల్ల, కళ్లెదుటే ముక్కలుగా చీల్చేయబడటం భరించుకోలేకపోయేడు. అనుకున్న శాంతి, సౌఖ్యం, మరుపుకంటె అశాంతి, దుఃఖం జ్ఞాపకంవచ్చి, తండ్రిని దిగనార్చేయి. ఎముకలపోగే చేసేయి.

తిరిగివచ్చేసేడు అందరితోనూ. అవూళ్లో కాకుండానే, ఇంకోవూళ్లోనే తండ్రి పునః ప్రవేశించేడు. ఈ హడావిడిలో కాలం గడవడం, తండ్రి కాస్తయినా మరిచిపోగలిగే డన్న భావనతోనే రాజా అన్ని [illegible]

క్రొత్త వూరు ! అంతా క్రొత్తే. గతించిన చరిత్రలు జ్ఞాపకంచేసే స్థలాలు లేవు. తండ్రి ఈ క్రొత్త వ్యక్తులమధ్య, ఆయన ఉడిగం అల్లుకోవడం, అది నిజంగా మంచికే వచ్చిం దనుకున్నాడు.

ఆ కొద్దికొద్దిగా మానుతూ పారకడుతున్న గాయాన్ని చూచి, మాట్లాడని తల్లీ, ఆలోచనల్తో, ఇంకా ఆయనఆరోగ్యం పూర్వపుస్థితికి లేవడం ఎల్లా అన్నదేనా మధ్య ఉండి విజయం పొందడం సంతోషం కల్గించింది.

భగవంతుడు తనను ఈవిధంగానైనా 'కృతజ్ఞత' చూపేందుకే, ఆ ఉద్యోగంలో ప్రవేశపెట్టలేదు అని అనునయం తెచ్చిపెట్టుకున్నాడు. అయినా అది నిలవటంలేదు. తన భావి ? తప్పు పెళ్లిఅయితే ! స్వతంత్రత—ఇవన్నీ జడ్డీల్లా వుండేవి...

ఎదురుచూస్తూ కాలాన్ని గడపాలి. పరిసరాలు తనను ఏవిధంగా కట్టేస్తున్నాయో అని ఆందోళన చెందేడు...

ఒక్కటే, సంసారం ఇప్పుడు పూర్ణంగా తన మీద వుంది. డబ్బా...అది ఈ జీవితంలో తడుముకో అక్కర్లేనట్టే తడుతోంది.

* * *

ఆ మాఘంలో కూతురుపెళ్లి ఏడువేలరూపాయిల ఖర్చుతోనూ జరిగి బరువుతగ్గినందుకు చాలా సంతోషపడ్డాడు రామయ్యపంతులు. ఒక్క ఆనాడు ముళ్లుపడినప్పుడు తన అక్కగారు లేకపోయిందే అని కన్నీళ్లు తిరిగినా, తన కొడుకు తనను కుర్చీలో కూర్చోబెట్టే పెళ్లి చేయించేడు. తనకే ఆశ్చర్యం కలిగించింది. ఈనాడు తను డబ్బుమాత్రం ఇచ్చేడు. తక్కినదంతా వాడే. ఆ సన్నగా పూచలా వున్న కొడుకులో ఇంత క్రమశిక్షణ, మర్యాద నిబిడీకృత మయివున్నందుకు గర్వపడ్డాడు.

తన అక్కగారే ఉంటే, ఆవిడని ప్రతీపనిలోనూ అడగవలసేవుండేది. ఈనాడు రాజా, ఒక్కటీ అడగకుండానే చేసేడు. ఇది ఆశ్చర్యం కలిగిస్తోంది. కొంతవరకూ, తన వియ్యంకుడు వ్రాసిన "పెళ్లి చాలా బాగా చేసేరు" అన్న ఉత్తరం, నీఅక్కగారు చనిపోతూ, నువ్వు నట్టనడిసముద్రంలో నావవు అయిపోతావేమో అని నీకొడుక్కు ఆవిడలో ఉండే [illegible] చేసేయి. దానికి తనకే అర్థంకాని శక్తులు ఉన్నాయేమో అనుకున్నాడు.

ఆ రోజుల్లో ఎవరో వాడిని అడగడం, "పెళ్లికొరకు ఆగిపోయేను. ఎందులోనో ప్రవేశించా లండీ" అన్న సమాధానం తను విన్నాడు. ఇప్పుడు అది నిజంగా ఓ పిరికితనం పోస్తోంది. వాడు వెళ్లిపోతే ?

ఇన్ని సంవత్సరాల్లోనూ తన ఆసరామీదనే ఇంత ఉద్యోగం కట్టుకున్నాడు. అది ఒకరి చేతుల్లోంచి ఇంకొకరి భుజాలమీద పడింది తనకి భారం కలగకుండా. ఈ ఇల్లు ఎవరు చూస్తారు ? పొలాలమీదికి వెళ్లడానికి, ఇండ్లఅద్దెలు వసూలు చేసుకోవడానికి తనకు తీరుబడి ఎక్కడుంది ?

వాడు ఇవ్వాళ, కాకపోయినా ఇంకో రెండు రోజులు గడచిన తర్వాతైనా తన దగ్గరకు వచ్చి 'వెళుతా' అంటాడు. ఏమని చెప్పాలి? వాడు వెళిపోతే...శూన్యం. తన కోర్కెలకు, తన సరుదాకూలకు చెంపపెట్టుక్రిందే ఉండిపోతుంది.

ఈ పిల్లల చదువు, తన క్యాంపుల ఉద్యోగం, ఇవన్నీ తను ఒక్కడూ ఎల్లా ఆసరాపడి, నిర్వహించుకోవాలి? ఆలోచన పాలుపోవటం లేదు. తను చేసుకోనే లేదు. చేసుకోడానికి ధైర్యం చాలటం లేదు. అవి మిత్తిలా, క్రూరసర్పాల్లా నుంచుని, జీవితంలో శాంతిని తోలేస్తాయి.

అప్పుడో తనస్థితి...? ఇంతవరకూ జీవితంలో ఇల్లాంటి పరిస్థితి రాలేదు. వస్తుం దని ఊహించనూ లేదు...

భయం, ఆవేదన, శూన్యం క్రూరంగా నుంచుని నవ్వుతున్నాయి.

తనభార్యను అడుగుదా మనుకున్నా, ఆవిడ ఆ మాగనోము విడిచి, సమాధానంగా సలహా చెప్ప లేదు. చెప్పియుండనూ లేదు. చెప్పగల దన్న ధైర్యం కూడా లే దేమో!

ఈ సమయంలో రాజా తనదగ్గరకు వస్తేనే భయంగా ఉంది. ఆ అనుజ్ఞ అడుగుతా డేమో అని. తప్పించుకోవలసినట్టే ఉండేది. తను ఇవ్వలేదు. ఇస్తే... అది పైన ఊహించుకోనివ్వటం లేదు.

తనకు ఇక పింఛనీకాలంకూడా దగ్గరకి వచ్చేసింది. ఇక తన వూళ్లో ప్రవేశించి, ఆ జీవితానికి ఎల్లాగో తను అలవాటుచేసుకోగల నన్న ధైర్యం వుంది. అంతవరకూ రాజా వుండాలి...వుండితీరాలి...

తను పింఛనీ పుచ్చుకున్న తర్వాత, తనకు సహాయం చేస్తా నన్నవాళ్లు చెయ్యరేమో అని బెరుకు లేకపోలేదు. ఈలోపుగా రాజాను ఎందులోనో దూర్చితే, తనవలె కాలగమనంలో పేరుప్రతిష్ఠలు తెచ్చుకుని, తన పేరు నిలబెడతా డన్న తలంపు, ఆశా లేకపోలేదు. అయినా అది నిలవటం లేదు. స్వార్థం అన్నది రాజ్యం చేస్తుంటే, మానవక్రతువులు చెయ్యడానికి గుండెలు వెనుకంజవెయ్యవేమో!

పెళ్లయి రెండు నెలలు గడిచేయి. అన్నిరోజుల్లోనూ, ఆ కబురూ ఈ కబురూ చెప్పి రాజా తన తండ్రికి బడలిక తీర్చేడు. చెల్లెలు అత్తవారినిగురించి, పెళ్లిళ్లల్లో జరిగిన వింతల్ని, ఇల్లాంటివే రాజకీయాలు, ఆఖరుకు ఆఫీసుపనులుకూడా ఆ మాటల్లో దొర్లేవి.

అన్నిరోజుల్లోను తనఎడ చూపించే విముఖత కొంతవరకూ తగ్గడం, తండ్రిబెంగ దిగజారడం తనకు చాలా ఉత్సాహంగానే ఉండేది. ఇది లోపల్లోపల అంతశ్శక్తులు ఆక్రోదించి స్వసంపాదన, స్వతంత్రత మాత్రం పడగలు విప్పేవి. మరి వయస్సు ముదురుతోంది. ఇప్పుడు ఎందులోనో ఓదాన్లో తల దూర్చక పోతే కష్టం అవుతుం దేమో అన్న ఆవేదన లేకపోలేదు. ఈ ఏళ్లతరబడి సాఫీజీవితం తనను ఓ ధని కుడిక్రిందే చేసే, కాలు దించనియ్యకపోవడం అలవాటు చేస్తోంది. చేసిందికూడాను. తనకు తెలియకుండా సంవత్సరాలే గడిచేయి. ఇప్పుడు ఈ సాఫీ, దర్జా జీవితంలో వున్న శరీరం, ఆ వచ్చే వూడిగమునకు తట్టుకుని, వాళ్లకి ఒంగి ఒంగి సలాములు చేస్తూ, ఘంటల తరబడి కాగితాలమధ్య పనిచెయ్యగలనా అన్న నిరుత్సాహం, భయం కల్గకపోలేదు...

ఉద్యోగం చెయ్యకూడదు, ఏపల్లెల్లోకో వెళ్లి, అక్కడ వ్యవసాయం చేద్దామని ఉండేది. తీరా అది బ్రాహ్మణవ్యవసాయమై, సంవత్సరసంవత్సరమునకు అప్పుల్లో పడిపోతా డేమో అన్న భావనా వుంది. పైగా తను చదువుకున్నాడాయె. సమయ మొస్తే తట్ట నెత్తి పెట్టాలాయె. దానికి డిగ్రీల హోదా ఒప్పుకోదు.

స్నేహితుడు యుద్ధంలో నుండి ఉత్తరం వ్రాసేడు వాడు లెఫ్టినెంట్ కలనల్ అయ్యేడుట. 'నువ్వు ఏం చేస్తున్నావ్?' అడిగేడు. ఆ ప్రశ్న రాజాను చాలా నుండే వేసేవారు. ప్రయాణాల్లో, కనపడిన క్రొత్త వాడు అల్లా ప్రశ్నించేవారే. చెయ్యటం లేదు అన్న నిజం, చేసేవాళ్లని చూచి ఈర్ష్య తెప్పించి న్యూనత పరచేది. అందులో అబద్ధాలు ఆడేవాడు. బడిపంతులు దగ్గరనుండి ఇన్సూరెన్సుకంపెనీ ఏజంటు వరకు ఎన్ని చిల్లరఉద్యోగా లున్నాయో అన్నీ చెప్పేవాడు సమయానుకూలంగా.

ఒక్కొక్క సమయంలో ఈ చెప్పడం ఇరుకున పెట్టేది. ఆ వ్యక్తులే మళ్లీ కలుస్తూ ఉండేవారు. ఆ ప్రశ్నే వస్తే, ఏం చెప్పేడో జ్ఞాపకం ఉండేది కాదు.

స్నేహితునికి, ఉత్తరం వ్రాస్తే, రా ఇక్కడ ప్రయత్నిద్దా మన్నాడు. ప్రయత్నం! తను ప్రయత్నించకుండా, చెయ్యకుండా, చెప్పకోవడంలో

ఎన్నోరకరకాలు చేసేడు. అసలు నిజంగా వస్తే తను చెయ్యగలడా అన్న వూహా పిరికితనం కలిగించింది.

భోజనాలదగ్గరే తండ్రితో అన్నాడు: "గణపతి సెలవులలో ఉన్నాడు; ఓసారి రమ్మన్నాడు."

"ఎందుకూ?"

"ఉద్యోగం ఏదైనా ప్రయత్నిస్తాడుట"

"మొన్న సెప్టెంబరుకు కట్టేవు. పరీక్షల సమయానికి జ్వరం వచ్చింది. అది పూర్తిచేస్తే మంచిదేమో!"

"ఇక చదవలేనండి". నిజంగా తన నిరుత్సాహం అల్లా అనిపించింది.

"ఇంకోసంవత్సరంలోపులో నేను పింఛనీ ఎల్లాగా పుచ్చుకోవాలి. పిల్లల చదువుల విషయం బోధపడటం లేదు. మీ అమ్మ నేనూ క్యాంపుల్లో ఇరవై రోజులు వుంటాము. మరి ఇల్లు......ఆవిడ వుంటే..." కంఠం రుద్ధం అయింది రామయ్య పంతులకు.

ఆవిడ! ఇంటికి పెద్దపులి. తండ్రి చెప్పినదానిలో సత్యం లేకపోలేదు. ఆవిడే వుంటే, ఇంట్లో మొగదిక్కు లేకపోయినా గడచిపోయివుండేది. తను ఇంకో వూరు వెళ్ళినా, పిల్లలకు ఆధారంగానే వుండేది.

ఇప్పుడు నిజంగా ఇల్లు విడచిపెట్టకూడని పరిస్థితే. ఈ చిన్నక్లాసులు చదివేపిల్లలను వంటలక్క మీద వదలడం కష్టమే. తనతల్లి, ఆయనతో లేకపోతే, ఉండివుండని చెంగ, ఆరోగ్యంకూడా దెబ్బతినేస్తయి.

పరిస్థితులను తిట్టుకున్నాడు. అవి తనను మొదటినుండీ విపరీతంగా దెబ్బతీసి దిగనారుస్తూనే వున్నాయి. వాట్లకు జీవితం బలి అయిపోతోంది. దాంతో ఆశలు కూలిపోయి, పిరికితనం నూరేస్తోంది.

మాట్లాడకుండానే వుండిపోయేడు, ఏం సమాధానం ఇవ్వాలో తెలియకుండానే.

తనంత నిర్దయపరిస్థితుల్లో ఇంకో వ్యక్తి లేడేమో అని వెతపడ్డాడు. లోనున్న స్వతంత్రభావాలు అడుగంటుతున్నాయి. అసలు తన జీవితంలో తను సంపాదించలేడేమో!

ఆ ఇంటివద్ద కూర్చుండి, ఉప్పు, మిరపకాయలు ఉన్నాయో లేవో, వంటావిడ వాగాలు పెట్టకుండా ఒప్తోందా? పాలు, నెయ్యి ఎంత ఖర్చు అవుతోంది? ఇల్లాంటి ఆలోచనలు, కార్యక్రమాలు తప్ప ఇంకొకటి లేనేలేదు. తిండి, నిద్ర, ఇంటిపని, ఇంతే. శరీరం స్తబ్ధత చెందినట్టే ఉంది.

ఆ రోజుల్లో, కాలేజీజీవితాల్లో మొలకలెత్తిన భావనలు ఒచ్చేవి. చుట్టూరా ఉన్న జీవితంలో విషాదాంతం గోచరించేది. తృప్తి లేని దుఃఖాంతజీవితాలు ప్రజలంతా ఎందుకు గడుపుతారో అర్థం కాలేదు. కఫంలో పడ్డ ఈగల్లా కొట్టుకుంటూ, డబ్బుసంపాదన కోసం మానాభిమానాలు ఒదులుకొని ఎందుకు జీవిస్తారో కూడా మృగ్యంగానే వుంది.

కథలు వ్రాసేవాడు. ఆకథల్లోని పాత్రలు, వాతావరణంకూడా ఆనందంలో తృప్తి నిచ్చేవి కావు. ఏదో ప్రపంచకంలో వెతుక్కుంటూ, నిరాశగా, నిట్టూర్పుతో బ్రతికేం అన్నట్టే వుండేవి. బ్రతికినా అమరత్వం రావటం లేదు. దేవుడు అనే కత్తిక్రింద, కైమా చెయ్యపడ్డట్టే వుండేవి. చాలాసారులు అనుకున్నాడు, నవ్వుతూవుంటే చాలా కాలం బ్రతక వచ్చునని.

విషాదాంతం! అసలు జీవితం విషాదకావ్యమేమో! బ్రతుకు అనేది దుఃఖదేవత-చీరమడతల్లోని వెలుగునీడ లేమో! ఈ భావన ప్రతీపనిని, ఓనమాత్రపు కన్నుతో, దుఃఖంకోసం వెతుక్కునేట్టు చేసింది. అదే జాలి నిచ్చేది. జాలితో ఆవేదన మూర్తీభవించేది.

ఈ చిన్నవయస్సుపిల్లల చదువులు చూస్తుంటే, తన గతించిన చిన్నతనం జ్ఞాపకం వచ్చేది. అది రాజాలాగే జరిగింది. అందులో ఉన్న ఉన్నతి వీళ్ళకి రాలేదు. రాదేమో కూడాను. ఒక్కగా ఒక్కడే తను అప్పుడు. అడుగులకు మడుగులు ఒత్తుతుంటే నే తన చదువు, పోషణ గారాబంలో జరిగింది. ఇప్పుడు వీళ్లో, ఎదో ఆ మైలుదూరం నడచి, వచ్చి, ఇన్ని మెతుకులు కొరికి, నడచివెళ్తుతారు. ఆ చదువుల్లోకూడా పరీక్షపోతుం దన్న దైన్యం ఒళ్లో వున్నట్టే.

జాలి కలిగింది. వాళ్ళకి తన చేతుల్లో ఉన్నదల్లా చేసేడు. చెయ్యాలి అన్నది పూర్ణంగా అవ్వతం చేసినా డబ్బు అన్నది అడ్డంగా నుంచుంది. అది ఈ ఎత్తుదిగుడు విన్యాసాలలోనే తనను ఆడిస్తోంది.

పెళ్ళి అయినప్పటినుండీ సంసారం దాని పని చూస్తూనేవుంది. ఇదివరకురోజుల్లో, ఒచ్చేజీతానికి

తండ్రి శిస్తుల్లో పాలు కలిపి వాడేవాడు. అది ఇప్పుడు సున్నా అయ్యింది. ప్రతీనెలా అప్పుల్లో జీవించడం అవుతోంది.

ఓవిధంలో తనతండ్రి సంసారానికి ఇవ్వకుండా దాచుకుంటున్నాడా అన్న భావన నిలవదు. ఆయన ఏ పాతికో ఏభైయో తప్ప తక్కినదంతా తన చేతిలో పోస్తున్నాడు. ఇది సరిపోవటం లేదు. ఈ స్థితిలో తండ్రిని అడగడానికి కూడా మనస్సు ఒప్పటంలేదు. జాలి కల్గుతోంది. ఆయనమాత్రం ఎక్కడనుండి తెస్తాడు?

ఓవిధంగా తనను న్యూనతపరచింది లేమి అన్న గిజగిజ. తనే సంపాదిస్తూవుంటే. నిజమే వేన్నీళ్లకి చన్నీళ్లు తోడైనట్టు. కాని ఈ వూళ్లో కనీసం ఏభై రూపాయిల జీతం ఎవ రిస్తారు? ఎవర్ని అడగ్గలడు? ఆలోచనలు...వ్యర్థంగా వచ్చి చచ్చేవి.

ఒకటోతారీఖు వచ్చిందంటే, తనకే భయంగా వుండేది. అప్పులాళ్లు...అంతా వచ్చి ముట్టేస్తారనే... ఆ తండ్రిచేతుల్లో పోసిన డబ్బు అంతా ఇచ్చేస్తే తనకు సంసారం నెలా జరిగించడానికి ఒక్కఏగానీ మిగలదు. తను ఇవ్వకతప్పదు. ఇక్కడ పోషించకా తప్పదు...

ఏ స్నేహితులకైనా డబ్బు సర్దుబాటుచేస్తారేమో అని వ్రాయా లనుకున్నాడు. రైతులకి వ్రాద్దామన్నా, వాళ్ల పెళ్లాల మెళ్ళో పుస్తెలు తాకట్టు పెట్టించి డబ్బు దమ్మిడీలతో వసూలుచేసేడాయె. స్నేహితులుమాత్రం...ఈ యుద్ధపురోజుల్లో...పాలు పోలేదు...ఎకౌంటు పుస్తకం తీసినప్పు డల్లా క్రూరంగా మూడంకెల బాకీలు కన్పడేవి. వాళ్లు ఎక్కడ నిలబెట్టి డబ్బు ఇమ్మంటారో అనే భయం. పైగా న్యూనత...ఇల్లు కదలనివ్వటం లేదు. పిరికితనం..

ఎల్లాగా తీర్చేది? తనకి అప్పు ఎవ రిస్తారు? ఈ నిరాశే...వంశపారంపర్యా వచ్చే పెట్టెలు తీయించింది. వెతికేడు. తన గౌరవం, సంసారపుగుట్టు నిలబడాలి, అవమానం రాకూడదు అన్న తలంపే... వంశంగా వచ్చేదాంట్లోనే బంగారంతీసేడు; దొంగతనంగానే ఆ సాయంత్రం హుషారుగానే వెళ్లి అమ్మి, దారిలో అప్పుల్లో సగంపైగా తీర్చి, ఉన్న డబ్బు నెలాఖరునరకూ సరిపోతుం దని సంతోషపడ్డాడు.

క్రియ అంతా జరిగినతర్వాతనే మైకం వదలింది. తను ఎంత క్రూరమైన తలవంపు కలిగే పని చేసేడో అర్థంఅయ్యింది. తన తండ్రి గడించే అది మూలపురుషుల్లాగే దాచిపెట్టేడు. దాన్ని ముట్టుకోకూడదు అన్న పవిత్రతతోనే...

తనో...ఎన్నో విపరీతసన్నివేశాలు క్రుంగ తీసేయి. తను ఎంత నీచంగా తయారయ్యేడో, తన తండ్రిఇంట్లో తనే దొంగ...

ఏడ్చేడు. హృదయం పగిలేపోయింది.

ఒక్కటి......

ఈ సంగతే తెలుస్తే, తన తండ్రి నీచంగా ఎంచి, 'వెళ్లిపొమ్మంటాడు' అనుకున్నాడు. వెళ్లిపోతాడు......ఎక్కడికో...ఆఖరుకు కూలిచేస్తుకునైనా...జీవించవచ్చు నన్న ఆశ మిణుకుమిణుకుగా తట్టింది. కలా! ఆశ...తన ఆశ, ఈ చావలేని ఆశ మేడలు కట్టేస్తోంది.

* * *

పింఛనీ పుచ్చుకుని స్వగ్రామం చేరుకున్నాడు రామయ్యపంతులు. ముప్ఫైసంవత్సరాలు పైగా ప్రభుత్వాన్ని కొలిచే మేడలు ఎక్కేడు. ఇప్పుడు ఆ పరివారం, ఆశ్రితులు, బిళ్లబంట్రోతులు అన్నీ కూడా వెళ్లిపోయేయి. తన జీవితం ఆఖరైపోయింది. ఒకళ్లని పాలించడం, ఆర్డర్లు వెయ్యడం, జిల్లా అంతా తిరగడం అంతంఅయింది.

ఆఖరురోజున, ఆ ఛార్జి ఇచ్చేటప్పుడు, చేసిన సేవ, అనుభవించిన పవరు అంతా ఆఖరు అన్న భావన గుబగుబ మనిపించింది. దుఃఖం వచ్చింది. అయినా ఒకళ్లకి తెలియకనే అది లోపల్లోపలే చెలరేగి, దుమారాలు లేపి, శాంతపడింది.

అంత శాంతంలోనూ వున్న రామయ్యపంతులు భార్య ఆరాటపడిపోయి, ఇక వుండడం ఎల్లాగా అని మెడలో నగలు భర్త అమ్మడానికి తీసుకువెళ్లినపుడు బాధపడే భార్యలాగే కలవల్లాడింది.

ఈ రెండు ప్రవృత్తులూ చూస్తే రాజాకి అర్థం కాలేదు. తన తండ్రికి ఉద్యోగంమీద, తల్లికి ఆఫీసరుగారి భార్యగా చెలామణీమీద ఉన్న వ్యామోహం ఎందుకో అని. అంతగా వ్యామోహం ఒదల్లేనితనం వున్న తండ్రి తనని ఎందుకు ఉద్యోగాల్లోకి పోనియ్యడో? ఆలోచించినా దానికి కారణాలు కన్పించటం లేదు.

ఆ పల్లెగ్రామం చేరినతర్వాతనే ఓసారి సింహావలోకనం చేసుకున్నాడు. ఇన్ని వత్సరాల ఉడిగం, తను పింఛనీ పుచ్చుకుని ఇంటికి వచ్చేసరికి, అప్పు మాత్రం ఇచ్చి కూర్చొబెట్టేయి. అంతే! తను

ఇన్నాళ్లు, తన పొలాలమీద ఒచ్చే శిస్తుల్ని పెట్టి, కడుపు మాడ్చుకోకుండానే, గౌరవం నిలబెట్టు కున్నాడు. ఆ గౌరవంలో భాగస్వామ్యానికి, అందులో నిజాయితీకి ప్రభుత్వం శరీరాల్ని పీల్చేయడం, నాలుగు వేలు పైగా అప్పులు పెట్టించడం బహుమతీగా ఇచ్చేయి.

నవ్వు వచ్చింది. చేసినన్నాళ్లుకూడా తను లెఖ్ఖలు వేసుకోలేదు. ఈ తీరుబడి కాలంలో తను జమ, ఖర్చులు చూచుకుంటే తేలిన ఫర్మానా అది. ఆ శ్రీముఖానికే తను అమ్ముడుపోయేడు.

అసలు, ఈ ఉద్యోగసర్మాల పర్యవసానం ఇల్లా వుంటే కొడుకును ఉద్యోగం చెయ్యమనడం అంత తెలివితక్కువ ఏమీ లే దన్నట్టు తట్టింది. అయినా...తను పేరు సంపాదించుకున్నాడు...ఇది మాత్రం చిరస్థాయిగానే నిలబడిపోయింది. మరి కొడుకో...

ఆ తీరుబడిరోజుల్లో, ఇంటికి వచ్చే పత్రికలు తిరగవేసేవాడు. అందులో కొడుకు వ్రాసిన కథలు జ్ఞాపకంగా కనపడితే చదివేవాడు. ఓవిధమైన 'నిరాశ' బరువుగా నల్చుని ఉండడం ఆలోచనలు కలుగజేసేది. అయినా అది తనను మార్చలేదు. ఆకొడుకు దృక్పథంలో నైనా చూడా లన్న తలంపు కల్గించలేదు. తను వూహించి బాధపడడానికి తీరుబడి లేనేలేదు.

తీరుబడి. నిజంగా తీరుబడి లేదు. రైతులు వచ్చేవారు. వెళ్లేవారు. రమ్మనేవారు. తను వెళ్లే వాడు. అదంతా ఏదో కలగాపులగంగా ఉన్నట్టే వుంది. ఈ చేతిలో డబ్బులేకపోవడం అన్నది, కొడుకు కళ్లుమూసుకునే పొలాలికి కవుళ్లు, ఆపాటివాళ్లతోనే ఇచ్చేడు. ఇళ్ల అద్దె పెంచలేదు. రావలసిన బాకీలకు నోటీసైనా ఇప్పించేడు కాదు; అన్న కోపం కల్గిం చేది.

నిజంగా డబ్బు లేనేలేదు. తనకు ప్రభుత్వం దగ్గరనుండి పింఛనీ రావడానికి చాలాకాలం పడుతుంది. అన్నాళ్లు తను, తన కుటుంబం మాడుతూ కూర్చో వాలా?

రోజూ, ఏదో ఖర్చులకు తెమ్మని, ఇంట్లో కొడుకు అడుగుతూనే వున్నాడు. వాడు అడక్క ఏం చేస్తాడు? వచ్చినప్పటినుండి, తను ఇంటి ఎక్కౌంటు తీసుకునే సర్దుకున్నాడు. ఆ గిజగిజలాడే సమయంలో, వెనక పేజీలు త్రిప్పితే తన కొడుకు ఎంత దూబరాగా సంసారాన్ని అప్పుల్లో పడవేసేడో కనపడి చికాకు కల్గించేది.

నిజంగా తనే డబ్బు వాడివుంటే ఈ విషమ పరిస్థితి రాలేకపోయేది. రాకపోయివుండేది కూడాను. పదిసంవత్సరాలు, పైలా పచ్చీసులా తను ఆర్జించిన, తన పొలాలమీద సంపాదించిన డబ్బు వాడేయడమే కాకుండా అప్పుల్లోకి ఈడ్చాడు. ఏవిధంగా అవి తీర్చాలో తెలియక, కోపం, అసహ్యం కల్గించేయి కొడుకుమీద.

రోజూ ఇలా స్తబ్దులా ఉండి, తిండి మాత్రం తింటూ, నీటుగా బట్టలు వేసుకుని, రంగోళీలా ఉండి, తనను డబ్బు అడగడం ఒళ్లు మండిస్తోంది. డబ్బు ఎక్కడనుండి తేవడం...?

ఈ వెధవ పుట్టినప్పటినుండి డబ్బుఖర్చే అనుకుని తిట్టుకున్నాడు. వాడు ఉద్యోగంలో ప్రవేశించి సంపా దించకూడదూ? ఇంకా ఎన్నాళ్లు ఇల్లా వుంటాడు?

ఆరోజు అనుకోకుండానే రామయ్యపంతులు తన పాతపెట్టెలన్నీ తీసేడు. కాగితాలన్నీ తిరగవేసు కున్నాడు. అచేతనంగానే తన మూలపెట్టె తీసుకుని, పరిమాసుకునేసరికి గుండెలు ఆగిపోయేయి. తను ప్రాణపదంగా భావికొరకు దాచుకున్న మూలవిరా ట్టుల్లో కొంత పోయింది. పోయింది అని అనుకోడా నికి అయినా గుండెలు నిలవలేదు.

ఎవరు తీసేరు? గత ఎనిమిదివత్సరాల్లోనూ ఎవ రికీ నగలు చేయించనే లేదు. తను అవి వున్నాయేమో అన్న తలంపు, చూచుకోవా లన్న అభిలాష కల్గించ లేదు. తనకు అవి వుండవన్న అధైర్యమూ కల్గలేదు. ఇప్పుడో! తన భార్య తీస్తుం దని తనకి నమ్మకం లేదు. ఇం కెవరు?

నెమ్మదిగా పిల్చి "నువ్వు ఏమైనా తీసేవా?" అన్నాడు.

"తెలియదు" అంది.

"మరి ఏ మవుతుంది?"

ఆమెకూడా పెట్టెలన్నీ వెతికింది. అ దేమైనా ఇంకో చోట్లో పడిం దేమో. లేదు. పోయింది. దుఃఖం కలిగింది.

"వాణ్ణి అడుగు..."

అప్పుడే వచ్చినవాణ్ణి నెమ్మదిగా వస్తూనే అడిగింది. అసలు కొడుకుతో మాట్లాడ్డమే భయం. ఈ భయం నరనరాలకీ అలవాటు అయినట్టే.

క్రుంగిపోయేడు. తను నిజంగా చేసిన తప్పూ, ద్రోహం,ఎంత క్రూరమైనదో అని పడగలు విప్పుకుంది.

మాట్లాడనేలేదు.

"ఆయన మధ్యాహ్నంనుంచి వెతుకుతున్నారు. నువ్వుకూడా ఓసారి చూడ్దూ?" అంతకంటె ఆమె తనకొడుకును చెలాయించి అడగలేదు. ఆ ప్రాధేయత తన తనకు దుఃఖం కలిగింది.

జతిలేదు. ఈ గుండెల్లో కుంపటిలా ఉండే తిరగవేసేడు. చెప్పాలని ఉంది. మార్గం ఎల్లాగో అర్థం కావటం లేదు. శరీరం పనిచేసింది కాని, అంతస్సు బాధతో క్రుంగింది.

నా బిడ్డకూడా, నిలబెట్టి అడగగలిగినా అడుగలేదు. అడగరు. ఆ గౌరవం తనమీద ఉంచేరు. కాని తన జన్మలో ఆ గౌరవం నిలబెట్టుకోవడానికి హక్కు లేకుండానే చేసేడు. ఈ నైతికపతనానికి తన పరిస్థితులు తీసుకువెళ్లినా, అది కుటుంబగౌరవంకొరకు తను ఒప్పించినా, తన నిజాయితీ, తన బాధ వాళ్లు గుర్తించలేరు. గుర్తించగకూడదు.

"రెండుకూడువందలిది. ఇంట్లోకి ఎవరు వస్తారు? ఎల్లా పోయింది? దొంగలు వచ్చేరా?"

"ఇంత భద్రంలేనివాళ్లే కనుక ఒక్క నగా చెయ్యించ నన్నా. ఇచ్చేయి నీమెళ్లో వున్నవన్నీ. ఏ బ్యాంకులోనైనా తగలెడుతా"

"కష్టార్జితం...ఒకటా రెండా...ఆక్షణంనుండి నాకు మనస్సు విరిగిపోయింది. ఒక్కక్షణం శాంతి లేకుండానే ఆలోచనలు..."

"ఈ సంసారం చూస్తుంటే నాకే విరక్తి కలుగుతోంది. ఈ క్షణం విడిచిపెట్టి ఏ కాశీఅయినా లేచి పోవా లనిపిస్తోంది".

ఆయన అంటున్న ముక్కలు వినిపిస్తున్నై. చెవుల్లో సూదులు...ఎంత వ్యర్థంగా తను పతనమయ్యేడో! ఏ ప్రపంచకపు అంచులకు వెళ్లి తను ఏడ్చి, క్షమార్పణలు కోరి అడిగితే, తను చేసిన గాయం మానుతుందో? ఒక్కరోజుకి తను క్షమింపబడుతాడా?

చెప్పడం...యవ్వనంలోని రక్తం తిరగబడమంటుంది. ఈ ఆత్మ, ఘాతికాలవిప్లవంలో తను కీటకం అయ్యేడు. సత్యం అన్నది నచ్చచెపితే... వినేవా రెవరూ?

రెండు ... మూ డు...రో జు లు గడిచేయి. ఇంట్లో తన తల్లి, తండ్రీ బెంగ, దుఃఖం తోచేటె తిరిగేరు. తను అన్నం తినలేకపోతున్నాడు. క్షోభ... ఆవేదన...

ఆ సాయంత్రమే ఇక ఉండలేకనే "నే తీసేను" అన్నాడు తల్లితో.

"ఏం చేసేవు?"

"అదేం అడగవద్దు. కొద్దిరోజుల్లో నేనే ఇచ్చేస్తా".

శాంతి వచ్చినట్టే ఆయనతో చెప్పింది.

"హృదయం విరిగిపోయింది. ఇవన్నీ చూస్తూంటే, సంసారం ఏ గోతుల్లో పడనీ...నాకాలం నాకు వెళ్లింది. ఇంక వెళ్లదని బెంగ లేదు..."

ఈ శూన్యంలో, ఆవేదనలో అది విన్నాడు. హృదయం మండింది. తన తండ్రి తనకి గాఢిగా తిగలాలనే అన్నాడు. కాని, ఈ ఇంట్లో కూర్చుని, తను ఆయనతిండి తింటూ, గడ్డ కట్టుకుంటూ, దానికోసం శరీరంలో రక్తమాంసాలు ఏళ్లతరబడి నైవేద్యం పెట్టి, ప్రతిష్ఠకొరకు పతనం చెందేడు...

సంపాదన లేకపోవడం తనను నీచంగా, జలగలాగే చేసింది. ఇప్పుడు ప్రపంచకంలోకి తను వెళ్లాలన్నా వెళ్లలేడు.

ఏం చెయ్యాలి?

* * * *

రోజులు బరువుగా గడుస్తున్నై. అన్ని ఘంటలూ జరుగుతాయా, తను పొందే ఈ ఝంఝూమారుతపు రంజా తగ్గుతుందా అని ఆశించేడు.

ఒక్కటి. ఆనాటినుండి, తను పుట్టి, పెరిగి, జ్ఞానం, విద్య ఆ గడపల్లో, ఆ మాటల చైతన్యంలో పొంది, చీమూ రక్తం పంచుకున్నా, ఇప్పుడు తను ఎక్కడినుండో వచ్చిన కృతఘ్నుడి జీవితం వెళ్లపోసుకుంటున్నట్టే ఉంది. తనకి మొదటినుండి హృదయమిచ్చి మాట్లాడేవారు లేరు. ఇప్పుడో అసలు పలకరించి, ఉన్నావా అని అడిగేస్థితికూడా పోయింది.

తన తండ్రో? ఆయన్ని చూడ్డానికే భయపడుతున్నాడు. ఎదటబడి ఏదైనా చెప్పడానికికూడా గుండెలు నిలవటం లేదు. ఈ స్థితి దిగనార్చినట్టే వుంది. తన నరాల్ని వెనక్కు తోడినట్టే.

ఎక్కడికైనా, ఏ అరణ్యాల్లోకో, అనంతాల చివరకో వెళ్లిపోవాలి. శాంతంగా, అక్కడ ఉండిపోవాలి...ఈ వాతావరణంలో అశాంతి ఉండలేకపోయింది.

ఎదటపడకుండానే "ఎక్కడికైనా వెళ్లాలి" అన్నాడు.

ఏమిటీ ? అన్నట్టుగా చూచి, "ఎందుకూ ?"

"ఏదైనా ఉద్యోగం ప్రయత్నించి అది చెయ్యాల్ని ఉంది"

"నే నేం వెళ్లవద్దన్నానా ?/ వెళ్లు" గునపం గ్రుచ్చినట్టే అయింది. అందులో ఈసడింపు. రక్తం వచ్చింది...

"రేపే వెళుతున్నా..."

"వెళ్లూ...ఈ క్షణంలోనే. ఈ సంపాదన, ఈ ఆర్జన ఇదంతా నాకోసమా ఏమిటి ? వార్ధక్యంలో ఉన్న నా ఆరోగ్యం మీరంతా పరిచూస్తూ ఉండా లని నేను ఆశిస్తా. ఉంటే పదికాలాలపాటు పింఛినీ డబ్బులు వస్తాయి."

"ఈ ఆస్తి నా కేం అక్కరలేదు; నేనే సంపాదించుకుంటా..."

"సంపాదించేవు కా ! నాకుమాత్రం కావాలా ఈ సంసారం. నా రోజులు ఎల్లాగా వెళుతాయి...నన్ను ఉద్ధరించినట్టు మాట్లాడుతావేం..."

"నన్ను ఉద్ధరించుకోడానికే...నా బ్రతుకు నే బ్రతకక్కర్లేదూ ? నాకు మీ ఆస్తిలో ఒక్క సెంటు భూమికూడా అక్కర్లే దని వ్రాసిస్తా కావలిస్తే...నే వెళ్లాలి..."

తల్లి గాబరాపడింది ఇద్దరిమాటలూ చూచి. కాని ఏం చెయ్యాలో తెలియలేదు.

"ఊరుకోరా !"

ఊరుకు నేఉన్నాడు. ఇన్నాళ్లూ. ముప్ఫైవత్స రాలుపైగా. అణిగిమణిగే. దానికే ప్రతిఫలం...

చెయ్యి పట్టుకునే గదిలోకి తీసుకు వెళ్లింది...

"వట్టి గొడ్డుకు పుట్టెడు అర్పులట" అయన... తలుపుసందుల్లోంచే వినపడ్డాయి. అదే అయింది తన జీవితం...

దుఃఖం వచ్చింది. ఎదలోని రొదలు విజృంభించేయి. తన జీవితం ఆ క్షణంవరకూ సింహావలోకనం చేసుకోమని కూర్చుంది. ఎదురుగా ఒకొక్కక్క వత్సరమే, ఎంత వృథాగా, నిర్దయగా, క్రతువుచేయబడిందో తిరిగింది. ముప్ఫై నిండు వత్సరాలు...

ఏమీ చెయ్యకుండానే. తను బ్రతికినా, చచ్చినట్టే. కృతజ్ఞత నెత్తిమీద కూర్చుని చెలాయించింది. అదే శరీరంలోని జవసత్వాల్ని, ఆశల్ని, ఆడంబరాల్ని తినేసింది. వాటిని తన దగ్గరనుండి ఏ మార్గంలో విడగొట్టి, పూర్ణశానిప్రకింద చేసుకోవాలో చేసి, ఇప్పుడు నవ్వుతూ కూర్చుంది.

ఈ క్షణంలో, ఇంత రాత్రివేళ ఎక్కడికైనా వెళ్లిపోవా లన్న కోర్కె: ఉండలేని పరిస్థితులను మూటకట్టింది. వెళ్లిపోవాలి...తెల్లారితే తను ఆ కళ్లల్లో పడి తిరగలేడు.

బ్రతుకే చచ్చినతర్వాత ఈ కట్టె ఎందుకో అన్నట్టే...ఎక్కడికి వెళతాడు. ఉద్యోగం...ఎవ రిస్తారు ?...మరి డబ్బో !

పర్సు తీసుకున్నాడు. అదీ నీరసంగా ఏడుస్తున్నట్టే, ఏపణాలన్నరని దాచుకుని చూస్తోంది... తను నడిచినా, ఆఖరుకు రెండుజతల దుస్తులతో వెళ్లినా, ఎంతదూరం నడవగలడు ? దారిలో తిండి ! అంతవరకూ జీవితంలో ఒకళ్లని దేహీ అనకుండానే గడపడం వరాలకు పట్టింది. ఇప్పుడు ఒకళ్లదగ్గరకు వెళ్లి..."భోజనం పెడతారా ?"

ఆత్మ చచ్చిపోతుంది. ఇంతకంటె మలమలా మాడి...ఆపైది తలపుల్లో భీకరంగా వుంది...

ముడతలుపడుతూన్న శరీరం నవ్వుతోంది వయస్సును దాచుకుని. ఈ వయస్సులో తను పూడిగం చేస్తా నని అడిగినా ప్రభుత్వం తీసుకోదు. పైగా ఆ పరీక్షలు కట్టేందుకు ఎక్కడ డబ్బు తేవడం ?

ఉద్యోగం ఇచ్చినా, తను చెయ్యలేడేమో ! ఉదయంమొదలు సాయంత్రంవరకూ పలాములు చేస్తూ, వాళ్లు తిడుతుంటే, త్రిప్పుతుంటే తన అంతస్సు ఒప్పుకోదు. ఒప్పుకోవటం లేదు. అసలు చెయ్యగలడా, సందిగ్ధం...చెయలేను...చెయ్యలేను అని అరుస్తోంది.

ఏం చెయ్యాలి ? ప్రపంచకం శూన్యం, చీకటిని భార్యల్లా చేసుకుని ఎదురుగా నంచున్నట్టే వుంది. జీవచ్ఛవపరిస్థితులు దిగవార్చి కాలుస్తుంటే, అది మాత్రం జాలిపడుతుం దనుకోవడం వెర్రితనం...

మరి జీవించి...అసలు ఎందుకు ? తనమీద ఆశలు కట్టుకున్న వారు, తను ఆశించుకున్న ఉన్నతులు, మరణించేయి. ఏమీ చెయ్యలేని, ఆత్మక్షోభ...వ్యర్థం అంటోంది.

చచ్చిపో ! ఆత్మలోకాల్లోంచి పౌరుషం అభిమానంలో ఎలుగెత్తింది.

మృత్యువు ! అందులో శాంతి, సుఖం ఈ నిరంతఘోష. అణుగుతుం దని ఇదివరకు చాలాసార్లు

అనుకున్నాడు. కాని అది పూర్ణాకృతి దాల్చలేక పోయి అప్పుడు లోపల్లోపలే నాట్యం చేసింది... ఇప్పుడో...

పువ్వులు విచ్చుకుని, పూర్ణ రంగులతో ఆహ్వానిస్తున్నట్లే వుంది. ఆవిడ తనను కౌగలించుకోడానికే నవ్వుతోంది.

తను చచ్చిపోవాలి...

తనకోసం దుఃఖించేవాళ్లు లేనేలేరు. తల్లీ, తండ్రీకూడా కన్నందుకు ఋణం తీర్చుకునే ఇప్పుడు ఒదిలివేసేరు...బ్రతుకా...అది లేనే లేదు. ఈ గాఢాంధకారపు లోకంలో వెలుగు లేదు. లేనప్పుడు ఉండడం...ఊపిరితీస్తూ బ్రతకడం...?

వెనక్కు చూచుకున్నాడు. గదిమూలలో చీకటి నవ్వింది. తనను చూస్తూ ప్రతీవస్తువూ నిలదీసి, వ్యర్థజీవీ! తండ్రిమీద పడి తిన్న జలగా! నీఇంట్లో కన్నం వేసిన దొంగా! అంటున్నాయి...ఉడికిపోయేడు. కౌగిలం తీసేడు. తను నిజంగా చేసిన పనులకి నిర్దోషే! అయినా శిక్ష పొందుతున్నాడు. తండ్రే తనను ఈ కూపంలోకి లాగేసేడు. అది పాలిగూడే అయి పోయింది.

"నాన్నా! రేపు నువ్వు ఈ ఉత్తరం చూచే టప్పటికి నేను అనే జీవి ఉండదు. బహుశః రక్తగడ్డ కట్టి, బాధతో నల్లగా, ముడతల్లో పడిన కట్టెమాత్రం ఉరిలో కనపడుతుంది. ఆ సాయంత్రంతో అదీ కనపడదు.

ఈ వయస్సులో మీకు తీరని ద్రోహం చేసి వుండవచ్చు. వంశానికే మచ్చ తెచ్చివుంటుంది నా చర్య. అయినా అంతకంటె నాకు గత్యంతరం లేనేలేదు.

నువ్వు పెంచేవు ఓ ధనికుడి బిడ్డలాగే. డబ్బు అనేది వెదజల్లే నాలో నిషా పేర్పరచేవు. దానికోసం నన్ను నీ బానిసక్రింద చేసేవు. కృతజ్ఞత అన్న దానం క్రింద నేను నీకు శరీరం ఒప్పచెప్పేను. ఆత్మ తిరగ బడినా...

నన్ను నైతికపతనం చేసింది. నా నరాలను అది తోడేసింది.

ఈ జీవికి ఓచోట ముక్తి ఉండని స్థితి అలుము కుంది. ఏమూలా నాకు స్థలం లేదు. ఇదీ ప్రతిఫలం.

నాలో ఉన్న అభిమానం, మగజీవిగా పుట్టిన పౌరుషం, ఆత్మాభిరుచికూడా ఇప్పుడు తిరగబడే నన్ను ఈ స్థితిలోకి తీసుకువచ్చింది.

వెళతా! ఆ లోకంలో ఏదో వుందనే. దాన్ని పొందనీ, పొందలేకపోనీ, కొన్నాళ్లు చచ్చి జీవించేను అన్న భావన, నన్ను ఏ అనామకుడిక్రిందో, ఏ ముష్టి వాడిక్రిందో ఎందుకు పుట్టిపెరగలేదా అన్న ఆశ మాత్రం ఉంది. అది నాకు రాదు...ఇక వస్తుందేమో అనుకోవడం మూర్ఖత్వంకూడా.

ఈ ఆఖరిక్షణంలోకూడా ఒక్కటే బాధిస్తా వుంది. నీ డబ్బు నేను తీర్చకుండానే చచ్చిపోతున్నా. అది తీర్చలేని అప్పుక్రిందే ఉంటే...

క్షమించు.

అమ్మ,నువ్వూకూడా విచారించకండి. విచారం, మననం అన్నది మీకు దుఃఖం కల్గిస్తుంది. వయస్సు ముదిరిస్తుంది.

పుట్టలేదనే అనుకోండి...

జీవితంలో యాత్ర అయిపోయింది. అది నేను అనుకున్న పువ్వులూ, కాయలూ లేని వృక్షమైంది. ఇది నా పాపఫలితమే కావచ్చు. కర్మ అనేదే దుఃఖం గీతగీసివుండవచ్చు.

ఒక్కటి కోరుతున్నా...

నాతర్వాతవాళ్లకి మాత్రం నాలాంటి పెంపకం ఇవ్వకూ...ఇస్తే వాళ్లూ బాధ ఓర్చుకోలేకపోతారేమో! వాళ్లను బీదవాళ్లక్రిందే పెంచు...

క్షమించ నర్హత లేకపోయినా, ఈ అంత్య కోర్కగా అదే అడుగుతున్నా..."

... ...

ఇక వ్రాయలేకపోయాడు...

అంతే...

శూన్యంగా ఉన్న చీకట్లు తగ్గిన దీపంలో నాలికలు చాపేయి...

ఎర్రటి ఛాయలు వెనక నున్న శకారాల్ని ఆహ్వానించేయి...

అంతం...బాధ...ఓర్పు...ఆ లోకం...చీకటి ...అంతా చీకటి...

జీవితయాత్ర అయిపోయింది.

కలగూరగంప

అలెగ్జాండరు - దండామిస్ మహర్షి *

అలెగ్జాండరు వీరుడు పంజాబులోని హిందూ సైన్యములతో ఘోరాఘోరిగా పోరుచున్న కాల మది. అట్టి కాలమందే దండామిస్ ఋషియొక్క కీర్తిప్రతిష్ఠలు అలెగ్జాండరుచెవిని బడెను. ఆ ఋషిని దర్శించవలెనను అభిలాష అలెగ్జాండరునకు వెంటనే కలిగెను. వెనువెంటనే తన విశ్వాసపాత్రుడగు 'ఓనీస్‌క్రేటుస్' (*Onesikrates*) అను అధికారిని ఋషీశ్వరుని తోడితెచ్చుటకై పంపెను.

అట్లే అతడు వెళ్లి "ఓ బ్రాహ్మణోత్తమా, నీకు జయమగుగాక." అని దీవించి "మహాబలసంపన్నుడగు 'జ్యూస్' (*Zeus*) దేవునికుమారుడును, మానవుల కెల్ల నేకచ్ఛత్రాధిపతియు నగు అలెగ్జాండరు మహారాజు నిన్ను తనవద్దకు రమ్మనుచున్నాడు. అందు కంగీకరించితివా, అతనిచే మహోద్భుతములైన బహుమతుల నందగలవు. నిరాకరించితివా, నీ శిరశ్ఛేదము తథ్యము." అని విన్నవించెను.

అలెగ్జాండరుతరుపు వాద్యంతము చిరునవ్వుతో ఆ ఋషి వినెను. వినెనే కాని ఈషణ్మాత్రమైనను అతడు చలించలేదు. పిమ్మట ఈ క్రింది ప్రత్యుత్తర మిచ్చెను :

"సకలలోకాధిపతియైన భగవంతు డెన్నడును దురహంకారజనితాపచారములకు కర్త కాడు. ఎవడు హింసాకృత్యములను గర్హించునో, యుద్ధములను ప్రేరేపింపడో అతడే భగవంతుడు. ఆ భగవంతునే వినయవిధేయతలతో నే నారాధించెదను. కాని అలెగ్జాండరు భగవంతుడు కాడు. అతడును ఏనాడో ఒకనాడు మృత్యుదేవత కెర యగువాడే గదా!

"ఇంతవరకును 'టైబరోబోస్' (*Tiberoboas*) నది కావలి ఒడ్డుకు చేరలేనివాడును, ఈ విశాలవిశ్వసామ్రాజ్యసింహాసనాసీనుడు కాలేనివాడును అయిన మీ అలెగ్జాండరు భూలోకాధిపతి ఎట్లు కాగలడు? ఈ భూలోకమునుగురించి గాని, పితృలోకమునుగురించి గాని ఎట్టి జ్ఞానమును సంపూర్ణముగా లేనివాడు మీ అలెగ్జాండరు. ప్రపంచములో నాల్గుమూలల నివసించు ప్రజలెందరో ఇంతవరకు అలెగ్జాండరుపేరైనను ఎరుగరు! ప్రస్తుత మాతని యధీనములో నున్న రాజ్యము లాతని రాజ్యకాంక్షను తీర్చనియెడల గంగానదిని దాటనిమ్ము. గోష్పాదతుల్యమైన ఈ దేశ మాతని దురాశాదాహమును తీర్చలేకున్న గంగానది కావలి ప్రాంత మెందరు మానవులనో భరించగలదు.

"అలెగ్జాండరు సమర్పించు బహుమతులు నాకు అన్నివిధముల పనికిమాలినవి. అమూల్యములై నాకెంతో ఉపయోగపడు వస్తువులు ఈ పర్ణకుటీరము, అమృతతుల్యమగు ఆహారము నిచ్చు కుసుమఫలభరితములగు నీ వృక్షములు, దాహ మార్పు నిర్మలజలములే. ఇంతకు మించి అతిజాగరూకతతో సంపాదించి కూడబెట్టిన ఆస్తిపాస్తు లన్నియు దుఃఖజనకములై తుదకు వానిని కూడబెట్టిన వ్యక్తుల వినాశహేతువులుగా పరిణమించును.

"అలెగ్జాండరును, తా నివ్వబోవు ధనకనకవస్తువాహనాదికముల నాశించుచు, మృత్యుభయముతో గడగడలాడువారినే ఈబెదరింపులతో భీతావహులను చేయనిమ్ము, ఈ యాశలుగాని బెదరింపులుగాని సర్వ

---

* ఈ భారతీయమహర్షి అసలుపే రేదియో తెలియదు. కాని గ్రీకులుమాత్రము ఇతనిని దండామిస్ (*Dandamis*) అనుచుండిరి.

సంగ పరిత్యాగులైన మమ్ము ఏమి చేయగలవు? ఇటువంటి ఆయుధములు మమ్ము లోబరచుకొనునంతటి శక్తి వంతములు కావు. కారణ మేమందువా, బ్రాహ్మణులు బంగారము నారాధించరు. మృత్యు వన్న భీతి చెందరు.

“ఇక పొమ్ము. అలెగ్జాండరున కీ సందేశ మందించుము: ‘నీవస్తువులతో దండామిన్ కెట్టి యవసరమును లేదు. అందుచేత నీవద్ద కతడు రాడు. కాని దండామిన్ వద్దనుండి నీ కేమైనను కావలసియున్న నీవే అతని వద్దకు పొమ్ము.’”

ఈ సందేశమును, తదితరవిషయములను తన దూతలైన ఓనీస్ క్రేటస్సు తెలియపరచగా అలెగ్జాండరు విని ఆశ్చర్యచకితు డయ్యెను. అప్పటినుండి దండామిన్‌ను చూడవలె నను అభిలాష అలెగ్జాండరునకు ద్విగుణీకృత మయ్యెను. ఈనాటికి జగజ్జేతయైన తన యాజ్ఞను ధిక్కరించిన కౌపీనధారియగు నొక పండుముసలివానిని భారతభూమిలో అలెగ్జాండరు చూడగలిగెను.

దీనినిబట్టి ప్రాచీనహిందూ వేదాంతి తన సిద్ధాంతముల కనుగుణముగ నెట్లు జీవించెనో తేటతెల్ల మగుచున్నది. గీతోపనిషత్తుల బోధనామృతసారము మన పూర్వుల జీవితములం దెట్టి మార్పును తెచ్చెనో, ఈ ప్రశంసార్హమైన ఉదాహరణము విశదపరచుచున్నది. ఖండత్రయమందు సామ్రాజ్యమును పెంచిన అలెగ్జాండరుపై తను ఆధ్యాత్మికబలచిహ్నమగు నీఋషి యెదుట తన యల్పత్వమును అంగీకరించుటలో ఆశ్చర్యమేమియు లేదు.

[‘ప్రబుద్ధభారత’ అను పత్రికలో డా. రమేశ చంద్రమజుందార్ గారు వ్రాసిన ‘ఇండియన్ ఫీలాసఫర్స్’ అను వ్యాసము ననుసరించి.]

సిద్ధాంతి మల్లికార్జునం.

పారితోషికపు చేతిగడియారాలలో అలారం మోత

ఇక కొద్దినెలలో ఫేవర్‌లూబా కంపెనీవారి సుప్రసిద్ధమైన వల్‌కైన్ క్రికెట్ అలారం చేతిగడియారాలు ఈదేశానికి రానున్నవి. ఈ గడియారం కోరిన గంటకు, కోరిన నిమిషానికి అలారం ఇవ్వగలదు. దీనిని తయారుచేసేందుకు అనేక సంవత్సరాలు పట్టింది.

అలారం మెకానిజం బహించిన్నది. అయినా ఇది కీచురాయి (క్రికెట్) మాదిరి ఖంగుమని ధ్వనిస్తుంది. ఉద్యోగస్థులకు, వ్యాపార ప్రముఖులకు పని ఒత్తిడిగల ప్రతివారికీ ఇది అమూల్యమైనది. ప్రొద్దున్నే లేవగొట్టేందుకూ, రోజు పొడుగునా ఎప్పుడుపడితే అప్పుడు మేలుకొలిపేందుకూ ఇది మిక్కిలి సౌకర్యంగా అమిరి ఉంటుంది.

ఒక వ్యాపారసంస్థలో పెద్ద ఉద్యోగి ఒకడు ఈ ‘క్రికెట్’ను ప్రయోగించి తన్ను చూడవచ్చిన వారితో తన కాలం పొల్లుపోకుండా చూచుకుంటున్నాడు. “ఇన్ సైడ్ యు. యస్. ఎ.” అనే చిత్రంలో హాస్యగాని పాత్రనటించిన హెర్బ్ షైనర్ ఈ ‘క్రికెట్’ మోగటంతోనే మరి నోరు మెదల్పకుండా రంగంనుంచి నిష్క్రమిస్తాడు. అలన్ లాడ్, జాన్ లండ్, ఇంకా అనేకమంది సినిమానటీనటులు షూటింగ్ టైముకు స్టూడియోకు చేరుకునేందుకు ఈ వల్‌కైన్ క్రికెట్ అలారం రిస్టువాచిమీద ఆధారపడుతున్నారు. ఇండియాలో ఈగడియారాలను మొట్టమొదటగా కొన్న వారిలో న్యూఢిల్లీ లోని ఒక పెద్దజాతీయ వార్తాపత్రిక ప్రొప్రయిటరు, బొంబాయిలో ఒక కౌన్సల్ జనరలు, ఒక విదేశీబ్యాంకుయొక్క సబ్‌మానేజరు, అమెరికా దేశపు ఒక సుప్రసిద్ధరసాయనిక వ్యాపారసంస్థయొక్క భారతదేశ ప్రతినిధి, ఎగుమతిదిగుమతులుచేసే ఒక పెద్ద విదేశవ్యాపారసంస్థ డైరెక్టరు, రాయల్ ఇండియన్ ఇంజనీర్స్‌కోరుకు చెందిన ఒక ఆర్మీ మేజరు ఉన్నారు. మొట్టమొదటిసారి ఈ గడియారాలు స్విట్జర్లాండునుండి అమెరికాకు కొద్ది మొత్తం చేరినప్పుడు వీటికి విపరీతమైన గిరాకీ కలిగి గడియారాలకు బదులు వరుస నంబర్లుగల అమ్మకపు పత్రాలు అచ్చువేసి పంచిపెట్టవలసి వచ్చిందట. దరిమిలా ఆ నెంబర్ల వరుసను గడియారాలు సప్లయిచేయబడ్డవి. ఇండియాలో మాత్రం ప్రస్తుతం ఒక వరసకు చాలినన్ని ఉన్నవనీ, అయినా ఈసంవత్సరానికి బొటాబొటిగా కావలసినంత సరుకు మాత్రమే సప్లయి అవుతుందనీ తెలుస్తున్నది.

వల్‌కైన్ క్రికెట్ మచ్చుపడని ఉక్కుతోను, 18 కారట్ బంగారంతోను తయారుచెయ్యబడ్డవి. అమ్మకపుపన్ను కాకుండా ఉక్కుగడియారం వెల రు. 338/-లు, బంగారంది రు. 1,065/-లు. పారితోషికాలకూ, కట్నాలకూ, కానుకలకూ ఇవి ప్రశస్తమైనవి.



విమర్శనము

హిందీ బాలవ్యాకరణము

రచయిత: పాగా వెంకోబరావుగారు. ప్రచురణకర్తలు: నవభారత్ పబ్లిషర్సు లిమిటెడ్, కర్నూలు. వెల: నాలుగు అణాలు.

నేడు హిందీభాషను నేర్చుకొనుటయందు ఆంధ్రులు మిక్కిలి శ్రద్ధ చూపుచుండుట ముదావహము. జాతీయభాష కానున్న హిందీభాషను సులభముగా, తమంతకు తాము నేర్చుకొనుటకు ఉత్తమ గ్రంథములు కావలసియున్నవి. ఈ బాలవ్యాకరణము హిందీభాష నభ్యసింపగోరు ఆంధ్రులకు అనువైన రీతిగా సమకూర్చినాడు రచయిత. ఇందులో ప్రారంభకులకు తెలిసికోదగిన వ్యాకరణనియమములు చక్కగా వివరింపబడినవి. విభక్తిప్రత్యయములు, సర్వనామములు సులభముగా అర్థమగునట్లు వ్రాసియున్నారు. ఇంకను వాక్యభేదములు — వాక్యనిర్మాణపద్ధతులను గురించి కొన్ని పాఠముల నెక్కువగా కలిపియుండిన బాగుండెడిది.

హిందీ - తెలుగు అనువాదమాల

రచయిత, ప్రకాశకులు పైవారే. వెల ఆరు అణాలు.

ఒకభాషను నిర్దుష్టముగాను, సులభముగాను నేర్చుకొనవలె నన్న నిట్టి అనువాదమాల లెక్కువగా తోడ్పడగలవు. ఇందులో తెలుగునుండి హిందీకి, హిందీనుండి తెలుగునకు అనువాదము చేయు విధానము ప్రశంసనీయముగా నున్నది. ఆంధ్రభాషలో ఇట్టి గ్రంథము లెంత ఎక్కువగా వెలువడిన అంత మంచిది. ఈ అనువాదగ్రంథమువల్ల విభక్తిప్రత్యయములు, వ్యాకరణవిశేషములు, వాక్యనిర్మాణపద్ధతి, భాషా సంప్రదాయములు బోధపడగలవు. అనువాదమునకు వలసిన నియమములనుగురించి ప్రారంభకులకు బాగుగా తెలియునట్లు వ్రాసియుండిన రచయితఉద్దేశ్యము పూర్తిగా నెరవేరియుండెడిది.

శాస్త్రి.

రాయల హిందీ-తెలుగు ప్రైమరు, రాయల హిందీ-తెలుగు పహలీ కితాబ్

రచయిత: ఎ. సి. కామాక్షీరావుగారు. ప్రకాశకులు: రాయలు అండుకో., కడప. వెలలు: అణాలు ౬, ౯.

అర్థానుస్వారతత్త్వము

రచయిత: తాతపల్లి మిరాదారు శేషగిరి శాస్త్రిగారు. ద్వితీయముద్రణము. ప్రకాశకులు: వేదము వెంకటరాయశాస్త్రి అండు బ్రదర్సు, ౮, మల్లికేశ్వరగుడి దక్షిణపుసందు, లింగిచెట్టివీథి, మద్రాసు. వెల. ౮ అ.

వీ ర మ సీ దు

జాతీయఖండకావ్యము. కృతికర్త: ముదివర్తి కొండమాచార్యులుగారు, గూడూరు. వెల ౧ రూపాయి.

తో ర ణ ము

ఖండకావ్యసంపుటి. కృతికర్త: కొండూరు వీరరాఘవాచార్యులుగారు. ప్రకాశకులు: విశ్వజ్ఞ మండలి, తెనాలి. వెల ౧౨ అ.

ఆయురారోగ్యవిజ్ఞానపరిణామము

రచయిత: 'కృషీవల'. ప్రకాశకులు: ఆధునిక వాఙ్మయకుటీరము, ౨౨, దివాన్ రామయ్యంగారి రోడ్డు, వేపేరి, మద్రాసు ౭. వెల ౧౦ అ.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press.
No. 7, Thambu Chetty St., G. T., Madras.Editor— S. Sambhu Prasad.